ఆంధ్ర సచిత్ర వారపత్రిక

18-24, ఏప్రిల్, '86

రు. 2-50



ఫారెక్స్® మొట్టమొదటి ఎంపిక!




ఎందుకంటే క్రొత్త మేలుపర్చబడిన ఫారెక్స్® మొదటి మొదటి ఘన ఆహారాలకు మారే పాపాయికి సహాయకరంగా అత్యావశ్యక పదార్థాల సమ్మేళనం.

ప్రొటీన్లు మరియు క్రొవ్వు పదార్థాల సరియైన కలయిక.
ఫారెక్స్. పాపాయి బలంగా మరియు ఆరోగ్యవంతంగా పెరిగేలా తోడ్పడటానికై ప్రొటీన్లతో సమృద్ధమైనది. పాపాయి యొక్క సున్నిత జీర్ణశక్తికి అనువుగా సరియైన పాళ్లలో క్రొవ్వు పదార్థంతో ప్రత్యేకంగా రూపొందించబడినది.

పాపాయి రక్తాన్ని ఆరోగ్యవంతంగా వుంచడానికి తగినంత ఐరన్.
నాల్గవ నెలప్పటికి పాపాయి యొక్క ఐరన్ నిల్వ తరిగిపోతుంది. పాపాయి రక్తాన్ని ఆరోగ్యవంతంగా వుంచి రోగాలను ఎదుర్కొడానికి సహాయకరంగా తగినంత ఐరన్ కల్గినది ఫారెక్స్.

కాల్షియం-ఫాస్ఫరస్‌ల ఆదర్శవంతమైన నిష్పత్తి.
దిన-దినమూ, పాపాయి పళ్లు, ఎముకలు బలంగా మరియు ఆరోగ్యవంతంగా పెరిగేలా తోడ్పడటానికి, ప్రత్యేకంగా రూపొందించబడిన ఫారెక్స్‌లో కాల్షియం, ఫాస్ఫరస్‌లు ఆదర్శవంతమైన 2:1 నిష్పత్తిలో కలవు.

మరి మీరు పాపాయికి పెట్టే ప్రతి చెంచాడు పోషణ తత్వ-యుక్త ఫారెక్స్ మరింత రుచికరం. కలపడానికి మరింత సులభం.



క్రొత్త మేలు పర్చబడిన **ఫారెక్స్®**

పాలు చేర్చే అవసరం లేదు.
కేవలం నీటిలో కలిపి పట్టండి

ప్రేమతో గ్లాక్సో నుండి!

CLARION/B/GX/10/244 TEL


అందానికి అందం
ఆనందానికి ఆనందం
'గాంధిటెక్స్'
కాటన్ శారీస్!
మా వెరైటీలు...
999, 888
777 & 666
అర్గండి డోరియా
గాంధిటెక్స్
కాటన్ శారీస్

'రాజీవ్ ఇండియా'లో సి.ఐ.ఎ. పాత్ర

న్యూఢిల్లీ లేఖ



డా. జయదుబాషి

భారతీయులకి ఓర్పు ఎక్కువ, కానీ వారి సహనం సన్నగిల్లి పోతున్నట్టు కనిపిస్తున్నది. రాజీవ్ గాంధీపై ప్రజలకి ఆకర్షణ తగ్గిందని ఒక జాతీయ వార్తాపత్రిక సంపాదకుడు అన్నారు. తమ వ్యాసాలతో, సంపాదకీయాలలో రాజీవ్‌గాంధిని ఆయన విమర్శించారు. ఈ పత్రికా రచయిత ఒకప్పుడు గాంధీలకి అనుకూలంగానే ఉండేవారు. పూర్వం ఆయన శ్రీమతి గాంధిని పొగుడుతూ రాసిన వ్యాసాల లాగే ఇవి కూడా ఉన్నట్టు తోస్తున్నది. చాలా మంది లాగే ఈయన కూడా ఇప్పుడు ప్రధానమంత్రికి వ్యతిరేకంగా మారారు. దానికి కారణాలు ప్రస్తుతానికి మనకి అనవసరం. ఆకర్షణ తగ్గినటువంటి వారు మరికొందరు ఉన్నారు కానీ వారిది మరీ అంత వ్యక్తిగతమైనది కాదు. చర్చిల్ ఒకసారి క్లెమెంట్ అట్లీ గురించి చెబుతూ ఆయన చాలా నమ్రతగల వారని, అంతకన్నా ఆయనని గురించి చెప్పేది ఏమీ లేదని అన్నారు. రాజీవ్ గాంధీ కాకతాళీయంగా ప్రధానమంత్రి అయినారు. తగిన వ్యక్తిని తగినటువంటి స్థానంలో కూర్చోపెట్టటం లేదని అప్పుడు చాలా మంది భారతీయులకి తెలియక పోవటమే చెప్పుకోదగ్గ విషయం.

రాజీవ్ గాంధీ బృందంపై ప్రధానమైన నా ఆరోపణ వాళ్ళు తగనివారని కాదు, నమ్మదగిన వారు కాదన్నదే! వాళ్ళు గత ఏడాదిలో, శ్రీమతి గాంధీ తమ పూర్తి పరిపాలనా కాలంలో కూడా చెప్పనన్ని అబద్ధాలు చెప్పారు. రాజీవ్ గాంధీ చాలా తెలివైన జట్టుని సమకూర్చుకున్నారు. వాళ్ల అతితెలివి ఎలాంటిదంటే మార్కెటింగ్‌కి సంబంధించిన వ్యక్తులు ఏదో ఒక వస్తువుని వీలైనంత త్వరగా అమ్మాలని చూసినట్టే ఉంటుందది. దేనినైనా బలవంతంగా రుద్దటం అన్నది విధి లేనప్పుడు మాత్రమే ప్రభుత్వం చేయవలసిన పని. ముఖ్యంగా భారత్ వంటి దేశంలో అతి పేదవాడు కూడా అబద్ధాలని తేలికగా పసికట్టగలడు. భారతీయుడన్న ప్రతి వ్యక్తికీ అబద్ధాలని పసిగట్టగల అతీంద్రియ శక్తి, అమెరికన్‌లకి డబ్బు విషయం పసిగట్టగల శక్తి లాగా, ఉంటుంది. అందువల్ల అతడిని బోల్తా కొట్టించటం అంత తేలికైన పని కాదు.

ఈ ఆకర్షణ తగ్గటానికి విశ్వనాథ్ ప్రతాప్‌సింగ్, ఆయన బడ్జెట్‌లు ప్రస్తుతం కారణాలుగా చెప్పబడుతున్నాయి. తక్కువ పన్ను రేట్ల వల్ల ఎక్కువ ఆదాయం ప్రభుత్వానికి వస్తుందని ఆయన అంటూ వచ్చారు. ఆయనకి, ప్రభుత్వంలో ఉన్న వారికీ అది నిజం కాదని తెలుసు. పన్ను రేట్లు తగ్గించటానికి గల కారణం చెప్పటం చాలా తేలిక. విదేశీ కంపెనీలు ఆయనకి ఒక శ్రీముఖం ఇస్తూ పన్ను రేట్లు తగ్గించకపోతే భారతదేశంలోకి ఒక్క డాలర్ కూడా తీసుకు వచ్చేది లేదని అన్నాయి. కంపెనీలకి పన్ను రేట్లు తగ్గించటం వల్ల వ్యక్తిగత పన్నులని కూడా ఆయన తగ్గించక తప్పలేదు. ఆయన ఎదురు చూసినంతగా ప్రభుత్వానికి ఆదాయం రాకపోవటంతో కొరడా ఝుళిపిస్తూ వ్యాపారవేత్తలపై పడ్డారు. వ్యాపారస్తులు తమ గల్లాపెట్టెలతో సహా దొరికి పోయారన్న ఆయన వాదం పూర్తిగా అబద్ధం. జైలుకి పంపబడిన ఆర్కేస్‌కి చెందిన కపాల్ మెహ్రాతో సహా ఏ ఒక్క వ్యాపారవేత్త మీదా మోపబడిన అభియోగాలు నిలవవు. ఎందుకంటే కపాల్ మెహ్రా కేసుని బొంబాయి కోర్టు కొట్టి వేసింది. మిగతావి కూడా అలానే ఉంటాయని నా అనుమానం.

తక్కువ పన్నుల వల్ల ఎక్కువ ఆదాయం వచ్చేట్లయితే మరి శ్రీ సింగ్ వాటిని ఈ ఏడాది మరింత ఎందుకు తగ్గించలేదు? మనందరికన్నా బహుళ జాతి సంస్థలకే ప్రభుత్వం మీద పట్టు ఎక్కువ ఉన్నది. దిగుమతులని మరింత సుకరం చెయ్యాలని అవి పట్టుబడుతున్నాయి. బహుళ జాతి సంస్థలనించే ఎక్కువ దిగుమతులు జరుగుతాయి. ఇక్కడ కూడా మళ్ళీ ప్రభుత్వం అబద్ధం చెప్పింది. సాంకేతికమైన ఆధునికీకరణకి దిగుమతులు అవసరమని వాదించింది. ఆర్థిక వ్యవస్థని దిగుమతుల ద్వారా, ఉదాహరణకి విడిభాగాల రూపంలో కార్లని (మారుతీలాగా) మొదలైన వాటిని తెప్పించటం వల్ల ఎలా ఆధునికం చేస్తారో నాకు తెలియదు. వాటిని ఇక్కడ ఒకచోట చేర్చి బిగించడమే కదా చేసేది! అసలు ప్రభుత్వానికి ఆధునికీకరణ కార్యక్రమం అంటూ ఏదీ లేదు. ఆ మాటకి వస్తే అసలు పనికి వచ్చేదంటూ ఏదీ లేదు




అసంబద్ధమైన వాదనలతో అది ఒక విధానం నించి మరోదానికి మారిపోతూ ఉంటుంది. పరిస్థితులు సవ్యంగా లేక పోతే నల్ల డబ్బు లాంటి విషయాలని గురించి మాట్లాడుతుంది, తన మంత్రులకి నల్ల డబ్బుతో ప్రమేయం లేనట్టు.

'రాజీవ్ ఇండియా' వ్యవహారాన్నే తీసుకోండి. ఆ టెలివిషన్ చిత్రాన్ని అంతకు ముందెప్పుడూ చిత్రాలు తీయనటువంటి జాక్ ఆండర్‌సన్ తీసారు. రాజీవ్‌కి అమెరికాలో మంచి ప్రచారం కోసమే ఆ చిత్రం తీయటం జరిగిందన్నది నిర్వివాదాంశం. రాజీవ్ ప్రభుత్వం ప్రమేయంతోటే దానిని తీయటం జరిగింది కానీ మరొకటి కాదు. రాజీవ్‌ని గురించి, మిగతా వారిగురించి ఆండర్‌సన్ తాము రాసే పత్రికలలో బాగానే రాస్తూ వచ్చారు. ఎందుకంటే ఆయన దేశాధినేత కాబట్టి. ఒక మాజీ సి. ఐ. ఎ. వ్యక్తి తీసిన ఈ చిత్రంలో కంటికి కనిపించేదే కాకుండా ఇంకా ఎంతో ఉన్నదని తెలిసింది. సి. ఐ. ఎ. ప్రమేయం లేకుండా అమెరికాలో ఒక విదేశానికి, విదేశీ ప్రభుత్వాధినేతకి సంబంధించిన దేదీ జరగదు. ఆ చిత్రం సి. ఐ. ఎ. దని మన ప్రభుత్వానికి దాదాపు క్షుణ్ణంగా తెలుసు. శ్రీమతి గాంధీకి వ్యతిరేకంగా ఆ చిత్రంలో ఉన్నవన్నీ కొత్త ఢిల్లీలో అధికారంలో ఉన్నవారు ఆమోదించి నటువంటివే. కానీ వాళ్లే ఇప్పుడేదో దయ్యాన్ని చూసి భయభ్రాంతులకి లోనవుతున్నట్టు ప్రవర్తిస్తున్నారు. చివరి నిమిషంలో వాళ్ళు భయాందోళనలకి లోను కావటం అన్నది ఆ చిత్రానికీ సి. ఐ. ఎ. కి గల సంబంధాన్ని రామనాథ్ గోయంకా వంటి వారిపై సానుభూతి లేనివారు ఎవరైనా బయట పెడతారేమోననే. పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచి నప్పుడు గొడవ చేసిన పార్లమెంటు సభ్యుల లాగే ఈ విషయంలో కూడా యశ్‌పాల్ కపూర్‌ని రంగంలోకి ఆఖరు నిమిషంలో తీసుకువచ్చారు. ఉన్నత స్థానంలో ఉన్నవారి తీరు ఏవిధంగా ఉంటుందన్నదానికి ఈ వ్యవహారం ఒక నిదర్శనం. ఆ చిత్రం సి. ఐ. ఎ. తో సంబంధం ఉన్న వారు తీసినది, సి. ఐ. ఎ. ఆమోదం దానికి ఉన్నది, సి. ఐ. ఎ. హస్తం దీనిలో ఉందన్న సంగతి ఇక్కడ దానిని

(73 వపేజీ చూడండి)

జీవితంలో అతి ముఖ్యమైన వస్తువుల విలువ మరెంతో ఎక్కువ



జపాన్ సాంకేతిక పరిజ్ఞానం ఆల్విన్ రిఫ్రిజిరేటర్లలో చిరకాల దక్షత నేర్పాటు చేసింది.


సాటిలేని నిరంతర సేవ. మేటిలేని పనితనం. నిశ్చలమైన, నిశబ్దమైన సమర్థత.
అవే కొత్త ఆల్విన్ 2000 ఎస్.ఎల్. సీరీస్ రిఫ్రీజిరేటర్లు మీ కోసం, జపాన్ వారి సాంకేతిక పరిజ్ఞానం మరియూ గ్యారంటీతో లభిస్తున్నాయి.
హిటాచీవారి లైసెన్సుతో తయారు చేయబడిన కంప్రెస్సర్ సాఫీగా, నిశబ్దంగా పనిచేస్తుంది.
అత్యుత్తమమైన రోల్‌బాండ్ ఫ్రీజర్ అతి ఎక్కువ చల్లదనాన్ని అతి తక్కువ వ్యవధిలో ఇస్తుంది,
అల్విన్ 10 శాతం తక్కువ విద్యుచ్ఛక్తి వినియోగిస్తుంది.
170 నుండి 250 వోల్ట్స్ విద్యుచ్ఛక్తికి తగినట్లు తయారుచేయబడినది కనుక వోల్టేజ్ స్టెబిలైజర్ ఉపయోగించ నక్కరలేదు.
స్వయంగా నీరు తోడివేసుకొనే పద్ధతి ఉన్నందువలన డీఫ్రాస్టింగ్ మరింత సులభం.
అల్విన్ రిఫ్రీజిరేటర్లు 85, 165, 300 లీటర్స్ సింగిల్ డోర్ మోడల్స్‌లోను, మరియు 165, 300, 380 లీటర్స్ డబుల్‌డోర్ మోడల్స్‌లోను, లభిస్తున్నాయి.
వివిధ రకాల్లో, సైజుల్లో, మీ ఎంపికకోసం.
మీకు జీవితాంతం అతి త్వరితమైన సేవ, దేశమంతటావున్న అల్విన్ డీలర్లద్వారా లభిస్తుంది.
అందుకోసమే . . . .

7 సంవత్సరాలు గ్యారంటి

IS:1476 ISI

ఆల్విన్

2000 ఎస్ ఎల్ రిఫ్రిజిరేటర్లు



హిటాచి వారి నుండి లైసెన్సు పొందినది

HITACHI

అన్ని సమయాలకు ఆల్విన్

అల్విన్ ఏరియా సేల్స్ ఆఫీసులు ఈ దిగున స్థలాలలో వున్నాయి:
అహమ్మదాబాద్, బెంగుళూరు, భోపాల్, భువనేశ్వర్, బొంబాయి, కలకత్తా, చండీఘర్, ఢిల్లీ, ఎర్నాకులం, గౌహతి, ఘజియాబాద్, హైదరాబాద్, జైపూర్, కాన్‌పూర్, మద్రాసు, పాట్నా, విజయవాడ మరియు విశాఖపట్నం.

MAA(S) ALN 12A TEL 85

ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

స్థాపితం : 1908

శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు : (1938-1972)

18-24 ఏప్రల్, 1986
శ్రీ అక్షయ నామ సం. చైత్ర. శు నవమి
సంపుటము 78 : సంచిక 32

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

విడి ప్రతి వెల రు. 2-50
పోస్ట్‌లో 6 నెలల చందా రు. 71-50
పోస్ట్‌లో 12 నెలల చందా రు. 143-00

ఆంధ్రపత్రిక కార్యాలయము,
గాంధినగరం, విజయవాడ-520 003

విషయానుక్రమణిక

ముఖచిత్రం :
'శపథం'లో సుజాత

కథలు :

సీరియల్ నవలలు:

వ్యాసాలు, శీర్షికలు :

ఉత్తరాలు

బ్రూస్‌లీ చరిత్ర

నటి "సుమలత" ముఖచిత్రంతో వెలువడిన 7–13 మార్చి 86 సంచిక చాలా ఆకర్షణీయంగా వున్నది. ఈ పత్రికలో యర్రగుంట్ల వరలక్ష్మిదేవిగారి "బ్రూస్‌లీ చరిత్ర" అను సీరియల్ చక్కగాను, ఆసక్తికరముగా ఉంది రచయిత్రి గారికి మా కృతజ్ఞతలు.

–దువ్వాడ శ్రీకాంత్, కాశీబుగ్గ

* * *

నటి సుమలత ముగ్ధ మనోహర ముఖచిత్రంతో వెలువడిన ఆంధ్రసచిత్ర వారపత్రికలో ప్రారంభించిన కొత్త సీరియల్ "బ్రూస్‌లీ చరిత్ర" ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ఒక యధార్థ గాథ. దానిని చక్కని నవలగా మలచి రచించిన రచయిత్రి యర్రగుంట్ల వరలక్ష్మిదేవికి హృదయపూర్వక ధన్యవాదములు.

ఆకెళ్ళ సుబ్బారావు, కందికుప్ప

* * *

7 మార్చి 13 అందాల నటి మా అభిమాన హీరోయిన్ "సుమలత" ముఖచిత్రంతో వెలువడిన మన పత్రికలో "బ్రూస్‌లీ చరిత్ర" సీరియల్ చాలా ఇంట్రస్ట్‌గా వున్నది.

అర్వపల్లి ఆంజనేయులు, రాజ్యలక్ష్మి,
ఖమ్మం

కథలు

నటి సుమలత ముఖచిత్రంతో వెలువడిన 7–13 మార్చి 86 సంచికలోని వీరపల్లి వీణావాణి గారి "విలాపాగ్నులు" కథ చాల బాగుంది. నేటి యువతరానికి ఇటువంటి కథలు ఎంతో శ్రేయస్కరము.

బి. షహనాజ్‌బాను,
ఎమ్మిగనూరు

న్యూఢిల్లీ లేఖ

ఈ వారం (7–13 మార్చి) సుమలత ముఖచిత్రంతో వెలువడిన మన పత్రిక అన్నివిధాలా ఆకర్షణీయంగా వుంది. డా. జయదుబాషీ గారి వ్యాసం "వేగంగా పనిచేసే ప్రభుత్వం తీరు" సూపర్బ్‌గా వుంది. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య, నియంతృత్వ వైఖరిని చాలా చక్కగా వివరించారు.

హెచ్. దేవానంద్‌బాబు,
హనుమకొండ

□

"శ్రీరంగ నీతులు చెప్పే సంస్కార వంతులంటే నాకు అసహ్యం" – వైశాలి

"షి ఈజ్ ఏన్ అబ్‌నార్మల్ వుమన్" అన్నారు పోలీసులు ఆమెని గూర్చి.

"విశృంఖల మనస్తత్వం గల మహిళ" అంటున్నారు కొందరు ఆమెని.

చలంగారి 'మైదానం'లో ని రాజేశ్వరి, 'దైవ మిచ్చిన భార్య' లో ని పద్మావతిలను పోలి వుందామె మనస్తత్వం అని వో ప్రముఖ రచయిత్రి వ్యాఖ్యానించింది.

ఏది ఏమైనా ఆమె–తనకు తానుగా వొక వివాదాస్పద పరిస్థితిని సృష్టించు కొని పలువురి దృష్టిని ఆకర్షిస్తోంది.



(ఆమె –శ్రీమతి వైశాలి రెడ్డి.

ఇటీవల తీహార్ జైలు నుంచి తప్పించు కొని పారిపోయిన అంతర్జాతీయ నేరస్థుడు ఛార్లెస్ శోభరాజ్ వైశాలి రెడ్డికి ఆధ్యాత్మిక ప్రియుడు. "అనంతాలను దాటిన ఆధ్యాత్మిక సంబంధమైన ప్రేమ మా ఇద్దరిలో చిగురించిం"దని చెబుతున్న వైశాలి తన ఇద్దరు కూతుళ్ళతో కలిసి హైదరాబాద్ లో ని శ్రీరామచంద్ర మిషన్‌కు ఎదురుగా వున్న ఇంటిలో నివసిస్తున్నారు.

"భగవంతు డిచ్చిన అపురూప కానుక"గా, "మధురానందానికి ప్రతీక"గా, "అలౌ కిక అనందగీతిక"గా ఛార్లెస్ శోభరాజ్ హృదయంలో స్థానాన్ని పొందినట్లనుకుంటున్న శ్రీమతి వైశాలి నిజామాబాద్ జిల్లా లో ని బికనూర్ కు చెందిన వారు. ఆమె తండ్రి గొప్ప ఆయుర్వేద వైద్యుడు. చిన్నప్పుడు హైదరాబాద్ లో ని స్టాన్లీ గర్ల్స్ హైస్కూల్ లో నూ, ఆ తర్వాత ఉస్మానియా యూనివర్సిటీ లోను చదువుకున్న వైశాలి నిజామాబాద్ లో ని మహిళా కళాశాలలో వృక్ష శాస్త్ర విభాగం అధిపతిగా పని చేశారు. కళాశాల యాజమాన్యంతో ఇమడలేక పోవటం వల్ల 1982లో ఉద్యోగానికి రాజీనామా చేశారట.

ఆమె రెండు సార్లు వివాహమాడారు. మొదటి భర్త ముస్లిం మతస్థుడు . రెండవ భర్త రెడ్డి కులానికి చెందిన వ్యక్తి. ప్రస్తుతం రెండవ భర్తతో విడాకులు తీసికొనే ప్రయత్నంలో వున్నారు. మొదటి భర్త ద్వారా ఆమెకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు కలిగారు. పెద్దమ్మాయి డిగ్రీ మొదటి సంవత్సరం , రెండవ అమ్మాయి ఇంటర్మీడియెట్ చదువుతున్నారు. కుమారుడు . అమెరికాలో ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్‌గా పని చేస్తున్నారు. ఢిల్లీ, హైదరాబాద్ పోలీసులు ఆమె ఇంటిని సోదా చేసి ఇంటరాగేషన్ కూడ జరిపారు.

అడిగిన ప్రశ్నలకు సూటిగా జవాబులు ఇవ్వటం ఆమెలో ని ప్రత్యేకత. కుండ బ్రద్దలు కొట్టినట్లు అభిప్రాయాలను వ్యక్తం చేయటం కూడ ఆమెలో ని మరో ప్రత్యేకత.

'ఆంధ్రపత్రిక'తో మాట్లాడుతూ పలు విషయాలపై ఆమె అభిప్రాయాలను వెలిబుచ్చింది. వాటినే ఇక్కడ పేర్కొనటం జరిగింది.

"స్క్రిప్టును తయారు చేసి ఇస్తే ఛార్లెస్ మీద సినిమా తీస్తామని కొందరు నిర్మాతలు నాకు కబురంపుతున్నా" రని అంతర్జాతీయ నేరస్థుడు ఛార్లెస్ శోభరాజ్‌ను పెళ్ళాడాలనుకుంటున్న శ్రీమతి వైశాలి రెడ్డి తెలిపారు.

వో సాయంకాలం "ఆంధ్రపత్రిక ప్రతినిధితో

వేళ నేను స్క్రిప్టు తయారు చేస్తే, అందులో నా పాత్రను నేనేయాక్టు చేయవచ్చు, లేకపోతే నిర్మాతలు మరెవరినయినా సెలెక్ట్ చేయొచ్చు. నిర్మాతలు ఎవర్ని తీసికున్నా ఫరవాలేదు. నా అంతర్మథన మేమిటో అందులో వ్యక్త మవుతుంది. అయితే అదెప్పుడు కార్యరూపం దాలుస్తుందో [illegible]

వివరిస్తూ.....

తాను మొదట్నుంచీ ఛార్లెస్ గూర్చి వో పుస్తకం రాయాలనుకుంటున్నాననీ, ఎవరయినా సహరచయిత దొరికితే తన పని మరి సులువు అవుతుందని వైశాలి పేర్కొంటూ ఛార్లెస్ మనస్తత్వం మీద ప్రవర్తన మీద తనకు మంచి అవగాహన వుందని చెప్పారు.

"శోభరాజ్ గురించి చాలా పుస్తకాలు , వ్యాసాలు చదివాను. అలా చదువుతున్నప్పుడే అతణ్ణి సంస్కరించి ఎందుకు పెళ్ళాడకూడదనే ఆలోచన నాలో ఉత్పన్నమయింది. లాస్టియర్ జూలై నుంచి మూడు రోజుల కోమారు నా ఛార్లెస్‌కు ఉత్తరాలు వ్రాయటం మొదలెట్టాను. అతను కూడ అదే విధంగా నాకు జవాబులిచ్చేవాడు. ఛార్లెస్‌గాడ్‌ను బిలీవ్ చేయడు అయినా నన్ను "గాడ్స్ గిఫ్ట్"గా సంబోధించేవాడు. నిజంగా మా ఇద్దరిదీ చాలా గొప్ప ప్రేమ" అన్నదామె ఛార్లెస్‌తో తన పరిచయాన్ని గూర్చి వివరిస్తూ.

"డబ్బు కోసమో, శారీరక వాంఛతోనో నేను ఛార్లెస్‌తో ప్రేమలో పడలేదు. నేరస్థుణ్ణి ఆదరించలేని సమాజం కళ్ళు తెరిపించాలనే ఉద్దేశంతోనే ఛార్లెస్‌ను ప్రేమించాను" అని ఆమె చెబుతూ ఇదే విషయాన్ని అతనికి ఉత్తరంలో తెలిపి పెళ్ళి ప్రతిపాదన చేస్తే అంగీకరించాడని పేర్కొన్నారు. అందువల్లనే తాను జనవరి 31న ఢిల్లీకి వెళ్ళటం జరిగిందని ఆమె చెప్పారు.

'శోభరాజ్ వల్ల నాకు ఆర్థిక సహాయం లభిస్తున్నట్లు కొందరు ప్రచారం చేస్తున్నారు. అది నిజంకాదు. కేవలం డబ్బుకోసమే ఛార్లెస్‌ను పెళ్ళి చేసికోవాల్సిన అవసరం నాకు లేదు. అలాగయితే నాకు మరెన్నో దారులున్నాయి. కానీ నేనలా చేయను. చట్టాన్ని, నైతిక విలువలను గౌరవించే మనిషిని నేను. అందుకే నిజామాబాద్‌లోని నా ఇంటిని అమ్మేసి నా కూతుళ్ళతో పాటు ఇక్కడుంటున్నాను" అని ఆమె పేర్కొన్నారు.

జైల్లో ఛార్లెస్‌ను పెళ్ళి చేసికోవటానికి ఏమైనా చట్టప్రకారం వీలవుతుందేమోనని తాను ఛార్లెస్ క్రిమినల్ లాయరైన డాక్టర్ ఎస్. ఎం. ఘటాటేను కలిశాననీ, జైలు జీవితాన్ని గడుపుతున్న నేరస్థుణ్ణి పెళ్ళాడటానికెందువల్ల ఉత్సుకత చూపుతున్నారని ఆయన తనని ప్రశ్నించారని వైశాలి తెలిపారు.

"నాకతడంటే ఎంతో ఇష్టం . అతడిని పెళ్ళి చేసికొని సంస్కరిద్దామనుకుంటున్నా. ఏ దేశమయితే నేరస్థుణ్ణి కూడ ఆదరిస్తుందో అలాటి దేశానికి వెళ్ళి ఛార్లెస్‌తో జీవితం గడుపుదామని. లేదా మిసెస్ ఛార్లెస్ గానే ఢిల్లీలో బ్రతుకుదామని. అంతేగానీ నాలో ఏకోశానా దురాశలేదు. నేను రెండవపెళ్ళి కూడ చేసికున్నాను. ఎందువల్ల అనుకున్నారు? కేవలం నైతిక మద్దతుకోసమే! ఈ పెళ్ళి ఆలోచన కూడ దీనికోసమే , పాత ఛార్లెస్‌ను సత్శీలుడుగా సంస్కరించగలననే విశ్వాసం కూడ బలంగా వుండటం వల్ల" అని తాను ఘటాటేకు జవాబిచ్చినట్లు తెలిపారు.

కోర్టులో తన విడాకుల వ్యవహారం పెండింగ్‌లో వుండటం వల్ల, ఛార్లెస్‌ను పెళ్ళాడటంలో గల లీగల్ చిక్కులను ఘటాటేతో చర్చించాననీ, తర్వాత ఆయన తనను తీహార్ జైలుకి తీసికెళ్ళారని ఆమె వివరించారు. "ఢిల్లీలో వున్నన్నాళ్ళు ప్రతిరోజు ఉదయమే ఛార్లెస్‌ను కలుసుకొని సాయంత్రం దాకా కబుర్లు చెప్పేదాన్ని" అని కూడ ఆమె తెలిపారు.

ఇద్దరు భర్తలతోనే ఇమడలేక పోయిన మీరు శోభరాజ్‌ని ఎలా సంస్కరించగలరని ప్రశ్నిస్తే—

దాన్ని సాధించ గలనన్న విశ్వాసం నాకుంది. ఆ గుణం మా నాన్న గారి నుంచి నాకు కూడ అబ్బింది. నా గూర్చి తెలిసిన వాళ్ళు సైతం ఈ నిజాన్ని వొప్పుకుంటారు. ఛార్లెస్ ను పెళ్ళి చేసికొని తప్పకుండా సంస్కరించగలను. నేనంటే ఆయనకి చాలా ఇష్టం. నేను చెప్పినట్లు వింటాడు కూడ. ఆస్తి సంబంధమైన తగాదా కారణంగా నా ఫస్ట్ హజ్బెండ్‌కు డైవోర్స్ ఇచ్చాను. మన స్పర్థల కారణంగా నా సెకండ్ హజ్బెండ్‌కు డైవోర్స్ ఇస్తున్నాను. స్త్రీకి స్వేచ్ఛ కావాలనే మనిషిని నేను" అని వైశాలి ఆవేశంగా జవాబిచ్చారు.

ఛార్లెస్ శోభరాజ్‌ను సంస్కరించాలనే మీ అభిప్రాయాన్ని మీ పిల్లలు సమర్థిస్తున్నారా అని అడిగినప్పుడు—"దయచేసి ఈ విషయంలో నా పిల్లల ప్రస్తావన తీసుకొని రావద్దు. నాకూ, ఛార్లెస్‌కు మధ్య వున్న అనుబంధాన్ని మాత్రమే అడగండి. ఎంత సేపయినా చెబుతాను..... ఎంతైనా చెబుతాను ఐనా అడిగారు కనుక చెపుతున్నా— నేను చేసే ప్రతిపనీ వారికి తెలుసు.... నాకు అభ్యంతరం చెప్పరు.... తమ చదువు తమ భవిష్యత్తును గూర్చి వారు ఆలోచిస్తారు. అంతే!" అని వైశాలి పేర్కొన్నారు.

"నేను ఏ పని చేసినా ముందు ఆలోచించే చేస్తాను . ఛార్లెస్‌ను ప్రేమించే ముందు ఇలాటి సంఘటనలు ఎదురవుతాయని ఊహించాను. అయినా దీన్ని గూర్చి నేను ఖాతరు చేయను. నేను ఆధునిక భావాలు గల యువతినే అయినప్పటికీ హద్దుల లోనే వున్నా"నని చెప్పిన వైశాలి ఎలాటి విపత్కర పరిస్థితు లెదురయినా తాను చలించననీ, పిరికిదాన్ని కాననీ స్పష్టం చేశారు.

జైలుకి తిరిగొస్తే పెళ్ళి చేసుకుంటాను

"అతనెక్కడికి పారిపోయినా సరే క్షేమంగా వుండాలనే కోరుకుంటా. అయితే చట్టానికి తలవొంచి పోలీసు అధికారులకు లొంగి పోతేనే పెళ్ళి చేసుకుంటాను. అతను చట్టాన్ని గౌరవిస్తాడనే నమ్మకం నాకుంది. ఛార్లెస్ తప్పకుండా పట్టుబడతా"డని ఆమె పేర్కొంటూ " నిజానికి ఛార్లెస్ అలా జైలు నుంచి పారిపోవలసింది కాదు. అతడిలో గొప్ప మార్పు తేవాలని చేస్తున్న నా ప్రయత్నం కాస్తా ఇలా నీరు కారిపోతుందని నేనూహించలేదు. అయినప్పటికీ నేను ఛార్లెస్‌ను గొప్పగా ప్రేమిస్తున్నాను. అనంతాలను దాటిన ఆధ్యాత్మిక సంబంధమైన ప్రేమ మాలో చిగురించింది." అని దగ్గుత్తికతో చెప్పారు.

శోభరాజ్ జైలులో వున్నప్పుడు పలువురు అమ్మాయిలు కలుసుకోవటానికి వచ్చే వారనీ, వారితో అతనికి అన్ని విధాలైన సంబంధాలుండేవనీ, ఆ అమ్మాయిలలో ఘటాటే గారి వద్ద పని చేసే జూనియర్ లాయర్ స్నేహ కూడ వున్నదని "ఢిల్లీ పోస్ట్" పత్రికలో వచ్చిన వార్తను తనకు ఢిల్లీలో డాక్టర్ ఘటాటే చూపారనీ, ఈ విషయాన్ని జైల్లో శోభరాజ్‌తో ప్రస్తావించినప్పుడు వొప్పుకున్నాడనీ, అయినా సంస్కరించే అవకాశాన్ని కల్పించమని తాను కోరగా అంగీకరించాడనీ, తర్వాత రోజుల్లోనే శోభరాజ్ జైలు నుంచి పారిపోయినట్లు దూరదర్శన్‌లో చూసి ఆశ్చర్యపోయానని ఆమె వివరించారు.

"ఛార్లెస్ పారిపోయిన రోజు నుంచి స్నేహ కూడ కనిపించటం మానేసింది. ఆమెను విస్మరించి పోలీసులు నన్నే ఇంటరాగేషన్ చేస్తున్నారు. వారేం చేయగలరు? ఛార్లెస్ వెళ్తూ వెళ్తూ నా అడ్రస్ వొదిలేసి వెళ్ళి పోయాడు" అంటూ వో సందర్భంలో ఆమె నిస్పృహను వ్యక్తం చేసింది. మళ్ళీ అంతలోనే— "అదేమిటో గానీ ఛార్లెస్ తన జీవితంలో ఎప్పుడు కూడ ఛాన్సులు వచ్చి నప్పుడు వినియోగించుకోలేదు. ఆ గుణమే అతని పతనావస్థకు కారణమవుతోంది. అతని బయోగ్రఫీ చదివితే ఆ విషయం అర్థమవుతుంది. తండ్రి ప్రేమ కోసం మొదట్నుంచి తపించి పోయాడతను". అని వైశాలి పేర్కొన్నారు.

తన దగ్గర ఎలాటి రహస్యాలను దాచవద్దనీ, నీ గత జీవితాన్ని పూర్తిగా క్షమిస్తాననీ ఛార్లెస్‌తో తాను చెప్పినప్పటికీ, తాను కోరిన రిచర్డ్ నెవిల్ రాసిన "శోభరాజ్ జీవితం" ఇస్తూ అందులో హత్య చేయబడిన అమ్మాయిల ఫోటోలను చింపివేసి ఇవ్వటం పట్ల తాను కోపగించుకోవటంతో అతను చాలా బాధ పడినాడని ఆమె తెలిపారు. చింపి వేసిన ఆ అమ్మాయిల ఫోటోలను తాను దిగిన హోటల్‌లోని బుక్‌స్టాల్‌లో వున్న పుస్తకంలో చూశానని కూడ ఆమె తెలిపారు.

"భారతీయ సంస్కృతి మంచిదే – కానీ నాకు భారతీయతపై నమ్మకం లేదు"

"మన భారతీయ సంస్కృతి మంచిదే! కానీ నాకు భారతీయతపై నమ్మకం లేదు . ఎందుకంటే చెప్పేవి శ్రీరంగ నీతులు దూరేవి దొమ్మరి గుడిసెల్లో మాదిరిగా వ్యవహరిస్తున్నారు— సంస్కారం గూర్చి ఉపన్యాసాలు ఇచ్చేవారంతా అలాటి వాళ్ళంటే నాకసహ్యం. ఒక నేరస్థుణ్ణి, వ్యభిచారిణీ మార్చటం చాలా గొప్ప సంస్కారం అంటుంటారు తమ ఉపన్యాసాల్లో. అలా నీతులు చెప్పే వాళ్ళే ఎవరైనా సంస్కారాన్ని చేతల్లో చూపిస్తే అసహ్యించు కుంటారు. ఇప్పుడు నా పట్ల విచిత్రంగా అందరూ చూడటం లేదా?" అని ఆమె ప్రశ్నించారు.

తాను చేస్తున్న పనిని సమాజం హర్షించక పోయినప్పటికీ తన అంతరాత్మ మాత్రం మంచి పనేనంటూ సమర్థిస్తోందని ఆమె చెప్పారు.

ప్రతి వ్యక్తి స్వేచ్ఛామయ జీవితాన్ని గడపాలని వైశాలి కోరుతూ స్త్రీ స్వేచ్ఛ అంటూ ఉద్యమాలు నడిపే వాళ్ళంతా కేవలం నినాదాల వరకే తమ జీవితాన్ని పరిమితం చేసు కుంటున్నారనీ, ఇతరులకు మాత్రమే స్వేచ్ఛను గూర్చి ప్రబోధిస్తారే తప్ప తమ దాకా వొస్తే తోకలు ముడుచుకుంటారని ఒక సందర్భంలో విమర్శించారు. "ముందు తమ కుటుంబాలలో స్వేచ్ఛను ప్రసాదించుకొని బయట అడుగు పెట్టడం మేలు" అని ఆమె వ్యాఖ్యానించారు.

సీరియల్

వసంతోత్సవం

దేవినేని ఉష

(గత సంచిక తరువాయి)

రామనాథం భార్య రాజేశ్వరి భోజనాల ఏర్పాటు చేసింది. కృష్ణ మొహమాటపడిపోయాడు. కానీ తప్పలేదు.

"మాలకు ఫోన్ చేస్తే పోయేదిగా?" రాజేశ్వరి అంది.

"అక్కరలేదు. వచ్చే టయిమ్ అయింది" అన్నాడు రామనాథం. మగవాళ్ళ భోజనాలు అయ్యేసరికి యూనివర్సిటీకి వెళ్ళిన మాలతి రానే వచ్చింది. కృష్ణను చూసి బిడియపడకుండా నమస్కరించింది.

అంతా హాల్లోకి వచ్చారు. ఆడవాళ్ళు వెళ్ళి భోజనాలు చేసి వచ్చారు. స్వప్న అక్కను, కృష్ణనే చిలిపిగా గమనించసాగింది.

మూడింటి వరకు అందరూ కూర్చుని కబుర్లు చెప్పుకున్నారు. అటు కృష్ణకు కానీ, ఇటు మాలతికిగానీ ఆ సన్నివేశం పెళ్ళి చూపుల్లా లేదు. ఒక ఆప్తమిత్రుడితో కాలక్షేపం చేసినట్టుగా ఉంది. కృష్ణకు అలానే ఉంది మంచి ఫ్రెండ్స్ దొరికినట్టుగా.

మూడింటికి స్వప్న లేచి ఫ్రిజ్‌లో కూల్‌డ్రింక్స్ తీసుకు వచ్చింది. అవన్నీ గోల్డ్‌స్పాట్ బాటిల్స్. అవి టీపాయ్ మీద పెట్టి తిరిగి వెళ్ళి రెండు లిమ్కాలు తెచ్చింది.

"అక్కా! నీకు కృష్ణగారు నచ్చితే గోల్డ్ స్పాట్ తీసుకో. నచ్చకపోతే లిమ్కా తీసుకో" మాలతి వంక కొంటిగా నవ్వుతూ చెప్పింది స్వప్న.

ఆ మాటలకు మాలతి సిగ్గుపడిపోయింది.

"కృష్ణగారూ! మీరు కూడా అక్క నచ్చితే గోల్డ్‌స్పాట్ తీసుకోండి. నచ్చకపోతే లిమ్కా తీసుకోండి." కృష్ణకు చెప్పింది.

కృష్ణ ఇంకేం ఆలోచించకుండా నవ్వుతూ గోల్డ్‌స్పాట్ అందుకుని కొద్దిగా సిప్ చేసి స్వప్నవేపు చూసాడు.

ఆనందంతో సన్నగా విజిల్ వేసింది స్వప్న. రాజేశ్వరి స్వప్నను కోపంగా చూసింది. స్వప్న భయపడినదానిలా నోట్లో వేళ్ళు తీసేసి బుద్ధిగా అక్క పక్కన కూర్చుంది. రామనాథంగారు పెద్ద కూతురిని నవ్వుతూ చూసారు. "మాలా! ఆ బాబు అభిప్రాయం చెప్పారు. నవ్వు కూడా చెప్పేయి."

"ఫో డాడీ!" మొదట కృష్ణను చూడగానే రాని సిగ్గు ఇప్పుడు వచ్చింది. తనూ ఒక గోల్డ్‌స్పాట్ తీసుకుని వడివడిగా తన గదిలోకి వెళ్ళిపోయింది. స్వప్న అక్క వెనక పరిగెత్తింది.

"ఎంత చదువుకున్నా నీ కూతురికి ఆడపిల్ల సిగ్గు పోలేదు చూసావా?" నిండుగా నవ్వుతూ భార్యవేపు చూసారు రామనాథం.

"బాగుంది. ఆడపిల్ల అన్నాక సిగ్గు పడక తప్పుతుందా?" ఆవిడ లేచి వెళ్ళిపోయింది.

జరిగిన కథ – 1: చిన్నతనంలో తల్లిదండ్రులను కోల్పోయిన కృష్ణ వరుసకు చిన్నాన్న అయిన సుబ్బారావు దగ్గర పెరుగుతాడు. సుబ్బారావుకి మగపిల్లలు లేరు. ఇద్దరూ ఆడపిల్లలే. కాంత, ప్రమీల. కృష్ణకు హైదరాబాద్‌లో బ్యాంకులో ఉద్యోగం వచ్చింది. కాంతకు, ప్రమీలకు వివాహాలు జరిగిపోయాయి. ప్రమీల భర్త కమలాకర్‌కి బాబాయి కూతురైన మాలతిని చూడటానికి పెళ్ళిచూపులకై మద్రాసు వెళ్తాడు కృష్ణ.

"చూడండి బాబూ! మీ కుటుంబం గురించి ముఖ్యంగా మీ గురించి నేను బాగా విన్నాను. నా కూతురికి ఇచ్చే కట్నానికి ఇంత కంటే ఘనమైన సంబంధం తేగలను. కానీ మీలాంటి మంచి మనసున్న మనుషులు దొరకవద్దా? పరిగెత్తి పాలు తాగేకంటే నిలబడి నీళ్ళు తాగటం ఉత్తమం అని నా అభిప్రాయం నేను అన్ని విషయాలు మీ నాన్నగారితో మాట్లాడేసాను కాకపోతే మా బలవంతం కాదు. మీ ఇద్దరు ఒకరికొకరు నచ్చాలన్న ఆలోచనతో మిమ్మల్ని ఇక్కడకు పిలిపించాను. ఈ వేసవితో మాల పి.హెచ్‌డి. పూర్తవుతుంది. అప్పుడు లగ్నం పెడదామని నాన్నగారితో చెప్పాను. వారు ఒప్పుకున్నారు" రామనాథంగారు చెప్పారు.

"ఓ.కే. అలానేనండి. నేను కూడా ఎమ్.కాం. ప్రిపేరవుతున్నాను"

"చాలా సంతోషం." అక్కడితో సంభాషణ ఆగిపోయింది ఇక మాట్లాడటానికి ఎవరిదగ్గరా మాటలు లేవు. కృష్ణకి ఇక అక్కడ ఉండటం భావ్యంగా అనిపించలేదు.

"నేను వెళ్ళొస్తానండి" కృష్ణ లేచాడు.

"వెళ్తారా? ఓ.కే. ఎన్ని రోజులు లీవ్ పెట్టారు?" రామనాథం అడిగాడు

"నిన్నా, ఇవాళా పోను ఇక రేపూ ఎల్లుండీ మాత్రం ఉంది లీవ్ రేపు సాయంత్రం హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌కు సరాసరి వెళ్ళిపోతాను"

"నాన్నగారి దగ్గరకు వెళ్ళరు?"

"ఊహూ లేదండీ."

"అలా అయితే రేపటి వరకూ ఎక్కడ ఉంటారు? బంధువులు ఎవరైనా ఉన్నారా?"

"లేరండి. హోటల్‌లో దిగాను"

"అరె, అలా ఎందుకు? మనిల్లు ఉండగా. నేను హోటల్‌లో సామాను తెప్పించేస్తాను. మీరు ఇక్కడ ఉండండి"

కృష్ణకు మొహమాటం కలిగింది ఈ సాయంత్రం తను బీచ్‌లో గడిపి రేపు పగలు బజార్లు తిరిగి సాయంత్రం వెళ్ళిపోవాలనుకున్నాడు ఇక్కడ ఉంటే ఫ్రీడమ్‌గా ఉండదు. అందుకే కృష్ణ ఆయన మాటలను నవ్వుతూ తిరస్కరించాడు. రామనాథంగారు ఎక్కువ బలవంతం చేయలేదు నవ్వి ఆ ప్రస్తావన ఆపేశారు. రామనాథంగారు గదిలో కూర్చున్న కూతుళ్ళను, భార్యను పిలిచారు.

"నేను వెళ్ళొస్తానండి". క్రీగంట మాలతిని గమనిస్తూ ఆమె తల్లికి నమస్కారం చేసాడు.

మాలతి స్నానం చేసినట్టుంది ఇందాకటి చీర మార్చింది సోగ కళ్ళు, లావుగా, పొట్టి జడ, హైటు కృష్ణకు తగ్గట్టే ఉంది కనుబొమలు, కళ్ళు పెన్సిలుతో దిద్దింది. ఆమె వదనం విజ్ఞానంతో పదును తేరినట్టుగా కనిపిస్తోంది చిన్న పిల్ల స్వప్న మొహంలో వున్న అమాయకత్వం మాలతి వదనంలో ఎక్కడా లేదు. పాల మీగడలాటి శరీరచ్ఛాయ ఆమెది

"సార్! మిమ్మల్ని బావగారు అనొచ్చా?" అమాయకంగా అడిగింది స్వప్న

మాలతి చిరుకోపంగా చెల్లెలి వేపు చూసింది

"ఓ.కే బేబీ అలానే పిలువు" రామనాథం మాట ఇచ్చేసాడు

"రండి మిమ్మల్ని కారులో డ్రాప్ చేస్తాను" రామనాథం అన్నాడు

కృష్ణ టైమ్ చూసుకున్నాడు. ఐదు కావస్తోంది

"నేను మెరీనా బీచ్‌కు వెళదాం అనుకుంటున్నానండి రేపు పగలు బాగుండదు కదా!" కృష్ణ చెప్పాడు

"బీచ్‌కా ఒక్కరే ఎలా ఎంజాయ్ చేస్తారు? బోర్ కొట్టదూ?" స్వప్న అనేసింది.

"ఫరవాలేదు. ఇక్కడ ఫ్రెండ్స్ ఎలా దొరుకుతారు?" కృష్ణ చిన్నగా నవ్వాడు

"డాడీ! అయితే మనమంతా వెళదాం అండి" స్వప్న అడిగింది

"నేను, మీ అమ్మ ఏడుగంటలకు చక్రపాణి ఇంట్లో డిన్నర్‌కు వెళ్లాలిగా!" రామనాథం గుర్తు చేసాడు.

"ఓ, ఆ లాయర్ చక్రపాణి ఒకరు" విసుక్కుంది స్వప్న

కాబోయే బావగారు ఆ పిల్లకు బాగా నచ్చారు అతన్ని ఎక్కువగా మర్యాద

చెయాలనిపిస్తోంది ఆ అమ్మాయికి.

"పోనీ ఒక పని చేద్దాం" రామనాథంగారు అంటుండగానే "చెప్పండి" స్వప్న ఉత్సాహంగా అడిగింది.

"మన కారులో డ్రైవర్‌ను తీసుకువెళ్ళి నువ్వు, అక్కా ఈ బాబును బీచ్‌కు తీసుకు వెళ్ళండి. తరువాత ఆయన్ని హొటల్ దగ్గరు డ్రాప్ చేసి మీరు వచ్చేయండి."

స్వప ఎగిరి గంతేసింది. "ఓ.కే డాడీ!" అంటూ. "డాడీ! మరి మీకు కారు కావద్దా?" మాలతి అంది.

"కారుదేం ఉందిలేమ్మా! రంజిత్‌కు ఫోన్ చేస్తే పంపిస్తాడు. నువ్వు వెళ్తావుగా బీచ్‌కు?" రామనాథంగారు కూతుర్ని అడిగారు.

"అలాగేనండి" తలూపింది.

కృష్ణ మనసులో పొంగిపోయాడు. రామనాథంగారు కూతుళ్ళను వెళ్ళమన్నప్పుడు మాలతి వస్తుంది అనుకోలేదు.

"మీరు రిఫ్రెష్ అవండి" అన్నాడు రామనాథం. నౌఖర్ వెంకన్న వచ్చి కృష్ణకు బాత్‌రూం చూపించాడు. కృష్ణ ఫ్రెష్‌గా తయారయి వచ్చేసరికి నాయర్ ఫలహారం రెడీ చేసాడు. రసగుల్లాలు, రెండు కేక్స్, కారప్పూస, టీ. ఈలోగా మాలతి, స్వప్న కూడా రెడీ అయ్యారు. స్వప్న చుడీదార్ వేసుకుంది: చెవులకు పెద్ద రింగ్‌లు పెట్టింది. మెళ్లో ముత్యాల హారం వేసుకుంది. వాచి ఒక చేతికి, ఒక చేతికి వెండి గాజుల సెట్ వేసుకుంది.

మాలతిని చూసాడు కృష్ణ. కళ్ళు వెలిగాయి. పాలపిట్ట రంగు డిస్కో చీర కట్టింది. అదే కలర్ జాకెట్‌కు వైట్ అంచులు వేసింది. మెళ్లో చైన్ తీసేసి కాసుల పేరు వేసింది. చేతులకు అర వంకీలు పెట్టింది. కను బొమల మధ్య చిన్న బొట్టు పెట్టింది. అంత చిన్న జుట్టుతో ఏ మాయ చేసిందో ఏమో కానీ జడ స్థానంలో అందమైన ముడి చుట్టి ఉంది. కృష్ణ ఆమె వేపు చూడగానే కనీ కనబడనట్టుగా పల్చగా నవ్వింది. అతిగా చూస్తే బాగుండదని చూపు మరల్చుకున్నాడు. అక్కా-చెల్లెలు ఒకరితో ఒకరు అలంకరణలో, అందంలో పోటీ పడుతున్నట్టు ఉన్నారు.

అల్పాహారాలు ముగిసాయి. రామనాథం డ్రైవర్‌ను పిలిచారు. నాయర్ అతనికి కూడా టిఫిన్ పెట్టాడు.

రామనాథంగారు డ్రైవర్‌తో వీళ్ళను బీచ్‌కి తీసుకు వెళ్ళమని చెప్పాడు. చివరిలో ఎప్పటిలా "జాగ్రత్త సుమా!" అని హెచ్చరించాడు. ఆ డ్రైవర్ చాలా ఏళ్ళ నుండి నమ్మకంగా చేస్తున్నాడు. అతనితో పిల్లలను ఒంటరిగా అయినా పంపిస్తారు.

అంతా బైటకు వచ్చారు. అక్కా, చెల్లెలు వెనుక సీట్లో కూర్చున్నారు. కృష్ణ డ్రైవర్ పక్కన కూర్చున్నాడు.

దారి పొడుగునా స్వప్న ఏవో జోక్స్ వేసి కృష్ణను, మాలతిని నవ్వించసాగింది. కృష్ణ కూడా స్వప్నతో పాటు సమానంగా జోక్స్ వేయసాగాడు. డ్రైవర్ కూడా నవ్వుతున్నాడు. మాలతి పెద్దగా నవ్వితే కృష్ణ ఏమైనా అనుకుంటాడని పెదవుల చాటునే నవ్వసాగింది.

బీచ్ రోడ్డు దగ్గర కారు ఆపాడు డ్రైవర్. "అమ్మాయిగారూ! మీతో నన్ను లోపలకు రమ్మంటారా?" డ్రైవర్ మాలతిని అడిగాడు.

"వద్దులే. నువ్వు ఇంటికి వెళ్ళి నాన్నగారిని లాయర్ చక్రపాణిగారి ఇంటి దగ్గర దింపేసి ఇటురా! వాళ్ళు వచ్చేటప్పుడు ఎవరి కారులోనో వచ్చేస్తారులే" మాలతి అంది.

డ్రైవర్ తలూపి కారు రివర్స్‌లోకి తిప్పాడు.

మాలతి డబ్బున్న హుందా బాగా అబ్బింది. ఆమె మాట్లాడే ప్రతి మాటా ఒక శాసనంలా అనిపిస్తోంది. అలా అని అహంకారం చూపించదు. మాలతి కృష్ణకు చాలా బాగా నచ్చింది.

కారు వెళ్ళిపోయేదాకా చూసి ముగ్గురూ ఇసుకలో నడవసాగారు.

కృష్ణ, మాలతి అప్పుడప్పుడు మాట కలపసాగారు స్వప్న మాటలలో.

ఎదురుగా కడలి కనిపిస్తోంది. కెరటాలు ఉవ్వెత్తున లేచి పడుతున్నాయి. మాలతి ఒక పక్కగా నీళ్ళకు కాస్త దూరంగా కూర్చుంది. కృష్ణ ఆమెకు కాస్త దూరాన కూర్చున్నాడు. సబ్బు నీటి నురగలా ఎగిసి పడి వచ్చి ఇసుకను తడిపేసి



వసంతగీతం

కదలి అజ్జకు కట్టుబడిన వాటితో వెనక్కి వెళ్ళిపోతున్నాయి కెరటాలు.

స్వప్న వాళ్ళతో కూర్చోలేదు. కెరటాలకు అందేంత దూరంలో నిల్చబడింది. కెరటం వచ్చి ఆమె తల మీదగా వెళ్ళిపోతుంటే ఎరగబడి నవ్వసాగింది. స్వప్న కాదు చాలామంది అలాగే అల్లరి చేయసాగారు. కృష్ణ వయసున్న నలుగురు యువకులు ఒడ్డున ఉన్న ఈ సందడి గమనిస్తూ నీళ్ళలో ఈతలు కొడుతున్నారు.

మాలతి అప్పుడప్పుడు క్రీగంట కృష్ణను గమనిస్తూ అటు చూడసాగింది. కృష్ణ కూడా అదే పని చేస్తున్నాడు. ఒకసారి సడన్‌గా ఇద్దరూ ఒకరికొకరు పట్టుబడిపోయారు.

"ఏమిటి అలా చూస్తున్నారు?" సంకోచం పక్కన పెట్టి కృష్ణ పలకరించాడు.

మాలతి కళ్ళు వాల్చేసింది.

"ప్లీజ్ మాట్లాడండి. మళ్ళీ మనం చాలా నెలలకు కలుసుకుంటాం. అదీ పెళ్ళి పందిరిలో. అప్పుడు కనీసం ఒకరినొకరం చూసుకోవటానికి కూడా వీలు కాదు" కృష్ణ అర్థిస్తున్నట్టుగా మెల్లగా అన్నాడు.

మాలతి కళ్ళలో మెరుపు కనిపించింది. శరీరం సన్నగా కంపించింది. బుగ్గల్లోకి సర్రుమని సిగ్గు పాకి వచ్చింది. కృష్ణ అదంతా గమనించాడు.

"ప్లీజ్." కృష్ణ లాలనగా అన్నాడు.

మాలతి ఎదురుగా చూసింది. స్వప్న ఈ లోకంలో లేదు. తన వయసు పిల్లలతో ఎగురుతూ తడుస్తోంది. తిరిగి కృష్ణను చూసింది.

"ఏం మాట్లాడమంటారు, చెప్పండి" సిగ్గును దూరంగా నెడుతూ కృష్ణ వైపు అర మోడ్పు కన్నులతో చూస్తూ మెల్లని స్వరంతో అడిగింది.

"నాకు మీరు బాగా నచ్చారు. ఐ లవ్ యు!" కృష్ణ కళ్ళల్లో మైకం కమ్మింది.

మాలతి తల నేలలోకి వంచేసింది" మీరూ నాకు ఆ మాట చెప్పరు?" అన్నాడు.


మాలతి ఒళ్ళు గగుర్పొడిచింది.

"చెప్పండి. ఆ మాటే తలుచుకుంటూ నేను పెళ్ళి రోజుదాకా ఈజీగా గడిపేస్తాను."

మాలతి మాట్లాడలేదు.

"చెప్పండి మళ్ళీ మీ సిస్టర్ వచ్చేసిందంటే చెప్పరు." కృష్ణ తొందర చేసాడు.

స్వప్న ఆట అయిపోయినట్టుంది. ఇటు వస్తోంది.



"అదుగో చెప్పండి."

మాలతి పెదవులు విప్పింది. ఆమె నోటి నుండి వచ్చేమాట కోసం కృష్ణ ఏదో తెలీని అనుభూతితో చూస్తున్నాడు.

"ఐ లవ్ యూ!" మాలతి అదురుతున్న పెదవులతో చెప్పేసింది.

"థాంక్స్, వెరీ మెనీ థాంక్స్!" కృష్ణ అన్నాడు.

స్వప్న వచ్చేసింది. మరో గంట స్వప్న కబుర్లు వింటూ గడిపేసారు.

బాగా చీకటి పడిపోయింది. శుక్లపక్ష రోజులు కావటంతో చంద్రుడు బాగా కనబడుతున్నాడు. చంద్రుణ్ని అందుకోవాలనుకుంటూ కెరటాలు సాయంత్రం కంటే వేగంగా ఎగరసాగాయి. జనం పల్చబడిపోతున్నారు.

"మనం కూడా వెళదాం" కృష్ణ లేచాడు. ముగ్గురూ రోడ్ మీదకు వచ్చేసారు.

కారుతో డ్రైవర్ సిద్ధంగా ఉన్నాడు. వీళ్ళని చూసి డోర్స్ తీసాడు.

"నాన్నగారిని, అమ్మను డ్రాప్ చేసి వచ్చావా?" మాలతి అడిగింది.

"వారిని అక్కడ దింపే వచ్చానండి" వినయంగా అన్నాడు. కృష్ణ తను దిగిన హోటల్ పేరు చెప్పాడు. డ్రైవర్ కారు అటు తిప్పాడు.

హోటల్ ముందు కారు ఆగింది. సన్నగా తుప్పర పడసాగింది.

కృష్ణ కారు దిగి వెనుక డోర్ తీసి "వస్తా స్వప్నా! వస్తా మాలా" అంటూ ఇద్దరికీ చెప్పాడు.

మాలతి తలెత్తింది. లైట్ వెలుగులో ఆమె కళ్ళు చూసిన కృష్ణ హృదయం జివ్వుమని లాగింది. అతనికి ఒక చిలిపి కోరిక పుట్టింది.

"స్వప్నా ఇందాక మీ అక్క నాకు ఒక మంచి మాట చెప్పింది. దాన్నే తలచుకుంటూ ఆమె చదువు అయ్యే వరకూ గడిపేస్తాను" అన్నాడు.

మాలతి మొహం ముద్ద మందారంలా అయింది.

"ఏమిటండీ ఆ మాట?" స్వప్న చిటికెలు వేస్తూ అడిగింది.

"మీ అక్కనే అడుగు బై! డ్రైవర్ కారు పోనీ" అంటూ డోర్ వేసేసాడు. కారు మెల్లగా కదిలింది. స్వప్న చేయి ఊపింది. కారు ముందుకు వెళ్ళిపోయింది. కృష్ణ వెనుకనే మిగిలిపోయాడు.

ఆ రాత్రి కృష్ణ బీచ్‌లో కలిగిన అందమైన అనుభూతిని తల్చుకుంటూ తృప్తిగా నిద్రపోయాడు.

మర్నాడు బజారులు తిరిగి మధ్యాహ్నం హోటల్‌లో భోంచేసి రూమ్ రెంట్ ఇచ్చేస్తున్నాడు. అంతలో అతనికి ఫోన్ వచ్చింది. రిసెప్షన్ వద్దే ఉన్న కృష్ణకు ఫోన్ అందించారు. అవతల మాట్లాడేది రామనాథం. తను వెళ్ళిపోతున్నట్టు చెప్పాడు. కాసేపటికి ఆయన ఫోన్ పెట్టేసాడు.

స్టేషన్‌కు వచ్చేసాడు. హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు. బెర్త్ ఖాళీగా ఉంటే సీటు వదిలిపెట్టి పైకెక్కి నిద్రపోయాడు.

* * * * *

పెద్ద కుదుపుతో ట్రైన్ ఆగింది. కృష్ణ ఉలిక్కిపడి తలో చనలలో నుండి తేరుకున్నాడు.

కాజీపేటలో ఆగింది ట్రైన్. తల తిప్పి ఎదురు సీటు వైపు చూసాడు. ఆ యువతి మెలకువ వచ్చిన దానిలా కృష్ణను చూసి చిన్నగా నవ్వింది. కృష్ణ కూడా పలకరింపుగా నవ్వాడు.

ఆమె వదనం అమాయకంగా పాలు కారుతున్నట్టు ఉంది.

"ఏ వూరండి ఇది?" అడిగింది కిటికీలో నుండి బైటకు చూస్తూ.

"కాజీపేట! మీరెక్కడికి వెళ్ళాలి?" అడిగాడు.

"హైదరాబాద్ వెళ్ళాలి."

కాఫీ, ఫలహారాల వాళ్ళ కేకలతో అలజడిగా ఉంది.

కృష్ణ కాఫీ అబ్బాయిని పిలిచాడు.

"మీరు తీసుకుంటారా?" ఆమెను అడిగాడు.

"వద్దండీ" అంది.

కృష్ణ మౌనంగా కాఫీ తాగేసాడు. ట్రైన్ తిరిగి బయల్దేరింది.

సహజంగా స్నేహశీలి అయిన కృష్ణ ఆమెతో మౌనంగా ఉండలేకపోయాడు. ఆమెతో మెల్లగా మాటలు కలుపుతూ ఆమె నుంచి విషయాలు రాబట్టాడు.

ఆమెది విజయవాడ అని ప్రస్తుతం తన ఫ్రెండ్ ఇంటికి హైదరాబాద్ వస్తున్నట్టూ, వీలైతే ఆ ఫ్రెండ్ ద్వారా అక్కడే ఏదైనా జాబ్ చూసుకోవాలని చెప్పింది.

కృష్ణ పలకరించినా ఆమె తడబడలేదు. చాలా అమాయకంగా కృష్ణ అడిగిన ప్రతి మాటకూ జవాబు చెప్పసాగింది. పరాయి మగవాడు అతననీ, తను వంటరిగా ప్రయాణం చేస్తున్న ఆడపిల్లనని ఆమె బెట్టుగా ఉండటం లేదు:

ఆమె శరీరం ఎదిగినా మనసు ఎదగలేదని కృష్ణ గ్రహించాడు.

"మీరేం చదివారు?" అడిగాడు.

"బి.ఎ. పరీక్షలు మొన్న ఎగ్జామ్స్‌లో రాసానండి. ఇంకా రిజల్ట్స్ రాలేదు."

"ఐ.సి. మీ పేరేమిటి?"

"అన్నపూర్ణ అని మా నాయనమ్మ పేరు పెట్టారు కానీ అది పాత పేరని అందరూ అనూ అని పిలుస్తారండి."

"నైస్ నేమ్!"

"నా గురించి అడిగారు మరి మీ గురించి చెప్పరేం?"

నవ్వాడు. తను చేసే ఉద్యోగం గురించి, తన పేరు చెప్పాడు.

"నా ఎడ్రెస్ ఇస్తాను. ఎప్పుడైనా మీ ఫ్రెండ్‌తో మా ఇంటికి వస్తారా?" ఫ్రెండ్లీగా అడిగాడు.

"అలాగే ఇవ్వండి" ఉత్సాహం చూపించింది.

జేబులోంచి చిన్న డైరీ తీసి అందులో ఒక పేపర్ చింపి తన ఇంటి ఎడ్రస్, ఆఫీస్ ఎడ్రెస్ రాసిచ్చాడు. ఆమె అది జాగ్రత్తగా బ్యాగ్‌లో పెట్టింది.

"నేనొక సత్యం చెప్పనా?" అంది.

"ఓ.కే" భుజాలు ఎగరేసాడు.

"హృదయమనేది ఆలయము, స్నేహము దేవుని ప్రతి రూపము!కులమేదైనా మతమేదైనా దానికి లేదు ఆబేధము అన్న సూక్తిని నేను బాగా నమ్ముతానండి. అందుకే నా బ్రతుకు ఇలా మారింది" ఆమె స్వరం గద్గదమయింది. కళ్ళ నుండి నీళ్ళు బైటకు ఉరికాయి.

"ఏమిటండీ మీ బాధ?" కంగారుగా అడిగాడు.

ఆ కంపార్ట్‌మెంట్ అంతా ఎవరి ధ్యాసలో వాళ్ళు ఉన్నారు. వీళ్ళ గురించి ఎవరూ పట్టించుకోలేదు.

ఆమె గబగబా కళ్ళు తుడుచుకుంది. " మీ దగ్గర కొంచెం పేస్ట్ ఉంటే ఇవ్వండి బ్రష్ చేసుకు వస్తాను" నవ్వాలని ప్రయత్నిస్తూ అంది.

ఆమెలో ఏదో బాధ దాగి ఉందని కృష్ణకు తెలిసింది. అలా అని ఆమెను ఎలా తర్కించి అడుగుతాడు. మౌనంగా తన బ్యాగ్‌లో పేస్ట్ ట్యూబ్ తీసిచ్చాడు. అది తీసుకుని ఆమె బాత్‌రూం వేపు వెళ్ళిపోయింది.

స్వప్న ఎంత అమాయకమైనదో ఈమె అంత అమాయకమైనదని అనిపించింది కృష్ణకు.

ఆమె తిరిగి వచ్చింది. ఆ తరువాత ఎక్కువ మాటలు సాగలేదు.

ఆమె బాధ ఏదో అడగాలని ఉంది కృష్ణకు. కానీ సభ్యత అడ్డు వచ్చింది.

ట్రైన్ హైదరాబాద్ చేరింది.

"మీ కోసం ఎవరైనా వస్తారా?" కృష్ణ బ్యాగ్ భుజానికి తగిలించుకుంటూ అడిగాడు.

"అవునండి" అంటోంది. అంతలోనే "అనూ!" అంటూ దాదాపు ముప్ఫయి సంవత్సరాల వ్యక్తి పైకివచ్చాడు.


"హల్లో", అంటూ అను నవ్వింది.

"రాంబాబూ! వీరి పేరు కృష్ణ. నాకు ట్రైన్‌లో మంచి కంపెనీ ఇచ్చారు" కృష్ణను చూపిస్తూ అంది.

"ఐ.సీ వెరీ థాంక్స్ మిస్టర్!" అంటూ త్వరగా దిగమని అనుని తొందర చేసాడు.

"వస్తానండి" అంటూ అను కృష్ణతో చెప్పి మొహం చిట్లించుకుంటూ త్వరగా రమ్మని పిలుస్తున్న రాంబాబు వెంట వెళ్ళిపోయింది.

ఆ రాంబాబు ధోరణి కృష్ణకు అసలు నచ్చలేదు. ఫ్రెండ్ ఇంటికి అంది. కొంప తీసి ఆమె ఫ్రెండ్ ఈ వ్యక్తేనేమో. ఏదో కథ ఉంది. అందుకే స్నేహాన్ని నమ్మటం మూలానా నా బ్రతుకు ఇలా అయింది అని ఆమె బాధపడింది. బహుశ



డాక్టర్ సలహాలు

డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

వై. వి. ఆర్., కామారెడ్డి

నా వయస్సు 20 సం.లు. నేను బి. యస్స్.సి రెండవ సం. చదువుచున్నాను. నేను ఇంతకు ముందు ఎపుడు సమయము దొరికితే అపుడు తప్పకుండా నా టెక్స్ట్ బుక్స్ తీసుకుని చదువుతుండేవాణ్ణి నాకు బాగా అర్థమై, చాలా కాలం వరకు జ్ఞాపకం ఉండెడిది. నేను ఈ మధ్య 2 నెలల క్రితం ఒకరి ఇంట్లో భోజనం చేసినాను. భోజనము చేసిన 15 రోజుల తర్వాత నుండి నాకు ఎంత సమయం దొరికినా టెక్స్ట్ బుక్స్ చదవాలనిపించట్లేదు. ఎంతో ప్రయత్నం చేసి చదివినను నా బుర్రకి ఎక్కుటలేదు. మరియు చదువుతున్నంత సేపు కూడా నా మనస్సు బుక్స్‌పై ఉండట్లేదు. వాళ్లకు, మాకు కొద్దిగా శత్రుత్వము. వాళ్లు నాకు ఏదో మందు పెట్టినట్లు అనుమానంగా ఉంది.

మీ అనుమానం నిరాధారం. బుద్ధి నిలకడ లేకుండా (కుదురు లేకుండా) ఎంత చదివినా జ్ఞాపకం ఉండదు. చదివే దానిమీద మనస్సు లగ్నం కావలసి ఉంటుంది. ఎవరో మందు పెట్టారని మన తప్పుల్ని కప్పిబుచ్చ చూడటం అవివేకమే అవుతుంది.

వి. ఆర్. - సరసరావుపేట

నేను 6 నెలల నుండి హెర్నియాతో బాధపడుతున్నాను. కుడి వైపు వాపు మాత్రమే. నెప్పిలేదు. ఆపరేషన్ లేకుండా నయమవుతుందా? నేను వ్యాయామం చేద్దామనుకుంటున్నాను. చెయ్యవచ్చునా?

హెర్నియాకి ఆపరేషన్ చేయించుకోవడమే ఉత్తమమైన పద్ధతి. అలా చెయ్యకపోతే స్ట్రాంగులేటెడ్ హెర్నియా వచ్చే ప్రమాదం (అంటే ప్రాణాపాయ పరిస్థితి) ఉంటుంది. ఆపరేషన్ తర్వాత వ్యాయామం చెయ్యండి.

ఎమ్. ఎస్., పాకాల

చెమట ఎందుకు పడుతుంది? కొంతమందికి అసలు పని చేసినా, చేయకపోయినాచెమట పట్టదు. చెమట పట్టని వారి ఆరోగ్యం బాగుండదా? చెమట పడితే బాగుంటుందా? నేను వ్యాయామము చేయునపుడు చెమట పట్టదు. నా మిత్రునికి కొంతసేపు వ్యాయామము చేసిన యడల విపరీతంగా చెమటపట్టి స్నానం చేసినవాడిలా తయారవుతాడు.

చెమట పట్టటం అనేది ప్రకృతిసిద్ధం. శరీరంలోని అధిక లవణాలు బహిర్గతమవటానికి, రక్త ప్రమాణం అదుపులో ఉండటానికి, ఉష్ణోగ్రత సమస్థితిలో ఉండటానికి చెమట పట్టటం చాలా అవసరం. స్వేద గ్రంధుల పనితనం ఒక్కొక్కరిలో ఒక్కొక్క విధంగా ఉంటుంది. ఈ పనితనం జీన్స్‌ల ప్రభావమే అని శాస్త్రజ్ఞుల అభిప్రాయం. దీనికిగాను వాడతగిన మందులేవీ లేవు.

వి. ఆర్. - పర్లాకిమిడి

నా వయస్సు 24 సంవత్సరాలు దాటింది. నా ముందరి పళ్ళు ఎగుడు దిగుడుగా పెండి ముందు వెనుకలుగా వున్నాయి. బాగా ముందుకు వచ్చేశాయి. పండ్లు తోముకునేటప్పుడు అసౌకర్యంగా వుంటుంది. కొంచెం గారపట్టి వున్నాయి.

దంత వైద్యులు ప్రత్యక్షంగా పరీక్షించి ఆ లోపం సరిచెయ్య కలిగినదీ లేనిదీ తీర్మానిస్తారు. గారపట్టిన పళ్లను తప్పకుండా క్లీన్ చేస్తారు. □

వసంతగీతం

ఇతన్ని నమ్మి ఇంట్లో చెప్పకుండా పారిపోయి వచ్చిన బాపతులా ఉందే అనిపించింది.

అతని చిటపటలాడే మొహం చూస్తే ఆమెని మూసి నదిలో ముంచేలా ఉన్నాడే అని కూడా అనిపించింది. ఆమె ఎవరో తనకెందుకు? ఇంత ఆలోచన అని నవ్వు వచ్చింది. కానీ అమాయకమైన ఆమె మొహం మర్చిపోదాం అన్నా మరపుకు రావటం లేదు.

తనూ ట్రైన్ దిగి గబ గబా బైటకు వచ్చాడు. ఆటో కట్టించుకుని లకడీకపూల్‌లో ఉన్న తన ఇంటికి వచ్చేసాడు.

ఆ రోజంతా అనుని గుర్తు చేసుకుంటూనే ఉన్నాడు. మర్నాడు ఉదయం హోటల్‌లో భోజనం చేసి బ్యాంక్‌కు వెళ్ళిపోయాడు. క్రితం రాత్రే తండ్రికి లెటర్ వ్రాసాడు.

మాలతి తనకు బాగా నచ్చిందనీ. వాళ్ళు ఇచ్చే కట్న కానుకలతో తనకు ఏ మాత్రం సంబంధం లేదనీ, ఈ పెళ్ళి తనకు పూర్తిగా ఇష్టం అని వ్రాసేసాడు.

బ్యాంక్ దగ్గరకు వస్తూ అది పోస్ట్ చేసేసాడు. అంత దర్జాగా బ్రతికే మాలతి తన వద్ద కాస్త ఇబ్బంది పడాల్సి వస్తుందేమో అని ఆలోచించాడు.

ఎమ్.కాం. పూర్తి చేస్తే తనకు ప్రమోషన్స్ వస్తాయి. అదీ కాక తన పేరున బ్యాంక్‌లో తండ్రి పేర వచ్చిన డబ్బు చాలానే ఉంది. మాలతిని సంతోషపరచలేకపోడు అని తన మీద తనకు నమ్మకం కలిగింది.

బ్యాంక్‌లో పని చేస్తున్నా సాయంత్రం వరకు మాలతి జ్ఞాపకాలు అతన్ని వదలలేదు. మధ్య మధ్యలో అను గుర్తు వచ్చింది. 'ఇన్నొసెంట్‌గాళ్ ఎలా ఉందో?' అనుకున్నాడు.

ఆ సాయంత్రం బ్యాంక్ వదలగానే బయటకు వచ్చాడు.

తోటి క్లర్క్ సురేష్ కృష్ణ వెనకనే వస్తూ మాటలు కలిపాడు. ఇద్దరూ మాట్లాడుకుంటూ బస్‌స్టాప్ దగ్గరకు రాసాగారు. దారిలో పేవ్‌మెంట్ మీద ఒక కోయ వ్యక్తి కనబడ్డాడు.

అతనికి సుమారు నలభై సంవత్సరాలు ఉంటాయి. అతన్ని చాలా కాలం నుండి చూస్తున్నాడు కృష్ణ. అతను జాతకం చెప్తాడు. చాలామంది తోచింది ఇచ్చి చెప్పించుకుంటారు. అది జరుగుతుందో లేదో కృష్ణకు తెలీదు.

ఇవాళ మాత్రం కృష్ణకు తన పెళ్ళి మాట తెలుసుకోవాలనిపించింది.

"ఉండు బ్రదర్!"సురేష్‌తో అంటూ కోయవాడితో మాట్లాడి చెయ్యి చూపించాడు.

"దొరా! నువ్వు బహు దూరం వెళ్ళి ఒక పెట్టను చూసి వస్తివి. ఆమెపైన మనసు పెంచుకున్నావు అవునా?" కృష్ణను పట్టి పట్టి చూస్తూ అడిగాడు ఆ కోయవాడు.

దాంతో కృష్ణ అతన్ని బాగా నమ్మాడు.

"అవును" తలూపాడు.

"ఛో, ఆమె నీగ్గాదు" చేయి వదిలేసాడు కోయవాడు.

"అంటే?" నిటారుగా అయ్యాడు.


"నీ మనువు వేరే ఉందిలే" చిన్నగా నవ్వుతూ చెప్పాడు.

అతన్ని ఈడ్చి ఒక్క తన్ను తన్నాలని అనిపించింది కృష్ణకు. క్షణంలో అతనిపై ఏర్పడిన నమ్మకం సడలిపోయింది.

"వెళ్ళవయ్యా! శుభం పలకరా అంటే పెళ్ళి కూతురుముండ ఎక్కడ చచ్చింది అన్నాడట నీబోటివాడు" అంటూ అతన్ని తిరస్కారంగా చూస్తూ జేబులో నుండి రెండు రూపాయలు తీసి అతని చేతిలో పెట్టి "పద సురేష్!" అంటూ ముందుకు నడిచాడు.

"ఈ జనాలు ఉన్న మాట చెప్తే భరించలేరు. ప్రతి వాడికి గొప్పగా ఒక రాజు అయ్యేట్టు ఉంది జాతకం అని చెప్తే నమ్ముతారు" పెద్దగా అనుకున్నాడు కోయవాడు. అప్పటికే చాలా దూరం వెళ్ళిపోయిన కృష్ణ, సురేష్ ఆ మాటలు వినలేదు.

(ఇంకా వుంది)


పరీక్షలొచ్చాయ్!
-BANNU* & పద్మ..
వీడు పదేళ్ళనుండి పరీక్షలు తప్పుతు ఉండబట్టి... మనం గూడు కట్టుకునే శ్రమ తప్పింది!!
పరీక్ష హాలు
మావాడు పరీక్షల ముందు నిద్ర రాకుండా మాత్రలు వేసుకుని చదివి... పరీక్షల తర్వాత నిద్రమాత్రలు వేసుకుని రెస్ట్ తీసుకుంటాడు!!
PARK
BUS STOP
యుద్ధానికి కాదు బాబూ... ఆయన వాచర్‌గా వెళుతున్నాడు! రక్షణకోసం అలా.....!
నువ్వు 'స్లిప్పులు' దాచుకోడానికి జుట్టు వుంది! ఎటొచ్చీ నాకే అది వీలుపడదు.... ప్చ్!!
రేపు మీ అబ్బాయి పరీక్ష..... బాలా బాగా రాస్తాడా? మీరెలా చెప్పగలరూ?
రేపు వాచర్‌గా..... మావారే వెళ్తార్లే!



రాబందు(వు)లు

కందుకూరి వెంకటమహాలక్ష్మి

కొందరి మూఢనమ్మకాలనంది, అనాలో చితపు పనుల కనండి, మూఢవిశ్వాసాల కనండి -వేటికయితేనేమి మరొకరు పతనమవడమే కాకుండా, ఆ నమ్మకాల పర్యవసానం మరొకరి మిదపడి వారి ః జీవితంతో పాటు, వారి కుటుంబంలోని వారి భవిష్యత్ కూడా నాశన మవుతుంది.

నానిని చూసాకా నాకీ ఉపోద్ఘాతం వ్రాయాలనిపించింది. వాడూ నేనూ చిన్నప్పటి నుంచి కలిసి తిరిగాం. కలిసి చదువుకున్నాం. ఆఖరికి ఉద్యోగాలు కూడా ఒకే వూరిలో రావడంతో రోజూ ఏదో టైములో కలుసూ_ మా_ మధ్యతరగతి కష్టసుఖాలని చెప్పుకునేవాళ్లం.

అసలు పేరు దేవుళ్ల పేరంతా కలిపి చాంతాడంత. అయితే కొడుకు, కొడుకని కలవరించి పోయి, పుత్రులు లేని వారి జన్మ నరకప్రాయమన్న నమ్మకంతో తపించిపోయి, పూజలూ, పునస్కారాలు చెయ్యగా అయిదో వాడుగా పుట్టిన వాడిని 'నాని' అని ముద్దుగా పిల్చుకునే వారు.

నాని బి. కాం ఫైనల్‌లో వుండగానే కారు ఏక్సిడెంట్‌లో తండ్రి మరణించటంతో పిన్న వయసులోనే అతని నెత్తిన సంసార బాధ్యత పడింది. కొంత పొలం అమ్మి నాని అక్కలిద్దరి పెళ్లిళ్లూ తండ్రే కానిచ్చాడు. 'గుడ్డిలో మెల్ల' అన్నట్లు తండ్రి ఆఫీసులోనే నాని బి. కాం పూర్తవగానే ఉద్యోగం యిచ్చారు ప్రభుత్వం రూల్సు ప్రకారం. అప్పటికే ఆఖరాద పిల్లలిద్దరూ పెళ్లికెదిగి పోయారన్న తల్లి గోల భరించలేక నాని మిగిలిన పొలం, ఇల్లు అమ్మి అక్కలిద్దరి పెళ్లిళ్లూ తాహతుకి మించి చేశాడు.

ఆడపిల్లల బాధ్యతలు తీరిపోయాయి. ఇక కొడుకు గడించే డబ్బుతో గుట్టుగా కొనాళ్ళు ఆ తల్లి సంసారాన్ని లాక్కొచ్చి వుంటే వారి జీవితాలు కొంతకాలమన్నా హాయిగా సాగిపోయేవి. పిల్లల పెళ్లయిన మర్నాటి నుంచే నానిని పెళ్లి చేసుకోమని పోరటమే కాకుండా, సంబంధాలు కూడా తీసుకొచ్చేది.

'అమ్మా! కొన్నాళ్ళు నన్ను నిలదొక్కుకోనీ అమ్మా! కొంత డబ్బు నిలవ్వేసుకొని చేసుకుంటా"నన్న దానికి నే ని యింట్లో చాకిరి చెయ్యలేనురా! వయసొస్తోందా!అయినా యింట్లో దీపం పెట్టే పునిస్త్రీ పిల్లలేదు!" అంటూ మొదలెట్టేది. ఇంకా గట్టిగా ఏమన్నా అంటే తన పెద్దరికానికి భంగం వచ్చినట్లు తన్ని నిర్లక్ష్యం చేసాడంటూ బాధపడటంతో పాటు "మి నాన్న పోబట్టి, నీ తిండి తి ఏట్టి, నా బ్రతుకిలా వుందంటూ తల్లి పెట్టే ః నీళ్ళు చూడలేక నాని పెళ్లికి తలొగ్గి యింటికి భార్యని తీసుకొచ్చాడు.

ముందు వద్దన్నప్పటికి భార్య రత్న వచ్చాకే వాడిలోనూ ఓ విధమైన ఉత్సాహం వచ్చి "మంచి పనే చేసా"ననుకునేవాడు.

కానీ అసలు కష్టాలు ప్రారంభమయింది ఈ స్టేజిలోనే! ప్రభుత్వోద్యోగి నానికొచ్చే జీతంలోనే ఆ యిల్లు గడపాలి. తప్పదు. ఆ నూతన దంపతులకి అచ్చట్లు, ముచ్చట్లు తీర్చుకోవాలన్న కోరిక లొచ్చేవి. వచ్చే జీతంలో రెండింటినీ అందుకోలేని నాని ముఖ్యమైనవి చూసుకుంటు తమ తమ సరదాలని చంపుకొనేవాడు. రత్న మనసు అప్పుడప్పుడు బాధపడినప్పటికి భర్త అనురాగమే అన్ని ముచ్చట్లు" అని సరిపెట్టుకునేది. దీనికి ముఖ్యంగా యింట్లో పెద్దవారి అండ, సహకారం, తృప్తి, అవగాహన తోడైతే వారి సంసారం స్వర్గతుల్యమయ్యేది.

రామలక్ష్మి గారికి కోడలొచ్చిన కొత్తలో ఆనందంగానే వుండేది. కానీ ఆ ఆనందాన్నలా అట్టే కాలం నిల్పుకోలేక పోయింది. ఇంట్లో అన్నింటా తనతో పాటు సగం వాటా పంచుకుంటున్న పరాయి స్త్రీని చూసి సహించలేకపోయేది. తన వస్తువు నెవరో లాక్కుపోతున్నారన్న భావం ఆమెలో ఏర్పడింది. అంతేకాక ఆ యింట్లో అంతా పరాయివాళ్లలాగా, ఆ యింట్లో తననెవ్వరూ గౌరవించనట్లు, కించపరుస్తున్నట్లు భావించ సాగింది. కొన్నాళ్ల ఆ యింటి నుంచి వెళ్లిపోతేగాని తన విలువ తెలిసిరాదన్న ఉద్దేశ్యంతో "వో వెయ్యి రూపాయిలివ్వరా! ఆడపిల్లల్ని చూసి రావాల నుందంటూ కొడుకుని అడిగింది.



అన్నంలో అన్నం, ఖర్చులో ఖర్చు పెట్టడానికి లోటులేని సంసారం కాని అడిగిందే తడవుగా వెయ్యి రూపాయలు తెచ్చివ్వగల స్తోమత తనకి లేదని తెలిసి కూడా తల్లి అలా అడగడం నానికి ఆశ్చర్యాన్ని కలిగించినప్పటికీ, అదే మాట విడమర్చి చెప్తే తల్లి అనే మాటలు తెలిసిన నాని నా దగ్గరకి పరిగెత్తుకు వచ్చి ఈ కష్టాలన్నీ చెప్పుకున్నాడు. ఎలాగో ఓ వెయ్యి రూపాయలు అప్పు పుట్టించివాడికా కష్టం గట్టెక్కించాను.

కానీ అది అంతతో ఆగక వెళ్ళిన రెండు నెలలకే మళ్ళీ ఓ పదిహేనొందలు పంపమంటూ వ్రాసి, దానికి కారణాలు వివరించింది. పెద్ద పిల్ల పెళ్ళయిన యిన్నేళ్ళకి నెల తప్పిందని, డాక్టర్లు దానికి బాగా రెస్టు కావాలన్నారని, మంచి మందులిప్పించమన్నారనీ, అత్తవారింట ఆడ పిల్లకి విశ్రాంతి ఉండదు గనక త్వరలో దాన్ని తీసుకొస్తున్నాననీ, వారం రోజులలో అయిదవనెల వస్తోంది, వారికీ, మనకి తొలిసారి వేడుక గనక కాస్త ఘనంగా సూడెదలిచ్చి తీసుకురావాలి కదా? నువ్వు వెంటనే డబ్బు పంపు. నేను రెండు నెలలుగా నీ దగ్గర లేను కదా? నాకయ్యే డబ్బు మిగిలే వుంటుంది. ఆలస్యం చెయ్యకు -

ఇది ఆ ఉత్తరంలోని సారాంశం. మళ్ళీ అదుచ్చుకుని పరుగెత్తుకొచ్చిన వాడికి మరొకని చేత ఆ డబ్బు అప్పు యిప్పించి పంపేను.

ఇలా ముందు ముందు జరిగే ఈ సంఘటనల గురించి వివరంగా రాయనక్కరలేదు. ఒకరి తర్వాత ఒకరికి సూడెదలంటూఆ తరువాత పురుళ్ళకంటూ, బారసాలకంటూ, వీటన్నింటికి వచ్చిన వారికి బట్టలంటూ, పుట్టిన పిల్లలకి నగలంటూ ఆ తల్లి నానిలోని రక్తాన్ని పిల్చేసేదే గానీ కొడుకొచ్చే జీతంలో ఈ ఖర్చులన్నీ ఎలా తట్టుకుంటాడనీ ఆలోచించేదికాదు.

"అమ్మా! కాసు బంగారం కొనాలంటే రెండు వేలన్నా కావాలమ్మా!" అని తల్లికి చెప్పబోతే "నాయనా! నా పుట్టింటివారు పిల్లకి రెండేసి, మూడేసి కాసులు పెట్టార్రా! కనీసం ఆ మాత్రమన్నా మనం పెట్టక పోతే ఏం మర్యాదగా వుంటుందిరా?!" అనేదేగానీ తన కాలం ధరల్తో యిప్పటి ధరలు పోల్చి చూసుకొనేదికాదు.

ఈ ఖర్చులు తట్టుకోలేక నాని కాబూలీ అప్పులు కూడా చేస్తున్నట్లు తెలిసి అడిగితే అవునురా! యిప్పటికే చాలా చోట్ల అప్పులు యిప్పించావు. ఎంతనింకా నిన్నడగలను? అన్నాడు జాలిగా ముఖంపెట్టి.

నాని ఈ విధంగా హింసించబడుతుంటే ఆ యింటి కోడలు రత్న ఓ ముద్దూ ముచ్చటా తీరక, ఆఖరికి సరియైన బట్ట కూడా వంటిని లేక బాధపడేది. భర్తకొచ్చే జీతంలో మూడొంతులు వడ్డీలకి పోతుంటే, మిగిలినదాంతో సంసారం లాక్కురాలేక సతమతమయ్యేది. అందుకు కనీసం యింట్లో వారి

సానుభూతన్నా లభిస్తుందేమోనని ఆశించేది. రత్నానికదీ కొరతయ్యింది.

రక్తమాంసాల్ని పీల్చి, పిప్పి చేస్తున్న ఈ రాబంధువుల మధ్య, పడ్డీలకి పీక్కు తినే కాబూలీ అప్పులాళ్ళ మధ్య సతమతమయిపోతున్న ఆ దంపతులు టీవప్పువాల్లా తయారయ్యారు. రాను రాను పరిస్థితులకి విసిగిపోయిన నాని తన కోపాన్ని, విసుగుని ఎవరి మీద చూపించాలో అర్థమవక రత్న ఏం మాట్లాడినా విసుక్కోవడం, చిరాకుపడటం ప్రారంభించాడు. తల్లి పెట్టించే ఖర్చుల్ని అప్పుచేసన్నా చెయ్యక తప్పని నాని, రత్న యింటికోసం చెప్పే సరుకుల్ని కూడా తేలేక ఆమెని కసరడమే కాకుండా తిట్టి, కొట్టి తన కోపాన్ని చల్లార్చుకునేవాడు. అఖరికి భర్త ఆదరణ కూడాలేటయిన రత్న బెంగతో చిక్కి శల్యమవసాగింది. కోపంతో అనాలోచితంగా భార్యని తిట్టి, కొట్టినప్పటికి, నా దగ్గరకొచ్చి బాధపడి, రత్న ఆరోగ్యం గురించి విచారించేవాడు.

కృశించిపోతున్న రత్నని ఓసారి డాక్టర్ దగ్గరికి తీసుకెళ్ళి చూపించాము. డాక్టర్ అన్ని పరీక్షలూ చేసి ఆమెకి క్షయ వచ్చిందని. దానికి ఆరునెలలపాటు ఖరీదయిన మందులు వాడి, పూర్తిగ రెస్టు యివ్వాలని, నెల నెలా అన్ని టెస్టులూ చేయిస్తూ వుండటమే కాకుండా మంచి టానిక్కులు, బలమైన తిండి కూడా ఏడాదిపాటు యివ్వాలని చెప్పడంతో, నానితోపాటు నా కాళ్ళూ, చేతులూ కూడా


రాబందు(వు)లు


చల్లబడ్డాయి. 'ధనవంతులకి రావలసిన రోగాలివి. రత్నంలాంటి మనసుగల రత్నకి కాదు" అనుకున్నాను.

ఇంటిదగ్గరి వార్త విన్న తల్లి నానిని, నన్ను పిల్చి "ఈ రోగం అంటురోగం! దాన్నింట్లో ఎలా పెట్టుకుంటాం? నా యింటికి నా పిల్లలూ, మనవలూ వస్తూ వుంటారాయె! నాకి చాకిరి చేసే ఓపికలేదు! ఏ ధర్మాసుపత్రిలోనో పెట్టడమో లేదా దాని పుట్టింటికి పంపెయ్యడమో చేస్తే మంచిది." అంటూ తన నిర్ణయాన్ని నిక్కచ్చిగా చెప్పేసింది.

వయసులో పెద్దావిడగా, నానికి తల్లిగా నాకు యిన్నాళ్ళూ ఆమె మీదున్న గౌరవం కాస్తా ఆ ఒక్క మాటతో పోయింది. ఆ యింట కాలెట్టింది మొదలు నాది అనకుండా వచ్చిన వారందరికీ పెట్టడమే కాకుండా, తనవంటి నున్న నగల్ని అర్పించిన రత్నాన్ని, అత్త, ఆడబిడ్డలం అంటూ రౌతుల్లా సవారి చేస్తూ కూర్చున్న వారందరికీ విశ్రాంతి లేకుండా బండచాకిరి చేసిన ఈ రత్నాన్ని గురించే నా యిలా చెప్తుంటే ఆ యింటికి దీపమై వెలుగునిస్తూ తాను కొవ్వొత్తిలా కరిగిపోయింది. హరించి పోయింది. కరిగిపోయిన కొవ్వుని గోకి పారేసినట్లే 'యిప్పుడు రత్నాని ఆ యింట నుంచి పంపెయ్యమని ఎంతో తేలిగ్గా చెప్తోంది యిల్లాలు. అత్త అంటే యిలాగే వుండాలా?-అత్త కోడలు అనుబంధమింతేనా?? అత్త కోడల్నికన్నా ఓ తరం ముందు వ్యక్తి. మరి కూతుర్ని, కోడల్ని ఒకే కంటితో ఎందుకు చూడలేరు? ఆడపిల్ల పరాయింటికి వెళ్ళిపోతుందన్న- మమకారం, వాళ్ళకి పుట్టింటి అచ్చటా, ముచ్చటా తీర్చాలన్న ఆశ తల్లికుండడం సహజం. కాని ఒకరి కోసం మరొకర్ని పతనం చెయ్యడం సమంజసమేనా! అని ఒక్కసారి ఆలోచించలేరూ? నా కోడలూ ఓ యింటి ఆడపిల్లే అనిగానీ, నా పిల్లలాంటిదే అనిగాని యోచించరేం? పనికిరాని వస్తువుని బైటపారేసినట్లే, రోగమొచ్చి, చాకిరి చెయ్యలేని కోడల్ని పంపెయ్య మనడం భావ్యమేనా? రేపు మీకే ఈ రోగమొస్తే అని అడిగితే?? కాని పిన్నవాళ్ళు అలా పెద్దాళ్ళని అడక్కూడదని సమాజం చెప్పింది. అప్పటికే "కన్న తల్లంటే గౌరవం లేదురా! నీకోసం తపస్సుచేసి కని, ఎంత కష్టపడి పెంచానో!పెళ్ళా మొచ్చాకా తల్లి గుర్తుంటుందా నాయనా!ఈ కాలం వాళ్ళింతే" అంటూ సోకాలు తియ్యడం పరిపాటయిన ఆమెతో ఏం చెప్పినా ప్రయోజనంలేదని తెలిసి వూరుకున్నారు.

రోగంతో పుట్టింటికి చేరిన రత్నానికి వారూ సామాన్యులే కావడంతో తగిన మందులు, తిండీ పడక ఆరోగ్యం దెబ్బతినసాగింది. అప్పులకి వడ్డీలుకడుతూ, యిల్లు నడపలేక సతమతయ్యే నాని భార్యకి నాయమైనా పంపలేకపోగా, కనీసం కళ్ళతో చూడటానికి కూడా వెళ్ళలేక పోయేవాడు







అప్పుడప్పుడు నా దగ్గరకొచ్చి రత్న గురించి బాధపడుతూ నా నుంచే దానికారోగం వచ్చిందిరా! నేనుకూడా దాన్ని చాలా హింసించానురా! దానికి పుట్టింటి వారిచ్చిన పది రూపాయలుకూడా ఎన్నడూ దాచుకునెరగదురా! నా యింట అడుగెట్టింది మొదలు కష్టాల్నే రుచి చూసిందిరా! దాన్ని పెట్టిన ఉసురు నాకే కొడుతుందిరా!" అంటూ విలపించే వాడు. చేతులు కాలేక ఆకులు పట్టుకున్నట్లు ఎందుకురా ఆ ఏడుపు?" అని మందలించేవాడిని.

వీళ్లిలా వున్నప్పటికీ నేనా యింటికి వెళ్తే నవ్వుతూ ఎదురొచ్చి పలకరించే నాని తల్లి ముఖంలోని ఆనందం నన్నాశ్చర్య పర్చేది. ఎప్పుడూ కూతుళ్ళ, మనమల ముచ్చట్లు చెప్తూ, వారిని ఎంతెంత వున్నతుల్ని చేసింది చెప్తూ మురిసిపోయే ఆ తల్లిని చూస్తే ఒక్కోసారి జుగుప్స కలిగేది. ఆ దృష్టితోటే చూసి కొడుకు సంసారం గురించెందుకు బాధపడదు? కోడలి రోగం గురించెందుకు ఆలోచించదు? కొడుకిలా అప్పుల్లో మునిగి కూతుళ్ళ ముద్దు, ముచ్చట్లు తీరుస్తుంటే బెంగలేదు సరికదా– ఆనందంతో అవునురా! తండ్రిలేని ఆడపిల్లలికి అన్నదమ్ములు చెయ్యకపోతే ఎవరు చేస్తారు? అప్పో, సొప్పో చేసి మనమేకదా చెయ్యాలి అని నీతులు బోధిస్తూ ఓ పక్క కొడుకు సంసారాన్ని నాశనంచేసే తల్లి ఓ తల్లేనా? అనిపించేది. లోకంలో "తల్లి" అనే పదానికి విలువ కట్టలేమంటారు. కానీ యిటువంటి తల్లులు కూడా వుంటారన్నది నాని తల్లిని చూసాకానే నాకు తెల్సింది.

ఆఫీసులో దొరికినన్నిల్లోనూ తీసుకొన్న నానికి జీతం పూర్తిగా రావటం లేదు. వచ్చింది అప్పులాళ్ళ వడ్డీలకి చాలటం లేదు. దీనికి తోడు అక్కలు తమకి జరుగుతున్న లోటుపాట్లని అత్తవారెలా సాధిస్తున్నారో ఉత్తరాల ద్వారా దెప్పిపొడ్వటం. భార్య అనారోగ్యం రోజురోజుకీ ముదురుతున్నట్లు వచ్చే ఉత్తరాలు – వీటన్నిటితో విసిగిపోయిన నాని మానసికంగా, శరీరకంగా కృంగిపోతూ, వీటన్నిటికీ తన అసమర్థతే కారణమనుకొంటూ నా దగ్గర విరక్తిగా మాట్లాడే నానిని చూస్తే ఒక్కోసారి భయమేసేది.

అనుకున్నట్లే ఈ జీవిత పోరాటంలో ఓడిపోయిన నాని ఆఫీసులో ఫైలంతస్తు మించి దూకి ఆత్మహత్య చేసుకోబోయాడని, ఆసుపత్రిలో వున్నాడని కబురందిన నేను క్షణాల మీద పరిగెత్తుకెళ్ళాను.

రెండు రోజులకి స్పృహ వచ్చిన నాని నన్ను చూసి గోల పెట్టాడు. "ఒరేయి రాజూ !చావు కూడా ఒక వరమేరా! దేముడు అది అందరికీ ప్రసాదించదురా! నామీద కసికట్టిన ఈ కాలం నా ఓ చేతిని మింగేసిందిరా! అవిటిగా జీవితాంతం బ్రతకమని విధి నన్ను శిక్షించిందిరా!" అంటూ దుఃఖిస్తున్న నానిని ఎలా వూరడించాలో తెలీక పక్కకి తిరిగి కళ్ళుతుడుచుకున్నాను.

ఈ కబురు తెలిసిన రత్న శవాకారంలో వచ్చి లేని ఓపిక తెచ్చుకుని భర్తకి సేవలు చెయ్యసాగింది. 'భర్తకి రోగమొస్తే చెయ్యవలసింది ఒక్క భార్యే కదా? ఈ నాడు కనీసం ఓ అక్కగారయినా అపేక్షగా వచ్చి తమ్ముడిని పలకరించలేదు. పైగా దానికి పెద్దలు చెప్పిన నీతుల్ని వల్లిస్తూ "పరాయి యింటి ఆడపిల్లొచ్చి ఏం చెయ్యగలదు నాయనా! అస్వతంత్రులు" అన్న ఒక్క సానుభూతితో తప్పించుకుందా తల్లి, నిజమే! ఈ కుళ్ళు సమాజం ఆడపిల్లలకో నీతి, కోడళ్ళకో నీతి తయారు చేసింది. అందుకు అవే మాటలు ఆమె నోటంట వినడంలో ఆశ్చర్యం లేదనుకున్నాను.

ఇహనో, యిప్పుడో అనున్న క్షయ రోగి యింటికి రావడం యిష్టంలేని అత్తగారు "అమ్మా రత యింటి దగ్గర నేను చూసుకుంటాను ఆసుపత్రిలో వుంది వాడిని చూస్కో తల్లీ!" అంటూ తియ్యటి కబుర్లతో కోడల్ని యింటికి రానీకుండా జాగ్రత్త పడింది.

రోజూ సాయంకాలాలు వెళ్ళి నానిని, అతనికి రాత్రి, పగలు తన ఆరోగ్యాన్ని మరిచి సేవలు చేస్తున్న రత్నని పలకరించి రావడం నా దిన చర్యలో ఒకటయింది.

ఆ రోజు వెళ్ళిన నాకు రక్తం కక్కుకున్న రత్నని వేరే ఆసుపత్రిలో చేర్చారన్న వార్తతో పాటు, నానికి తీసేసిన చెయ్యి దగ్గర సెప్టిక్ అయిందన్న విషయం డాక్టర్ చెప్పగానే పెద్ద డాక్టర్లని కలిసి వాకబు చెయ్యగా రెండు కేసులూ లాభం లేనివని చెప్పేసారు.

నానికి యిరవై నాలుగు గంటల లోపల, రత్నకి కొన్ని రోజుల లోపల ఈ కుళ్ళు సమాజం నుంచి బ్రతికుండగా పీక్కుతినే ఈ రాబంధువుల నుంచి విముక్తి లభిస్తుందన్న మాట." అనుకున్నాను బాధగా. కాలానికి ఎదురీదే ఈ రకం వ్యక్తులు ఏ నాడో ఓ నాడు అలిసిపోయి, ఓడిపోయి తమ జీవితాలని యిలాగే ఒకరికి అంకితం చేస్తారు. అటువంటి వారి జీవితాలిలా ఒకరి కోసం బలి కావలిసిందే!!

మొదట్లోనే ఆడా, మగకి తేడా లేదనుకునుంటే నాని ఈ లోకంలో కొచ్చేవాడూ కాదు – ఈ బాధలు పడేవాడూ కాదు. అందుకే మూఢనమ్మకాలతో కొందరు చేసే పనులకి మరొకరు హింసింపబడతారన్నాను. కనీసం తల్లన్నా నాని బాహాటు తెలుసుకుని మెలిగి వుంటే, నాని జీవితం కూడా హాయిగా పిల్లా, పాపతో కలకల్లాడేదేమో!! పోనీ సానుభూతన్నా లభిస్తే కొంతలో కొంతన్నా మెరుగ్గా వుండేదేమో!!! ఏదీ లేని వారి బ్రతుకులు నాని, రత్నాల బ్రతుకుల్లాగే వుంటాయి" అనుకుంటూ కన్నీటితో వెనుదిరిగిన నేను ఈ కథని అస్రుతర్పణాలతో అటువంటి వారికే అంకితం చెయ్యాలనుకుంటూ కలం పట్టాను. □

వ్యక్తిగతం



దూరదర్శన్ సీరియల్ 'రజని'లో ఆ పాత్ర ద్వారా పేరు తెచ్చుకున్న ప్రియా టెండూల్కర్ ప్రస్తుతం మానసిక రోగులైన మహిళల పునరావాస కేంద్రాన్నొకదానిని స్థాపించే ప్రయత్నంలో ఉన్నారు. మానసిక వ్యాధి గ్రస్తురాలైన తమ స్నేహితురాలొకరి దయనీయస్థితే తమకీ ఉద్దేశ్యం కలగటానికి కారణంగా ఆమె వివరించారు. ఈ సమాజంలో స్త్రీగా పుట్టటం, అందులోనూ మతిస్థిమితం లేకుండా ఉండటం అన్నది ఒక శాపం అని ఆమె అన్నారు. మానసిక రోగుల పట్ల మన సమాజంలో సరైన అవగాహన లేదని అటువంటి వారి చరిత్రలు తరచుగా పోలీసు నిర్బంధంలోనే ముగిసిపోతూఉంటాయని అన్నారామె. వైద్య చికిత్స పూర్తి అయిన వెంటనే వారిని బయట ప్రపంచంలోకి నెట్టకుండా ఈ పునరావాస కేంద్రాలలో కొంత కాలం ఉంచటం వల్ల ఎంతైనా మేలు జరుగుతుందని ఆమె అభిప్రాయ పడ్డారు. ఈ సత్కార్యానికి ఆమె నిధి సేకరణని కూడా ప్రారంభించారు. మానసిక వైద్యుల సలహాలని కూడా తీసుకుంటున్నారు. ప్రముఖ మరాఠీ రంగస్థల, కళాత్మక చిత్రాల నటుడు, మానసిక వైద్యుడు అయిన డా. మోహన్ అగాషే కూడా ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొంటున్నారు......



డేవిడ్ రిచర్డ్ హాల్ (29) బ్రిటిష్ పౌరుడు. మాదక ద్రవ్యాలు అక్రమ రవాణా చేసే ఒక అంతర్జాతీయ ముఠాతో సంబంధం ఉన్న వ్యక్తి. ఛార్లెస్ శోభరాజ్‌ని తిహార్ జైలు నుంచి తప్పించటంలో ప్రముఖ పాత్ర నిర్వహించాడు. గంజాయి దొంగ రవాణ చేస్తూ ఇతను గత డిసెంబరులో ఢిల్లీ పోలీసుకి దొరికి పోయాడు. తిహార్ జైలులో నిర్బంధించారు. తర్వాత బైలు మీద బయటికి వచ్చినా తరచు తిహార్ జైలుకి వెళ్ళి అక్కడి కొందరు అధికారులకి కానుకలు ఇస్తూ ఉండేవాడట. శోభరాజ్ తప్పించుకు పోయిన రోజు ఇతను విదేశీ కారులో తిహార్ జైలుని సందర్శించాడు. అదే కారులో అంతా పలాయనం చిత్తగించారు......

వారఫలం

18-4-1986 శుక్రవారం మొదలు 24-4-1986 గురువారం వరకు

★ **మేషం :** ధన కనక వస్తు వాహన సమృద్ధికి అవకాశమిచ్చేది గ్రహస్థితి యున్నది. అన్నీగాకపోయినా కొన్ని అయినా సమకూడుతాయి. ఉద్యోగరీత్యా పెంపున్నది. వ్యాపారం యధాతథం. నూతన వ్యక్తుల పరిచయ భాగ్యం. స్త్రీలకు : ఉద్యోగ భాగ్యం. కార్య సాధన, సర్వత్రా విజయం.

★ **వృషభం :** ఆస్తి పెంచుకొంటారు. అపూర్వ వస్తువులు కొంటారు. రాజకీయంగా మేల్కొంటారు. తగాదా తంటాల నుండి విముక్తినందుకొంటారు. అప్తులకు సహాయం అందించవలసిన సమయం. వ్యాపార సంబంధంగా ప్రయాణం సాగించాలనుకొంటారు. స్త్రీలకు : ఉన్నత పదవి భాగ్యం లభిస్తుంది, పదవి బాధ్యతలు అతిశయిస్తాయి.

★ **మిధునం :** ఈ వారం మీకు ముఖ్య గ్రహాలు, మీ రాశి నాధుడు సహాయం చేయనున్నారు. ఆశించిన ధనం అందు కొంటారు. అరమరికలు లేని మిత్రులు చేరుతారు. వృత్తియందు పెంపున్నది. దూరపు బంధువులు మీ సహాయం కోరి యిల్లు చేరుతారు. స్త్రీలకు: శుభ వర్తమానం అందుతుంది. ఆదాయం పెంపొందుతుంది.

★ **కర్కాటకం :** ప్రభుత్వపరంగా రావలసిన కాగితాలుగాని, డబ్బుగాని సమయానికి అందుతుంది. ఒకానొక విషయం సులభ సుందరంగా అనందదాయకంగా నెరవేరుతుంది. 'జాయింటు' వ్యాపారం భాసిస్తుంది. ఉద్యోగంలో హోదా పెరుగుతుంది. బాధ్యతా అధికమవుతుంది. హాయిగా, ఆశించిన రీతిగా, ఆహ్లాదజనకంగా యింటి వ్యవహారాలు సాగుతాయి. స్త్రీలకు : విజయవంతమైన వారం.

★ **సింహం :** సత్సాంగత్యం లభిస్తుంది. ధర్మ కార్యాచరణమునకు అవకాశమున్నది. విద్యా విషయంగా పెంపు చేకూరుతుంది, రాజకీయంగా మీకు ప్రోత్సాహకరమైన వారమే. మంచి మిత్రులు దొరుకుతారు. బంధు సందడి అధికమవుతుంది. స్త్రీలకు: గృహానికి అవసరమైన సామానులు కొంటారు. వృత్తియందు వికాసం.

★ **కన్య :** రాశికి మూడవ యింటనున్న 'శని' సహకారం ఎంతైనా ఉన్నది. కళా సాహితీ రంగాన వికాసమున్నది. అవసరాలు గడచిపోవుటకు ఆక్షేపణ లేనంతగా ధనం లబ్ధమవుతుంది. పది మందిలో పేరు పొందుతుంది. నాట్య నాటక, రచనా విధానాన పత్రికా విలేఖన రీత్యా చేయి తిరిగిన వారికి సదవకాశాలు లభ్యం కాగలవు. స్త్రీలకు : ఉద్యోమందు పెంపు, నూత్న వాహన సేకరణకు అవకాశం, స్థితియందు పెంపుగల వారం విజయవంతం.

★ **తుల :** ఏదో చేయబోయి, ఏదో చేసామని బాధపడుతారు. రాజకియంగా భంగపడ్డామని బాధపడుతారు. శ్రమ వృధాయైనదని భంగపడుతారు. వృత్తియందు అనుకూలం. ఆదాయం. స్థితియందు పెంపు. స్త్రీలకు : వృత్తి రీత్యా మేలు, పలువురిలో ప్రసిద్ధి.

★ **వృశ్చికం :** నూతన వ్యక్తులతో పరిచయం ఏర్పడుటం చేత ఏదో మేలు చేకూరుట నిశ్చయం. పది మందిలో పేరు ప్రతిష్టలు చేకూరనున్నవి. ఇటీవల పోగొట్టుకొన్న వస్తువులను సమకూర్చుకోగలుగుతారు. ఆరోగ్యమందు వృద్ధి కనిపిస్తుంది. స్త్రీలకు: ఆదాయ వృద్ధి, వృత్తియందానందం.

★ **ధనుస్సు :** రక రకాల వ్యక్తులతో పరిచయం ఏర్పడుతుంది. మితి మీరి శ్రమని చేయవలసిన అగత్యం ఏర్పడుతుంది. వృత్తియందు అభివృద్ధి కనిపిస్తుంది. రాజకీయంగా ఏదో సాధింపగలిగినామని సంతోషిస్తారు. ముఖ్య వ్యక్తుల పరిచయ భాగ్యం లభిస్తుంది. స్త్రీలకు: అన్ని రంగాలలో శ్రమించేవారికి, నూతనావకాశాలు లభ్యంకాగలవు.

★ **మకరం :** ఎంతో కాలంగా కలుసుకొందామనుకున్న వారి పరిచయ భాగ్యం లభ్యమవుతుంది. స్థితియందు బాగా మెరుగు కనిపిస్తుంది. వ్యాపార రీత్యా అంతా అనుకూలమని తెలిసికొంటారు. విలువగల వస్తు సేకరణకు అవకాశమున్నది. స్త్రీలకు : తలవని తలంపుగా దూర ప్రాంతాలకు పోవలసిన అగత్యం కొందరకు, ఆదాయ మందు వృద్ధి కొందరకు,

★ **కుంభం :** చాల కాలం క్రితం శ్రమించి వదలిన ఒకానొక విషయం, మరలా బయటకు తీయవలసిన అగత్యం ఏర్పడుతుంది. ఆరోగ్యరీత్యా వృద్ధి కనిపిస్తుంది. ఎదురు చూచే తీగ కాళ్లకు తగిలినట్లు ఒకానొక విషయంలో గ్రహిస్తారు. స్త్రీలకు: వృత్తి పెంపు, నూతన వ్యక్తుల పరిచయం.

★ **మీనం :** లాభించవలసిన వ్యవహారంలో నష్టం రావచ్చు. చేతికందుతుందనుకొన్న డబ్బు విషయంలో నిరుత్సాహం కలుగవచ్చు. అనుకోకుండా ప్రయాణాలు తగులవచ్చు. ఉన్నత విద్యకై కొందరు విదేశాలకు ప్రయాణించవచ్చు. స్థితియందు పెంపు కన్పించవచ్చు. గ్రహించండి. స్త్రీలకు : కొందరకు గృహ మార్పు, వృత్తి మార్పు, కొందరకు అనుకొనని మార్గాన ఆదాయం.

-విద్వాన్ కోట సత్యరంగయ్యశాస్త్రి

ఒకటి అరగా.... ఎక్కడో కొమ్మల మధ్య నుంచి కాకి.... "కావ్...... కావ్...... " మంది.

అంతకు మించి ఏ అలికిడి లేదు.

ఆ నిశీథ ప్రకృతిలో..... నిర్మలమైన ఆ తెల్లవారు ఝాము ప్రశాంతతని భగ్నం చేస్తూ..... మృత్యు దేవత విషాద నృత్యంలా.... మనసుని విచ్చు కత్తుల్లా చీల్చే విషాదమైన ఆ స్త్రీ రోదన!

శ్మశానంలో అర్ధరాత్రి సమాధుల మీదుగా వినవచ్చే...... తీతూ పిట్ట అరుపులా..... భీతి కొలుపుతూ ..... వికృతంగా!

కారు చిచ్చులా......

కడుపు కోతలా......

కుళ్ళి కుళ్ళి కుమిలి కుమిలి ఏడుస్తున్నట్టు ఆ రోదన?.....

కిటికి రెక్కలు తెరిచిన సీత కొద్ది క్షణాలు స్తంభించినట్టు ..... అలాగే బొమ్మలా నిల్చుండి పోయింది.

నెమ్మదిగా తేరుకుని చుట్టూ కలయ చూసింది.

చల్లగాలి రివ్వున కొడుతూంది.

చీకట్లు దట్టంగా వున్నాయ్.

ఆ ఏడుపు ఎవరింట్లోంచి వస్తూందో.... అసలు ఏ దిక్కుగా వస్తూందో సీతకి అంతు చిక్కలేదు.

కాని–

ఉప్పొంగే వరదలా క్షణక్షణానికి వుధృతం అవుతూ ఆ స్త్రీ శోకం సీత గుండెని వాడి కత్తిలా పొడుస్తూంది.

బాణం దెబ్బ తిన్న పిట్టలా సీత హృదయం గిజగిజ మంది.

ఎవరు ?

ఎవరా స్త్రీ?

ఎందుకంతగా కుమిలి పోతూంది?

భయంతో ఒళ్ళు ఝల్లు ఝల్లు మంటుంటే సీత గభాల్న మధ్య హాలులోకి పరిగెత్తి ... గాఢ నిద్రలో వున్న తల్లి భుజంమీద చేత్తో గట్టిగా ... కొడుతూ ...

"అమ్మా ... లే ...! మనింటి దగ్గర ఎవరో ఏడుస్తున్నారు" అంటూ తల్లిని లేపి ఛెంగున దూకినట్లు వీధి తలుపు తెరిచి అరుగు మీదకి వచ్చి నిలుచుంది.

ఎదురుగా కనిపిస్తున్న దృశ్యాన్ని చూస్తూ నోట మాట రానట్లు స్తంభీభూతురాలు అయిపోయింది.

ఎదురుగుండా వున్న ఇళ్ళ వరసలో అట్నుంచి నాలుగవ లైనులో వున్న రమణమూర్తి మాస్టారింట్లో తలుపులన్నీ బార్లా తెరిచి వున్నాయ్.

ఇల్లంత జ్యోతుల్లా లైట్లు వెలుగుతున్నాయ్. గేటు ముందు, లోపల ... వాళ్ళ ఇల్లంత ఇసక వేస్తే రాలనట్లు జనం గుమిగూడారు.

సీత గుండె దడదడమంటూంటే - వెనకాల్నుంచి తల్లి పిలుస్తున్నా వినకుండా ఛెంగున అరుగు మించి దూకి గేటు తెరచుకుని లేడిలా వాళ్ళింటి వైపు పరిగెత్తింది.


వాకిలి నిండా గుంపుగా దడి కట్టినట్లున్న జనాన్ని తోసుకుని లోపలికి అడుగుపెట్టిన సీత జడుపుతో "అమ్మా ..." అంటూ కేకపెట్టింది.

ఎదురుగా కన్పట్టిన ఆ భీకర దృశ్యం చూడగానే ఆమె గుండె ఒక్క క్షణం ఆగి తిరిగి రెట్టింపు వేగంతో కొట్టుకోసాగింది.

కొద్ది క్షణాలు నోట మాట రానట్లు అవాక్కుగా అయిపోయింది

"అమ్మా!" అంటూ వెర్రి కేక పెట్టి అలాగే నిలువుగుడ్లు వేసుకుని వుండిపోయింది.

రమణమూర్తి మాస్టారి ఇంటి ముందు వున్న వసారాలో ‚త చిన్ననాటి



జీవితం చేజారిందా

నేస్తం. మాస్టారి ఒక్కగానొక్క గారాలపట్టి అయిన పదిహేనేళ్ల రాధిక శవాన్ని చాపమీద పడుకోబెట్టి తెల్లటి దుప్పటి కప్పారు.

రాధిక తల దగ్గర మట్టి ప్రమిదలో చిన్న నూనె దీపం వెలుగుతూంది.

ప్రక్కనే వసారా చివర రాధిక తండ్రి,ఇద్దరు అన్నగార్లు నిశ్శబ్దంగా కన్నీరు కారుస్తూ నిల్చుని వున్నారు. రాధిక తమ్ముళ్లు ఇద్దరూ తల్లి వెనకాల బిక్క మొగాలు వేసుకొని గోడకి ఆనుకుని కూర్చున్నారు.

చనిపోయిన కూతురు తలని ఒళ్లో పెట్టుకుని మూర్తీభవించిన శోకదేవతలా కూర్చుని వుంది భ్రమరాంబ. రాధిక తల్లి.

ఆవిడ జుత్తంతా చెదిరి వుంది.

నుదుట కుంకుమ చెదిరి ఎర్రగా నుదురంతా అలుముకుంది.

ఆవిడ చెక్కిళ్ళ మీద కన్నీరు ధారలు కట్టి కాల్వలై ప్రవహిస్తూంది.

దుఃఖానికి మారు రూపంలా కూతురు శవం ప్రక్కన కూర్చుని వుంది.

మధ్య మధ్య రెండు చేతుల్తో గుండెలు బాదుకుంటోంది. పిచ్చిదానిలా జుత్తు పీక్కుంటోంది. వెర్రి దానిలా ఏడుస్తోంది. కడుపు శోకం భరించలేక తల గోడకేసి కొట్టుకుంటోంది.

"రాధీ! నా తల్లి . . వెళ్లిపొయ్యావుటే ..." అంటూ హృదయ విదారకంగా విలపిస్తూంది.

కనుల ముందు కనిపిస్తున్న ఆ ఘోర దృశ్యాన్ని చూస్తూ ఎంతో సేపు అవాక్కుగా సర్పద్రష్టలా అలాగే నిల్చుండి పోయింది సీత.

ఇంతలో లక్ష్మి, గిరిజ, సుభద్రమ్మ ... అంతా లేచి అక్కడికి వచ్చారు.

సుభద్రమ్మని చూస్తూనే భ్రమరాంబ దుఃఖం రెట్టింపు అయ్యింది.

కట్టలు తెంచుకున్న వరదలా ఆవిడలో కన్నీరు పెల్లుబికింది.

బాధ భరించలేక రెండు చేతులతో తల బాదుకుంది.

"వచ్చావా సుభద్రమ్మా! రా తల్లి! చూడు ... నా కూతురు రాధమ్మని చూడు. నా కడుపులో చిచ్చుపెట్టి వెళ్లిపోయిందే తల్లీ ... చూడు ... ఒళ్లంతా ఎలా కాల్చుకు చచ్చిపోయిందో ... దాని పెళ్లి చేసి చేజేతులా దాని గొంతు కోశామే తల్లి ... దాని పాలిట పెళ్లి నరకం అయిపోయింది ... ఉరితాడు అయిపోయిందమ్మా ..."

" ... !? "

"ఒసే సుభద్రమ్మా? నీ కూతుళ్ళకి పెళ్లిళ్లు అవ్వలేదని బాధపడకే పెళ్లి పెటాకులు లేకపోతే ఆడది బ్రతకలేదా? కాని ఇలాంటి వెధవ పెళ్లి చేసుకుంటే మాత్రం ఒళ్లు కాల్చుకుని చచ్చిపోవాలి ...

కాదు ... కాదు ...

ఆ రాక్షసులంతా కల్సి నా కూతుర్ని చంపేశారు ... ఒక్కగానొక్క ఆడపిల్ల అని ఒంటికి వెన్న రాసి పెంచాను. అలాంటి నా బిడ్డని ఆ అత్త .. ఆడబిడ్డలు .. కిరసనాయిలు పోసి అంటించేశారు తల్లీ? బ్రతికుండగానే దాని తలకి కొరివి పెట్టేశారు ... నా కూతురికి జరిగిన ఇలాంటి పెళ్లి - చావు ... ఎవ్వరికి ఒద్దు దేముడో ... నా శత్రువులకి ... నా పగవాళ్లకి కూడా వద్దు దేముడా ... ఇంత కడుపు శోకం ... ఓసేయ్ సీతా ... ఇదిగో ... చూడు ... " అంటూ భ్రమరాంబ ఆవేశంగా కూతురు శవం మీద కప్పిన దుప్పటి తొలగించి పారేసింది.

అంతే!

"అబ్బా ...!"

"హా ..."


" ...."

"శివ శివా ..."

అన్న పదాలు అక్కడ గుంపుగా చేరిన వాళ్లందరి నోళ్ళల్లోనూ జుగుప్సగా ప్రతిధ్వనించాయి.

వుల్లిపాయ వుడికించి తొక్క తీసినట్లు రాధిక పచ్చటి అందమైన శరీరం అంతా కాలి బొబ్బలెక్కి, వికృతంగా నల్లగా కమిలిపోయింది.

గడుసులోకం —బాబు



గుండెల దగ్గరంతా వుడికిపోయి మాంసం కండలు కండలుగా బయటక వచ్చింది

మరి కొన్ని బొబ్బలు చితికి మహా వికృతంగా వున్నాయ్.

రాధిక కనుబొమ్మలు, జుత్తు కూడా కాలిపొయ్యాయి. కళ్ళు పేలిపోయి ఆ స్థానంలో నల్లగా గుంటలు ... పడ్డాయి ...

మనిషి ఫలానా అని చెప్పినా గుర్తు పట్టలేనంతగా మారిపోయింది ఆమె రూపం

ఆ ఘోర దృశ్యాన్ని చూడలేక భయంతో "కెవ్వు"మని కేక వేస్తూ రెండు చేతుల్తోనూ ముఖం కప్పుకుంది సీత.

ఆమెకి తెలియకుండానే దుఃఖం పొంగి క్రమంగా వెక్కిళ్లోకి దిగింది.

ఎవరో వచ్చి ఆమె రెండు భుజాలు ఒడిసి పట్టి ఓదార్చారు.

వయసులో కొద్దిగా తేడాలున్నా, రాధిక సీత మంచి స్నేహితులు. కొన్నాళ్ళు ఇద్దరూ కలిసి చదువుకున్నారు.

తన స్నేహితురాల్ని ఆ స్థితిలో చూడగానే సీత కడుపంతా కదిలినట్లు అయ్యింది.

దుఃఖం భరించలేని దానిలా ఒణికి పోతూ అలాగే "శవం" ప్రక్క కూలబడింది.

* * * *

రమణమూర్తి మాస్టారు, ఆయన పై ఇద్దరు కొడుకులు స్థానికంగా ట్యుటోరియల్ కాలేజి నడుపుతున్నారు. రెండు వందల మంది దాకా స్టూడెంట్సు వున్నారు.

ప్రైవేటుగా పరీక్షలు రాసేవాళ్ళు, ట్యూషన్ చెప్పించుకునేవాళ్ళు సప్లిమెంటు పరీక్షలకి కూర్చొనేవారు ... ఇలా రకరకాలుగా స్టూడెంట్లు, విద్యాశక్తి వున్న గృహిణులు ఆయన కాలేజీలో ఎక్కువగా చేరతారు

వేలకి వేలు ఆర్జించక పోయినా ఆ రాబడితో రమణమూర్తి మాస్టరుగారి కుటుంబం ఏ ఒడిదుడుకులు లేకుండా నల్లేరు మీద బండి నడకలా సాగిపోతూంది.

నల్గురు మగపిల్లల మధ్య అపురూపంగా పుట్టిన కూతురు రాధిక.

భ్రమరాంబకి కూతురంటే పంచప్రాణాలు. రాధిక టెన్తు ప్యాస్ కాగానే రెండేళ్ళ క్రితం తల తాకట్టు పెట్టి పదిహేనువేలు కట్నం ఇచ్చి ఘనంగా పెళ్లి జరిపించారు.

రాధిక భర్త ఒక గవర్నమెంటు ఉద్యోగి కాని ...

రాధిక కాపురానికి వెళ్లిన మర్నాటి నుంచే నరకాన్ని చవి చూసింది.

ఆమె అత్తింటి వాళ్లంతా డబ్బు మనుషులు. భర్త పరమ శాడిస్టు.

కట్నం చాలలేదని, లాంఛనాలు సరిగా జరిపించలేదని, పెళ్లిలో పెట్టిన చీరలు వెలిసిపొయ్యాయని , అల్లుడికి ఇచ్చిన వెండి కంచంలో వెండి మంచిదికాదని, నాసి రకం అని ... ఇలా రకరకాలుగ రాధికని పట్టుకుని సాధించేవారు.

పెళ్లయి అత్తింట కాలు పెట్టిన మర్నాటి నుంచి ఇంటెడు చాకిరి రాధిక నెత్తిన రుద్దారు.

రాధికని అనుక్షణం సూటి పోటి మాటలతో వేధించుకుని తినేవారు.

రమణమూర్తి గారు అల్లుడ్ని, కూతుర్ని ముచ్చటగా పండగలకి పిలిస్తే పంపించేవారు కాదు.

పండక్కి అల్లుడు అలిగాడని, స్కూటరు కావాలని, టేప్‌రికార్డర్ కావాలని, ఫ్రిజ్ ఇప్పించమని, మంచి ఫర్నిచర్ లేదని, కూతురుకి ఘనంగా చీర సారె ఏది ఇవ్వకుండా దరిద్రపుదాన్ని, దిష్టిబొమ్మని పంపినట్లు పంపారని ఎత్తి పొడిచేవారు.

ప్రతి పండక్కి గొంతెమ్మ కోరికలు కోరేవారు

రాధిక భర్త శివప్రసాద్ అవటానికి వున్నత విద్యావంతుడే'

కాని పరమ మూర్ఖుడు!

చదువుకున్న సంస్కారంలేని అవివేకి. అమ్మ గీచి తల్లి గిసిన గీత దాటడు. ఆవిడ ఎంత చెప్తే అంత. చిన్నప్పట్నుంచి కొడుకుని అలా పెంచింది ఆవిడ.

పెళ్ళయి భార్య కాపురానికి వచ్చాక కూడా భార్యమీద కొండేలు చెప్పి అతని మనసుని విరిచెయ్యటానికే అనుక్షణం ప్రయత్నించింది.

అందు చేత తల్లి, చెల్లెళ్ళతో పాటు అతను కూడా భార్యని హింసించే వాడు.

కొత్తగా కాపురానికి వచ్చిన అమ్మాయి అన్నైనా జాలి చూపకుండా తల్లి మాట విని భార్యమీద చెయ్యి చేసుకునేవాడు అతనికి డబ్బు పిచ్చి ఎక్కువ

అత్తింట ఆ బాధలు, అనాదరణ, చాకిరి తట్టుకోలేక తరచూ పుట్టింటికి వచ్చేది రాధిక.

కూతురు కన్నీళ్ళు చూడలేక చాతనయినంతవరకు రమణమూర్తి అల్లుడి కోర్కెలు తీరుస్తూనే వున్నాడు.

అయినా వీళ్ళ ఆశ తీరలేదు.

కాళ్ళు కడిగి పిల్లనిచ్చిన మామ అంటే అల్లుడి దృష్టిలో కామధేనువు...' కల్పవృక్షం!! కూతురు పెళ్ళి పేరుతో రమణమూర్తి మాస్టారు ఊరంతా అప్పులపాలై ఆఖరికి వేరే దారిలేక ఇల్లు తాకట్టు పెట్టాడు.

అల్లుడికి పదిహేను వేలు కట్నం కాక స్కూటరు కొనిచ్చాడు వుంగరం,' స్టీలు ఫర్నిచరు కొనిచ్చాడు. లాంఛనాలపేరుతో ఇన్ని కొనిచ్చినా వాళ్ళు

జీవితం చేజారింది

తృప్తి పడలేదు.

ఆఖరికి కలర్ టి.వి. సెట్టు కావాలని అల్లుడు పట్టుబట్టినప్పుడు ఇంక తనవల్లకాదని ఖచ్చితంగా చెప్పేశాడు రమణమూర్తిగారు.

దాంతో వాళ్ళంతా ఆగ్రహించారు.

శివప్రసాదు అహం దెబ్బతిన్నట్లయి బోనులో పులిలా గాండ్రించాడు.

ఇకమీదట ఇట్లా కట్నాలు కానుకలు అడిగినా, తన చెల్లెలుమీద చెయ్యి చేసుకున్నా పోలీస్ కంప్లెంట్ ఇస్తానని వుడికే రక్తపు ఆవేశంలో హెచ్చరించాడు రాధిక చిన్నన్న మహేంద్ర.

పరిస్థితి విషమించటం చూసి తాత్కాలికంగా అడుగు వెనక్కి వేసినా దెబ్బతిన్న అహాన్ని ఓర్చుకుని ఆ బాధని మనసులోనే అణగద్రొక్కుకున్నాడు శివప్రసాద్.

ఆ తరువాత అనుకోకుండా అతనికి ట్రాన్స్‌ఫర్ అయ్యింది.

భార్యతో వేరే ఊర్లో ఒంటరిగా కాపురం పెట్టాడు ...

అల్లుడికి ట్రాన్స్‌ఫర్ అవటంతో కూతురికి అత్త, ఆడబిడ్డల పోరు తప్పిందని భ్రమరాంబ చాలా సంతోషించింది.

భార్యాభర్తలిద్దరూ అనురాగంతో మెల్లిగా దగ్గరవుతారని ఆశించింది.

ఆమె ఆశించినట్లే ఓ ఆరునెల్ల కాలం ఏ అలజడి జరగలేదు.

తనని ఇప్పుడు భర్త బాగానే చూస్తున్నాడని, ఏ గొడవలు లేవని తరచూ రాధిక తల్లికి ఉత్తరాలు కూడా వ్రాసేది.

మధ్యలో రాధిక పెద్దన్న ఒకసారి వెళ్ళి చెల్లెల్ని చూసి పూరగాయలు అవీ ఇచ్చి రెండు రోజులు వుండి వచ్చారు.

ఆ రెండు రోజులు చెల్లెలు చలాకీగా కనిపించింది. శివప్రసాద్ కూడా బావమరిదిని చక్కగా మర్యాదచేసి ఆదరించాడు.


బావగారి మనసు మారి ఇప్పటికైనా రాధిక సంసారం కుదుట పడిందని అంతా ఎంతో ఆనందించారు.

కాని -

శివప్రసాద్ పైకి బూటకపు ప్రేమ నటిస్తూ లోలోన ఎలాగైనా రాధికని వదుల్చుకోవాలని పథకం వేసినట్లు వాళ్ళు గ్రహించలేకపోయారు.

ఆఖరికి ఒక రోజు -

రాధిక ఏమరుపాటుగ వంటగదిలో పన్లు చూసుకుంటుంటే శివప్రసాద్ హఠాత్తుగా లోపలికి వచ్చి ఆమెని గట్టిగా ఒడిసిపట్టి నోట్లో గుడ్డలు కుక్కాడు బలంగా ఆమె రెండు చేతులు వెనక్కి విరిచి తాడుతో గట్టిగా కట్టేశాడు.



ప్రక్కనే వున్న కిరసనాయిల్ డబ్బా ఎత్తి ఆమె ఒంటిమీద జల్లి మండుతున్న కిరసనాయిల్ స్టౌ మీదికి పడదోశాడు.

అంతే!

క్షణాల్లో మంటలు రాజుకున్నాయి.

రెప్పపాటులో నిలువునా అగ్నికి ఆహుతి అయ్యింది రాధిక.

శరీరం మీద లేస్తున్న మంటలకి తాళలేక బాత్‌రూమ్‌లో నీళ్ళ తొట్టి వైపు పరిగెత్త బోయింది.

కాని శివప్రసాద్ గభాల్న వంటగది తలుపు బయట నుంచి గడియ వేశాడు.

నిస్సహాయంగా ఆ అగ్నిజ్వాలల మధ్య ఒంటరిగా వంటగదిలో బంది అయ్యింది రాధిక.

నిప్పుకి మండి చేతికి బిగించిన తాళ్ళు కాలి తెగిపొయ్యాయి.

భర్త నోట్లో కుక్కిన గుడ్డ తీసేసి గట్టిగా కేకలు పెడుతూ గదంతా పరుగులెత్తింది.

ఒంటి మీద చీర లాగెయ్యటానికి ప్రయత్నించింది. కాని ...

కట్టుకున్నది టెర్లిన్ చీర కావటంతో సింథటిక్ రబ్బర్ కాలి వాసన వేస్తూ ఒంటికి అతుక్కొని పోయింది.

వేరే దారి లేక గభాల్న మంచినీళ్ల బిందె ఎత్తి ఒంటిపై గుమ్మరించుకుంది.

క్షణాల్లో ఆమె స్పృహ తప్పి కింద పడిపోయింది.

ఆమె శరీరం మీద నాల్కలు చాచిన అగ్నిజ్వాలలు కాస్సేపు మండి ఆ తరువాత తమ ప్రతాపాన్ని కొద్దిగా తగ్గించుకున్నాయి.

వంటగదిలో కిరసనాయిల్ వాసన గప్పుమని గదంతా దట్టంగా పొగలు క్రమ్మాయి. అప్పుడు తీరుబడిగా గది తలుపులు తెరిచి ఖంగారు పడుతున్నట్లు హడావుడిగా లోపలికి వచ్చాడు శివప్రసాద్.

ఒళ్ళంతా కాలి స్పృహ తప్పి నేల మీద నీళ్ళ మడుగులో కొన వూపిరితో పడి వుంది రాధిక!

వంట చేస్తుంటే "స్టౌ" అంటుకుందని చెప్పి అర్ధగంట తర్వాత రాధికని హాస్పిటల్‌లో చేర్చాడు.

అప్పటికి రాధిక దేహం బాగా కాలిపోయింది.

మాంసం వుడికి వాసన వేస్తోంది.

ఒళ్ళంతా వికృతంగా బొబ్బలు తేలింది.

తల ... జుట్టు ... కనుబొమ్మలు అన్నీ కాలిపొయ్యాయి

విశాలమైన చక్రాల్లాంటి ఆమె కళ్ళ స్థానంలో రెండు గుంటలు.

వుడికించిన చిలకడ దుంపలా కండలు ఎక్కడికక్కడ బయటికి వచ్చాయి.

గాలిలో దీపంలా ప్రాణం కొనవూపిరికి వచ్చింది.

ఉచ్ఛ్వాస నిశ్వాసాలు అతి కష్టంతో తీసి విడుస్తోంది.

పల్స్ పూర్తిగా పడిపొయ్యాయి.

ముందు డాక్టరు రాధికని అడ్మిట్ చేసుకుందుకే అంగీకరించలేదు.

కాని శివప్రసాద్ మొసలి కన్నీరు కారుస్తూ, బ్రతిమాలటంతో కేవలం మానవత్వంతో ఒప్పుకున్నాడు.

ఆమెని బ్రతికించాలని హాస్పిటల్ స్టాఫ్ అంతా శాయశక్తులా ప్రయత్నించారు.

కాని మృత్యువుని జయించలేకపొయ్యారు.

హాస్పిటల్ బెడ్ మీద చివరి క్షణాల్లో వుండి పోలీస్ ఇనస్పెక్టర్ అడిగిన ప్రశ్నలకి ఓపిక కూడగట్టుకుని అతి కష్టంతో జవాబు చెప్పింది రాధిక.

"తనని అత్తింటి వారంతా ఎన్నో ఆరళ్ళు పెట్టారని, చివరికి వాళ్లంతా కల్సి తనని అంతం చెయ్యాలని ప్లాన్ వేశారని, తన భర్త ట్రాన్స్‌ఫర్ కూడా అందులో ఒక భాగమే కావచ్చునని, తన భర్తే తనని రాక్షసత్వంగా కిరసనాయిల్ పోసి కాల్చి చంపాడని, తన తల్లితండ్రుల దగ్గర్నుంచి జలగలా రక్తాన్ని పిల్చినట్లు డబ్బు పిండారని, ఆ నష్టాన్నంతా తిరిగి వాళ్లకి ఇప్పించమని, తనలా ఇంకొక ఆడపిల్ల ఈ వరకట్న పిశాచికి "బలి" కాకూడదని, తన తల్లితండ్రుల్ని దుఃఖపడవద్దని తన మాటగా చెప్పమని స్టేట్‌మెంట్ చెప్పి అంతిమ శ్వాస విడిచింది రాధిక.

దాంతో "కేసు" నమోదు అయింది.



తన్ను కన్న తల్లి, పుట్టిన ఊరూ స్వర్గంకంటె గొప్పవని మనవారు ఎప్పుడో చెప్పారు. అంటే స్వర్గం మీద ఉండే ఆపేక్షకంటె తల్లిమీదా, పుట్టిన ఊరిమీదా ఉండే ఆపేక్ష అధికమన్నమాట. తల్లిని విడిచి పెట్టి విద్యకోసం గానీ, ఉద్యోగరీత్యాగాని పై స్థలాలకు వెళ్లినప్పుడు, తిరిగివచ్చి తల్లిని చూచేవరకూ ఆందోళనగా ఉంటుంది. తల్లికి కూడా ఆ కుమారుణ్ని చూడాలనే ఆపేక్ష అధికంగా ఉంటుంది. తల్లి లాగే మాతృభూమికి కూడా తన బిడ్డలపయి అభిమానం లేక పోలేదు. కాని, దానిని వెల్లడించడానికి నోరు లేదు. అందువల్ల, మాతృభూమిపయి రెట్టింపు అభిమానాన్ని చూపవలసి ఉన్నది. మాతృభూమిని విస్మరించకూడదు.

పెరిగి పెద్దవాడై విద్యాబుద్ధులు సంపాదించి, ధనాన్ని గడిస్తున్నా, తల్లిని ఆదరంతో చూచి, ఆమె సుఖ, సంతోషాలకు ప్రయత్నించడం ధర్మమయినట్లు జన్మ భూమిని గౌరవించడం కూడా ముఖ్యమైన ధర్మమే! అలాగే తాను పేరు ప్రతిష్ఠలు సంపాదిస్తే, తన మూలంగా జన్మభూమికి కూడా గౌరవం లభిస్తుంది. అక్కడి వారు "మన ఊరివాడు ఇంత ప్రఖ్యాతి సంపాదించా"-డని ప్రశంసిస్తారు. తెలిసిన వారెవ్వరూ చులకనగా చూడరు. తరం మారి కొన్నేళ్ళు జరిగిన తర్వాత , అక్కడి వారు వింతగా చూడడం, తిరస్కార భావాన్ని ప్రదర్శించడం, అధిక్షేపించడం జరిగితే జరగవచ్చు. అది వారి అజ్ఞతనే సూచిస్తుంది. ఉచితజ్ఞులు అట్టి వానిని లెక్క చెయ్యరు. వారికి మాతృభూమిపయి గౌరవం తగ్గదు.

మనదేశంలో స్వదేశీయులను గౌరవించడం కంటె విదేశీయులనే ఎక్కువగా గౌరవించడం జరుగుతున్నదనే అపప్రథ ఉన్నది. ఇక్కడ అభివృద్ధి పొందుటకు తగిన అవకాశాలు దొరకక ప్రతిభావంతులు విదేశాలకు పోయి ధనం సంపాదించడం, అక్కడనే కొందరు స్థిరపడి పోవడం దీనికి కారణం కావచ్చు. ప్రతిభావంతులు ఇతరత్రా స్థిరపడి పోకుండా- విదేశాలకు పోనవసరం లేకుండా స్వదేశంలో తగిన ప్రోత్సాహం కలిగించి, సౌకర్యాలను కలిగించి, స్వదేశాభిమానాన్ని పెంపొందించడం స్వదేశంలోని వివిధ సంస్థల ధర్మం.

-బులుసు వేంకటరమణయ్య.

రాధిక మరణం క్షణాల్లో వూరంతా గప్పుమంది.

ఈ వార్త తెలిసి స్థానికంగా వున్న మహిళా మండలి వారు "ర్యాలి" వూరేగింపు చేసి శివప్రసాద్ ఇంటి ముందు "ప్రొటెక్షన్" చేసి స్లోగన్స్ వదిలారు.

కాని -

అంతమాత్రం చేత ఒరిగింది ఏముంది?

పోయిన రాధిక ప్రాణం తిరిగి రాదుకదా?

రమణమూర్తి, భ్రమరాంబ వెళ్లేసరికి కూతురు ప్రాణం పంచభూతాల్లో కలిసిపోయింది. గుండెలు బాదుకుంటూ రాధిక శవాన్ని ఇంటికి తెచ్చుకున్నారు.

రాధిక శవాన్ని టాక్సీలో ఇంటికి తెచ్చేసరికి అర్ధరాత్రి రెండు గంటలు కావచ్చింది.

అప్పటికే 'శవం' బాగా కుళ్ళు వాసన వెయ్యటంతో ఆ మర్నాడు ఉదయం పది గంటల ప్రాంతంలో రాధిక శవానికి యథావిధిగా దహనసంస్కారం జరిపించారు.

ఆమె అత్తవారింటి వైపు బంధువులెవ్వరూ రాలేదు. కాని వూరు వూరంతా ఆమె కోసం కన్నీరు కార్చింది .

రాధిక శవం శ్మశానానికి తరలి వెళ్లేదాకా అక్కడ వుండి ఆ తరువాత అంతా ఇంటికి వచ్చారు.

ఆ రోజంతా సీతకి తిండి సయించలేదు.

మనసంతా తెడ్డు వేసి కెలికినట్లుగ అయిపోయింది.

కళ్లు మూసినా తెరిచినా రాధిక వికృత రూపమే కళ్ల ముందు కదలసాగింది.

రాధిక మరణంతో అందరి మనసులు పాడైపోయ్యాయి ఆ వాడకట్టంతా లావాలా కుతకుతమన్నారు.

ఆ రోజంతా సుభద్రమ్మ పెద్ద కూతుర్ని తల్చుకుని ఏడుస్తూనే వుంది.

(ఇంకా ఉంది)

ఇద్దరూ ఉద్యోగస్తులైతే...?

మంచిగా ఉండు, మంచే చెయ్యి!

పోలవరపు కృష్ణప్రసాద్ హైదరాబాద్ ఎ. జిస్ ఆఫీసులో ఆడిటర్‌గా పనిచేస్తున్నారు. ఆయన భార్య శ్రీమతి విజయలక్ష్మి ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో క్లర్క్‌గా పనిచేస్తున్నారు.

వింత కలయిక:- మా వివాహం చాలా గమ్మత్తుగా జరిగింది. పెళ్ళి చేసుకోవాలనుకుని ఆంధ్రదేశంలోని నలుమూలలా పిల్ల కోసం వెతికాను. ఎక్కడా దొరకలేదు. చివరికి కోయంబత్తూరులో స్థిరపడ్డ తెలుగు పిల్లను చూడటం, వెంటనే నచ్చడం, చేసుకోవడం జరిగింది. పెళ్ళయినప్పుడు నా శ్రీమతికి ఉద్యోగంలేదు. బ్యాంకు పరీక్షలు వ్రాసింది. పెళ్ళయిన తరువాత ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయి, ఉద్యోగం సంపాదించుకుంది.' అన్న కృష్ణప్రసాద్ ఎమ్. ఎ. ఎల్. ఎల్. బి. చేసి గవర్నమెంటు ఆఫీసులో గుమాస్తా గిరి చేయడం అంత తృప్తికరంగా ఉన్నట్లు కనిపించలేదు.

భయపడను:- మా వారికి పుస్తకాల పిచ్చి ఎక్కువ. పెళ్ళయిన కొత్తలో ఆయన వాలకం చూసి కాస్త భయపడ్డాను. ఎప్పుడూ ఎమర్‌సన్, సిగ్మండ్‌ఫ్రాయిడ్, ఆల్‌ఫ్రెడ్ ఎడ్లర్, సి. జి. జంగ్ సైకాలజీ పుస్తకాలు తెగ చదివేవారు. ఆయన సైకాలజీ నామీద ప్రయోగిస్తారేమో అనుకునేదాన్ని. తరువాత నెమ్మదిగా అర్థమైంది. ఆయనకు విజ్ఞానం సంపాదించుకోవాలన్న తపన ఎంత ఉందో?' అన్నారు శ్రీమతి విజయలక్ష్మి కృష్ణప్రసాద్.

ఆవిడే నయం!:- 'నాకన్నా మా ఆవిడ చాలా నయం! నేను ఎంతసేపూ పుస్తకాలు చదవడం నాలెడ్జి సంపాదించడానికి కృషి చేశాను. ఆవిడ బ్యాంకు ఉద్యోగంలో చేరిన సంవత్సరానికల్లా జీవితంలో స్థిరత్వం కోసం ప్రయత్నాలు మొదలుపెట్టి రెండేళ్ళలో బ్యాంకువారి పుణ్యమా అని ఇల్లు కొనేసింది. నాకందుకే అనిపిస్తుంది. భారతదేశంలో పురుషులకన్నా స్త్రీలే ఒక మెట్టు ముందున్నారని! ఏమంటారు?"

'నిజమే! ఒప్పుకోక తప్పదు!' మీ కుటుంబాన్ని చూసిన తర్వాత.' అన్నాను!

విజయలక్ష్మి, కృష్ణప్రసాద్‌లకు ఇద్దరు మొగపిల్లలు. ఇద్దరినీ బాగా చదివించి, ఒకణ్ణి ప్రపంచ పేరుప్రఖ్యాతులు గడించాల్సిన గొప్ప సైంటిస్టుగాను, రెండో వాణ్ణి ఇంజనీరుగాను తీర్చిదిద్దాలని ఉవ్విళ్ళూరుతున్న శ్రీ కృష్ణప్రసాద్‌కు ఎడిసన్, న్యూటన్, ఫరడే అభిమాన సైంటిస్టులు!

'నాకు మాత్రం మా అబ్బాయిల్ని మంచి స్పోర్ట్స్‌మెన్‌గా చూడాలని ఉంది.' అన్నారు శ్రీమతి విజయలక్ష్మి.

వాహన ప్రాప్తి!:- హైదరాబాద్‌లాంటి పట్టణాలలో పని చేసే వారికి ఏదన్నా వాహనం కంపల్‌సరిగా ఉండాలండి! వెధవ బస్సులో ఆదరాబాదరాగా ఆఫీసులకు అలసిసొలసి వెళ్ళాల్సి వస్తోంది! టైమ్, ఎనర్జీ, అన్నీ వృథా. అందుకే మా వారిని కనీసం మోపెడ్ అన్నా కొనమంటున్నాను.' అన్నారు శ్రీమతి విజయలక్ష్మి.

'మోపెడ్ మా పర్సనాలిటీకి సరిపోదు. స్కూటర్ కొంటే పిల్లల్ని కూడా స్కూల్లో దింపడానికి బాగుంటుంది. అదే ప్రయత్నంలో ఉన్నాను.' అన్నారు కృష్ణప్రసాద్.

భక్తి సున్న:- 'ఐ డోంట్ బిలీవ్ ఇన్ ది ఎగ్జిస్టెన్స్ ఆఫ్ గాడ్'. అంతరాత్మే పరమాత్మ అని నా నమ్మకం. ఎ. జిస్ ఆఫీసులో చేరక ముందు బ్యాంకు ఉద్యోగం వస్తే కాదనుకున్నాను. అప్పట్లో బ్యాంకు ఉద్యోగానికి అంత గ్లామర్ లేదు. ఇప్పుడు బ్యాంకు ఉద్యోగం దొరకడం గగనం. పేరుకు చేసేది ప్రభుత్వోద్యోగమే అయినా పెరిగేందుకు అవకాశాలు చాలా తక్కువ. నా శ్రీమతి కూడా నాకు చేదోడు, వాదోడుగా ఉంటూంది కాబట్టి హైదరాబాద్ నగరంలో ఉండగలుగుతున్నాం! మధ్యతరగతి కుటుంబాల్లో మొగుడూ, పెళ్ళాలిద్దరూ ఉద్యోగం చేయడం మంచిదని నా అభిప్రాయం!

'మంచిగా ఉండు, మంచే చెయ్యి' అన్న బుద్ధుడి సిద్ధాంతమే నా సిద్ధాంతం!' అంటారు కృష్ణప్రసాద్. మంచిదేగా!

—కృష్ణాజీ



శ్రీ పి. కృష్ణప్రసాద్, శ్రీమతి విజయలక్ష్మి



జి. రజని

నీరెండ తగిలి కళ్ళని చురుక్కుమనిపించగానే మంచం మీద బద్ధకంగానే లేచి కూర్చున్నాడు సూర్యం. చుట్టూ కొత్తగా ఉన్న వాతావరణం మెల్లి మెల్లిగా మనసుకు అలవాటు కాసాగింది కొంచెం పాతబడిన ఇల్లు అది. పెరట్లో గిలకబావి నందివర్ధనం పూలచెట్లు. తెల్లని ముగ్గులతో మెరిసి పోతున్న నడవా దూరంగా పశువుల పాక ఉండి ఉండి అంబా అన్న అరుపులు.

తులసికోటలో నీళ్ళు పోసి దణ్ణం పెడుతున్న కృష్ణమూర్తి భార్య పట్టుచీర కొంగు చల్లగాలికి రెపరెపలాడుతోంది.

ఆ ప్రభాత వేళ సౌందర్యం సూర్యం నిద్రమత్తుని క్షణంలో వదిల్చి పారేసింది. ఓ విధమైన తన్మయత్వంతో గుండె నిండిపోయింది. నిజమే ఎక్కడో నాగపూర్‌లో నిత్యం వాహనాల రణగొణధ్వనులు. మనిషికి మనిషికి పొంతనలేని కృత్రిమ తత్వాలు తెచ్చుకోలు నవ్వులకి అలవాటు పడిపోయిన అతని ప్రాణాలకి ఈ పల్లెటూరి గాలి కన్నతల్లి ప్రేమలా చల్లగా మెత్తగా తాకుతూ చిన్ననాటి స్మృతుల్ని ఒక్కసారి లేపి తట్టి గిలిగింతలు పెట్టింది.

ఈ ఊళ్లో ప్రతి అణువు తనకి పరిచయమే. అడుగు పెట్టని గడపే లేదు. స్నేహితులు కాని వారేలేర.

కృష్ణమూర్తి తను గోలీకాయలాడుకున్న నిక్కరు రోజులు జ్ఞాపకం వచ్చి అతని పెదవులపై చిన్నగా చిరునవ్వు మెరిసింది.

ఆ క్షణంలో తనో పెద్ద ఫర్మ్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరునన్న సంగతి మర్చిపోయాడు. ఓ అందాల భామకి భర్తనని, ముచ్చటయిన ఇద్దరు పిల్లల తండ్రిననీ అతని స్పృహకే రాలేదు.

కృష్ణమూర్తి వచ్చి రెండు మూడుసార్లు పలకరించితే గాని ఈ లోకంలోకి రాలేకపోయాడు.

"రాత్రి బాగా నిద్రపట్టిందా?" అతని ప్రశ్నకి తల ఊపాడు సూర్యం.

కృష్ణమూర్తి అక్కడే స్కూలులో టీచరుగా పనిచేస్తున్నాడు. ఇంత హాయి అయిన పరిసరాలలో ఉన్న ఊళ్లోనే స్థిరపడిపోయాడు. అదృష్టవంతుడు.

బ్రష్ తీసుకుని వాకిట్లోకి వచ్చాడు. ముఖం కడుక్కునేందుకు నీళ్ళు సిద్ధంగా పెట్టింది కృష్ణమూర్తి భార్య. నడుస్తుంటే ఆమె పాదాల వెండి మట్టెలు పట్టాలు లయగా శబ్దం చేస్తున్నాయి.

పల్లెటూరి ముగ్ధ అందమంతా ఆ సవ్వడిలో వినిపించి నవ్వుకున్నాడు సూర్యం.

ఆ క్షణంలో అతనింకేమీ ఆలోచించలేదు. అంతరంగంలో మధుర గానాలు మారుమ్రోగుతున్న వేళ జీవితం అక్కడే ఆగిపోతే బాగుండుననిపించే అపురూపమైన ఘడియలు అతనికా తన్మయత్వాన్ని, వదలాలనిపించలేదు.

ఒక విధమైన తన్మయత్వంలో మునిగిపోయిన సూర్యం ఒక్కసారి తలెత్తి కనిపించిన దృశ్యాన్ని చూసి రక్తం గడ్డ కట్టినట్టయి బిగుసుకు పోయాడు. అతని గుండె కొంచెం సేపు కొట్టుకోవడం మానింది

ఆ ఊరికి ఉన్న ఒకే ఒక మంచినీటి చెరువు కృష్ణమూర్తి ఇంటి ఎదురుగానే ఉంది. అక్కడ బిందె ముంచుకుని నీళ్ళు తెచ్చుకుంటున్న స్త్రీ అతి సామాన్యంగా ఉంది. వెలిసిపోయిన నేత చీర, నిర్లక్ష్యంగా వదిలేసిన పిపంతా పరచుకున్న పొడవైన తలకట్టు. నుదుట కనీ కనిపించకుండా చిన్న కుంకుమబొట్టు.

ఏ భావమూ లేకుండా నిశ్చలంగా నిర్వికారంగా ఉన్న విశాలమైన నేత్రాలు అతి మామూలుగా ఉన్న ఆమెలో అద్భుతమైన సౌందర్యం సృష్టికర్త పాలరాతి బొమ్మను చేసి ప్రాణం పోసినట్లు చప్పున తల తిప్పుకున్నాడు సూర్యం.

ఆమెను చూడగానే సుందరమైన లోకంలో నుంచి అధః పాతాళానికి జారిపడ్డట్లు ఫీలయ్యాడు పాల కుండలో విషం చిందినట్లుగా చేదుగా అనిపించింది.

అరుంధతి వెనక నీళ్ళు తెచ్చుకుంటున్న అమ్మలక్కల మాటలు బాహాటంగానే అతని చెవిన పడుతున్నాయి.

"ఈ పాపిష్టి కళ్ళతో ఎన్ని విచిత్రాలు చూడవలసి వస్తోందమ్మాయ్! ఎంత బరితెగించిన మనిషి కాకపోతే విచ్చలవిడిగా చెరువుకొస్తుంది! ఈ ఒక్క పూటా నీళ్ళు తెచ్చుకోకపోతే కొంపలేం మునిగాయి. అవతల చెట్టంత కొడుకు సవతి పిల్లాడే అనుకో ఊళ్లోకి వచ్చి మొహం చెల్లక అయినవాళ్లింట్లో దిగకుండా స్నేహితుడింట్లో మకాం పెట్టాడా ఇంకో మనిషయితే సిగ్గుతో ప్రాణం పోయి గడప దాటి కాలు ఇవతల పెడుతుందా! తగుదునమ్మా అని ఇలా వీధిన పడి తిరగడమే ఆశ్చర్యం రోజూ ఈ వగలు పయ్యారాలు మనం చూస్తూనే ఉన్నామనుకో ఏమైనా సంప్రదాయపు కుటుంబాల్లో ఉన్న ప్రాణాలం. ఇలాంటి మోరకలి చూస్తుంటే ఇహ అన్నం సయిస్తుందా! పరాయి వాళ్ళం మనమే ఇంత మధనపడిపోతున్నాం ఆ అబ్బాయి ఎలా తట్టుకున్నాడో పాపం అందరూ తెలిసినవాళ్లేనాయె. ఏ ముఖం పెట్టుకుని ఎవర్ని పలకరిస్తాడు! ఎవరింటికి సంతోషంగా వెళ్లగలడు!"

రామాయమ్మగారి మాటలు ప్రవాహంగా సాగిపోతుంటే ఈతరాక కొట్టుకుంటున్న చిన్న పిల్లాడిలా ఉక్కిరిబిక్కిరై పోతున్నాడు సూర్యం పంక అలవోకగా చూసి పెదవి విరుచుకుంది. కరణంగారి కోడలు

"అవునత్తయ్యా, ఆ అబ్బాయి పడే మనోవ్యథ మనం తీర్చేదికాదు ఓదార్చవలసిన విషయం అంతకంటే కాదు. అరుంధతికి మాయ రోగం వచ్చిందనుకోవాలి లేకపోతే ఇలాంటి పాడు బుద్ధులెందుకు పుడతాయి! వాళ్ళ మామగారు పౌరోహిత్యం చేసినట్టు చేశాడు. పెనిమిటి వేదాలు చదివాడు. వాళ్ల నాన్న యజ్ఞం చేసినట్టు విన్నాం రెండు వంశాలకి అప్రదిష్ట తెచ్చి పెట్టింది అలా బతకడం కన్నా చెరువులో పడి చావడం నయంకాదూ?" ఆవిడ గొంతులో స్పష్టంగా

ధ్వనిస్తున్న ఈసడింపు నాలుగడుగుల దూరంలో నడుస్తున్న అరుంధతి పిన్ని చెవిన పడటం లేదా సూర్యం ఆశ్చర్యానికి అంతులేదు. ఆ ఛీత్కారాలు వెటకారాలు తనవి కానట్టే నిర్వేదంగా ఇంటికి అరుంధతి నడచిపోతుంటే నిర్విణ్ణుడై నిలబడి పోయాడు సూర్యం. ఆమె నిబ్బరానికి లోలోపల మెచ్చుకోలేకుండా ఉండలేక పోయాడు కానీ మళ్లీ మనసు మేల్కొలిపింది. నువ్వు ఊళ్లో తలెత్తుకో లేని పాడు పని చేసింది. నువ్వు పుట్టిన వంశానికే కళంకం తెచ్చింది. నీ తండ్రిపోగానే ఊళ్లో భూస్వామి నాయుడితో సంబంధం పెట్టుకుంది. పరోక్షంగా నిన్ను నవ్వులపాలు చేసినట్టు కాదా. ఇక్కడ మిగిలిన కాస్త పొలం అమ్ముకుని ఇక ఈ ఊరితో ఋణం తీర్చేసుకోవాలని వచ్చావు. అదేదో పూర్తి చేసుకుని తిరుగు బస్సెక్కు. అనవసరంగా అరుంధతి పిన్ని నీడ చూసినప్పటికీ నీ మనసు విపరీతంగా పాడవటం ఖాయం. ఆ ఇంటి వాయలకు పోబోకు. "తీవ్రంగా తన్ను తాను హెచ్చరించుకున్నాడు సూర్యం

గబగబా వేడినీళ్లు స్నానం చేశాడు. కృష్ణమూర్తి ఆ పూట స్కూలుకి సెలవు పెట్టాడు. ఇద్దరూ చిన్ననాటి సంగతులే తరచి తరచి చెప్పుకుంటూ భోజనం చేశారు కృష్ణమూర్తి ఎన్నో సంగతులు ఈ పదేళ్లలో ఊళ్లో వచ్చిన మార్పులు కథలు కథలుగా చెబుతున్నాడు. పరధ్యానంగా ఊ కొడుతూ వింటున్నాడు సూర్యం కానీ ఒక్క విషయం అతని దృష్టిని దాటి పోలేదు కృష్ణమూర్తి పొరపాటున కూడా అతని కుటుంబ విషయాలు ముఖ్యంగా అరుంధతి గురించి సంభాషణలలోకి రాకుండా జాగ్రత్త పడుతున్నాడు. ఆమెను గురించి ఎన్నో తెలుసుకోవాలనుంది. ఉబుకుతున్న కుతూహలాన్ని లోలోపల అణుచుకుని ఊరుకున్నాడు సూర్యం. తనక తానుగా బయటపడటం అతనికి ఇష్టంలేదు. పైగా కృష్ణమూర్తి నోట ఆ చేదు నిజాలు వింటే ఏమైపోతానో అన్న భయం కలిగింది. అసలు రామాయమ్మగారు చెప్పినట్టే తలెత్తుకోవడం కష్టం

మనిషి జీవిత పరిధుల్ని కనీస మర్యాదల్ని చదువుకోక పోయినా ఆవిడ ఒక్క మాటలో సులభంగా తెల్పి చెప్పగలిగింది నిజంగా ఇప్పుడు తన పరిస్థితి అలాగే ఉంది ఆ నాలుగెకరాల పొలం అమ్మాలంటే నలుగురి సాయం తప్పనిసరి, లేకపోతే మంచి ధర రావడం కష్టమే అయినకాడికి అమ్ముకుంటే కొన్ని వేలు నష్టపోక తప్పదు ఏమైనా ఊళ్లో అందరి ముందుకు పోయి ఆ అవమానం భరించే కంటే ఏదో ఓ రేటుకి ఇక్కడ కృష్ణమూర్తి ఇంట్లోనే అమ్ముకుని వెళ్లడం మంచిది అన్న నిర్ణయానికి వచ్చాడు సూర్యం

మెరుపులా ఓ ఆలోచన తళుక్కున మెరిసింది. ఆ పొలం పక్కనే కృష్ణమూర్తి తోట ఉంది. ఇతనికే ఇస్తే సరిపోతుంది. పదివేలు వార అయినా

అమ్మ

ఫరవాలేదు ఎంతైనా ప్రాణ స్నేహితుడు. అతని గుండెలో అభిమానం పొంగింది

కృష్ణమూర్తి భుజం మీద స్నేహపూర్వకంగా చేయి వేశాడు. "ఒరేయ్ కృష్ణా ఈ పరిస్థితిలో నేను పొలం "బేరానికంటూ తిరగలేను నువ్వే తీసుకోరాదూ"

కృష్ణమూర్తి చాలా సేపు మాట్లాడలేదు. చివరకి "నేనా! నీ పొలం రేటు ఇప్పుడు అరవై వేలకి తక్కువ ఉండదు. అంత ఇచ్చుకోలేను. అయినా ఇప్పుడు కొత్తగా భూమి కొనాలన్న ఉద్దేశం కూడా లేదు. నువ్వు శ్రమపడ నవసరం లేకుండా ఆ వ్యవహారం నేను సెటిల్ చేసి పెడతాను" మంచం వాల్చుకుని దిండు వేసుకుంటూ అన్నాడు. సూర్యానికెంతో రిలీఫ్ దొరికింది, కృతజ్ఞతగా చూశాడు.

"రక్షించావు. అసలీ పని ఓ కొలిక్కి వస్తుందా అని భయపడ్డాను. నువ్వుండగా ఇంక ఆ విషయం ఆలోచించనక్కరలేదు." కళ్లు మూసుకుని పడుకున్నాడు. అతని ఎదలో సుళ్లు తిరుగుతున్న బాధా తరంగాలని గమనిస్తూనే ఉన్నాడు కృష్ణమూర్తి.

తప్పించుకుని ముఖం చాటు చేసుకుంటూ ఆవేదనని దూరం చేసుకోవాలని శతవిధాల ప్రయత్నిస్తున్నాడు సూర్యం. అతనిదసలే సున్నిత హృదయం. బస్సు దిగుతూనే మునసబు పాలేరు చెప్పనే చెప్పాడు. ఇదివరకెప్పుడో ఉత్తరాలలో బంధువులు ప్రస్తావిస్తే నిజమో కాదో అని పట్టించుకోక ఊరుకున్నాడు. ఇప్పుడు లోకం కోడై కూయడమంటే ఏమిటో తెలిసింది.

నిజానికి అరుంధతి కథ ఎప్పుడో పాతబడిపోయింది. కాని సూర్యం తలవని తలంపుగా అకస్మాత్తుగా రావడంతో తమకంతా తెలుసు నన్నట్టు పదేపదే అతని ముందు ఆ విషయం ఎత్తి మనసును ఈటెల్లాంటి మాటలతో చిత్రవధ చేస్తున్నారు

మధ్యాహ్నం పొలం లెక్కలు వేయడానికి మునసబు గారింటికి ఇద్దరూ వెళ్లారు

పడకుర్చీలో తిరిగ్గా పడుకున్న శేషాచలం గారపట్టిన పళ్లను బయటికి పెట్టి పెద్దగా నవ్వుతూ పలకరిస్తుంటే తల వంచేసుకున్నాడు సూర్యం.

"ఏమోయ్! ఇన్నాళ్లకి ఊర్లోకి అడుగు పెట్టావు. మేమందరం గుర్తున్నామా' పోనీలే పెద్ద చదువులు చదువుకున్నావు మంచి ఉద్యోగస్థుడివి అయ్యావు మీ నాన్న పోగానే మేనమామ ఊరెళ్లినందుకు మేలే జరిగింది ఇక్కడే వుంటే నీ భవిష్యత్తంతా ఏమయ్యేదో, ఆ అరుంధతమ్మ, ఛ. ఛ. చెప్పుకుంటే సిగ్గు చేటయ్యా ఆ నాయుడ్ని తగులుకుంది వాడేమో దాని ఇంటికి కాపలాననట్టు పాలేళ్ల చేత పంపిస్తాడు ఆ ఇల్లంతా ఇప్పుడు నాయుడి అజమాయిషిలోనే ఉందనుకో మీ పిన్నిని చూసి బుగ్గలు నొక్కుకోని ఆడదిలేదు. తల దించుకొని మగాడు లేదు. ఉన్నత వంశంలో పుట్టి ఇదేం బుద్ధయ్యా. ఇద్దరు పిల్లల్ని ఆ మాత్రం పోషించుకోలేక పోతుందా. ఏదో మాలాంటి నాలుగిళ్లలో పని పాటు చేసుకుంటే బతుకు గడిచిపోదూ - అందుకు కులం కానివాడితో సంబంధం పెట్టుకోవాలా!"

ఆయన జాలి కురిపిస్తుంటే పిడి బాకులు పెట్టి వళ్లంతా తూట్లు పొడిచినట్లుంది సూర్యానికి. సిగ్గుతో పిన్ని మీద వళ్లుమాలిన కోపంతో అతని వదనం ఎర్రగా కమిలిపోయింది.

అది సరేలెండి. మనవాడు వచ్చిన విషయం.... అంటూ మాట తప్పించబోయాడు కృష్ణమూర్తి.

"నువ్వుండవోయ్. చాలా రోజులకి వచ్చాడు! అతనికి అన్ని సంగతులు ఇక్కడ జరుగుతున్న భాగోతం అంతా చెప్పొద్దంటావా. నాయనా సూర్యం. మీపిన్ని వ్యవహారం నలుగురికీ తల వంపులుగా ఉందంటే అందులో అబద్ధమేముంది. మర్యాదగల కుటుంబాల వాళ్ళ మంతా ఏమైపోవాలి మాకూ ఆడపిల్లలున్నారు. ఇలాంటి పోకిరి బుద్ధులు వాళ్ళు నేర్చుకునే ప్రమాదముంది. అందుకని కాస్త చెప్పవయ్యా, ఎలాగూ వచ్చావు. మీ పిన్నికి కాస్త గడ్డిపెట్టు. సవతి కొడుకువే కావచ్చు. కానీ బంధుత్వం దగ్గరేగా" ఆయన వాగ్ధోరణి ఆగేటట్టు లేదు. స్నేహితుడి ముఖాన.

కత్తి వాటుకి నెత్తురు చుక్క లేకపోవడం గ్రహించాడు కృష్ణమూర్తి

"తర్వాత వస్తామండి" సెలవు తీసుకుని సూర్యాన్ని రెక్క పట్టుకుని బయటికి తీసుకువచ్చాడు.

దారిలో అతినిశబ్దంగా ఉన్నాడు సూర్యం కానీ అతని గుండెలో అగ్నిపర్వతం రగులుతోంది అదురుతున్న అతని ముక్కుపుటాల్లోంచి వేడి సెగలు చిమ్ముతున్నాయి. కళ్లలో నీటి తడి. ఆ స్థితిలో అతన్ని చూసి కృష్ణమూర్తి పెదవి విప్పడానికి సాహసించలేకపోయాడు. ఇద్దరూ మౌనంగా ఇంటికి తిరిగి వచ్చారు. వరండాపై ఉన్న కుర్చీలో సూర్యం వాలిపోతే కృష్ణమూర్తి లోపలి కెళ్ళాడు

తలపై చేతులుంచుకుని అలాగే కూర్చున్నాడు సూర్యం వెంటనే ప్రయాణమై ఊరికి బయలు దేరిపోతే బాగానే ఉండునని పదేపదే అను కుంటున్నాడు

వీధి గుమ్మానికి ఎదురుగా మట్టిరోడ్డు ఓ పక్కగా గోలీలాడుకుంటున్నారు ఇద్దరు పిల్లలు.

తమ్ముడ్ని పిలవడానికని వచ్చింది కాబోలు ఆరేళ్ల పిల్ల ఆ సంగతి మర్చిపోయి ఆట ధ్యాసలో పడిపోయింది. ఎర్ర చుక్కల పరికిణీ చిన్న నోరు చురుకైన చూపులు వాళ్ళు అరుంధతి పిన్నిపిల్లలు తన రక్తం పంచుకు పుట్టిన చెల్లెలు తమ్ముడు అని గుర్తించగానే అతని ఒంట్లో రక్తం ఒక్కసారిగా పొంగింది. ఎవరికీ కనిపించకుండా ఎవరితో మాట్లాడకుండా అక్కణ్నుంచి పారిపోవాలన్న

కోర్కె బలంగా కలిగింది.

"బాబూ! నేను సాంబయ్యని గుర్తున్నాను" తలపాగా కట్టుకుని అతివినయంగా నిలబడిన మనిషి ఇదివరకు తమ ఇంట్లో పాలేరుగా పని చేశాడు.

గుర్తుండకేం ఎలా మర్చిపోతాడు. సాంబయ్య భుజాలపై ఆడుకునే వాడు. వడదెబ్బ కొట్టిన వాడికి చల్లని చిరుగాలి సోకినట్టు ప్రాణం లేచొచ్చింది.

"బాగున్నారా" అని అతని కుటుంబ క్షేమ సమాచారాలడిగాడు.

"ఏం చెప్పమంటావులే బాబూ. మా ఇంటిది కాలం చేసింది. అప్పట్నుంచి కోడీలు గంజినీళ్ళు కూడా పోయనంటది. పెద్ద వయసొచ్చినా కూలి చేసుకోక తప్పడం లేదు" అని కూలబడ్డాడు.

సూర్యం ఎక్కడ ఉద్యోగం చేస్తున్నాడో ఎంత మంది పిల్లలో అతని భార్య ఎలా ఉంటుందో అన్ని వివరాలు కనుక్కున్నాడు.

అయితే ఇక్కడ పొలం అమ్ముకుని ఊరితో సంబంధం పూర్తిగా తెంచేసుకుంటారన్నమాట. ఇంక మళ్లా వస్తారో రారో. సాంబయ్య దిగులు పడుతుంటే సూర్యం అతి మెల్లగా అన్నాడు.

"ఇక రాకూడదనే నా ఉద్దేశం సాంబయ్యా" అతడు ఉలిక్కపడినట్లుగా చూశాడు.

"ఏవిటీ....." ఏదో గొణుక్కుంటున్నట్టు

"ఊరివాళ్ళ మాటలు మీదాక వచ్చాయన్న మాట' అన్నాడు తల నిమురుకుని.

ఎందుకు రావు సాంబయ్యా, మానాన్న ఎంత పరువుగా బ్రతికాడో ఆ ఇంటిని నమ్ముకుని పనిచేశావు నీకు తెలుసు. మాది ఎంత సదాచార వంశమో ఇక్కడ ప్రతిగడపకి తెలుసు. నేనిప్పుడు తలెత్తుకోలేని స్థితిలో ఉన్నానంటే కారణం నానోటితో చెప్పనక్కరలేదు. నేనిక్కడ గంటసేపు ఉండలేక పోతున్నాను. సిగ్గుతో అవమానంతో ప్రాణం చచ్చిపోతోంది. ఒక్కటే సందేహం . ఇన్ని ఛీత్కారాలు వెక్కిరింపుల మధ్య ఆవిడ ఎలా ఉండగలుగుతోందా– అని"

పిల్లల్ని పిలవడానికి అటు వేపుగా వచ్చిన అరుంధతిని చూసి కావాలనే చివరి మాట బిగ్గరగా అన్నాడు సూర్యం

"ఆడదానికి ప్రాణంకన్నా విలువైనది శీలం కాదంటావా, అదీ లేనప్పుడు బ్రతికీ ప్రయోజన మేముంది?" అందులో ధ్వనించిన ఆగ్రహానికి సాంబయ్య కొద్దిగా బెదిరాడు.

సూర్యం మాట వినిపించి కాబోలు ఒక్కసారి వెనక్కి నిర్వేదంగా . చూసి పిల్లల్ని తీసుకుని ఇంట్లోకి వెళ్లిపోయింది అరుంధతి. ఆ చూపుల్లో ఎటువంటి భావం స్ఫురించ లేదు సూర్యానికి పైగా ఆవిడ తన ఉనికిని ఏమాత్రం ఖాతరు చేసినట్టుగా లేదు. తన ఇంట్లో సకల మర్యాదలు అందుకోవలసిన స్థానంలో ఉండి ఇలా దిక్కు లేనివాడిలా స్నేహితుని పంచన తల దాచుకున్నాడు. కనీసం ఆ బాధ కూడా ఆమె వదనంలో ప్రతి ఫలించలేదు.

రోజూ కనిపించే సాంబయ్య వైపు ఎలా చూసిందో తనవైపు అదే విధంగా నిరాసక్తంగా......

అందులో అర్థం సూర్యానికి అంతుపట్టలేదు. దూషణలకి తిరస్కారాలకి అతీతంగా అతి ప్రశాంతంగా ఉంది ఆమె ముఖం.

లోకమంతా కట్టగట్టుకుని నిందించినా చలించదేమో.

తండ్రి ఆమెను వివాహం చేసుకున్న తర్వాత ఆమెతో కలసి రెండు మూడు రోజులు ఆ ఇంట్లో ఉన్నాడతను అంతే.

ఇద్దరిదీ దాదాపు ఒకటే వయస్సు కావడం ఆవిడను చూడాలంటే బిడియపడే వాడు. దానికి తోడు అరుంధతి ఎప్పుడు తలుపు చాటునే ఉండేది.

నేత చీర కొంగు పొడుగాటి వాలుజడ ఆమె ఉందనడానికి సంకేతాలు. పెదవి విప్పి ఆమె మాట్లాడటం అతను వినలేదు. సాధారణంగా ఏ స్త్రీలోను కనిపించని విశిష్టత అరుంధతి పిన్నిలో ఉంది. ఆమె అంటే ఆరాధనా భావం అతనిలో చోటు చేసుకుంది.

ఇప్పుడో దానిస్థానే జుగుప్స లోకంలో అందరూ ఆలోచించే రీతిలో ఆమె పై రాళ్ళు రువ్వే ప్రవృతిలో నే అతడు పయనిస్తున్నాడు.

పొలం వ్యవహారం దాదాపు సెటిల్లై పోయినట్టే. ముందు కాసేపు లౌక్యంగా బేరాలు సాగించినా చివరికి నలభై వేలకి ఒప్పుకున్నాడు. మునసబు కొడుకు . సగానికి సగం నష్టం వస్తున్నా భరించాడు సూర్యం.

రాత కోతల సమయంలో మునసబు కొడుకు అలవోకగా అన్నమాట ముల్లులా అతని మనసుని గాయపర్చింది.

మీనాన్నకి జబ్బు చేసినప్పుడు కొంత పొలం అమ్మారు చూశాలే. అరుంధతమ్మ తన వంతు అమ్మి భర్తకి వైద్యం చేయించింది కానీ నీ ఆస్తిలో కానీ ముట్టుకో లేదోయ్ తమ్ముడూ. అప్పుడావిడ కాస్తంత తెలివి తేటలు చూపించి ఉంటే నువ్వు అమ్మడానికి నీ వాటా అసలు మిగలక పోను " ఎందుకని అలా చేసిందో ఉమ్మడిగా ఉన్న భూమి అమ్మితే మాత్రం కాదనడానికి తన తరపున ఎవరున్నారు. కేవలం ఆవిడ వంతు వచ్చిన ఆస్తితోనే తండ్రికి వైద్యం చేయించిందంటే. ఏమో ఎంతవరకు నిజమో . ఆ విషయం అంతటితో వదిలేసి ఊరుకున్నాడు.

ప్రయాణానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నాడు.

సాయంత్రం ఏరువంక బయలు దేరారు స్నేహితులిద్దరూ.

సూర్యం ఆ ఇంటి గుమ్మం దాటబోతూ ఎందుకో ఆగిపోయి పరిశీలనగా చూశాడు. ఆ ఇంట్లో తిరుగాడిన రోజులు మనసుని ఒక్క ఊపు ఊపగా భారంగా నిట్టూర్చాడు.

వీధిలో సన్న జాజి పందిరి గేటుదాటి లోపలికి వెడితే దూరంగా పెరటివైపు మెట్ల మీద కూర్చుని బియ్యం ఏరుకుంటోంది. అరుంధతి.

చటుక్కున తలవంచుకుని గబగబా నడిచాడు.

ఏటి వడ్డున కూర్చున్నారు.

కృష్ణమూర్తి చాలాసేపు మాట్లాడ లేదు. అతనేదో తీవ్రంగా ఆలోచిస్తున్న ధోరణి కనపడింది. ఎంతో ముఖ్యమైన విషయమైతే తప్ప అతను అంత సీరియస్‌గా ఉండడు.

అయినా ఇక చెప్పేదేముంది. కృష్ణమూర్తి బహుశ మరోసారి గుర్తు చేస్తాడు వెంకట్రాయ నాయుడుతో పిన్ని రాసలీలలు వర్ణిస్తాడు.


సూర్యం అన్నిటికి సిద్ధపడినట్టే గడ్డి పరకలు పెరుకుతున్నాడు.

"సూర్యం" హఠాత్తుగా కృష్ణమూర్తి గొంతు పలికింది.

"మీ పిన్నితో నీకు ఎంత పరిచయం ఉంది?"

"ఏమో ఓ నాలుగు రోజులు అక్కడ ఆ ఇంట్లో ఉన్నానేమో, అప్పుడావిడ పన్నెత్తి పలకరించిందే లేదు" గుర్తు చేసుకుంటూ అన్నాడు.

"అవునా. అరుంధతి నాకు ఎన్నేళ్ళుగా



సప్త రాగాలలో రామాయణాన్ని నిక్షిప్తం చేసిన స్వాతి తిరునాళ్

కీర్తనల రచనలో మణిప్రవాళ సాహిత్యాన్ని ప్రవేశ పెట్టిన ఘనత శ్రీ స్వాతి తిరునాళ్ మహారాజాది.

ఈయన రామాయణాన్ని సప్తరాగాలలో, పొందుపరిచి రచించారు. సంస్కృతాంధ్ర మళయాళ భాషలు కలిసిన ఈ రాగమాలిక చిట్టస్వరాలతో కూడి ఎంతో పేరుగాంచింది.

అయితే స్వాతి తిరునాళ్ మహారాజుకీ, ఆయన వచనకూ బహుళ ప్రజాదరణ లభింపజేసిన గాయని శ్రీమతి ఎం. ఎస్. సుబ్బలక్ష్మి. రసజ్ఞులు చాలామంది ఈ ఎల్. పి.ని విని ఉండవచ్చును.

ఈయన గొప్ప కళాపోషకుడు. నాట్యాచార్యులనూ, హిందూస్థానీ, కర్ణాటక విద్వాంసులనూ, శిల్పులనూ ఈయన ఆదరించారు. ఈయన ఆయుర్దాయం ముప్పయి నాలుగు సంవత్సరాలు (1813– 1847). వీరు పరిపాలించినది (తిరువాన్కూరు 1829 నుండి 1847) కొద్ది సంవత్సరాలు. ఆ కాలంలో ఈయన ఆస్థానం కవిపండిత గాయకులతో కలకలలాడుతూ ఉండేది. ఆయన మాతృభాషలో (మళయాళం) ఎక్కువ రచించినా, సంస్కృతంలో నూ, తెలుగులో నూ కూడా అనేక రచనలు చేశారు.

ఈయన ఇలవేల్పు పద్మనాభస్వామి. కమలనాభ, పద్మనాభ అన్న ముద్రతో రచనలు సాగాయి. సంస్కృతంలో హరికథలు కూడా రచించారు.

జయదేవుని బాణీని కొంత అనుసరించి, పద్మనాభస్వామిపై రచనలు చేశారు.

జన్మతః అన్యభాషకు చెందినా, అనేక దేవతామూర్తులను వర్ణించినా, రామాయణాన్ని ఐదు రాగాలలో క్లుప్తంగా మనోరంజకంగా రచించారు. రామాయణంలో చివరగా మధ్యమావతిలో కలితవర సేతుబంధం, ఇలతపమపి బృందదళం, అతిక్రూర దశకంఠ, విదారం అతిధీరం" అనే చక్కని ప్రాసతో రచించారు. వాగ్గేయకారుడే గాక లక్షణగ్రంధకర్త కూడా. గేయములలో యమకములు, ఆదిమధ్యానుప్రాసలు విపరణ చేస్తూ వ్రాశారు.

నాట్యానికి అనువుగా పదవర్ణాలు వ్రాశారు. ఈనాడు నాట్యం నేర్చేవారు ఎక్కువగా ఉన్నారు. అయితే పదవర్ణాన్ని అభినయిస్తేనే ప్రజ్ఞ కనబడుతుంది. భరతాచార్యులైన వడివేలును హెచ్చువే తనమిచ్చి, ఆయన సలహా సంప్రదింపులతో వర్ణములు రచించి నాట్యకళకు దోహదం చేశారు. జీవించినది కొద్ది కాలమైన హంసలా జీవించిన ధన్యజీవి.

–కె. నాగేశ్వరి

తెలుసో చెప్పమంటావా. అయిదేళ్ళ పిల్లగా ఉన్నప్పట్నించీ ఆమెను నేను ఎరుగుదును. మా అమ్మమ్మగారి ఊరేగా వాళ్ళది. వాళ్ళ నాన్న పెద్ద పండితుడు. పట్టుబట్టి తండ్రి దగ్గర వేదం నేర్చుకుంది. సంస్కృతంలో శ్లోకాలు గడగడా చెప్పగలదు. పురాణాలన్నీ పుక్కిట పట్టింది. పేదరికం రెండో సంబంధాన్ని ముడిపెట్టించినా కిమ్మనలేదు. పెళ్ళయింది మొదలు ఏనాడూ భర్తని తప్ప మరో మగవాడిని కన్నెత్తి చూసింది లేదు. అలాంటి ఉన్నతమైన స్త్రీని మనం ఎక్కడా చూడలేం సూర్యం. చాలామంది మామూలుగా ఉంటారు కానీ ఆ ప్రత్యేకమైన వ్యక్తిత్వం చాలా అరుదు. ఏ ఇంటికి వెళ్ళాలన్నా భయపడేది భర్త పోయాక ఆమె జీవితం దుర్భరమై పోయింది. మగవాళ్ళు కోరచూపులతో వెంటాడితే ఆడవాళ్ళు తమకేదో అన్యాయం జరిగిపోతోందని భావించుకుని ఆమెను శత్రువుకన్నా హీనంగా పరిగణించి

అమ్మ

చూపులతోనే చిత్రహింసలు పెట్టేవారు గత్యంతరం లేని పరిస్థితిలో వెంకట్రామ నాయుడిని అంగీకరించింది ఎందుకు తన జీవితం కరిగిపోయినా పిల్లలకింత తిండి అసరా దొరుకుతాయి. తనేమైనా ఫరవాలేదన్న నిశ్చయానికి వచ్చింది. నాయుడి భార్య రోగిష్టిది. ఆవిడ ఇదివరకే మొగుణ్ణి రెండో పెళ్ళి చేసుకొమ్మని పోరు పెట్టింది. పిల్లలు లేని నాయుడికి అరుంధతి నడి సముద్రంలో కొట్టుకు పోతున్న వాడికి నావలా కనబడింది. ఆమె పిల్లల్ని పెంచి పెద్ద చేసే భారం తనపై వేసుకున్నాడు. ఆమె కేలోటు రాకుండా చూస్తున్నాడు.

"సూర్యం వాళ్ళు కేవలం వ్యామోహంతో శారీరకమైన కోర్కెలతో దగ్గర కాలేదు. ఒకరి నుండి మరొకరికి ఓదార్పు స్వాంతన లభించాయి. బ్రతకడానికి అరుంధతికి ఓ నీడ దొరికింది. భవిష్యత్తు మీద అతనికో ఆలంబన చిక్కింది. ఇద్దరూ వేదనతో వేసారి పోతున్న తమ జీవితాలకు ఓ అర్థం కల్పించు కున్నారు. సునిసత మైన ఈ విషయాన్ని సహృదయతతో ఎవరు అవగాహన చేసుకుంటారు. వాళ్ళు నీచులు అని తేలికగా ముద్ర వేసి వెలివేస్తారు తప్ప సవ్యంగా ఆలోచించిన వారేరి.

అరుంధతి పడిన కష్టాలు కళ్ళారా చూశాను కనుక నిజానిజాలు నాకు తెలుసు" ఆవేశంతో కృష్ణమూర్తి కళ్ళు చెమ్మగిల్లాయి.

చిత్తరువులా కూర్చుని వింటున్నాడు సూర్యం. అతని కళ్ళు ముందు తెరలేవో కరగి పోతున్నాయి. ఒక మాతృమూర్తి మహోన్నత రూపం కళ్ళముందు సాక్షాత్కరించ సాగింది.

"ఇంకో మాట సూర్యం. అరుంధతి పై అంతరాంతరాల్లో నాకెందుకింత శ్రద్ధ నీకు నచ్చచెప్పి ఆమె అంటే ఉన్నదురభిప్రాయం తొలగించాలని నేనెందుకింత తపన పడుతున్నానో చెప్పమంటావా."

కృష్ణ మూర్తి కళ్ళలో నీటి పొరలు కదిలాయి.

"ఆమెను చిన్నప్పట్నుంచి విపరీతంగా అభిమానించాను. అంతకు మించి ఆరాధించాను. ఆమెను జీవిత భాగస్వామినిగా చేసుకోవాలని ఎంతో ఉవ్విళ్ళూరాను. కానీ నా చదువు పూర్తయి ఉద్యోగంలో స్థిరపడే సరికి ఆమె మరొకరి స్వంతమై పోయింది. ఆదెబ్బ నుండి ఓ పట్టాన కోలుకో లేకపోయాను. భర్త పోయి పిల్లలతో అరుంధతి అవస్థ పడుతుంటే చేతనైన సాయం చేయాలని నా మనసు కొట్టుకు పోయేది. కానీ లోకానికి దడిసి ఆగిపోయాను."

అతని గొంతు వణికింది. సూర్యం ఆర్ద్రంగా స్నేహితుని చేయి నొక్కాడు.

కృష్ణా నువ్వింత వివరంగా చెబితే గాని నాకళ్ళ పొరలు విచ్చుకోలేదు.

పిన్నిపై ఉన్న అపోహలన్నీ చెదరగొట్టి నా మనసును స్వచ్ఛంగా చేశావు. ఇప్పుడు ఆవిడ పాదాలపై పడి క్షమాపణ అడిగినా చేసిన పాపం పోదేమో."

కృష్ణమూర్తి ఎంత బతిమాలినా పిన్నిని కలుసుకోడానికి మొహం చెల్లలేదు సూర్యానికి.

కానీ కృష్ణమూర్తికి చెప్పవలసిందంతా చెప్పి తేలికపడిన గుండెతో రైలెక్కాడు సూర్యం.

ఆ సంతోషం ఎన్నో రోజులు నిలవలేదు.

నాగపూర్ వచ్చిన నాలుగు రోజులకి అతనికో నీలిరంగు కవరొచ్చింది.

కృష్ణమూర్తి వ్రాశాడు.

"సారి సూర్యం. మీ పిన్నిని నేనెంతో బ్రతిమాలాను. సూర్యం సంతోషంతో వ్రాసిస్తున్నాడు వాళ్ళ తమ్ముడికి చెల్లెలికి తన పొలాన్ని అని నచ్చచెప్పడానికి ఎంతో ప్రయత్నించాను. కానీ ఆవిడ ఒప్పుకోలేదు. అయాచితంగా వచ్చింది తీసుకోవడం తనకిష్టం లేదంది. ఆ అభిమానధనం ఆవిడ వ్యక్తిత్వానికి మరో కలికి తురాయి కదూ కృష్ణమూర్తి." □



ఆ సున్నితమైన అనుభవం మిమ్మల్నొక్క నిట్టూర్పులో ఆఘమేఘాల మీదుంచుతుంది

పొగమంచుకన్నా పల్చన, ఎగిరే ఈకకన్నా తేలిక, అదే మీరు కోరే నిశ్చింత నిస్తుందిక. డ్యూరెక్స్ ఫెదర్ లైట్ అంతఃరరాష్ట్రీయ కాండోము లిప్పుడు ఇండియాలో లభిస్తున్నాయి.

ప్రపంచానికి తెలిసిన అతి తేలికైన, సున్నితమైన సంరక్షతను తెలిసికొనడానికి మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాము.

అతి పల్చనిది

డ్యూరెక్స్ ఫెదర్‌లైట్

ఇది జగమెరిగిన గొప్ప అనుభవం.


[redacted]

MAA (S) LRDF 1A TEL 85

"నాకు నచ్చిన వ్యక్తి"


ఆంధ్రసచిత్రవారపత్రిక


వ్యాస రచన పోటీ



మొదటి బహుమతి : పోర్టబుల్ బ్లాక్ అండ్ వైట్ టి.వి.

రెండవ బహుమతి మిక్సర్





మూడవ బహుమతి : పెద్ద సూట్‌కేస్

ప్రత్యేక బహుమతులు 3 హెచ్.ఎం.టి. చేతి గడియారాలు



నిబంధనలు

1. ఆంధ్ర సచిత్ర వారపత్రిక పాఠకులందరూ ఈ పోటీలో పాల్గొనవచ్చు. ఆంధ్రపత్రిక సంస్థలోని ఉద్యోగులు, వారి బంధువులు ఈ పోటీలో పాల్గొనరాదు.

2. వ్యాసంలో మీకునచ్చిన వ్యక్తిగా ఇప్పుడు జీవించి ఉన్న వారిలో ఎవరినైనా పేర్కొనవచ్చు.

3. వ్యాసం ఒక అరఠావు (సుమారుగా 17×29 సెం.మి) మించరాదు. కాగితానికి ఒకవైపే సిరా లేదా బాల్‌పెన్‌తో రాయాలి.

4. ఈ పేజీలలో ఇచ్చిన ప్రశ్నావళి, కూపన్‌లని పూర్తి చేసి వ్యాసంతో పాటు విధిగా పంపాలి. వ్యాసం రాయనివారు కూడా ప్రశ్నావళి పూర్తి చేసి పంపవచ్చు.

5. పోటీకి పంపిన వ్యాసాలని ఎటువంటి సందర్భంలో నూ తిప్పి పంపటం సాధ్యంకాదు. కాబట్టి వాటితోపాటు స్వంత చిరునామాకల, స్టాంపులు అంటించిన కవర్లు జతపరచవద్దని కోరుతున్నాము.

6. గడువుతేదీ 31-5-1986 ఆ తర్వాత అందిన వ్యాసాలు పరిశీలింపబడవు.

7. ఈ పోటీలో తుది నిర్ణయం సంపాదకునిదే. పోటీలో పాల్గొనే వారంతా దానికి బద్ధులై ఉండాలి. దీని విషయమయి ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు.

8. పోటీకి పంపే వ్యాసాలని సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వారపత్రిక, గాంధీనగరం, విజయవాడ-520003 అన్న చిరునామాకి పంపాలి. కవరుమీద "నాకు నచ్చిన వ్యక్తి వ్యాసరచన పోటీకి" అని స్పష్టంగా రాయాలి.

పాఠకులందరూ ఈ పోటీలో ఉత్సాహంగా పాల్గొని దీనిని జయప్రదం చేయవలసిందిగా కోరుతున్నాము.

—సంపాదకుడు

ప్రశ్నావళి

ముగింపు తేదీ : 31–5–198

1. నాకు ఎక్కువ నచ్చిన శీర్షిక ____________________

2. కథలు	చదువుతాను	☐	చదవను	☐
3. సీరియల్ నవలలు	చదువుతాను	☐	చదవను	☐
4. సినిమా శీర్షిక	చదువుతాను	☐	చదవను	☐
5. న్యూఢిల్లీ లేఖ	చదువుతాను	☐	చదవను	☐
6. హైదరాబాద్ నోట్‌బుక్	చదువుతాను	☐	చదవను	☐
7. బొమ్మల కథ	చదువుతాను	☐	చదవను	☐
8. వారఫలాలు	చదువుతాను	☐	చదవను	☐
9. ప్రశ్నావళి	చదువుతాను	☐	చదవను	☐
10. డాక్టర్ సలహాలు	చదువుతాను	☐	చదవను	☐
11. ధర్మపథం	చదువుతాను	☐	చదవను	☐
12. కార్టూన్‌లు	చూస్తాను	☐	చూడను	☐
13. కవిత	చదువుతాను	☐	చదవను	☐
14. ఉత్తరాలు	చదువుతాను	☐	చదవను	☐
15. సినిమా శీర్షికలో సినిమా ప్రముఖులతో ఇంటర్వ్యూలు	ఉండాలి	☐	ఉండనక్కరలేదు	☐
16. వ్యాసాలు	చదువుతాను	☐	చదవను	☐
17. ఆంధ్ర సచిత్ర వారపత్రికకి లేఖలు	రాస్తాను	☐	రాయను	☐
18. ఆంధ్ర సచిత్ర వారపత్రిక నాకు సక్రమంగా	అందుతోంది	☐	అందటంలేదు	☐
19. నేను ఆంధ్రసచిత్ర వార పత్రికని తెప్పించేది	ఏజెంటుద్వారా	☐	పోస్టుద్వారా	☐
20. నేను ఆంధ్రసచిత్రవార పత్రికని ప్రతివారం షాపులో కొంటాను	అవును	☐	కాదు	☐

(తగిన విధంగా ఆయా గడులలో ✓ గుర్తు పెట్టండి)

- - - - - - - - - - - - - - - - - - - -

కూపన్

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

"నాకు నచ్చిన వ్యక్తి"

వ్యాస రచన పోటీ

వ్యాసం రాసిన వారి పేరు :..............................

పూర్తి చిరునామా :..............................


....

....

....

kasi

"నేను స్క్వాష్‌లూ, సిరప్‌లూ మానేసి రుచికరమైన రస్న వాడటం మొదలెట్టాను... అంతే, ఇక రికరింగ్ డిపాజిట్ ఎకౌంటు కూడా తెరిచాను!"



మొదట్లో నేను సాఫ్ట్ డ్రింక్స్‌కు ఎంతో డబ్బు అనవసరంగా ఖర్చు పెట్టేదాన్ని. మరి ఇంట్లో ప్రతి ఒక్కరికీ కావాలాయె—ప్రతి నెలా ఎంతో ఖర్చయ్యేది. కాని, రుచికరమైన రస్న గురించి నాకు తెలిసాక, ఇప్పుడు ఆ వృధా ఖర్చు మరి లేదు.

పౌడరు, ద్రవ రూపాల్లోని



రెండు కాన్సంట్రేట్ల మేళవింపు దీని ప్రత్యేకత.

అవును, రుచికరమైన రస్నలోని గొప్పతనం అదే. ఎంతో పొదుపైనది, పైగా, ఎంతో రుచిభరితమైనది రస్న. ఎందుకంటే విడివిడిగా వచ్చే రెండు కాన్సంట్రేట్ల మేళనంతో తయారయ్యేది ఇదొక్కటే. పౌడరు ద్రవ రూపాల్లోని రెండు కాన్సంట్రేట్ల మేళవింపు వల్ల, అసలైన కమ్మని రుచి అలాగే నిలిచి మరింత పసందుగా ఉంటుంది. తక్కువ ఖర్చుతో ఎంతోమందికి పానీయం అందించవచ్చు—ఒక్కొక్క ప్యాక్‌తో 32 గ్లాసుల చవులూరించే పానీయం తయారవుతుంది మరి. పైగా, ఎంచుకొనేందుకు 10 రకాల చక్కటి రుచులు!

ఫలితంగా, రుచికరమైన రస్నతో ఇంటిల్లిపాదీ మరింత కమ్మని పానీయాలు తాగవచ్చు. తక్కువ ఖర్చుతో ఎక్కువ మజా, ఎంతో ఆదా! అలా ఆదా అయ్యే డబ్బుని రికరింగ్ డిపాజిట్ ఖాతాలో వెయ్యవచ్చు—ప్రతి నెలా. కొద్ది నెలల్లోనే ఆ డబ్బుతో మీరు ఓ కొత్త ప్రెషర్ కుక్కర్ కొనుక్కోవచ్చు, లేదా ఇంకేదైనా వస్తువు కొనుక్కోవచ్చు. ఏమంటారు?



రస్న రుచిభరితం. కేవలం పౌడర్ కన్నా ఎంతో రసమయం.

Mudra A PI 2973 TEL

సినిమా విశేషాలు

— జి.వి.జి.

మేలో నే "ఖైదీ రుద్రయ్య"

కృష్ణ, శ్రీదేవి జంటతో ఎ. కోదండరామిరెడ్డి దర్శకత్వంలో టి. త్రివిక్రమరావు నిర్మించిన విజయలక్ష్మీ ఆర్ట్ పిక్చర్స్ వారి పై చిత్రంలో జస్టిస్ యశోధరాదేవిగా శారద ఒక కీలకమైన పాత్రను నిర్వహించారు. సత్యనారాయణ, రావు గోపాలరావు, శ్రీధర్, గిరిబాబు, నూతన్ ప్రసాద్, గుమ్మడి, చలపతిరావు, వరలక్ష్మి, శ్రీలక్ష్మి, అనూరాధ, స్మిత పాల్గొన్నారు. పరుచూరి సోదరుల రచన, వేటూరి గీతాలు, చక్రవర్తి సంగీతం, ఎ. ఎస్. ఆర్. స్వామి ఛాయ, భాస్కరరాజు శిల్పం, సలీమ్–తార నృత్యాలు, విజయన్ సూపర్ సుబ్బరాయన్ సాహసాలు, డి. కోటేశ్వరరావు నిర్మాణత, కె. సదాశివరావు సంయుక్త దర్శకత్వం, వై. సత్యానంద్ సహకార దర్శకత్వం, కోటగిరి వెంకటేశ్వర రావు కూర్పుతో టి. ప్రద్యుమ్నరావు సహనిర్మాత.

చిత్రీకరణ ముగిసిన "ఆది దంపతులు"

"కన్నబిడ్డలు, ఆ తర్వాత వారి సంతతి గురించి ఇలా అహర్నిశలూ తమ యావచ్ఛక్తినీ ధారపోసిన ఓ ఇంటికి పెద్దవారయిన ఆదిదంపతులను వార్ధక్యంలో ఆదుకునే వారెవరైనా ఉంటారా అనే. పాతిపదికపైన అల్లబడిన గుండెలను పిండే కథ. కొన్ని క్లిష్టమయిన పాత్రలను పోషించడంలో, తనకు తానే సాటి అని నాగేశ్వరరావుగారు మరోమారు నిరూపించారి చిత్రంలో. అలాగే జయసుధ కూడా. మార్చి 21 నుంచి 31 వరకూ జరిగిన షెడ్యూల్‌తో పాచ్ వర్క్ తప్ప దాదాపు షూటింగంతా పూర్తయినట్లే," అన్నారు దాసరి నారాయణరావు, ఈయన స్క్రీన్‌ప్లే, మాటలు, పాటలు, దర్శకత్వంలో నితిన్ డి. కపూర్ నిర్మించిన జె. ఎస్. కె. కంబైన్స్ వారి పై చిత్రంలో చంద్రమోహన్, నరేష్, త్రినాధ్, సత్యనారాయణ, వేలు, పూర్ణిమ, తులసి, సంయుక్త, రాజ సులోచన ఇతర పాత్రధారులు. భీశెట్టి కథ, సత్యం సంగీతం, సెల్వరాజ్ ఛాయ, బి. చలం శిల్పం, రవికుమార్ సహ దర్శకత్వం, అరవింద్ - శ్రీనివాస్ ప్రొడక్షన్, కృష్ణ కూర్పుతో జయసుధ సమర్పిస్తారి చిత్రాన్ని.

దాసరి రచన, దర్శకత్వంలో "ధర్మపీఠం దద్దరిల్లింది"

"స్వార్థపరులైన రాజకీయవాదుల కబంధ హస్తాలలో నలిగిపోతున్న న్యాయం, సత్యం, ధర్మాలను పరిరక్షించడానికి రేపటి ఉత్తమ పౌరులుగా నేటి బాలలను తీర్చి దిద్దే అపూర్వమైన ఉపాధ్యాయుని పాత్రలో శోభన్‌బాబు, మానవత్వానికి అద్దంపట్టే కాబూలీవాలా పాత్రలో సత్యనారాయణ విజృంభించారు," అన్నారు దాసరి నారాయణరావు: ఈయన రచన, దర్శకత్వంలో కోగంటి కేశవరావు నిర్మించే శ్రీ భ్రమరాంబికా ఫిలిమ్స్ వారి పై చిత్రంలో జయసుధ నాయిక. నాయికా నాయకుల కొడుకులుగా సుధాకర్, రాజా, చక్రవర్తి, కోడళ్ళుగా రాజ్యలక్ష్మి, పవిత్ర, నవ నటి కల్యాణి, ఇతర పాత్రలను ప్రభాకరరెడ్డి, గొల్లపూడి మారుతీరావు, రావి కొండలరావు, దేవి నిర్వహించారు. జె. వి. రాఘవులు సంగీతం, పి. శరత్‌బాబు ఛాయ, మోహన్ శిల్పం, సూరపనేని రాధాకృష్ణ - డిమిట్రావ్ సంయుక్త దర్శకత్వం, కె. ఎల్. ఎన్. శాస్త్రి - ఎస్. రామచంద్రరావు ప్రొడక్షన్, జి. జి. కృష్ణారావు కూర్పుతో బొడ్డు సత్తిరాజు సహ నిర్మాత.



"ఖైదీ రుద్రయ్య"లో కృష్ణ, శ్రీదేవి



"విజృంభణ"లో శోభన్‌బాబు, జయసుధ.

చిరంజీవి, జంధ్యాల కాంబినేషన్‌లో "చంటబ్బాయ్" రెండో షెడ్యూల్

"ఒక సంపన్నుని ఏకైక పుత్రుడు చంటబ్బాయ్ ఉనికి ఆయనకే తెలియక అన్వేషించవలసిందిగా డిటెక్టివ్ ఏకదంతంను నియమిస్తాడు. ఇంతలో ఆ చంటబ్బాయ్ నేనేనంటూ ముగ్గురు యువకులు వస్తారు.... ఇలా అనూహ్యమైన మలుపుతో మల్లాది వెంకటకృష్ణమూర్తి సమకూర్చిన కథలో చిరంజీవి, సుహాసిని అపూర్వంగా నటిస్తున్నారు. మార్చిలో రెండవ షెడ్యూల్ పూర్తిచేశాం," అన్నారు జంధ్యాల. ఈయన మాటలు సమకూర్చి, దర్శకత్వం వహించే జ్యోతి ఆర్ట్ పిక్చర్స్‌పై వారి చిత్రంలో చంద్రమోహన్, రాజేంద్రప్రసాద్, జె. వి. సోమయాజులు, వేలు, వీరభద్రరావు, అరుణ, శ్రీలక్ష్మి, గెస్ట్‌గా అల్లు రామలింగయ్య నటిస్తున్నారు. చక్రవర్తి స్వరకల్పనలో వేటూరి, సీతారామ శాస్త్రి గీతాలు రాశారు. లోక్‌సింగ్ ఛాయ, రంగారావు శిల్పం, రాజు సాహసాలు, శివశంకర్ నృత్యాలు, యు. వి. పాణి సహ దర్శకత్వం, మోహన్ ప్రొడక్షన్, గౌతంరాజు కూర్పుతో ఈ చిత్రాన్ని నిర్మించే భీమవరపు బుచ్చిరెడ్డి "ఏప్రిల్‌లో 5 రోజులు, మే 1 నుంచి 15, జూన్ 11 నుంచి 20 వరకు తదుపరి షెడ్యూల్స్." అన్నారు.



అమ్మాయిని చూస్తుంటే నా పుస్తకాల సంచీ గుర్తుకొస్తోంది మమ్మీ!

స్మితతో "తిరుగులేని తీర్పు"

"పలుకుబడిదారులకు సాక్ష్యం పాదాక్రాంతమై, ధర్మపీఠం గాడి తప్పినప్పుడు సామాన్యుడు దారుణంగా బలియై, తల్లడిల్లిపోతున్నాడు. అమాయకులకు న్యాయం రక్షణ కవచం కావాలి. ఈ అంశం ఆలంబనగా రూపొందిస్తున్న చిత్రం," అన్నారు ఎస్. రవీంద్రరెడ్డి. ఈయన స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో కె. శివారెడ్డి, ఇంతా వాసుదేవరెడ్డి నిర్మిస్తున్న ఎస్. కె. మూవీస్ వారి పై చిత్రం మొదటి షెడ్యూల్ మార్చి 20 నుంచి ఏప్రిల్ 1వరకు జరిగింది. తదుపరి షెడ్యూల్స్ ఏప్రిల్ 20 నుంచి మే 3, మే 19 నుంచి మే 30 వరకు. జూలై విడుదల. ఇందులో స్మిత, వినోద్, వేలు, పూర్ణిమ, ప్రసాద్‌బాబు, కోట శ్రీనివాసరావు, హరి ప్రసాద్, జీవా, సిలోన్ మనోహర్, రాజ్‌కుమార్, శశిమోహన్, యూన్స్, అనూరాధ, డిస్కో శాంతి పాల్గొంటున్నారు. మాటలు : పూసల, పాటలు : ఆత్రేయ, ఆదిత్య, సంగీతం : రాజ్ కోటి, ఛాయ : బాబూరావు, శిల్పం : చలం, సాహసాలు: జూడో రత్నం, సహకార దర్శకత్వం : విఠల్, సహాయ దర్శకత్వం : గురజాల, భాస్కరరాజు, రాజశేఖర్. ఈ చిత్రం ద్వారా చిత్ర అనే ప్రముఖ తమిళ, మలయాళ నేపథ్య గాయని పరిచయం గావింపబడుతుంది.



క్రొత్తది!
SUPER FRESH
SUPER FRESH
ఈ రోజును
సూపర్ ఫ్రెష్ రోజుగా చేసుకోండి.
కొండలోయల పుష్పాల పరిమళంతో
సూపర్ ఫ్రెష్ సహజమైన హాయనిపించే సుఖానుభూతిని
చేకూర్చే సుగంధ భరిత క్రొంగొత్త సబ్బు. మీచర్మానికి మృదుత్వాన్ని
చేకూర్చి మీకు ఉల్లాసాన్ని కొనితెస్తుంది
అందుకే కొద్దిగా తాజాదనాన్ని జల్లుకోండి,
ఈ రోజును సూపర్ ఫ్రెష్ రోజుగా తీర్చుకోండి
An Eskayef Product
6949/TL

నటుడు, కథకుడు, దర్శక నిర్మాత

ఎం. బాలయ్య

"మనం సినిమాలు తీస్తున్నది ఎవరి కోసం- అని ప్రశ్న వేసుకుంటే, ప్రజల కోసం అనే సమాధానం వస్తుంది. ఇది ఎందుకు చెబుతున్నానంటే, మన తెలుగు ప్రేక్షకులను మెప్పించడం అంత తేలికకాదు. సామాన్య ప్రజలకు అందుబాటులో ఉన్న ఏకైక సాధనం- సినిమా. ఎలాంటి సమస్యలూ, చికాకులతో సతమతమవుతూన్నా సగటు మనిషి సినిమా మాత్రం చూస్తాడు- కాస్త రిలీఫ్ కోసం. అలాంటప్పుడు చాలా సీరియస్‌గా ఉన్న కథలు కాకుండా కాస్త ప్రయోజనం ఉన్న కథను- మానవత్వంలోని విలువలకు ప్రాధాన్యత ఇస్తూ వినోదభరితంగా చెప్పాలని, అలా చెప్పడమే సబబు అని నా ఉద్దేశం," అనే మన్నవ బాలయ్య బి. ఇ., నటుడు, కథకుడు, దర్శక నిర్మాత అన్న విషయం అందరికీ విదితమే.

ఈయన బి. ఇ. (మెకానికల్) పట్టా పుచ్చుకున్నాక మద్రాసు "సెంట్రల్ పాలిటెక్నిక్"లో, కాకినాడ "ఆంధ్ర పాలిటెక్నిక్"లో లెక్చరర్‌గా పని చేశారు. మద్రాసు సమీపంగా ఉన్న తిరువొత్తియూర్‌లోని కె. సి. పి. లిమిటెడ్ సంస్థలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా పని చేశారు. ఈయన మద్రాసు (గిండీ) ఇంజనీరింగ్ కాలేజీలో చదువుకునే రోజుల్లో ఆ కాలేజీ వార్షికోత్సవాలలోని నాటకాలలో తరచు నటించేవారు. ఆ నాటకాలను కీ. శే. తాపీ చాణక్య డైరెక్ట్ చేసే వారు. తాపీ చాణక్య ప్రోత్సాహంతో నే సారథి వారి "ఎత్తుకు పై ఎత్తు" చిత్రంలో హీరోగా సినిమా రంగంలో ప్రవేశించారు. కొంత కాలానికి అమృతా ఫిలిమ్స్ సంస్థను నెలకొల్పారు.

"మీ సొంత చిత్రాలకు మీరే కథలు తయారు చేసుకుంటారు. ఇందుకు ప్రేరణ ఏదైనా ఉందా?" అని అడిగాను.

"అసలు నేను సినిమా నటుడ్ని అవుతానని కలలో కూడా ఎలా అనుకోలేదో అలాగే కథకుడ్ని అవుతానని కూడా అనుకోలేదు. కొన్నేళ్ళ క్రితం ఒక విచిత్రమైన సంఘటన గురించి విన్నాను. దానిని ఒక కథగా అల్లితే ఎలా ఉంటుంది- అనిపించింది. కొన్ని పేజీలు తయారు చేశాను. ఇంతలో అప్పుడు వెలువడుతూన్న "తుఫాన్" అనే పత్రికా సంపాదకులు నన్ను చలన చిత్ర పరిశ్రమ మీద ఏదైనా ఆర్టికల్ ఇమ్మని అడిగారు. "ఆర్టికల్ కన్నా- కావాలంటే ఒక కథ ఇస్తాను, అని నేను తయారు చేస్తున్న కథను టూకీగా వినిపించాను. ఆయనకు చాలా నచ్చింది. సీరియల్‌గా వేసుకుంటా నన్నారు- ఆయన ప్రోద్బలం మీద పది సంచికలకు రాశాను. దాన్ని పాఠకులు మెచ్చుకుంటూ రాసిన ఉత్తరాలను కూడా ఆ పత్రికలో ప్రచురించారు. ఆ కథ పేరు "నలుపు తెలుపు". ఈ కథే మా అమృతా ఫిలిమ్స్ తొలిచిత్రం "చెల్లెలి కాపురం"...." అన్నారు బాలయ్య.



"అసలు మీకు చిత్ర నిర్మాణరంగంలో ప్రవేశించాలన్న తలంపు ఎలా కలిగింది?"

"మొదట్నుంచీ నాలో చొరవ కాస్త తక్కువ. హీరో పాత్రలు ధరించే వయసు దాటిపోయిందేమో, మంచి కేరెక్టర్స్ వేద్దామన్న తలంపు కలిగింది. ఈ కోర్కె నెరవేరడానికి సొంత కంపెనీ నెలకొల్పితే బావుంటుందని పించింది. ఈ విషయమే నవయుగ చంద్రశేఖరరావుగారితో చెప్పాను. ఆయన ఓ. కే అన్నారు. ముందు చక్కని కథకోసం వేటాడ మన్నారు. నేను ఒక రిద్దరు రచయితలను తీసుకెళ్ళి, ఆయనకు కథలు వినిపింప చేశాను. ఆయన కేదీ నచ్చలేదు. అప్పుడు నేను సీరియల్‌గా రాసిన "నలుపు- తెలుపు" కథను వినిపించాను. "ఇది చాలా బాగుందే. దీన్ని తీయొచ్చు. ఇంతకీ ఈ స్టోరీ రైటర్ ఎవరు?" అని అడిగారు. నేనేనని చెప్పగానే, ఆయన ఆనందంతో భుజం తట్టారు. అప్పుడు విజయవాడ ఆలిండియా రేడియోలో పని చేస్తూన్న గొల్లపూడి మారుతీరావు గారి చేత డైలాగ్స్ రాయించమని సలహా ఇచ్చారు. అదే "చెల్లెలి కాపురం"...."

"చెల్లెలి కాపురం, నేరము-శిక్ష, అన్నదమ్ముల కథ" చిత్రాల వరకు మీ సంస్థ ఒక నీతినో, సందేశాన్నో అందిస్తూండేది. "ఈనాటి బంధం ఏనాటిదో" నుంచి మీ చిత్రాల ధోరణి పూర్తిగా వినోదాత్మకంగా మారినట్లనిపిస్తుంది....ఏమంటారు?"

"నిజమే. మొదట్లో ఒక నీతినో, సందేశాన్నో అందించాలన్న తపన నాలో ఎక్కువగా ఉండేది. కాని, ప్రేక్షకులు రెండున్నర గంటల సేపు హాయి గొలిపే వినోదం కోసమే వస్తారని నేను గుర్తించినప్పట్నుంచి కాస్త ధోరణిని మార్చక తప్పలేదు. పుష్కలంగా వినోదం ఉన్నా- ఏ నీతో, సందేశమో అంతర్లీనంగా ఉంటుంది నా చిత్రాలలో. ఎలాంటి అశ్లీలతకు గాని, అసభ్యానికి గాని తావు లేకుండా చక్కని చిత్రాలు అందించడమే నా ధ్యేయం. మా కొత్త చిత్రం "పసుపుతాడు" కూడా ఈ కోవకు చెందిందే."

"సినిమారంగంలోకి ప్రవేశించే కొత్త నిర్మాతలకు మీరిచ్చే సలహా?"

"చిత్ర నిర్మాణంలోని సాధక బాధకాలను ముందుగా అధ్యయనం చేయాలి. ప్లానింగ్, అన్ని శాఖలతో టి కనీసపు అవగాహన, వ్యాపారదక్షత ఉండి తీరాలి," అన్నారు బాలయ్య.

ఈయన కథలు సమకూర్చిన "చెల్లెలి కాపురం" తమిళంలో, "నేరము- శిక్ష" తమిళం, హిందీ భాషల్లో, "ఊరికిచ్చిన మాట" తమిళంలో, "అన్నదమ్ముల కథ" తమిళం, హిందీ భాషల్లో, "కిరాయి అల్లుడు" తమిళంలో, "ఈనాటి బంధం ఏనాటిదో" హిందీలో పునర్నిర్మించబడి ఆయా నిర్మాతలకు మంచి లాభాలు సమకూర్చాయి.

ప్రతిభావంతుడైన యువకుడు తులసీరాంను హీరోగా పరిచయం చేస్తూ ఈయన రూపొందిస్తున్న కొత్త చిత్రం "పసుపుతాడు"ను కూడా కొందరు నిర్మాతలు ఇతర భాషల్లో నిర్మించడానికి సంకల్పించారు.

– (జి. వి. జి.)

"మృత్యుంజయుడు"


బి. ఎస్. రంగ ప్రముఖ ఛాయాగ్రాహకుడుగా, దర్శకుడుగా ప్రేక్షకులకు చిరపరిచితుడే. ఈయన స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో ఈయనతో పాటు బి. ఆర్. వసంత్, సతీష్ నిర్మించిన వర్షా ప్రొడక్షన్స్ వారి పై చిత్రంలో మృదుమధురమైన ఎనిమిది గీతాలు, దాదాపు తొమ్మిది లక్షల రూపాయలతో వేసిన

సినిమా

నేత్రపర్వమైన సెట్స్ అదనపు ఆకర్షణ అని నిర్మా సారథి ఆర్. జి. నింబాల్కర్ తెలిపారు. తన్మయత్వం కలిగించే ఈ పౌరాణిక చిత్రంలో రాజేష్‌బాబు, రూప, మాను, పద్మావసంతి, శివరాం, సుదర్శన్, మాస్టర్ సంజయ్, మాస్టర్ రాజశేఖర్, పద్మనాభం, శైలశ్రీ, ఉమేష్, నింబాల్కర్ నటించారు. స్వర్గీయ సముద్రాల జూనియర్ మాటలు, పాటలు రాశారు. ఎం. రంగారావు సంగీతం, ఆర్ ఎన్. కె. ప్రసాద్ ఛాయ, బొబ్బిలి ప్రకాశరావు శిల్పం. కె. వి. ఎస్. కుటుంబరావు సహదర్శకత్వం, జయకుమార్ సహకార దర్శకత్వం. పి. జి. మోహన్ కూర్పు నిర్వహించారు.

(71 వ పేజీ చూడండి)

జయసుధ సమాధానాలు



ఉత్తమ ప్రశ్న

కె. శ్రీనివాసరావు, విశాఖపట్నం

కథాబలం చిత్రాల్లో మీరు అద్భుతంగా నటిస్తారు. మీరు ఓ చిత్రం చేసే ముందు కథపై శ్రద్ధ వహిస్తారా? లేక అన్నీ ఒకటేనా?

నటనా సామర్థ్యం కల్గిన నటీనటులకు మంచి పాత్ర లభించినప్పుడు ఆ పాత్రలో నటీనటులు కన్పించరు. తెరపై పాత్రలే కన్పిస్తాయి. నా అదృష్టం కొద్దీ నేను ధరించిన చాలా పాత్రలు క్లిష్టమైనవి లభించాయి. మంచి కథాబలం గల చిత్రాలు నేను చేయడం జరిగింది.

సాధారణంగా ఓ చిత్రంలో నటించే ముందు ఆ చిత్ర కథను వినడం జరుగుతూ వుంటుంది. ఒకోసారి పాత్రను బట్టి కాల్షీట్స్ యివ్వడం కూడా జరుగుతుంది.

ఆర్. భాగ్యరేఖ, మహబూబ్‌నగర్

తల్లిదండ్రులను దూషించినా బాధ పడటం లేదు నేటి యువతరం. కానీ తమ అభిమాన నటీనటులను దూషించనివ్వరు. కారణం ఏమిటి?

ప్రగాఢంగా అభిమానాన్ని ఉంచుకోవడంలో తప్పులేదు. అయితే అభిమానం... "దురభిమానం" కాకూడదు. జన్మనిచ్చిన తల్లితండ్రులకు విధేయులై వుండాలి.

జె. రమాదేవి, అత్తిలి

మీరు హిందీ చిత్రాల్లో ఎందుకు నటించుట లేదు.

హిందీ చిత్రాల్లో నటించలేక కాదు. రెండు... మూడు చిత్రాల్లో నటించాను. అయితే మన చిత్రాలు చేస్తే చాలు అన్న నిర్ణయం తీసుకున్నాను. ఈ నిర్ణయం మేరకే హిందీ చిత్రాల్లో ఆఫర్స్ వచ్చినా ఒదులుకున్నాను.

డి. నర్సింగరావు, పటాన్‌చెర్వు

"మాతృత్వంలోనే వుంది – ఆడజన్మ సార్థకం" అన్నారు కదా మరి మీరెప్పుడు మీ జన్మను సార్థకం చేసుకుంటారు?

త్వరలో!

కొత్తమాసు శ్రీనివాసులు, సింగరాయకొండ

మీరు సినిమారంగం నుంచి విరమిస్తున్నట్లు వచ్చిన వార్తల్లోని నిజం ఎంత?

ఇందులో అబద్ధం ఏ మాత్రం లేదు. అయితే మనం అనుకున్నవి అన్నీ జరగవు. జరగనున్నవి ఏవీ మనకు ముందుగా తెలియవు. విరమిద్దాము అని నిర్ణయించుకున్న నా నిర్ణయం అప్పట్లో సాగలేదు. మరిప్పుడు.... యిప్పట్లో చెప్పలేను.

ఎం. ఉషారాణి, కాకినాడ

'ప్రతిఘటన' సినిమాలోని పాత్ర మీరు నటిస్తే బావుండునని నా అభిప్రాయం.

ఎవరికి ఏ పాత్ర లభిస్తే ఆ పాత్రకు పరిపూర్ణ న్యాయం చేయాలి!

ఆ పాత్రలో మీరు నన్ను ఊహించుకున్నందుకు థాంక్స్!!

అయినా సోదరి శాంతి ఝాన్సిగా చక్కగా రాణించింది!!!

ఎ. రామచంద్ర, కట్టెలగేరి

మీరు బాలకృష్ణతో కలిసి ఏ సినిమాలో అయినా నటించుతున్నారా?

ప్రస్తుతానికి లేదు.

పి. టి. యస్. జ్యోతి, వరదయ్యపాలెం

మీకు ఇష్టమైన దేవుడు జీసస్ అంటారు ఎందుకు?

మీ ప్రశ్నలో సమాధానం కలిసి వుంది. □

కూపన్

ఆంధ్రసచిత్రవారపత్రిక

జయసుధ సమాధానాలు

ప్రశ్న: ______________________

____

____

పంపినవారి పేరు:

పూర్తి చిరునామా:

అభిమాన తారలపై అభిప్రాయం

నా అభిమాని జయసుధ. ఎన్నో,విభిన్న, విశిష్టమైన పాత్రల్లో నటించి, ఎన్నో బహుమతులు, బిరుదులు పొందటమే కాక ప్రేక్షకుల హృదయాల్లో ఓ ప్రత్యేకస్థానం ఏర్పరచుకుంది.



జయసుధ నటించే పాత్రల్లో ఒక విశిష్టతనే కాకుండా ధరించే దుస్తుల్లో కూడా ఒక ప్రత్యేకత వుంది.

ఫలానా సినిమాలో జయసుధ వుంది అంటే కనీసం ఆమె యాక్షనైనా బాగుంటుంది తప్పకుండా చూడాలి అనే అంత ఇమేజ్ వుంది. చాల బాధాకరమైన సన్నివేశంలో నటించింది అంటే నిజ జీవితంలో ఆ బాధ ఎంతగా అనుభవిస్తారో అంత సహజంగా నటిస్తుంది.

అలనాడు కన్నాంబ, సావిత్రి, వాణిశ్రీ అంతటి ప్రఖ్యాతి గాంచి, నటశిరోమణి అయింది. ఈ మేటి నేటి నటిగా ఈ దశాబ్దపు తారగా సినీరంగంలో తన కంటు ఓ ప్రత్యేక స్థానం ఏర్పరచు కోవాలి.

–జె. అరుణ, వరంగల్

* * * * *

1974లో రంగ ప్రవేశం చేసి తెలుగు పరిశ్రమలో నే (చిత్రాలలో నే) కాక హిందీ చిత్రాలలో కూడా అగ్రనాయకిగా పేరొందిన నా అభిమాన తార బ్యూటీ క్వీన్ జయప్రద. దాదాపు అన్ని చిత్రాలలోనూ ఎలాంటి పాత్రనైనా జీవం పోయగల నైపుణ్యం ఒక్క జయప్రదకు మాత్రమే. ఈమె నటనా చాతుర్యాన్ని వర్ణించలేం. జయప్రద కాలేజీ స్టూడెంట్‌గా ఎంతో బాగుంటుంది. ఆమెను ఎప్పుడూ కాలేజీ స్టూడెంట్-గానే చూడాలని నా అభిలాష. ఈమె కంఠం చాలా



తియ్యగా వుంటుంది. జయప్రదకు నేను ఇచ్చే సలహా ఏమిటంటే తరచూ పాటలు కూడా పాడాలని.

-టి. వి. విజయకుమారి, పెదమట్టపల్లి, భద్రాచలం

కుమారి శ్రీదేవి బాలతారగా రంగ ప్రవేశం చేసారు. అప్పటి నుండి ఆమె అభిమానిని నేను. ముఖ్యంగా బడిపంతులు, మరపురాని మనిషి చిత్రాలలో ఆమె నటన అద్భుతం. యశోదా కృష్ణ చిత్రంలో సాక్షాత్తు ఆ చిన్నికృష్ణుడే తెరమీద కనిపించినంతగా ఉంది ఆమె నటన. ఇక పదహారేళ్ళ వయసు, వసంత కోకిల, కంచు కాగడా వంటి చిత్రాలు ఆమె నటనకు మచ్చు తునకలు. అంత మంచి నటి కేవలం గ్లామర్ తారగా హిందీ చిత్రాలలో నటిస్తుంటే ఎంతో బాధగా ఉంది. అప్పటి శ్రీదేవికి ఇప్పటి శ్రీదేవికి ఎంత మార్పుని! వస్త్రధారణలో కూడా చాలామార్పు వచ్చింది. ఇహ మినవ్వు అప్పటి మి నవ్వులో అమాయకత స్వచ్ఛత ఉండి మనస్సుకి హాయి అనిపించేది. మొన్న వచ్చని కాపురంలో మినవ్వు చూస్తే అదోలా అనిపించింది.



మి మేకప్ కూడా బాగా మారింది. ఇప్పటి తెలుగు సినిమాలలో ఆ హిందీ మేకప్ నప్పటంలేదు. హిందీలో కూడా నటనకు అవకాశం ఉన్న పాత్రలు వేస్తారని ఆశిస్తున్నాను.

–యు. సునీత, విశాఖపట్నం

* * * * *

నా అభిమాన నటి విజయశాంతి. అన్ని రకాల పాత్రలలో సహజంగా నటించి ఉన్నత స్థాయికి



ఎదిగి ప్రేక్షకుల హృదయాలను దోచుకున్న నటి విజయశాంతి సాహసమైన పాత్రలలో, ధైర్యంగా, న్యాయం కోసము పోరాడే పాత్రలలో ఆమె నటన అద్భుతము. ఉదా: ప్రతిఘటన, నేటిభారతం, దేశంలో దొంగలు పడ్డారు. ఇక ముందు కూడ అగ్ర నటిగా పేరు పదిల పరచుకుని ఇంకా ఉన్నత స్థానాలను అందుకుని రాణించాలని నా కోరిక. చివరగా నేను ఆమెకు ఇచ్చే సూచన ఏమిటంటే గర్వమైన పాత్రలు తీసుకోకుండా (ఉదా: శ్రావణసంధ్య) మంచి ఆదర్శవంతమైన ఆశయాలు గల పాత్రలలో నటించమని.

-బి. ఉమారాణి, జడ్చర్ల

మౌనగీతం, ఇల్లాలు- ప్రియురాలు, చాలెంజ్, స్వాతి, దాంపత్యం, స్రవంతి, శ్రావణసంధ్య హిట్ చిత్రాలలో నటించి తనకంటూ ఓ ప్రత్యేకత సృష్టించుకొన్న అందాల నటి స్వాతి ఉరఫ్ సుహాసిని



నా అభిమాన నటి.

"మంగమ్మగారి మనుమడు" చూసాను. అందులో ఆమె చిలిపి నటన నన్ను ఎంతగానో ఆకట్టుకొంది. వీలు అయినప్పుడల్లా ఆమె చిత్రాలు చూస్తాను. "స్వాతి" చిత్రం చూచిన తరువాతు సుహాసిని నా ఆరాధ్య నటి అయ్యింది. అందులో ఆమె నటన వర్ణనాతీతం. స్వాతి చిత్రము ఎనలేని పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టింది ఆమెకు. ఎంత క్లిష్టమైన పాత్రను ఇట్టే వేయగలదు.

పరభాష నటి అయినా అచ్చు తెలుగు యువతిలాగ ఉంటుంది. నిండుదనమైన దుస్తులతో లెక్చరర్, లాయర్. డాక్టర్ లాంటి పాత్రలు పోషించాలని నా ఆశ. ప్రాముఖ్యం ఉన్న సినిమాలలో నటించాలని నా అభిలాష. తారలలో ధృవతారగా వెలగాలని నా కోరిక.

సి. అనురాధ, దిగువపేట, సిద్దవటం

* * * * *

ఊర్వశి శారద నటన అద్భుతం. అతిసహజం. కట్టు, బొట్టు సాంప్రదాయ పద్ధతిగా వుండే పాత్రలు ధరించి అభిమానుల హృదయములలో ఒక ప్రత్యేక స్థానం పొందకల్గారు.

హృదయాన్ని హత్తుకునే, సంభాషణలు పలికే తీరు. ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంటుంది. ఆమె నటించిన 'శారద' చిత్రంలో ఆమెనటన అమోఘం.


ఎటువంటి పాత్రలయిన ఇట్టే మెప్పించగల నటి శారద. "ప్రతిధ్వని" చిత్రంలో ఇన్స్పెక్టర్ పాత్రలో



ఆమె ప్రేక్షకుల అభిమానం మరింత పొందగలరని ఆశిస్తున్నాను.

నా అభిమాన నటికి నేనిచ్చే చిన్న సలహా ఏమిటంటే చిత్రాలను ఎన్నుకునే టప్పుడు తక్కువ సమయం తెరమీద కనిపించే పాత్రలను అంగికరించవద్దని –ఎం. లక్ష్మిపద్మావతి, గవర్నర్‌పేట, విజయవాడ □

సీరియల్ బ్రూస్ లీ చరిత్ర



యర్రగుంట్ల వరలక్ష్మీదేవి

(గత సంచిక తరువాయి)

బ్రూస్‌లీతో ఇంతకుముందు చాల చిత్రాలలో నొరొమియా అనే సుందరి కథా నాయికగ నటించింది. ఆమె అతడికి ప్రియురాలుగా, చాల సన్నిహితంగా ఉండేది. కొన్నాళ్ల తర్వాత వాళ్ల శృంగారం వాళ్లకే మొహం మొత్తి, మరికొన్ని కారణాల వల్ల వీరిరువురు దూరమయ్యేరు. ఒక సంవత్సరం క్రితం, అంటే 1972లో బ్రూస్‌లీకి మరో అందమైన సినీతార బెట్టీ టింగ్‌పీ తారసపడింది. ఇద్దరు సన్నిహితులై వలపులో పడ్డారు.

ఇరుగుపొరుగు వారు చెప్పిన ప్రకారం, ప్రతి వారం చివరి రోజున బ్రూస్‌లీ ఆమె ఇంటికి వచ్చి రాత్రంతా ఆమె ఇంట్లో గడిపేవాడు. ఇలా కొన్ని మాసాలు వారి వలపు సాగిం తరువాత, బ్రూస్‌లీ విసుగు చెందో, మరే కారణం చేతో ఆ అనుబంధాన్ని త్రెంచి ఆమెకు దూరంగా ఉండగానే, బెట్టీ టింగ్‌పీ ఆ విడిపోడ్డాన్ని భరించలేక కృంగిపోయి నిద్ర మాత్రలు మ్రింగి హాస్పిటల్‌పాలయింది. ఆ విషాద సంఘటన జరిగిం తరువాత ఆమె మమతను వదలుకోలేక బ్రూస్‌లీ మళ్లీ ఆమె ఇంటికి వెళ్లడం మొదలుపెట్టేడు. ఆ అనుబంధంతోనే బెట్టీ టింగ్‌పీని తమ చిత్రం 'గేమ్ ఆఫ్ డెత్'లో తీసుకుందామని రేమండ్ చౌకి బ్రూస్‌లీ చెప్పేడు.

రేమండ్ చౌ అంగికరించేడు. ఈ విషయమై మాట్లాడేందుకు బ్రూస్‌లీ, రేమండ్ చౌ బెట్టీ టింగ్‌పీ ఇంటికి మధ్యాహ్నం 4 గంటలకు వెళ్లారు. ఆమె ఇంట్లో కూల్‌డ్రింక్స్ త్రాగుతూ ఆ చిత్రం గురించి కొంతసేపు చర్చించుకున్నారు. సాయంత్రం 7-30కి బ్రూస్‌లీ కాస్త తలనొప్పి వచ్చిందన్నాడు. బెట్టీటింగ్‌పీ తన దగ్గర తలనొప్పి తగ్గడానికి డాక్టరు ఇచ్చిన మాత్ర ఉందని చెప్పి, ఈక్వాజెసిక్ అనే ఓ మాత్రను తెచ్చి ఇచ్చింది. ఆ మాత్రను బ్రూస్‌లీ వేసుకుని మంచినీళ్ళు త్రాగేడు.

బ్రూస్‌లీని కొన్సేపు విశ్రాంతి తీసుకోమని చెప్పి రేమండ్ చౌ మిరామెర్ హొటలులో జార్జి లాజెన్‌బెని కలియడానికి బయలుదేరాడు. బ్రూస్‌లీ తరువాత తను వచ్చి వాళ్లను కలుస్తానన్నాడు హొటలులో. ఆ హొటలులోనే రాత్రి ఆ ముగ్గురు డిన్నరు తీసుకుందామనుకున్నారు. బ్రూస్‌లీని లోన బెడ్ రూములో పడుక్కోమంది బెట్టీటింగ్‌పీ. కొన్సేపు పడుకొంటే తలనొప్పి పోతుందన్నాది. బ్రూస్‌లీ ఆ విధంగ లోనికి వెళ్లి పడుకున్నాడు. రేమండ్ చౌ



వెళ్లిపోయాడు.


ఒకగంట గడిచింది, గాని బ్రూస్‌లీ లేవలేదు. డిన్నర్‌కి టైమవుతూందని, బెట్టీటింగ్‌పీ పడక గదిలోకి వెళ్లి బ్రూస్‌లీని తట్టి లేపింది. కాని బ్రూస్‌లీ కదలలేదు. ఎంత ప్రయత్నించినా అతడు కండ్లు తెరవలేదు. బెట్టీ టింగ్‌పీకి భయమేసి ఆమెకు పరి చయమున్న డాక్టరు చూఫొవావోకి ఫోను చేసింది. డాక్టరు వెంటనే వచ్చి బ్రూస్‌లీని పరీక్షించి, అతడు ప్రమాదస్థితిలో ఉన్నాడని గ్రహించి ఏంబ్యులెన్సును పిలిపించి క్వీన్ ఎలిజబెత్ హాస్పిటల్‌కి బ్రూస్‌లీని తరలించేడు. అప్పటికి రాత్రి 10-30 అయింది.

ఎప్పటికీ మిరామెర్ హొటలుకి బ్రూస్‌లీ రాకపోయేసరికి రేమండ్ చౌ బెట్టీటింగ్‌పీ ఇంటికి ఫోను చేసేడు. బ్రూస్‌లీ ప్రమాద స్థితిలో ఉన్నాడని తెల్సుకుని, గాభరాతో వెంటనే బయలుదేరి కంబర్‌లాండ్ రోడ్‌లోని బ్రూస్‌లీ ఇంటికి వెళ్లి అతడి భార్య లిండాకు బ్రూస్‌లీ పరిస్థితి తెలియజేసి, ఆమెను తీసుకుని హాస్పిటల్‌కి వెళ్లేడు.

క్వీన్ ఎలిజబెత్ హాస్పిటల్‌లోని డాక్టర్లు బ్రూస్‌లీని బ్రతికించటానికి విశ్వప్రయత్నం చేశారు. కాని ఫలితం దక్కలేదు. ఆ రాత్రి 11-30 గంటలకు ప్రపంచంను తన అపూర్వ నటనతో ఒక ఊపు ఊపిన, కుంగ్‌ఫూ విద్యలో సాటిలేని నిపుణుడు అయిన బ్రూస్‌లీ చనిపోయేడు.

32 సంవత్సరాల వయస్సుకే ప్రపంచమంతటిలో అపూర్వ దృఢత్వంగల శారీరక సంపద కల్గిన బ్రూస్‌లీ ఆ భౌతికదేహాన్ని వదిలి అనంతంలో కలసిపోయేడు. కొన్నాళ్ల వరకు ఎవ్వరు ఈ నిజాన్ని నమ్మలేకపోయారు. ఈ కఠిన ప్రపంచంలో మంచివారు, యోగ్యులు అర్ధాంతరంగ చనిపోవడం చిత్రమైన విశేషం.

తరువాత బ్రూస్‌లీ చనిపోయిన వార్త అన్ని పత్రికలు ప్రపంచమంతటా ప్రకటింపబడి అందర్ని



దిగ్భ్రాంతుల్ని చేసింది. బ్రూస్‌లీ మరణం ప్రపంచమంతట ఎన్నో కోట్ల సంఖ్యలో నున్న అతడి అభిమానుల్ని విచారంలో ముంచింది. హాంకాంగ్‌లో కంటతడి పెట్టని సినీ ప్రేక్షకుడు లేడు.

1973 జులై 25వ తారీఖున బ్రూస్‌లీ మృత దేహాన్ని ఇత్తడితో చేసిన శవపేటికలో తెల్లని సిల్కు వస్త్రాల్ని పరచి పెట్టేరు. హాంకాగ్‌లోని కౌలూన్ శవ సంస్కార గృహంలో అభిమానుల దర్శనార్థం ఉంచేరు.



ప్రపంచం నలుమూలల నుండి వచ్చిన బ్రూస్‌లీ అభిమానులు పూల గుచ్చాలను పెట్టేరు. అవి ఓ పెద్ద గుట్టగ తయారయేయి. ఆ హాలులో ఓ బానర్ కట్టేరు. దానిపైన 'కళా గగనం నుండి ఓ మహాతార రాలిపోయింది అని రాసుంది. ఆ హాలులోకి కిక్కిరిసి ఉన్న అయిదు వందలకు పై నున్న ప్రేక్షకులే కాక, బయట వీధిలో అసంఖ్యాకమైన అభిమానులు బ్రూస్‌లీ తుది దర్శనానికి ఆతృతతో నిల్చున్నారు. పోలీసులకు ఆ జనాన్ని ఓ క్రమంలో పెట్టడం చాలా కష్టతరమైంది.

బ్రూస్‌లీ భౌతికదేహాన్ని అఖరుసారిగా దర్శనం చేసుకుని తమ గౌరవాభిమానాలను తెలియజేసేందుకు హాంకాంగ్‌లోని ప్రతి పౌరుడూ వచ్చేడు, ఓ ఇద్దరు తప్ప. షా బ్రదర్స్ చిత్ర నిర్మాణ సంస్థ అధిపతి రున్ రున్‌షా, బ్రూస్‌లీ ప్రియురాలైన బెట్టీటింగ్‌పి మాత్రం రాలేదు. బహుశా వారిరువురు బ్రూస్‌లీ చావుకు బాధ్యులనబడే అనుమాన ఛాయలో నున్నవారు గనుక,ప్రజాసందోహం యొక్క ఆవేశానికి గురి కావచ్చునన్న భయంతో రాలేక పోయి వుండవచ్చును.

ఆ మరునాడు బ్రూస్‌లీ శవపేటికను తీసుకుని బ్రూస్‌లీ భార్య లిండా ప్రత్యేకంగా అద్దెకి తీసుకోబడిన విమానంలో అమెరికాలోని సియాటిల్ పట్టణానికి వెళ్లింది. ఆ పట్నంలోని లేక్‌వ్యూ శ్మశానవాటికలో బ్రూస్‌లీ శవాన్ని పాతి పెట్టేరు, అమెరికాలోని బ్రూస్‌లీకి అత్యంత సన్నిహితులు, అభిమానులు ఓ వందమంది దుఃఖంతో కన్నీరు కారుస్తుండగా.

* * * *

బ్రూస్‌లీ చనిపోయి కొన్ని రోజులు గడిచినప్పటికి, హాంకాంగ్‌లోని వార్తాపత్రికలు దోమలకు మల్లే రొద చేయడం మాత్రం మానలేదు. ఇంతకీ బ్రూస్‌లీ చనిపోయేడా లేక హత్య గావింపబడ్డాడా అన్న సందేహం చాలమంది నోట అనబడింది. అఖరికి విసుగెత్తి ఈ పుకార్లను అణచివేయడానికి హాంకాంగ్ గవర్నమెంట్ ఓ విచారణ సంఘాన్ని ఏర్పరిచింది.

ఆ విచారణ పూర్తయి అఖరికి 1973 సెప్టెంబర్ 3వ తారీఖున ఆ సంఘం తమ నివేదికను సమర్పించింది. అదేమంటే బ్రూస్‌లీ తలనొప్పి మాత్ర వేసుకున్నాక బెట్టీటింగ్‌పి గృహంలో మరణానికి గురి కావడం నిజమేననీ, గాని ఆ మరణం సహజంగ సంభవించిందని.

1973వ సంవత్సరం మొదటి మూడు మాసాలలో బ్రూస్‌లీ బరువు 140 పౌన్ల నుండి 120 పౌన్లకు తగ్గిపోయింది. అది అతడు విపరీతంగా శ్రమించడం వల్ల జరిగి ఉండవచ్చునని, శ్రమ తగ్గించుకొమని అప్పట్లో డాక్టర్లు బ్రూస్‌లీకి సలహా ఇచ్చారు.



1973 మే 10వ తారీఖున అతడికి ఫిట్ వచ్చి వణుకుతో తెలివి తప్పి పడిపోయిన తరువాత బ్రూస్‌లీ డాక్టర్ల సలహాపై డైలాన్‌టిన్ అన్న మందును వాడుతుండేవాడు. జులై 20వ తారీఖున బెట్టీటింగ్‌పి ఇచ్చిన తలనొప్పికి మందు ఈక్వాజెసిక్ మాత్ర ఏస్ప్రిన్, మెప్రొబనేట్ ఔషధాల మిశ్రమం.ఈ మందును అతడు ఇంతకుముందు వాడలేదు.

కొందరి శరీరాలకు కొన్ని మందులుపడవు. అసలే కాస్త వ్యాధిగ్రస్తుడై ఉన్న బ్రూస్‌లీకి ఈక్వాజెసిక్ మాత్రలోనున్న ఏస్ప్రిన్, మెప్రొబనేట్ ఔషధాలు విరుద్ధమై అతడి మెదడుకు వ్యాపించి అతడిని కోమాలో పడేసుండవచ్చని డాక్టర్లు భావించేరు. బ్రూస్‌లీ చనిపోయిననంతరం హాస్పిటల్‌లో పోస్టుమార్టం చేసి చూడగ అతడి మెదడు 1400 గ్రాముల మామూలు బరువు నుండి 1500 గ్రాముల బరువుకు వాచిపోయి ఉంది. ఆ మెదడు వాపే అతడి మృత్యువుకు కారణమని డాక్టర్లు తేల్చేరు.

అందుచేత అతడి చావుకు ఎవ్వరు కారకులు కారని, అనుకోని విధంగ హఠాత్తుగా జరిగిన మరణమని ఈ విచారణలో నిర్ధారించేరు. దానితో పుకార్లు, అనుమానాలు సద్దుమణిగాయి.

ఏమయితేనేం ఓ మహానటుడు,కుంగ్‌ఫూ పోరాట విద్యలో ప్రపంచంలోకెల్ల సాటిలేని ప్రజ్ఞావంతుడు అర్ధాంతరంగా పిన్న వయస్సులో మరణించడం చిత్రసీమకు కల్గిన తీరని నష్టం - అతడి ప్రేక్షక అభిమానుల దురదృష్టం.

(అయిపోయింది)

(ఈ రచనలో నాకు కొన్ని సలహాలిచ్చి తోడ్పడిన, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జ్యుడో అండ్ కరాటే, విజయనగరంలోని కరాటే మాస్టర్ శ్రీ సజ్జద్ అలీఖోయాకు నా కృతజ్ఞతలు. -రచయిత్రి)

బ్రూస్ లీ శవపేటిక నుంచిన గృహంలో గుమిగూడిన అభిమానులు



కె. బి. కాకినాడ

★ కూనిరాగాలు తీస్తారెందుకు చాలామంది?

● పాట బాధలని పటా పంచలు చేస్తుందని బాలా!

వి. కె. ఆర్. తిరుమంద్యం

★ అతడు ఆమె కలయికే సృష్టికి మూలమని అన్నారు?

● మరి– అతని ప్రత్యేకత దేనికి? ఆమె అల్పత్వం దేనికి?! మగవాళ్లందరికీ యీ సంగతి తెలియదనా? తెలిసీ ఆడదాన్ని చిన్న చూపు చూస్తున్నారనే – నేనడిగేది.

ఎం. ఆర్. బి. కాశిబుగ్గ

★ వేశ్యాగృహం లోని స్త్రీకి పెళ్లి పందిట్లోని పెళ్లికొడుక్కి రేటు ఉంటుంది కారణం?

● ఇద్దరూ అమ్ముడు పోడానికి సిద్ధంగావున్న వాళ్లే కనుక. ఇంకా వేశ్యకి తిరస్కరించే హక్కైనా వుంటుంది. పెళ్లికుమారుడు పందిట్లో కూర్చోగానే – ఆ ఛాన్సు పోగొట్టుకుని వుంటాడు– కట్నం ముందే పుచ్చేసుకుంటే.


★ ఇలా ప్రశ్నలకి జవాబు లిస్తుంటే మీ కేమైనా జీతం యిస్తుంటారా?

● జీతం పుచ్చుకుందుకు ఉద్యోగిని కాను! ఊరికే రాయడానికి – ఎమెచూర్ రైటర్‌ని కాను!

ఎస్. వి. కొవ్వూరు

★ శ్రీ జయదుబాషి గారి వ్యాసాలు చదివి, ప్రతిఘటన సినిమా చూసి, ఎంత మందిలో సంచలనం కల్గుతుంది. వాటిలో అసత్యం లేనప్పుడు ప్రజలను ప్రభావితులను చేసే రచనలు పలువురు చేస్తే బాగుంటుంది.

● ఈ 'ప్రభావితం కావడం! ఏరచనో, సినిమానో అలా చేయకలగడం – శుద్ధ కాకతాళీయం సార్! ఇక్కడ మెచ్చుకొని, అక్కడ అలానే చెయ్యమనే వాళ్లుంటారు



పి. ఆర్. కె. కోటబొమ్మాళి

★ కె. ఆర్. గారూ, ప్రకృతిలో విలువైనది ఏది?

● ప్రకృతి కంటే విలువైనది యింకేం లేదు. అందుకే దాన్ని ఆధునికత పేరిట కలుషితం చేయకూడదని– యిప్పుడిప్పుడే తెలుసుకుంటున్నాం.

★ చావు అంటే భయపడే వాడిని ఏమనాలి?

● ఎవరి చావు? తనదా? ఎదుటి వానిదా?!

కె. ఎస్. ఆర్. హైదరాబాదు

★ మీరు భగవంతుని ఏమని ప్రార్థిస్తారు?

● నేను ఏమని ప్రార్థించాలో చెప్పకలను, ఓ మానవులారా! యీ భూమి నెందుకిట్లు విషప్రాయం చేస్తున్నారు?!

యు. ఎమ్. కొంకుదురు

★ వరకట్నాన్ని నిషేధించాలంటే చట్టబద్ధమైన ఆంక్షలు రావాలి.

● ఎందుకు? చట్టం అంటూ చేస్తే దాన్ని దాటించే అవకాశాలూ అప్పుడే పుట్టుకొస్తాయి. మనుషుల్లో మార్పు రావాలి గాని కట్నం నిషేధించి ప్రయోజనం లేదు....

కె. ఎస్. ఎల్. రాజమండ్రి

★ స్త్రీ అత్యధికంగా ప్రేమించే దేమిటి?

● స్త్రీ అత్యధికంగా ప్రేమించిన ప్రతీదీ ఆమెనే దెబ్బతీస్తుంది! అందుకే ఆమె నిస్వార్థంగా జీవితాన్ని అంకితం చేస్తుంది.

ఎల్. ఆర్. నౌపాడ

★ రామలక్ష్మి గారూ మగవారిపై అంత కోపం పనికి రాదండి.

● అబ్బే. నాకేం పిచ్చా– అందరి మీదా కోపం తెచ్చు కుందుకు! ఆడదాన్ని మనిషిగా గౌరవించ లేని వాళ్లంటే కోపం . ఆడదాన్ని అన్ని విధాలా ఉపయోగించుకుంటూ కూడా ఆమె ఉనికిని గుర్తించని స్వార్థపరులంటే కోపం, ... ఇలాగే చాలా రకాల వారి మీద సకారణ కోపం– గాని అకారణ కోపం నాకు రాదు.

★ అత్తగారూ నేనే మీ అల్లుడినైతే?

● నీకా అదృష్టం లేదు!

రాజు. నారాయణపేట

★ ఆడదాని మనసు అయస్కాంతం. మగవాడి మనసు ఇనుప ముక్క. కామెంట్ ప్లీజ్.

● ఇంకా అయస్కాంతం ఇనుప ముక్క అంటూంటే కామెంట్ ఏమిటి రాజా! మరి జావనైర్లు!!

జి.వి. ఆర్. సికింద్రాబాదు

★ పేదవాడు ధనికురాలిని పెళ్లాడితే?

● ఏముందీ– యజమాని వస్తుంది– పెళ్లాం కాదు!

ఎ. ఎస్. ఆర్. తెనాలి

★ నేటి రాజకీయాలపై మీ అభిప్రాయం?

● రౌడీల అండన తలదాచుకుందుకు ప్రయత్నించే వాళ్లు కొందరైతే– కత్తి తుపాకి చూపి పబ్బంగడుపుకునే వారు మరి కొందరు..... ఈ రాజకీయ శాస్త్రాని కింకా నిఘంటువులు తయారు కాలేదు. చదువు కోవడం కష్టం.

ఎమ్. ఎస్. నర్సీపట్నం


★ ఇంటికి యిల్లాలు దీపం అని నాలుగు గోడల మధ్య బంధించే మగవారిని ఏమనాలి?

● వారినేం అనక్కర లేదు. దీపాన్నేమోఅని నమ్మి బంధింపబడే ఆడదాని మూర్ఖత్వాన్ని ముందు పోగొట్టాలి. దీపం కావలిస్తే వెలిగిస్తాం. అక్కర్లేక పోతే ఆర్పేస్తాం– స్త్రీ జీవితం అలా కాదే.

ఎమ్. బి. బి. విజయవాడ

★ మీ వల్ల (ప్రశ్నావళి) మాత్రమే ఆడవాళ్లు తిరగబడుతున్నారను కొనే పిచ్చి వాళ్లకి మీరిచ్చే సమాధానం?

● మీరే అన్నారుగా పిచ్చి వాళ్లని!ఒంక దొరక్క డొంక పట్టుకున్నట్టు– కారణం కావాలి. అంతే– పెళ్లాల్ని కొట్టడానికో. ఆడాళ్లని తిట్టుకుందుకో..... □



ఇదిగో.. వదినగారూ!

మురళి సుబ్బారావు

"గురూ గారూ! ఒక సిగరెట్ ఉంటే ఇస్తారా. కాల్చుకుని మళ్ళీ ఇచ్చేస్తాను" అన్నాడు అనంతరావు ఆఫీస్‌లో బిజీగా రాసుకుంటున్న నాదగ్గరికొచ్చి.

నవ్వొచ్చింది నాకు. జేబులోంచి సిగరెట్ తీసి ఇచ్చాను.

"ఏం గురూగారూ అలావున్నారు" అన్నాడు అనంతరావు ఇచ్చిన సిగరెట్‌కి నిప్పు పెడుతూ.

"ఏం లేదు" అన్నాను. ముక్తసరిగా.

'లేద్సార్. ఏదో వుంది. ఎప్పుడూ హుషారుగా వుండేమీరు ఇవ్వాళ ఏదోలా వున్నారు. కారణం చెప్పాల్సిందే" అన్నాడు.

"ఏం లేదన్నానుగా".

"అబద్ధ మాడకండి గురూ గారూ. 'ఆఫీసులో అబద్ధ మాడితే ఆఫీసర్ పిలిచే టైంలో ఋుర్ర పనిచేయక పోవడం, అర్జెంటు వర్కు పెండింగయి పోవడం, సమయానికి సిగరెట్టిచ్చే వాడు దొరక్క పోవడం లాంటి ఇబ్బందులు కలుగును" అన్నాడు.

ఇక తప్పదు. సీట్లోంచి లేచాను.

"పద అలా కేంటిన్‌కి వెళదాం".

కేంటిన్‌కి చేరుకున్నాం.

నేను ఈ ఆఫీస్‌లో చేరి రెండేళ్ళయింది. ముందుగ పరిచయం కలిగింది అనంత రావుతోటే. ఇద్దరం ఒక వయసు వాళ్ళమే. చాలా విషయాల్లో నా పని తీరును బట్టి అనంతరావు నాకు దగ్గరయ్యాడు. 'గురూ గారూ' అని పిలుస్తుంటాడు.

ఇవాళ నాకొచ్చిన సమస్య ఇప్పటిది కాదు. సుమారు నెల రోజులుగా జరుగుతోంది. నిన్న రాత్రి మరి తీవ్రమయింది. అందుకే ఇవ్వాళ అదో మాదిరిగా వున్నాను.

"చెప్పండి గురూగారూ" అన్నాడు అనంతరావు.

"చాలా జాగ్రత్తగా విను అనంతూ. నాకు చాలా వర్రీగా వుంది. నువ్వే దిన్ని పరిష్కరించాలి. మా ఆవిడ ఈ మధ్య మా ప్రక్క వాటాలో వుంటున్నామె మాటలు విని......"

మధ్యలో నవ్వుతూ అన్నాడు అనంతరావు" ఇంట్లో సమస్యా? నాకర్థమయింది. వైఫ్ అనే మాట స్పెల్లింగుకి అర్ధమే వేరు సార్. వర్రీస్ ఇన్‌వైట్స్ ఫర్ ఎవర్. చెప్పండి మీ వర్రీ ఏమిటో"

నేను చెప్పడం మొదలు పెట్టాను.

"నాగురించి మొదట్నుంచీ చెప్పాలి. చదువుకున్న రోజుల్లో పుస్తకాలు తప్ప వేరే ధ్యాస లేదు నాకు. బజారుకి వెళ్ళి ఏ పనీ చేసే వాణ్ణి కాదు. అమ్మ, నాన్నగారు, చెల్లాయి చూసుకునే వారంతా. నాకు బొత్తిగా ఏమీ తెలీదంటే నమ్ము. నెలరోజుల క్రితం పెళ్ళయింది. నీకు తెలుసుగా. సుజాతను నాతో కాపురానికి పంపిస్తూ మా అమ్మ ఏమన్నదో తెలుసా? ఒరే బాబ్బీ! ఇప్పట్నుంచి ఒకళ్ళ కిద్దరయ్యారు. సంసారాన్ని జాగ్రత్తగా చూసుకో. నీ పెళ్ళానికి ఏ ఇబ్బంది వచ్చినా నువ్వు ఇబ్బందుల్లో పడతావు. ఇక్కడంటే ఏదో సరిపోయింది. ఇంట్లోకి ఏం కావాలో చూసుకో. మార్కెట్‌కి వెళ్ళి సరుకులు తేవడం గట్రా అలవాటు చేసుకో అని చెప్పింది మా అమ్మ. ఆ మాట పట్టించుకోలేదు నేను. ఇప్పుడు సమస్యగా మారింది."

ఇంతలో టీ వచ్చింది. ఇద్దరం టీ తాగుతుంటే నెల క్రితం సుజాతను కాపురానికి తీసుకు వచ్చి నప్పట్నుంచి జరిగిన సంఘటనలు చెప్పనారంభించాను.

* * *

ఆ రోజు ఫస్ట్ షో సినిమా ప్రోగ్రాం వుంది. త్వరగా ఇంటికి వెళ్ళాను ఆఫీసు నుంచి సుజాత ఇంకా వంటగదిలోనే వుంది.

"ఇంకా తయారవలేదు. టైమవుతోంది" అన్నాను.

"అయిపో వచ్చింది. ఒక్క పది నిముషాలు టేబుల్ మీద ఫ్లాస్కులో టీ వుంది. తాగండి. నేను తెమిలే సరికి బజారుకి వెళ్ళి కూరలు పట్రండి" అంది సుజాత కూరల సంచి చేతికిస్తూ.

సుజాత సంచి చేతికివ్వడంతో మొదలయింది సమస్య. కూరలేం తేవాలో తెలీదు. ఎంత ఖరీదంటాయో తెలీదు. బేరమాట్టం అసలే రాదు. ఎలా? తప్పించుకుందుకి అన్నాను.

"ఇద్దరం వెళదాం సుజా"

"బావుంది. వంట వ్వాలి నేను తయారు కావాలి. మీతో నేనూ వస్తే ఇక సినిమాకు వెళ్ళినట్లే" అంది.

వెళ్ళక తప్పలేదు. "ఏం కూరలు తేవాలి" అన్నాను.

"ఏవో ఒకటి పొద్దుటికి వంకాయలు తెండి. రేపు సాయంత్రానికి అరటికాయలేవైనా పట్రండి. పచ్చిమిర్చి, కొత్తిమీర కూడా కావాలి" అంది సుజాత స్నానానికని బాత్రూంలో వెళుతూ.

"పోనీ సినిమాకు వెళ్ళేటప్పుడు కొనుక్కు వెళదాం" అన్నాను.

ధభేలుమని బాత్రూం తలుపేసుకుంటూ అన్నది.

"ఏమిటి మీ వుద్దేశం. సినిమా హాల్లో నా పక్కన నా చెయ్యి పట్టుకుని కూర్చోక ఆ సంచీ పట్టుక్కూర్చుంటారా. సరే కొత్తిమీర కాస్త ఎక్కువ పట్రండి" అంది సుజాత.

"ఎందుకూ" అన్నాను అర్థం కాక.

"జడలో తురుముకుంటాను" అంది కోపంగా.

"నిజంగానే తెమ్మంటావా సుజా!"

"నిజంగానే తెండి. ఇందాక మల్లెపూలు అమ్మొస్తే కొన్నాను. అవి పనిమనిషి కిచ్చేస్తాను. వాళ్ళాయనతో అది సినిమా కెళుతుందిట!"

"సర్లే! అంత పని చెయ్యకు. బజారు కెళుతున్నాను. అరటికాయ లెన్ని తేవాలి. ఒక అరకేజి చాలా?" అన్నాను.

ఆ మాటకు సుజాత పడి పడి నవ్వింది. "అవి కేజీల్లో ఇవ్వరండి. కాయల లెక్కన ఇస్తారు. రెండు తీసుకురండి" అంది.

"కేజీ లెక్కన ఎందు కివ్వరూ? హైదరాబాదులో మామిడిపళ్ళు కేజీల్లోనే కదా ఇస్తారు" అన్నాను.

"అది వేరు. మీరు వెళ్ళి రండి. వాడు ఎలా అమ్మితే అలా తీసుకురండి. మీకు బొత్తిగా ఏమీ తెలీదు" అంది.

ఇక తప్పదు. కూరల లిస్టు మననం చేసుకుంటూ బజారుకి బయల్దేరాను.

కూరలు కొన్నాను.

కూరల కొట్టువాడు కూడా ఎందుకో మరి నవ్వేడు. కొత్తిమీర కొమ్మ ఎంత కిస్తున్నావని అడిగాను. అది తప్పా? అవునట. "తప్పు బాబూ అలా అడక్కూడదు. కొత్తిమీర కొమ్మలుగానూ మొక్కలుగానూ అమ్మరు. కట్ట పావలా" అన్నాడు.

ఇన్ని భరించి పావు గంటలో కూరలు తెచ్చాను. తర్వాత సినిమా కెళ్ళొచ్చాం. ఆ రోజు సుజాతకు నాకూ కూడా అర్థమయింది కూరలు కొనడం నాకు రాదని.

మర్నాడు ప్రొద్దుట నాకు ఆఫీస్‌కి క్యారేజి కట్టడానికని వంట చేస్తూ వంకాయలు తరుగు తోంది సుజాత. అప్పుడే వచ్చింది మా పక్క

వాటాలో వదినగారు. సుజాత ఆమెను వదినగారూ అని పిలుస్తుంది. సుజాతను కూడా ఆమె వదినగారూ అని పిలుస్తుంది. మాటల సందర్భంలో ఈ వంకాయలు నేను తెచ్చానని సుజాత చెప్పడం, ఆమె వాటి ఖరీదు అడగడం, సుజాత చెప్పడం, చాలా ఖరీదు పెట్టారమ్మా మీ వారు అని ఆమె అనడం, మా అన్నయ్యగారూ ఇలాగే తెస్తారా అని వాళ్ళాయన గురించి సుజాత అడగడం, అబ్బే అదేం లేదంటూ సాగదీసుకుంటూ, సంబర పడిపోతూ, చేతు లాడిస్తూ ఆమె చెప్పడం సుజాత ముఖం చిన్న బోవడం క్షణాల్లో జరిగి పోయింది.

ముందు గదిలో పేపరు చదువుకుంటున్న నాకు అన్నీ వినిపిస్తున్నాయి.

"అయితే వదినగారూ, అన్నయ్యగారికి కూరలు కొనడం కొద్దిగా తెలీదన్న మాట" అన్నది పక్కింటి వదినగారు చాలా నెమ్మదిగా రహస్యం మాట్లాడు తున్నట్లుగా.

"కొద్దిగా ఏమిటి? బొత్తిగా తెలీదు" అంది సుజాత కత్తిపీటను ధడాలున పక్కన పెడుతూ.

ఆ రోజు నుంచి కూరలు కొనడం ఎలా? అని తీవ్రంగా ఆలోచించాను. ఆఫీసులో కూడా చాలా మందిని అడిగాను కూర లెలా కొనాలని. అన్నీ తెలుసుకున్నాను కానీ మళ్ళీ కూరలు కొనే యోగం పట్టలేదు.

* * * *

"అదేమి" అన్నాడు అనంతరావు.

"మా పక్కింటి వదినగారు చెప్పిన జడ్జిమెంట్ ప్రకారం నాకు కూరలు కొనడం రాదు. దానికి శిక్షగా సుజాత తనే కూరలు కొని తెచ్చుకుంటోంది."

"చాలా ఘోరం జరిగింది గురూగారూ" భారంగా నిట్టూర్చాడు అనంతరావు.

మళ్ళీ చెప్పడం మొదలు పెట్టాను.

"ఆ తర్వాత పది రోజులకు సుజాత పుట్టిన రోజు వచ్చింది. దసరా కూడా అప్పుడే. చీర కొనాలను కున్నాను. నీ దగ్గరేగా అనంతం! డబ్బు అప్పు తీసుకున్నాను.

"అవును గురూ గారూ ఈ నెలలో ఇచ్చేస్తా నన్నారు. ఇవ్వనే లేదు" అన్నాడు అనంతం.

"సణక్కు. వచ్చే నెల్లో ఇచ్చేస్తాలే. చెప్పేది విను. నీ దగ్గర డబ్బు తీసుకుని చీర కొని పట్టు కెళ్ళాను."

* * * *

"చీర చాలా బాగుందండి. ఈ కలర్ ఇంతవరకు కట్టుకో లేదు. పక్కింటి వదినగారూ ఇలాంటిదే కొనుక్కున్నారు. ఎంత ఖరీదు? నూట నలభయ్యేనా? అంది సుజాత.

ఆ చివరి మాటకి నా ప్రాణం పోయినట్లైంది. నేను నూట అరవైకి కొన్నాను ఆ చీరని.

"ఉండండి. పక్కింటి వదిన గారికి చూపిస్తాను. ఆవిడ కొనుక్కున్నారు నూట నలభైకి. అది కూడా తెస్తాను. చూద్దురు గాని" అంటూ వాళ్ళ వాటాలోకి వెళ్ళింది సుజాత.

కాస్సేపటికి రెండు భుజాలమీద రెండు చీరలు వేసుకుని వచ్చింది సుజాత.


వెనకాలే వదిన గారొచ్చింది.

"నా చీర నూట నలభయ్యైంది అన్నయ్యగారూ. రవీంద్ర క్లాత్ స్టోర్సులో కొన్నారు మా వారు. మీరూ అక్కడే కొన్నారేమిటి కొంపదీసి" అన్నదామె.

"ఆ..... అవును" అన్నాను తడబడుతూ. నా గుండె అదుపు తప్పినట్లయింది. "నూట నలభైకే కొన్నాను నేను కూడా" అన్నాను గొంతు పెగుల్చుకుని. ఇరవై రూపాయల తేడా! బాప్‌రే!

వదినగారు ఏదోగా నవ్వుకుంటూ వెళ్ళి పోయింది ఆమె చీరతో సహా.

కాస్సేపటికి టీ ఇచ్చింది సుజాత. దగ్గర కూర్చుని మాట్లాడుతూ నా జేబులో చెయ్యి పెట్టింది. సుజాత చేతికి నేను కొన్న చీర బిల్లు తగిలింది. నేను గబుక్కున లాక్కునే లోపల సుజాత బిల్లు చూసింది. బిల్లుమీద అంకె నూట అరవై. సుజాత నా వైపు చాలా తీక్షణంగా చూసింది. నేను నిజంగా నూట



నలభైకి కొన్నానని వదినగారు వచ్చి అదోలా నవ్వుతూ "నూట నలభైకి కొన్నారా మీరూను" అనేసరికి మాట్లాడలేక పోయానని సుజాతకు చెప్పాలను కున్నాను. నాకు ఆ అవకాశం దొరక లేదు.

"ఇంకెప్పుడూ ఏ వస్తువూ కొనకండి" అంటూ చీర బిల్లు చింపి పారేసింది.

ఆ క్షణం నుంచి నాకు నిజంగా మార్కెట్ వ్యవహారాలు తెలియవని నిర్ణయాని కొచ్చేసింది సుజాత. వదినగారి మొగుడు ఏ వస్తువుకొన్నా దాని గురించి ఆమె గొప్పగా సుజాతకు చెప్పడం, నాకు ఆ విధంగా తీసుకు రావడం చేత కావట్లేదనే భావంతో సుజాత ముఖం చిన్న బోవడం, వదినగారు ఇంకా గొప్పలు పోవడం.... ప్చ్.... ఎన్నాళ్ళిలా.

* * * *

"చాలా ఇబ్బంది పడిపోతున్నారు గురూ గారూ! నేనేవిధంగా మిమ్మల్ని ఆదుకో గలను. ఇంకో సిగెరెట్ వుంటే ఇస్తారా?" అన్నాడు అనంతరావు.

సిగరెట్ ఇస్తూ అన్నాను.

"నిన్న సాయంత్రం సినిమాకు వెళ్ళాం నేను సుజాతా. బయల్దేరుతూ వదినగారితో చెప్పి రావడానికని వెళ్ళింది సుజాత. అప్పుడు వదిన గారే మన్నారో తెలుసా?"

"ఆమె కూడా వస్తానన్నా రేమిటి కొంపతీసి" అన్నాడు అనంతరావు.

"మీ వారు పువ్వులు కొనేటప్పుడు ప్రక్కన నువ్వుండు సుజా. సినిమా టిక్కెట్లు కూడా బేరమాడేస్తారేమో జాగ్రత్త అన్నది వదినగారు నవ్వుతూ."

"అలాగే నండీ తప్పదు కదా!" అంది సుజాత నా వైపు గుర్రుగా చూస్తూ.

"అందుకని అనంతం ఇదంతా వదినగారి వల్లనే జరుగుతోం దేమోనని పిస్తోంది నాకు."

అనంత రావన్నాడు,

ఇదిగో.... వదినగారూ!

"నా కర్థమైంది గురూ గారూ! ఎదుటి వాళ్ళు కలతల్లో వున్నారంటే సంతోషించే రకం పక్కింటి వదినగారు. మీ రిద్దరూ క్రొత్త దంపతులు పరస్పరం మీకు సుజాతగారికి సరైన అవగాహన కుదర లేదు. ఈ పరిస్థితుల్లో మిమ్మల్ని ఎద్దేవా చేసినట్లు మాట్లాడితే సుజాత గారి దృష్టిలో మీరు ఏమీ తెలియని వారవుతారు. మొగుడు పెళ్ళానికి చులకనయ్యేది పెళ్లయిన మొదటి రోజుల్ని బట్టే వుంటుంది గురూగారూ. మీ కన్నా ఆమె భర్త వ్యవహార జ్ఞానం కలవాడని చెప్పడానికి ప్రయత్నిస్తోంది వదినగారు. ఇటువంటి టైంలోనే పరిష్కరించు కోవాలి. దీని కంతటికీ ఒకటే కారణం."

"చెప్పు అనంతరావూ అదేమిటో చెప్పు. చచ్చి నీ నోట సిగరేట్‌నై పుడతా!"

"వద్దు గురుగారూ అంత త్యాగం భరించ లేను" అన్నాడు అనంతరావు.

"పోనీ నీకు ఆఫీస్‌లో బాస్‌నై పుడతాను."

"వద్దు గురూగారూ ఈ రేంక్ నుంచి పైకి వెళ్ళొద్దు. మీరు ఇలాగే వుండండి. చాలు" అన్నాడు అనంతరావు కంగారు నటిస్తూ.

"మరయితే ఈ సమస్యను పరిష్కరించు!"

"అలాగే గురూజీ" అంటూ అనంతరావు చెప్పడం మొదలు పెట్టాడు. అనంతరావు చెప్పింది సాంతం విన్నాను. నాకూ ఆ సలహా చాలా బాగుందని పించింది.

"ఇవాళ సాయంత్రమే దాన్ని అమలు చెయ్యాలి!"

* * * *

అనంతరావు చెప్పిన ఉపాయానికి చాలా కృతజ్ఞతలు చెప్పి ఆఫీసు నుంచి ఇంటి కొచ్చేసాను.

మార్కెట్‌లోకి వెళదాం తయారవ మన్నాను సుజాతను. దసరాకు నేను కొన్న నూట అరవై చీర కట్టుకో మన్నాను. సుజాత ఆ చీర కట్టుకుంది.

ఇద్దరం బయల్దేరాం.

రోజూ వెళ్ళిన దారిన కాకుండా వేరే రోడ్డున బయల్దేరాం!

"ఇటెక్కడి కండీ" అంది సుజాత.

"చెప్తాను నడు!"

కొద్దిసేపు నడిచేసరికి సుజాత వున్నట్టుండి అన్నది. "అన్నయ్యగారు వస్తున్నారండీ!"

"ఏడీ" అన్నాను.

"ఏడీ ఏమిటి తప్పు పూట వదినగారి భర్త. వింటే ఏమనుకుంటారు" అంది సుజాత.

మా మాటలు పూర్తయ్యే లోపల వదినగారి భర్త సన్యాసిరావు గారు మా దగ్గరి కొచ్చాడు సైకిల్ మీద.

"ఏమ్మా! ఇటు వెడుతున్నా రేమిటి?" సైకిల్ దిగి నిలబడుతూ అన్నాడు సన్యాసిరావు.

"అలా షికారుకని బయల్దేరా మండీ!" అంది సుజాత. కాస్సేపు ముగ్గురం మాట్లాడుకున్నాం.

అన్నట్టు ఈ చీర పండక్కి కొన్నది కదూ!" అన్నాడు సన్యాసిరావు.

"అవునండీ. నూట అరవైకి కొన్నాను. మీరు ఇటువంటి చీర నూట నలభైకి కొన్నారట కదా!" అన్నాను.

"నూట నలభైకి కొనడ మేమిటి? నేను కూడా నూట అరవైకి కొన్నాను!" అన్నాడు సన్యాసిరావు.


నేను సుజాత తెల్లబోయాం.

"మీరు నూట నలభైకి కొన్నట్టు వదినగారు చెప్పారు!" అంది సుజాత నసుగుతూ.

"దాని పిండాకూడు. దానికేమన్నా తెలిసి ఛస్తేగా. ఇంత ఖరీదుకి తెచ్చానని ఎప్పుడూ దానికి చెప్పను. నోటి కొచ్చిన ఖరీదు చెప్పు కుంటుంది అందరికీ" అన్నాడు సన్యాసిరావు.

"అదేమండీ!" అన్నాను విస్తుబోతూ.

"గొప్పకోసం. అందరి మొగుళ్ళకన్నా నేను నయం అనిపించాలని ఒకటి. మరొక కారణం కూడా వుందనుకో...." అన్నాడు సన్యాసిరావు సందిగ్ధంగా.



"అదేమిటో చెప్పండన్నయ్యగారూ!" అంది సుజాత.

"నాకు ఆఫీసులో పైన కాస్త డబ్బులు దొరుకుతాయి. జీతం కాక వచ్చిన డబ్బులు కదా మరి! పై సంపాదనతో మేము ఖరీదయినవి కొనేసు కుంటున్నామని అందరూ అనుకోకుండా వుండడానికని మా ఆవిడ అలా చెప్పు కుంటుంది!" అన్నారు సన్యాసిరావు.

ఆ మాటకు సుజాత ముఖం వికసించింది. నా వైపు చాలా లవ్లీ లునే విసిరింది.

"మొగుడి పెర్‌ఫెక్ట్‌నెస్, వ్యవహార జ్ఞానం పెళ్ళానికి తెలుస్తే చాలు" అన్నాడు అనంతరావు. ఆ మాటలు చూపులతో నిజం చేసింది సుజాత.

కాస్సేపు మాట్లాడేక వదినగారి భర్త సన్యాసిరావు కిరాణా షాపు వైపు వెళ్ళి పోయాడు కందిపప్పు గట్రా కొనాలని.

మేము వెనక్కి వచ్చేసాం. నేను సుజాతను మార్కెట్‌కి తీసుకొచ్చిన పనయి పోయింది. వదిన గారి భర్తను కలవడానికని సుజాతను ఈ త్రోవను తీసుకొచ్చాను. ఇది అనంతరా విచ్చిన సలహా.

* * * *

మర్నాడు ఉదయం.

వదినగారు గ్లాసుతో కందిపప్పు పట్టుకొచ్చింది. సుజాత దగ్గర ఆ మధ్య నెప్పుడో అప్పు పట్టు కెళ్ళిందట. బాకీ తీర్చడాని కొచ్చింది. కందిపప్పు తీసుకుంటూ సుజాత అన్నది.

"కందిపప్పు మరీ నాసిగా వుంది వదినగారూ. నిన్న మా వారు చాలా మంచి పప్పు తెచ్చారు."

అలాగా! మా వారు మంచిదే తెచ్చేవారు కానీ నిన్న ఆయనకు చాలా పను లుండటం వల్ల నేను తెచ్చాను కందిపప్పు" అంది వదినగారు.

"అయ్యో! మీరు బజారు కెళ్ళారా. నాకు చెబితే మా వారు తెచ్చేవారుగా మీక్కూడా" అంది సుజాత.

"అబ్బే ఎందుకు శ్రమ. మా వారు మంచిదే తెచ్చేవారు" అంది వదినగారు.


"శ్రమ దేముందండి. అన్నట్టు నిన్న మీ వారు మా వారికి బజార్లో కనిపించార్ట కందిపప్పు కొంటూ. చాలా సేపు మాట్లాడు కున్నారట" అంది సుజాత వోరగా వదినగార్ని చూస్తూ.

"అలాగా! మా వారు చెప్పలేదే!" అంది వదినగారు ఏమనాలో తోచక.

"అవునండీ పక్క పక్క వాటాల్లో వుంటున్నప్పుడు మగవాళ్ళు కూడా మాట్లాడుకుంటూ వుండాలని మా వారి ఆఫీస్ కొలీగ్ అనంతరావు గారు చెప్పారట. పండక్కి మీ అన్నయ్యగారు నాకు కొన్న చీర గురించి సన్యాసి రావన్నయ్య గారు చివాట్లేసారంటె నమ్మండి వదినగారూ" అంది సుజాత.

వదినగారు పనుందంటూ విసవిసా వెళ్ళి పోయింది.

సుజాత వేడి కాఫీ కప్పుతో నాకు దగ్గిరయింది. □


AMRUTANJAN'S
SWAS MINTS
అమృతాంజన్
వారి మరొక గొప్ప తయారి
శ్వాస్
మింట్
బిళ్ళలు
అమృతాంజన్ లిమిటెడ్

సీరియల్

బలి కోరిన ప్రేమ

ఎం.డి.సౌజన్య

(గత సంచిక తరువాయి)

చేతిలో చిన్న సూట్‌కేస్, మరో చేతిలో పళ్ళ బుట్ట, రంగుల బొమ్మల పుస్తకాలు, మోడరన్ బ్రెడ్, కీ యిస్తే తిరిగే రకరకాల బొమ్మలు తీసుకుని అతని దగ్గరికెళ్ళింది.

డాక్టర్ రంగారావు, అపస్మారకంలో వున్న అరవింద్ దగ్గరకెళ్ళి "బాబూ! అరవింద్ ... మీ అమ్మ వచ్చింది ... ఇటు చూడు బాబూ!" అన్నాడు. అరవింద్ నీరసంగా ఎక్కడో వున్నట్టు, కళ్ళు తెరవకుండానే మూలుగుతూ వున్నాడు. అతని నుదుట చెమట పడుతోంది! శ్వాస కాస్త బాధగా పీలుస్తున్నట్టు అతని డొక్కలు ఎగిరిపడుతున్నాయి!!

"బాబూ! అరవింద్ ... ఇటు చూడు ... అమ్మని వచ్చాను బాబూ! అమ్మని వచ్చాను!! ఒకసారి ఇటు చూడవూ!" అంది అన్నపూర్ణ అరవింద్‌ను మగత పోగొట్టి మేలుగొలిపే యత్నంలో.

'అమ్మ' ... అనే మాట చెవిన పడటంతో అరవింద్‌లో కాస్త కదలిక కనిపించింది.

అతను కళ్ళు కాస్త బలవంతంగా తెరిచే ప్రయత్నం చేశాడు.

"బాబూ! అరవింద్ ... ఇదిగో బాబూ! నీకోసం మీ అమ్మ ఏం ఏం బొమ్మలు తెచ్చిందో చూడు! నీ కోసం బ్రెడ్ తెచ్చాను ... ఏది నాన్నా ఒక్కసారి కళ్ళు తెరిచి నా వైపు చూడవూ?" అంది, తల మృదువుగా నిమురుతూ, చుబుకం పట్టి.

అరవిందుకు ఆ మాటలతో కొంచెం కదలిక వచ్చి, మెల్లగా కళ్ళు తెరిచి అన్నపూర్ణ వైపు చూసి, ఆమె ఎవరో అర్ధంకాక అనుమానంగా చూశాడు.

అన్నపూర్ణ ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ–

"నేనే బాబు మీ అమ్మ ... సావిత్రిని ...! హైదరాబాద్ నుంచి వచ్చాను!! నీ ఆరోగ్యం బాగుండలేదని తెలిసి నిన్ను చూడాలని ఎంతో ఆశగా ఇన్నాళ్ళకు వచ్చాను!" అంది మృదువుగా ఆ పసివాడి బుగ్గలు నిమురుతూ.

"అమ్మా ... నువ్వు ...!" అంటూ అన్నపూర్ణ చెయ్యి పట్టుకున్న అరవింద్, ఆమె వైపు తదేకంగా చూస్తూ, కళ్ళలో వుబికిన నీళ్ళు నిగ్రహించుకునే ప్రయత్నం చేస్తూ వున్నాడు.

జరిగిన కథ –2 ప్రఖ్యాత నటి అన్నపూర్ణను ఒక కోటీశ్వరురాలు తన కన్నకొడుకు ప్రాణాలు కాపాడమని వేడుకుంది. ఆ కోటీశ్వరురాలు కోరుతున్న పని నటనకు సంబంధించినది కాబట్టి అన్నపూర్ణ ఆమె అభ్యర్థనను వొప్పుకోలేకపోతోంది. అన్నపూర్ణకు గతంలో భార్య మరణ వార్త విని కూడా మురళీధర్ గుండె నిబ్బరంతో 'ఇల్లాలు' నాటకంలో నటించి స్టేజి మీదే గుండెపోటుతో మరణించిన సంఘటన గుర్తుకి వచ్చింది. అన్నపూర్ణ మళ్ళీ జీవితంలో నటిగా రంగ స్థల మెక్కకూడదని నిర్ణయించుకుంది. కోటీశ్వరురాలు రమాదేవి తన కొడుకు కాంతిభూషన్ ప్రాణాలు కాపాడమని అభ్యర్థిస్తూ తిరిగి ఉత్తరం రాసింది. రమాదేవి మొదటిసారి వచ్చి వెళ్ళిన రెండవ రోజు డాక్టర్ రంగారావు అభ్యర్థనపై అనాథైన అరవింద్ తల్లిగా నటించడానికి అంగికరించింది అన్నపూర్ణ.

అన్నపూర్ణ అరవింద్‌ను లాలిస్తూ "బాబూ! ఇదిగో నీ కోసం ఏం తెచ్చానో చూడు ...!! ముందు ఈ బ్రెడ్ కాస్త తిను బాబూ!!" అంది అన్నపూర్ణ బ్రెడ్ కాస్త తుంచి అతని నోటికి అందించి.

అరవింద్ ఆ బ్రెడ్‌ను అందుకుని "అమ్మా ... నువ్వు ... ఇన్నాళ్ళు నన్ను వదలి ... వు ... న్నా ... వు ... గ ... దూ?" అన్నాడు.

అన్నపూర్ణ అతని మాటలకు సమాధానం చెప్పలేక కళ్ళల్లో నీళ్ళు నిలుస్తుండగా "నేను రాలేకపోయినా ... నీ ఉత్తరాలకు సమాధానాలు వ్రాస్తూనే వున్నానుగా బాబూ! ఇదిగో చూడు నువ్వు నాకు వ్రాసిన ఉత్తరాలు ఎంత ప్రాణప్రదంగా దాచుకున్నానో చూడు!" అంది - అతను వ్రాసిన ఉత్తరాల కట్ట అతనికే చూపుతూ.

అన్నపూర్ణ చేతిలోని ఉత్తరాల కట్టను ఎంతో అభిమానంగా తాకిన అరవింద్ "అమ్మా ... నీ కోసం ఎంతో కాలం ఎదురు చూచాను ...!! ఇన్నాళ్ళు రాని నువ్వు ... ఇప్పటికైనా వచ్చావు ...!! అమ్మా ... నన్ను విడిచిపెట్టి వెళ్ళవుగా!?" అన్నాడు అన్నపూర్ణ కళ్ళల్లోకి ప్రేమగా చూస్తూ.

అన్నపూర్ణకు ఆ మాటలకు ఏం చెప్పాలో వెంటనే అర్ధంకాక "లేదు బాబూ! నిన్ను విడిచిపెట్టి ఇక వెళ్ళను!! ... ఇక ఎక్కడికీ వెళ్ళను! నా మాట నమ్ము బాబూ! నీతో వుండటానికి వీలుకల్పించని ఆ ఉద్యోగం కూడా నీ కోసం వదులుకున్నాను బాబూ!" అంది కళ్ళు నీళ్ళు అప్రయత్నంగా వస్తుండగా.

ఆమెకు మొదట తాను అరవింద్ తల్లిగా నటిస్తున్నట్లు అనుభూతి వుంది గాని ... తరువాత ఆమె తాను అరవింద్ తల్లిగా నటిస్తున్నట్లు మరిచిపోయి ... తాను నిజంగానే అరవింద్ తల్లి అనుకోసాగింది!!

పేదకు పెన్నిధి దొరికినట్లు ఎంతో ఆనందపరవశుడైన అరవింద్ మెల్లిగా లేచి అన్నపూర్ణ వడిలో వాలిపోయి "అమ్మా! నన్ను విడిచి ... నిజంగా నువ్వు వెళ్ళవు కదూ? వెళ్ళకమ్మా ...!! అమ్మా నిన్ను విడిచి నేనుండలేను ...!" అన్నాడు అన్నపూర్ణ చేతులను మృదువుగా, తన చిన్ని చేతులతో స్పృశిస్తూ.

అలా అరవింద్ ఎంత సేపున్నాడో ... అన్నపూర్ణ అతని తల నిమురుతూ ఎంత సేపుండిపోయిందో ...!!

అన్నపూర్ణ తాను విజయం సాధించానని, తాను ఒక పసివాడి ప్రాణం కాపాడగలిగానని డాక్టర్ రంగారావు ఆనందిస్తుండగా, ఆ రోజు రాత్రి అన్నపూర్ణ వడిలో పడుకున్న అరవింద్ పరిస్థితి అకస్మాత్తుగా విషమించింది.

డాక్టర్ రంగారావు - ఆయన బృందం ఎంతో కృషి చేసింది.

కాని ... కోమాలోకి వెళ్ళిన అరవింద్ తిరిగి స్పృహలోకే రాలేదు.

రెండో రోజు ఉదయం అరవింద్ శాశ్వతంగా యీ లోకం వదిలాడు.

అన్నపూర్ణ జీవితంలో మొదటిసారిగా నిజంగా ఒక ప్రాణి యీ లోకాన్ని విడిచిపెట్టటం చూసింది!! చావు చాలా భయంకరంగా ఉంటుందని - ఈ లోకంలో పుట్టి పెరిగిన ప్రాణి ... ఈ భవబంధాలు తెంచుకుని శాశ్వతంగా యీ లోకం విడిచే దృశ్యం ఆమె అంత సన్నిహితంగా మొదటిసారి చూసింది. అరవింద్ యీ లోకాన్ని విడుస్తూ కూడా "అమ్మా! అమ్మా!" అంటూ కలవరిస్తూనే వున్నాడు, ఆమె చేయి పట్టుకొని. అన్నపూర్ణ అతన్ని ఒక్క క్షణం కూడా విడిచిపెట్టలేదు.

నిజంగానే తనే ఆ పసివాడి తల్లి అయినట్లు కన్నీరుమున్నీరుగా విలపిస్తూ అతన్ని బుజ్జగిస్తూ, లాలిస్తూ 'బాబూ, 'బాబూ' అంటూ కలవరిస్తూ అలాగే అకలిదప్పికలు మరచి అన్నపూర్ణ అరవింద్ మంచం ప్రక్కనే వుండిపోయింది.

కాని ఫలితం దక్కలేదు!!

జీవితంలో అన్నపూర్ణ మొదటిసారి ఒక అత్యంత ఆత్మీయుణ్ణి పోగొట్టుకున్నట్టు బాధపడింది.

మొదట అరవింద్ చనిపోయాడంటే ఆమె నమ్మలేక పోయింది!!

అతను నిజంగా చనిపోయాడంటే భోరు భోరున విలపించింది! అనాథాశ్రమ పిల్లలంతా ఆ పసిబాలుడి భౌతిక కాయం మీద పుష్పగుచ్ఛాలుంచుతుంటే, పూలు చల్లి అంత్యక్రియలకు సిద్ధమవుతుంటే ఆ దృశ్యాన్ని చూసి తట్టుకోలేక విలపించింది! డాక్టర్ రంగారావు పసి వాడిలా ఏడ్చాడు. ఆ దృశ్యాలను చూడలేక అక్కడినుంచి వెళ్ళిపోతూ "సారి డాక్టర్! నా ప్రయత్నాలు ఫలించలేదు!" అంది, అన్నపూర్ణ.

"ఈ ప్రయత్నం ఇంకో నాలుగు రోజులు ముందు చేసి వుంటే ఎలా వుండేదో నమ్మా!" అన్నాడాయన బాధపడుతూ.

అన్నపూర్ణ హాస్పిటల్ నుంచి ఇంటికి వచ్చినా ఆమె మనసులో 'ఇంకో నాలుగు రోజులు ముందు చేసి వుంటే ఆ ప్రయత్నం ఎలా వుండేదో ?' నన్న డాక్టర్ రంగారావు మాటలు ఆమెకు ప్రతి క్షణం గుర్తుకు రాసాగాయి.

ఆమె ఆ రోజంతా తిండి మాని ఏడుస్తూ పడుకుంది!!

ఆ అబ్బాయి అరవింద్ ఎవరో - అతనికి తనకూ ఏం సంబంధమో! కాని ... విధి ఆడించిన నాటకం చివరి అంకంలో తనూ అందులో భాగస్వామిని అయ్యింది!

పైగా ఆ పసివాడిని కాపాడ లేకపోయినా ... అతను నిజంగానే తన కన్నతల్లిని చూడగలిగాననే ఒక సంతృప్తి కలిగించింది! అందుకే నటించింది!

జీవితంలో ఏమి అనుభవించని ఆ పసివాడు ..! ఏ ముద్దూ ముచ్చటకూ నోచుకోకుండానే ... ఒక అనాథగా ... అనాథాశ్రమంలో పెరిగి ...కన్నతల్లి ఉందనే భ్రమలో ... తపించి ... చివరికి కన్నతల్లి వడిలో తనువు చాలించానన్న సంతృప్తితో కన్నుమూయటం, ఆమె శరీరంలో నరనరాన్ని పట్టి కుదిపి వేసింది!

జీవితంలో నటించకూడదనుకుంటూనే ... తను మళ్ళీ నటించింది!

అరవింద పరిస్థితి తనకు కాకతాళీయంగా తెలిసి ఆమె రంగప్రవేశం చేసింది!

అదే ప్రయత్నం, డాక్టర్ రంగారావు అన్నట్లు - అదే ఇంకో నాలుగు రోజుల ముందే జరిగివుంటే ... పరిస్థితి మరో విధంగా వుండి వుండేదేమో!?

కాని ఇప్పుడు గతించిన దాన్ని గురించి చింతించి చేసేదేముంది?

ఇప్పుడు ఎంత చింతించినా చేయగలిగింది ఏంలేదు!

ఈ లోకాన్ని శాశ్వతంగా విడిచిన అరవింద్ తిరిగి యీ లోకంలోకి రాడు.

తరువాత ఇదే విషయం అన్ని పత్రికల్లో ముఖ్య శీర్షికగా, ప్రధానంగా ప్రచురింపబడింది.

ఒక పసివాడి ప్రాణాలు కాపాటానికి ఎంతో ప్రయత్నించిన అన్నపూర్ణ విషయం ఫోటోతో సహా వచ్చింది.

రమాదేవి ఈ వార్తలు పేపర్లో చదివే, తనను మళ్ళీ తన కుమారుణ్ణి కాపాడమని అర్థిస్తోందని అర్థం చేసుకుంది.

"ఒక రకంగా -తల్లి కోసం బెంగ పెట్టుకుని ... నిస్పృహతో కృంగిపోయిన అరవింద్‌కు ...మరచిపోలేని మధుర భావనలు మిగిల్చి దూరమైన ప్రియురాలి కోసం తపించిపోతున్న క్రాంతిభూషణ్‌కు దగ్గర పోలికలున్నాయేమో!" అనుకుంది అన్నపూర్ణ.

నాలుగు రోజులు ముందే తను ప్రయత్నించి వుంటే - తాను అరవింద్ ప్రాణం కాపాడగలిగి వుండేది!!

కాని ... అప్పటికే ఆలస్యమైపోయింది!!

ఇలాగే తాత్సారం చేస్తే .. కాంతిభూషణ్ కూడా తల్లి రమాదేవికి దక్కకపోవచ్చు!!

కేవలం ఇరవై నాలుగు గంటలు తల్లిగా నటించి అరవింద్‌ను మరిచిపోలేక పోతోంది తను. కాని ... కని పెంచిన తల్లి ... చెట్టంత కొడుకు ... శాశ్వతంగా దూరమైతే ... తట్టుకోగలదా!?

ఇంకా ఆలస్యంకాకముందే ... తను ... మరోసారి జీవితంలో 'నటిస్తే' ఏం!?

ఒక తల్లి కడుపు క్షోభకు గురి కాక ముందే తను ఆదుకుంటే తప్పేమిటి?

కాని ... తనను గురించిన నిజం వొకటి రమాదేవికి చెప్పాలి! కాని ... అది చెబితే!? పర్యవసానాలు? అది చెప్పకపోతే ...!? ఎటూ తేల్చుకోలేక పోయింది అన్నపూర్ణ. అప్పుడే "పార్సిల్‌లో వున్న డైరీలు చదివితే ఎలా వుంటుంది" - అన్న ఆలోచన ఆమె మనసులోకి వచ్చింది.



బలికోరిన ప్రేమ

ఎవరో పరాయి వ్యక్తి ... వ్రాసుకున్న డైరీ ... చదవటం ... అతని స్వవిషయాలు తెలుసుకోవటం సభ్యతకాదు!

కాని .. ఒక వైద్యుడు రోగికి బాధ కలిగించేదయినా అవసరమైతే పనికిరాని అంగాన్ని .. తక్కిన శరీరాన్ని కాపాడటానికి ఖండించటానికి వెనకాడనట్టు ... తనూ . కాంతిభూషణ్‌ని కాపాడటానికి ... అతని డైరీలు చదివి ... అతన్ని అర్థం చేసుకోడానికి ... అతను ప్రాణప్రదంగా ప్రేమించిన అవంతిని గురించి తెలుసుకోడానికి ప్రయత్నిస్తే తప్పేమిటి?

పైగా ఈ పని వెనక ఒక సదుద్దేశం - ఒక సదాశయం వుంది!

ఒకసారి అతని డైరీలు చదివాక ... ఇక రమాదేవి ... కాంతిభూషణ్ కోసం కోరిన పని . చేయటానికి అంగీకరించినట్లే అవుతుంది!

ఒక వేళ కాంతిభూషణ్ కోసం అవంతిగా తను రంగప్రవేశం చేయటానికి - ఆ డైరీల ద్వారా అవంతిని గురించిన విషయాలు ఏమైనా వుంటే అవి క్షుణ్ణంగా తెలుసుకోడానికి, ఆ డైరీల్లో విషయాలు సాయపడతై!

కాని .. ఒకటి మాత్రం నిజం!!

అవంతిగా నటించడానికి సిద్ధపడటం ఒక సాహసమే!

అందులో విజయం లభించినా .. లభించకపోయినా ... అది ఏవి మలుపులు తిరుగుతుందో ఎటువంటి పరిస్థితులు సృష్టిస్తుందో ... ఏ కొత్త కొత్త సమస్యలు తెచ్చి పెడుతుందో!? పైగా తన జీవితంలోని ఆ సంఘటన రమాదేవికి చెప్పకపోతే ఎలా? కాని .. అది ఎలా చెప్పటం! ఆలోచనలో పడిపోయింది.

ఆ రాత్రంతా అన్నపూర్ణ కాంతిభూషణ్ అన్ని డైరీలూ క్షుణ్ణంగా చదువుతూ తెల్లవార్లూ గడిపింది! ఆ ధ్యాసలో ఆమెకు తెల్లవారిన సంగతి తెలియదు!!


'ఏమిటమ్మా! రాత్రల్లా మేలుకుని చదువుతున్నావు!?" అంది తల్లి బెడ్ కాఫీ ఇవ్వటానికి వస్తూ.

ఉదయమే తల్లి నిద్ర లేపి కాఫీ ఇస్తేకాని ... అన్నపూర్ణకు తెల్లవారినట్టు తెలిసేదికాదు!

అలాంటిది . తనకు తెలియకుండానే ఆమె తెల్లగా తెల్లారిన సంగతి తెలియకుండా ఉండిపోవటం, తల్లి రాకతో నే తెలిసింది!!

అప్పటికి కాంతిభూషణ్ డైరీలన్నీ వరుసగా చదవటం ముగించింది - అన్నపూర్ణ అందులోని ప్రేమ ఘట్టాలతో ఆమె హృదయం బరువెక్కినట్లనిపించింది!

"నిజంగా ఒక పురుషుడు ఒక స్త్రీని ఇంత గాఢంగా ప్రేమించగలడా! మరింత బాగా ప్రేమించిన కాంతిభూషణ్‌ని ... ఆ అమ్మాయి ఎలా



విడిచిపెట్టిపోయింది? ఆ అమ్మాయి ... అవంతి ... కాంతిభూషణ్‌ని నిజంగానే ప్రేమించలేదా? నిజమైన ప్రేమ బలి కోరుతుందంటారు! చివరకి కాంతిభూషణ్ - అవంతి - ప్రేమ వ్యవహారం అలాగే అయిందా?!?ఇలా ఆలోచిస్తుండగా ఇంతలో బయట ప్లిమత్ కారు ఆగిన చప్పుడు విని తల ఎత్తి చూసింది. కాంతిభూషణ్ తల్లి రమాదేవి కారు దిగి ఇంట్లోకి త్వర త్వరగా వస్తోంది. కిటికిలోంచి ఆమె రాక స్పష్టంగా కనిపిస్తోంది అన్నపూర్ణకు.

అన్నపూర్ణ తల్లి ఎదురుగా వెళ్ళింది, ఆమెను ఆహ్వానించటానికి!

"రండమ్మా!! కూర్చోండి!" అంది ఆమె. రమాదేవికి ఎంతో వినయంతో మర్యాద చేస్తూ. .

"థ్యాంక్స్...!! ఫర్వాలేదు....!! అన్నపూర్ణ ఎక్కడమ్మా?" అంది ఆమె, తన తొందరపాటును మాటల్లో ధ్వనించకూడదన్నట్టు.

ఆమెలో కంగారు, మాటల్లో తడబాటు అన్నపూర్ణ లోపలనుంచే పసిగట్టి, తొందరగా బయటికి వచ్చి, "నమస్తే!" అంది చేతులు జోడించి.

"అమ్మా! అన్నపూర్ణా!! నీకు నేను నమస్కారం చేయాలి.... చిన్న దానివైనా!! అక్కడ మా కాంతిభూషణ్ పరిస్థితి చాలా దారుణంగా వుంది! వాడెంతో ప్రాణప్రదంగా చిత్రించుకున్న తైలవర్ణ చిత్రాలన్నీ ఒకచోట గుట్టగా పోస్తున్నాడు! వాడి వాలకం చూస్తే.... అవి తగలబెడతాడేమోనని అనుమానంగా వుంది!! చిన్నప్పటి నుంచి.... నిద్రాహారాలు మాని వాడు స్వయంగా చిత్రించుకున్న చిత్రాలమ్మా అవి!! వాడు ఏదో ఉద్దేశ్యంతో వళ్ళెరగకుండా వుండి ఆ పనికి పూనుకున్నాడు....!! కాని తరువాత వాడే మళ్ళీ మామూలు మనిషైనప్పుడు.... తను చేసిన పనికి ఎంత పశ్చాత్తాపం పొందుతాడో నేనూహించ గలను!" అంది బాధగా కళ్ళ నీళ్ళు వత్తుకుంటూ.

అప్పటికే ఒక నిర్ణయాని కొచ్చిన అన్నపూర్ణ "రమాదేవిగారూ! నేను మీరు కోరిన కోరిక తీర్చటానికి ముందు.... నా గతాన్ని గురించి ఒకసారి మీకు చెప్పాలని. . అది చాలా అవసరమని అనుకుంటున్నాను!" అంది బాధగా.

అసలు అన్నపూర్ణ అవంతిగా తన యింటికి రావటానికి ఒప్పుకోటమే పదివేలని భావించిన రమాదేవి, "అమ్మా! అన్నపూర్ణా! నీకు ఇదివరకే చెప్పాను.... నీ గతం నా కనవసరం....!! అది తెలుసుకుని నేను చేయగలిగింది, చేయబోయేది ఏం లేదు!! ఇక మనం మీనమేషాలు లెక్కపెట్టుకుంటూ కూర్చుంటే అక్కడ ఏం కొంప మునుగుతుందోనని భయంగా వుంది! పదమ్మా!" అంది, తొందర చేస్తూ.

అన్నపూర్ణ తన బట్టలు సర్దుకోడానికి లోపలికి వెళ్ళింది.

ఇంతలో రమాదేవి పది రూపాయల కట్టలు నాలుగు అన్నపూర్ణ తల్లికిస్తూ, "ఇవి ప్రస్తుతానికి ఉంచండి!! అన్నపూర్ణ నటిగా రంగస్థలం నుంచి నిష్క్రమించాక మీ ఆర్థిక స్థితి కొంచెం యిబ్బందుల్లో వుండి వుంటుంది...! అన్యథాభావించక ఈ చిన్న కానుక స్వీకరించండి!" అంది, ఆమె చేతులు పట్టి.

అన్నపూర్ణ తల్లి డబ్బు తీసుకోకుండా "ఫర్వాలేదమ్మా! డబ్బు అవసరం ఎవరికైనా వుండేదే! కాని.... మీరింత డబ్బు మా అమ్మాయి నుంచి ఏ సాయం ఆర్థించి ఇస్తున్నారో చూస్తుంటే.... భయంగా వుంది!" అంది, తన మనసులో మాట బైటపెడుతూ.

రమాదేవి ఆమె మాటలకు కొంచెం బాధపడ్డా "కన్న తల్లిగా మీరు నా బాధను అర్థం చేసుకోగలరనుకుంటాను!! ఒక అభాగ్యురాలికి పుత్రభిక్ష పెట్టటానికి సాయపడే మంచి పనికి మీ అన్నపూర్ణ కారకురాలు కాబోతోంది! ఇంతకంటే ఇప్పట్లో ఏమీ చెప్పలేను! ఆ నిర్భాగ్యురాలైన తల్లిని నేనేనమ్మా!" అంది, అన్నపూర్ణ తల్లి చేతులు పట్టుకుని, వలవల ఏడుస్తూ.

ఆమె ఏదో చాలా ప్రమాదంలో వుందని.... అన్నపూర్ణతో అతి ముఖ్యమైన పని వుండే అలా రెండోసారి వచ్చిందని అర్థం చేసుకుంది, అన్నపూర్ణ తల్లి. అందుకే ఆమె చూస్తూ వూరుకుంది.

అప్పటికే సిద్ధమైవున్నట్టు అన్నపూర్ణ తన సూట్‌కేస్‌తో నడచి బైటికి వచ్చి, "అమ్మా! నేను ఈ పూట్నే ఒక ముఖ్యమైన పనిమీద వెళుతున్నాను! నన్ను గురించి ఎవరడిగినా- మద్రాసులో సినిమాలో ప్రయత్నించటానికి వెళ్ళానని చెప్పు!! వీలుని బట్టి నేనే నీ దగ్గరికి వస్తుంటాను!" కంగారు పడాల్సిందేం లేదు. ..!! మన జాయింట్ ఎకౌంట్‌లో వున్న డబ్బు బ్యాంకు నుంచి తెచ్చుకో....!


ఓరియంట్
వినండి
మా ఘనత–
అనేకులనోట.
"మనం ఓరియంట్ ఫ్యాన్ కొనడానికి కారణం దాన్నే మా ఫాదర్ కూడా కొనడం."
"ఖుబ్ బొలో! ఒకే ఫ్యాన్‌లో రెండు బాల్ బేరింగులు దొరికాయండి."
"మా ఫ్యాన్ గొప్ప గుడ్ లుకింగ్ ఫ్యాన్, ఓరియంట్ గదా అది."
"మన ఫ్యాన్ మా అవిడ బుర్రని చల్లగా వుంచుతుంది. దాంతోబాటే ఎలక్ట్రిక్ బిల్లుని తక్కువ చేస్తుంది."
"బల్లే, బల్లే! ఓరియంట్ గొప్ప స్పీడ్‌గా తిరుగుతుంది. అయితేనేం చప్పుడేం వుండదు."
"యు! నో! మా స్టాఫ్ హాయిగా పనిచేస్తారు. ఈ ఓరియంట్ లాగే."
ORIENT
ఓరియంట్ ఫ్యాన్‌లలో వోల్టేజి హెచ్చు తగ్గులను తట్టుకుంటూనే తక్కువ విద్యుత్ ఖర్చు అయేలా చూసేలా కంప్యూటర్ డిజైన్ చేయబడిన మోటార్ వుంది. ఏమాత్రం సవ్వడి లేకుండా గ్యారంటీగా తిరిగేందుకు ప్రత్యేకమైన బాల్ బేరింగులున్నాయి. వీటిలో మరింత గాలి విచ్చేందుకుగాను ఏరోడైనమికల్లీ బ్యాలెన్స్‌డ్ బ్లేడ్‌లు. ఎలక్ట్రో స్టాటిక్ పెయింట్ ఫినిష్ మరియు సొగసైన డిజైన్. అంతేగాక ఫ్యాన్‌లు అట్టే బరువు లేకుండాను తుప్పు పట్టకుండాను వుంచేందుకు డై-కాస్ట్ అల్యూమినియమ్ బాడీ మరెయు బ్లేడ్‌లు గలవి ఇవి.
ఓరియంట్ ఫ్యాన్‌లు-సాటిలేని శ్రేణిలో మోడల్స్, రకరకాల సైజులలో ఎలాంటి అలంకరణకైనా సరిపడే ఛాయలలో. ఓరియంటల్ సీలింగ్, టేబుల్ మరియు పెడస్టల్ ఫ్యాన్‌లు.
ORIENT
ఓరియంట్
లోపల, బయటకూడా...
సాటిలేని నిర్మాణం.
C/OGI—8/86 TEL

బలికోరిన ప్రేమ

ఆరోగ్యం జాగర్త! అవసరమైతే నా అడ్రసుకురా!" అంది.

"ఆమె బ్యాంకుకు వెళ్ళవలసిన పని లేకుండా.... నేను ఇప్పుడే ఏర్పాటు చేశాను! అవసరమైతే ఇదిగో ఈ నెంబర్‌కి ఫోన్ చేస్తే మీరు ఎప్పుడైనా మా యింటికి రావచ్చు. మీ అన్నపూర్ణతో మాట్లాడవచ్చు!" అంది.

రమాదేవి ఫోన్ నెంబర్, అడ్రసున్న కార్డొకటి యిస్తూ.

అన్నపూర్ణ ప్లిమత్‌కారు కుషన్‌సీటులో కూర్చోగానే ఎ.సి. అన్ అయ్యింది, చల్లగా.

నీలిరంగులో వున్న అద్దాల్లో నుంచి బయటి మనుషులు- కార్లు- స్కూటర్లు- ఆటోలు కనిపిస్తున్నాయి.

అయితే లోపలవున్న వారెవరూ బయటికి కనిపించరు.

రాత్రంతా నిద్రలేకుండా ఉండటం వల్ల, చల్లగావున్న గాలికి లోపల కూర్చోగానే అన్నపూర్ణకు తన గతంలో జరిగిన ఒక చేదు నిజం గుర్తొచ్చింది. ఒకప్పుడు తను అలాంటి కార్లలో కొన్నాళ్ళు తిరిగింది! ఆ గతం ఒక్కసారి గుర్తొచ్చింది.

అన్నపూర్ణ నటిగా నటించకూడదని నిర్ణయించుకున్న తరువాత ఏదైనా ఉద్యోగం దొరికితే బాగుండునని ప్రయత్నం ప్రారంభించింది.

గోల్డ్ మెడల్స్‌ల పోస్టు గ్రాడ్యుయేట్లు, పి. హెచ్. డీ.లు వున్న వాళ్ళే రోడ్లమీద వూరేగుతున్న కాలంలో బి. యే. చదువుతూ.... ఆర్థిక ఇబ్బందుల వల్ల మానివేసిన అన్నపూర్ణకు ఉద్యోగం దొరకటం ఎంత దుర్లభమో తెలుసు.

అయినా తన క్వాలిఫికేషన్‌కు సరిపోయే ఏ చిన్న ఉద్యోగం దొరికినా నష్టం ఏముందని ఉద్యోగాన్వేషణ మొదలు పెట్టింది.

ఆమె ఊహించిన దానికంటే ఘోర నిరుద్యోగ వాతావరణం తాండవ మాడుతోందని అర్థం చేసుకుంది. చాలా కొద్ది రోజుల్లోనే.

ఎక్కడికి వెళ్ళినా నో వేకెన్సీ బోర్డులే!!?

సేల్స్ గరల్‌గా ఏదైనా షాపులో మూడొందలిచ్చే ఉద్యోగమైనా ఫర్వాలేదనుకుంది!

కాని అక్కడా పోస్టు గ్రాడ్యుయేట్లు డబుల్ పోస్టు గ్రాడ్యుయేట్లే ప్రత్యక్షమయ్యారు!

ఏదైనా చిన్న పిల్లలున్న ఆఫీసర్ల యిళ్ళల్లో ట్యూషన్ల కోసం ప్రయత్నించింది

అక్కడా చుక్కెదురు

పైగా నెలకు పది రూపాయలకు ఇద్దరు ముగ్గురు పిల్లలకు యిళ్ళకొచ్చి ట్యూషన్లు చెప్పేందుకు బి. యిడి., ఎమ్. యిడి.లు పోటీలు పడుతున్నారు. ఏం చేయాలో ఆమెకు తోచలేదు.

అలా నిరాశా నిస్పృహల మధ్య సతమత మయిపోతూ ఒక రోజు ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్‌లో తిరుగుతుండగా ఫేషన్ పెరేడ్‌లో పాల్గొనే అందమైన అమ్మాయిలకు మేకప్ చేసే భద్రయ్య కనిపించి, "ఏంటమ్మా! అన్నపూర్ణా!! ఏం చేస్తున్నారు?" అంటూ పలకరించాడు.

చిన్నపిల్లగా నాటకాల్లో నటించిన అన్నపూర్ణ మేకప్ భద్రయ్య మాటలకు ఏం సమాధానం చెప్పక పోవటంతో, "అమ్మా! మీకు మేకప్ చేయటం వచ్చు, చేసుకోవటం వచ్చు! ఇక్కడి ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్‌లోని ఫేషన్ పెరేడ్‌లో పాల్గొనే అమ్మాయిలకు మేకప్ చెయటానికి రండి! ఈ పని నెలరోజులపైనే వుంటుంది....! నాకు రోజుకో వంద రూపాయల కాంట్రాక్టుంది.... అందులో సగం మీ కిస్తాను! మా అసిస్టెంట్ సినిమాలో ఛాన్సుకోసం మద్రాసు వెళ్ళాడు." అన్నాడు.

అన్నపూర్ణ మళ్ళీ ఆ ఛాన్సు పోతుందేమోనన్న ఆతురతతో ఆ పనికి వప్పుకుంది.

ఫాషన్ పెరేడ్‌లో పాల్గొనే అమ్మాయిలను సప్లయ్‌చేసే బ్రోకర్ సాయంత్రం అయిదయ్యేప్పటికి మంచి మంచి అందమైన అమ్మాయిలను వేన్‌లో ఎక్కించు కొచ్చేవాడు.

వాళ్ళల్లో కాలేజి స్టూడెంట్స్ నుంచి- చదువు పూర్తయి నిరుద్యోగులుగా ఉన్న అమ్మాయిలు వరకూ ఉండేవారు.

ఒక్కొసారి మధ్య తరగతికి చెంది... వివాహమైన స్త్రీలూ వుండేవారు

ఫేషన్ పెరేడ్‌లో పాల్గొనటానికి కావలసిన మొదటి అర్హత... బాగా అందంగా ఉండటం ... ముఖం ఆకర్షణీయంగా, కళ్ళు పెద్దవిగా.... ఎత్తు అయిదున్నర అడుగులకు తగ్గకుండా, అన్ని అవయవాలు తీర్చి దిద్దినట్లుండాలి! ఒక సినియర్ అమ్మాయి గైడెన్స్‌లో వాళ్ళు వివిధ భంగిమల్లో స్టేజీమీదకు నడచి వెళ్ళి తాము ధరించిన దుస్తులు- అవి ధరించటం వల్ల తమ అంద చందాలు ఎలా యినుమడించాయో ప్రదర్శించాలి!

కేరళ స్త్రీలు ధరించే లుంగిలు, పంజాబీ స్త్రీలు ధరించే షుర్వాల్స్, ఆంధ్ర, తమిళ స్త్రీలు ధరించే చీరెలు, జాకెట్లు- రకరకాల ఫేషన్లతో వున్నవి ధరించాలి.

అయితే వీళ్ళల్లో చాలా మందికి ఇలాంటి ఫేషన్ పెరేడ్స్‌ల్లో అనుభవం తక్కువ.

మైక్‌లో నుంచి మంద్ర స్థాయిలో మ్యూజిక్ వినబడుతుంటే, దానికి అనుగుణంగా విన్యాసాలు లయబద్ధంగా చేస్తూ, తమ అందచందాలు ఫోకసింగ్ లైట్ల మధ్య ప్రదర్శించాలి!

వాళ్ళు ధరించిన దుస్తుల రంగుకు మేచ్ అయ్యేట్లు వాళ్ళ శరీర రంగుకు- ముఖ్యంగా ముఖానికి, గొంతుకు, చేతులకు- లైట్ క్రీమ్ కలర్ కేక్స్‌తో టచెస్ ఇచ్చి ఆ అందమైన యువతుల్ని మరింత అందంగా తీర్చి దిద్దే పని మేకప్ భద్రయ్యది.

అందరూ ఆడపిల్లలే కావటం వల్ల వాళ్ళకు మేకప్ చేసేపని ఎక్కువ భాగం అన్నపూర్ణ వంతుకే పడేది! అయినా అన్నపూర్ణ అందరినీ కవ్విస్తూ జోక్స్‌వేస్తూ కులాసాగా కబుర్లలో పెట్టి అందరికీ మేకప్ త్వరగా పూర్తి చేసేది.


మేకప్ భద్రయ్యే ఆమెకు అసిస్టెంట్‌గా సాయపడుతుండేవాడు.

(ఇంకా ఉంది)

యుగసంధి

ఏమని కీర్తించను?
నా కన్నతల్లిని, నా కల్పవల్లిని,
బంగరు సీమను, భారతమాతను!
పాలపొదుగులాగ ప్రేమను యిస్తుంది
తేనె వాగులాగ తీపిని యిస్తుంది
పచ్చని చేలతో భాసించు ధాత్రి
కోరిన వరమిచ్చే పుణ్యాల రాశి!
లేమిలో కుమిలేటి పేదలకు తోడెవ్వరో?
తమ్ముళ్ళ కన్నీళ్ళు తుడిచేటి వారెవ్వరో?
ఈ భరత జనయిత్రి గొడ్రాలు కాదురా,
ఎప్పుడో ఒకనాడు తన కడుపు పండదా?
ఏమని కీర్తించను,
ఇంకేమని కీర్తించను?

-కలువకొలను సదానంద



జోసెఫ్, నన్ను క్షమించు

'జ్యోతిర్మయి'

(గత సంచిక తరువాయి)

నాలుగు నెలలు గడిచాయి. ఆ రోజు సాయంత్రం లక్ష్మీకాంతంగారు ఆఫీసు నుంచి ఇంటికి వచ్చి, 'ఆ రోజు నీకు చెప్పాను గుర్తుందా? ఇంగ్లాండులో ఒక ముసలాయన మనదేశం వస్తానన్నారని. ఇవాళ ఉత్తరం వచ్చింది. ఆయన కొడుకు దగ్గర్నుంచి. ఇంకో 15 రోజుల్లో వస్తారట. ముందర ఢిల్లీ వెళ్లి కాశీ, అలహాబాదు చూసుకుని ఇక్కడికి వస్తారట. నేను రమ్మన్నాననే మన ఊరు వస్తున్నారు. మనం కాస్త ఊరదీ చూపించాలి. రెండు, మూడు రోజులు ఉంటారు. మా కంపెనీ వాళ్ళు కూడా చూసుకుంటారులే. మన ఇల్లు పెద్దది కదా. ఇంట్లో ఉంచుదామంటావా?' అన్నారు గబగబా.

'ఎందుకు లెద్దురూ? వాళ్ల అలవాట్లవీ వేరు. మన వాళ్లా ఏమన్ననా? అతనికి మొహమాటంగా ఉంటుంది. హోటల్లో ఉంచితే మంచిది. ఒక రోజు ఇంటికి తీసుకు రావచ్చు మధ్యలో.' సరేనని ఒప్పుకున్నారు ఆయన.

ఆ రోజు ఎయిర్‌పోర్ట్‌కి వెళ్లి అతన్ని రిసీవ్ చేసుకుని, హోటల్లో దింపి వచ్చారు. మోహన్‌తో, కొంచెం తీరిక చూసుకుని మధ్యాహ్నం ఆయన్ని కొంచెం అలా తిప్పి తీసుకురా. నాకు ఆఫీసులో కొంచెం పనుంది. సాయంత్రం నేను చూసుకుంటాను. పగలు రెస్టు తీసుకుంటారు ఆయన.' అన్నారు.

రెండు రోజులు ఆయన వెనకాతలే తిరిగారు, ఇద్దరూ. రెండో రోజు రాత్రి ఇంటికి తీసుకు వచ్చారు. కాస్సేపు కూర్చుని కబుర్లు చెప్పి, కాఫీ మాత్రం తాగారు. ఏమి తినాలని లేదని. దేశం కాని దేశంతో బలవంతం పెట్టడం ఇష్టం లేక ఊరుకున్నారు. చాలా సౌమ్యంగా మాట్లాడతాడు అతను. 'మై చైల్డ్' అంటూ. మాలతితో కూడా చాలా అభిమానంగా మాట్లాడారు. అందరికీ ఆయనంటే మంచి అభిప్రాయం కలిగింది.

ఆ రాత్రి పది గంటలకి ఫోను వచ్చింది, హోటల్ నుంచి. ఫలానా అతనికి మైల్డ్‌గా హార్ట్ ఎటాక్ వచ్చిందని, తను డాక్టర్ చేత పరీక్ష చేయించామని, మీ నెంబరు చెప్పారు, తెలియజెయ్యమని. వెంటనే రమ్మంటూ ఖంగారుగా పరుగెత్తారు లక్ష్మీకాంతంగారు. తన వాళ్లందరికీ దూరంగా ఉన్నారు, ఏమవుతుందో ఏమిటో అనుకుంటూ. గంట సేపటికి ఆయన్ని తీసుకుని ఇంటికి వచ్చారు. శాంతి వాళ్ల నాన్నగారిని రమ్మని ఫోను చేశారు. ఆయన వచ్చి పరీక్ష చేసి,

'ఏమీ ఫర్వాలేదు. చాలా మైల్డ్‌గా వచ్చింది. ఆ వయసుకి బాగానే తట్టుకున్నారు. పొద్దునకి మామూలు అయిపోతారు.' అని ధైర్యం చెప్పారు. నిద్ర పట్టడానికి ఇంజక్షన్ ఇచ్చారు. 'ఎందుకన్నా మంచిది. వాళ్ల వాళ్లకి కేబిల్ ఇవ్వండి. ఇంటికి వెళ్లిపోతే మంచిది, ఇంకెక్కడికీ తిరక్కుండా. ఎంత ఆరోగ్యవంతుడయినా, ఇటువంటి పరిస్థితుల్లో జాగ్రత్తగా ఉండాలి.' అన్నారు.

రాత్రంతా నిద్ర పోకుండా కూర్చున్నారు. బెంగ, భయం. ఎక్కడ్నించో వచ్చిన మనిషి ఇక్కడ ఏమన్నా అయితే ఎలాగ? ఉండుండి లేచి ఊపిరి ఆడుతుందో లేదో అని చూసేవారు లక్ష్మీకాంతంగారు. తెల తెల వారుతుంటే,

'మీరు పడుకోండి ఇంక. నేను కూర్చుంటాను. రోజంతా అలిసిపోయారు.' అని బలవంతంగా ఆయన్ని పడుకోనిచ్చి, గుమ్మం దగ్గరగా పడక కుర్చీ వాల్చుకుని కూర్చుంది. మోహన్ వచ్చి తను కూడా అక్కడే సోఫాలో పడుకున్నాడు తల్లికి తోడుగా. రాత్రంతా ఆయన లేవనే లేదు. పొద్దునే పాలవాడు రాగానే పాలు కాచి, కాఫీ కలుపుకుని తాగి నిద్ర మత్తు వదలగొట్టుకుంది మాలతి. లక్ష్మీకాంతం గార్ని లేపించి, 'ఆయన లేస్తారేమో. ఆ గదిలో కూర్చుందురు. బాత్‌రూమ్ కదీ తీసుకెళ్లాల్సి ఉంటుంది. మొహం కడుక్కుని కాఫీ తాగండి.' అంది. 'ఇంట్లో బ్రెడ్ కూడా లేదని, లేవగానే ఏమిటి ఇస్తాము ఆయనకి??'

'ఫర్వాలేదు. ముందు కొంచెం హార్లిక్స్, బిస్కట్లు ఇయ్యి. ఈలోగా షాపులు తెరుస్తారు.' అని బాత్‌రూమ్‌లోకి వెళ్లారు. పిల్లలు, ఆయనా ఒక్కసారి లేచారు. అందరూ ఆయన గదిలోనే చేరారు, కాఫీలు పుచ్చుకుని, 'ఒంట్లో ఎలా ఉందంటూ' ముసలాయన బాగానే తేరుకున్నారు ఒక్క రాత్రికే. పక్క ఇంట్లో వాళ్ళు రోజూ బ్రెడ్ తింటారు. పనిపిల్లని పంపించి ఒక అరడజను ముక్కలు తెప్పించింది అవసరానికి ఉంటాయని. ఆయన రెండు ముక్కలు తిని, మిగిలినవి పిల్లలకి ఇచ్చేశాడు. ఊర్కొనే హైరాన పడద్దని వారిస్తున్నా వినకుండా పిల్లలతో కబుర్లు మొదలెట్టారు.

'నిన్న రాత్రి మీకందరికీ చాలా ట్రబుల్ ఇచ్చాను. డాక్టరు ఎం ఫర్వాలేదు అన్నారు గానీ, నాకే ఒంటరిగా ఆ గదిలో ఉండటానికి భయం వేసింది. మిమ్మల్ని పిలిపించక తప్పలేదు. నిజంగా ఆఖరు సమయం వచ్చేస్తే ఒంటరిగా తట్టుకోలేనని ఎవరయినా కావాలనిపించింది. నాకు నిజంగా చావంటే భయం. అయామ్ ఎఫ్రయిడ్ ఆఫ్ గాడ్.' అన్నారు.

పిల్లలు అదేదో జోకులా తీసుకుని నవ్వారు. మాలతి పని చేసుకుంటూ అటూ ఇటూ తిరుగుతుంటే మాటలు వినిపిస్తున్నాయి.

'ఇన్నాళ్లకి ఇండియా వచ్చారు కదా. ఏమన్నా చూసినట్టుగా అనిపిస్తోందా? అసలు జ్ఞాపకమే లేదా? ఎలా అనిపిస్తోంది' అంటూ అడుగుతున్నాడు మోహన్.

డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుని కత్తిపీట కూర తరుగుతోంది మాలతి.

'ఈమధ్య ఎంతగానో వింటున్నాం మీ దేశం గురించి. టి. వి. లో కూడా చూస్తున్నాం. మీ ప్రగతి కాదు నాకు నచ్చింది. ఆధ్యాత్మిక నిలయం అంటారు కదా మీ దేశాన్ని. అదేదో చూద్దామని వచ్చాను. నా వయసెంతో తెలుసా? ఏడు దశాబ్దాలు దాటిపోయాయి. దేవుడి పిలుపు కోసం ఎదురు చూస్తున్నాను. ఎందుకో ఒకసారి మీ దేశం చూడాలనిపించింది. ఇపుడు మా వాళ్లకి అందరికీ కూడా ఇండియా అంటే తాజ్‌మహల్ కాదు. మీ హిమాలయాలు, గంగా, దేవాలయాలు – ఇవి ఎక్కువగా ఆకర్షిస్తున్నాయి. నిజంగానే ఏదో ప్రశాంతత ఉంది ఇక్కడ. ఇంత ప్రశాంతతని మేము భరించలేమేమో అనిపిస్తోంది. ముఖ్యంగా మీ దేశపు ఆడవాళ్ళు చాలా నచ్చారు నాకు. మా ఆడపిల్లలలోని విచ్చలవిడితనం కనిపించదు. గౌరవం కలుగుతుంది.

'మీరు ఇండియాలో ఉన్నప్పటి సంగతులు మీకు ఏమీ గుర్తు లేవా? అసలు ఏమీ జ్ఞాపకం లేదా? అంటోంది సుధ. నవ్వారు ఆయన.

'ఆ రోజులు, ఆ పరిస్థితులు మీకు తెలియవు. ప్రపంచం అంతా యుద్ధంలో మునిగిపోతోంది. ఒకళ్ళని ఒకళ్లం నాశనం చేసుకోడమే. నేను మిలిటరీలో పనిచేస్తుండేవాడిని. అప్పుడు మా సామ్రాజ్యం ఎంతో వ్యాపించి ఉండేదికదా. మిలటరీ పనిచేసే వాళ్లకి అసలు తీరయిన జీవితం ఉండేదికాదు. ఎక్కడికిపడితే అక్కడికి పోవడమే. ఎప్పుడో సెలవు దొరికితే ఇంటికి వెళ్లడమే. అస్తవ్యస్తంగా ఉండేవి జీవితాలు. ఆ రోజుల్లో

జరిగిన ఒక సంఘటనే ఇప్పటికీ నన్ను వెంటాడుతూ ఉంటుంది. ముఖ్యంగా నేను ఇక్కడికి రావడానికి అదే కారణం. ఇన్ని రోజుల్లో నాకు ధైర్యం లేకపోయింది. కానీ, ఇంకా జీవితపు ఆఖరి రోజుల్లోకి వచ్చేశాను కదా. ఇక్కడ చేసిన పాపం ఇక్కడే కడుగుకుంటే గానీ నాకు మనశ్శాంతి ఉండదేమోననిపించింది. గంగలో స్నానం చేశాను. మీకు ఆశ్చర్యంగా ఉందికదా. రోజులు దగ్గర పడుతున్నకొద్దీ నాకు దేవుడి ఎదుట నిలబడాలంటే భయంగా ఉంది. ఆ దేవుడికి సమాధానం చెప్పుకోవాలి గదా, ఎవరి నుంచి తప్పించుకున్నా.' కాస్సేపాగి ఆయన అన్నారు.

'మీకు అంతా అయోమయంగా ఉందా? ధైర్యముందంటే చెప్తాను. మీ అందర్నీ చూస్తుంటే నాకు చాలా హాయిగా ఉంది. మీ ఫామిలీ చాలా బాగుంది.'.

'చెప్పండి' అంటూ ఇద్దరూ బలవంతం చేశారు.

'మనిషన్నాక ఎన్నో పాపాలు చేస్తాము. కానీ తెలిసో, తెలియకో చేసిన మన పాపం ఇంకా వాళ్ల జీవితాన్ని నాశనం చేస్తే అది ఘోరం. దేవుడు తప్పకుండా శిక్షిస్తాడు. ఆ శిక్షకే నేను భయపడుతుంట. రెండో ప్రపంచం యుద్ధం రోజులు. నేను ఒక ఆయుధాలు చేరవేసే షిప్ మీద దేశాలు తిరుగుతున్నాను. ఇంకా చాలామందితో కలిసి. అలాగే మీ దేశం వచ్చాను. ఏదో ఊళ్లో ఆగాము. మాకేమీ పట్టేదిగాదు. ఎక్కడయినా ఒకటే పని.ఊళ్లోకి వెళ్లడం తాగి, తందనాలాడటం. మళ్ళీవి రాత్రో లేకపోతే మర్నాడు పొద్దునో షిప్‌కి చేరడం. ఆ ఊళ్లో పని అయ్యేదాకా ఇదే దినచర్య. అలా జరిగిపోయేవి రోజులు. మా తల్లిదండ్రులు కూడా ఎక్కడున్నారో పట్టేదిగాదు. ఒక రకమైన పాపపు జీవితం గడిపేవాళ్లం. అదే నన్నీ వయసులో తరుముతోంది.

ఆ రోజు మా షిప్ చూడడానికి ఒక మిషనరీ లేడీ తన స్కూలు పిల్లలని తీసుకుని వచ్చింది. ఆవిడ దగ్గర బంధువు ఒకతను మాతో పనిచేస్తున్నాడు. కొంత భాగం చూపించమంటూ. నాకు అప్పజెప్పాడు. మామూలుగానే నేను వాళ్లతో కలిసి తిరుగుతున్నాను. కానీ అనుకోకుండా నా దృష్టి చెప్తున్నదంతా కన్నార్పకుండా వింటూన్న ఒక అమ్మాయి మీద పడింది. ఎపుడూ ఆడవాళ్లతో అల్లరిచిల్లరిగా ఆడుకోడమేగానీ తేరిపార చూడడమన్నది లేదు. నా వయసుకూడా తక్కువేమీ గాదు అసలే మా దేశంలో జీవిత విధానం విచ్చలవిడి. అందులో మిలటరీ జీవితం మరి చెప్పక్కర్లేదు. అటువంటిది ఆ అమ్మాయి చూస్తుంటే ఏమిటో అనిపించింది. మామూలుగా కలిగే వికారంకాదది. ఏదో విచిత్రమైన భావన. సాధ్యమైనంతగా ఆ అమ్మాయికి దగ్గరగా నిలబడటం మొదలుపెట్టాను. ఇది ఏదో దేశం, ఎవరో అమ్మాయి, తనకి వాళ్లకి, పొసగదు అన్న ఆలోచనే రాలేదు. ఆ క్షణంలో ఆ అమ్మాయి నా కళ్ల ముందు నుంచి జారిపోతే నా జీవితమే లేదనిపించింది. పిచ్చిగా ఆ అమ్మాయి వెనకాతలే తిరిగాను. కొంతసేపటికి వాళ్ళు ఖంగారుపడ్డారు. కాంటిన్‌లోకి తీసుకెళ్లి టీ, కేకులకి ఆర్డరిచ్చాను. సాధ్యమైనంతసేపు ఆ అమ్మాయితో ఉండాలని, చీకటిపడిపోతోంది. అంటూ నాతో టీఅతను కనిపించగానే అందరూ పారిపోయినట్టే వెళ్ళిపోయారు. వాళ్ల ఖంగారు తెలుస్తోంది. ఆ అమ్మాయిని ఆపాలని ఉంది. ఎలాగో తెలియలేదు.


ఆ రాత్రంతా నాకు నిద్ర పట్టలేదు. మర్నాడుపొద్దునకి విషయం మర్చిపోదామనుకున్నాను గానీ మరింతగా బలపడిపోయింది. ఎందుకలా అనిపించిందో నాకే తెలియదు. నా గోల చూసి తోటి వాళ్లందరూ నవ్వడం మొదలెట్టారు. 'పెళ్లి చేసుకుంటావేమిటి' అంటూ. రెండో రోజున ఆ స్కూలు ఎక్కడ ఉందో కనుక్కుని నేనే అక్కడికి వెళ్లాను. మొండిగా. ఆ రోజున అంత ధైర్యంఎలా వచ్చిందో ఇప్పటికీ ఆశ్చర్యంవేస్తుంది. ఆ అమ్మాయి ఎందుకంతగా ఆకర్షించిందో తెలియదు.

ఆ ప్రిన్సిపాల్ నెమ్మదిగా 'ఇది ఆడపిల్లలకని తెరచిన స్కూలు.మనదేశంకాదు. ఎవర్నిపడితే వాళ్లని తీసుకుపోవడానికి. మర్యాదస్థుల సంఘం. ఎప్పుడూ బయటికి పంపని ఆడపిల్లలని మా మీద నమ్మకంతో పంపిస్తున్నారు.' అంటూ నచ్చచెప్పింది. నాతో తగవు పెట్టుకుంటే లాభం లేదని సాత్వికంగా మాట్లాడింది.

మళ్లీ వెళ్లాను రెండు రోజుల తర్వాత. ఈసారి ఎంతో బతిమాలుకుని 'వాళ్ల పేరెంట్స్‌ని కలుస్తానని, ఆ అమ్మాయిని అందరి అనుమతితో పెళ్లి చేసుకుంటానని, ఈ ఉద్యోగం వదిలేసి మంచివాడిగా స్థిరపడతానని బతిమాలుకున్నాను. ఎవరూ నమ్మరు ఆ మాటలు. ఆవిడ ఎంతో ఇదిగా 'ఇది జరిగే పనిగాదు. నీ వయసెంత. ఆ పిల్ల వయసెంత? ఎక్కడి నుంచి వచ్చిన వాడివి నువ్వు? ఎంత మంచి వాడివయినా నీకివ్వరు. కొంచెం తెలివి తెచ్చు కుని ఆలోచించుకో.' అంటూ ఆ అమ్మాయిని నాకు కనిపించకుండా చేసింది. పిచ్చివాడిలా రోడ్లన్నీ తిరిగాను. ఎక్కడన్నా కనిపిస్తుందేమోనని. నిజంగా నాలో కపటంలేదు. ఇంకా జీవించడం దుర్భరం అనిపించింది. ఆ ప్రిన్సిపాల్ మీద జాగా పిచ్చి కోపంగా ఉండేది, నాకు కాకుండా చేసిందని. అంతా నాపరంగానే ఆలోచించేవాడిని. అంతవరకూ అవతల వాళ్ళు నా మూలంగా ఏం బాధపడ్డారో అన్న ఆలోచనే రాలేదు.

కొన్ని రోజుల తర్వాత ఆ ప్రిన్సిపాల్ ఒక ఫాదర్‌తో ఏదో పని మీద మా షిప్ మీదకి వచ్చింది.నా వాలకం చూసింది.నన్ను దగ్గరకు కూర్చోబెట్టుకుని,

'నీ వైపు నుంచి ఆలోచిస్తున్నావే గానీ లేత వయసులో ఉన్న ఆ పిల్ల జీవితాన్ని, కలల్ని ఎలా నాశనం చేశావో నీకసలు ధ్యాస ఉందా? ఆడపిల్లలు చదవుకోడమే తక్కువ ఇక్కడ. అలాంటిది తెలివితేటలుగా చదువుతోంది. నీ మూలంగా ఆ అమ్మాయి అన్నీ వదులుకుని భయపడి పారిపోయింది. ఎన్నో రోజుల నుంచి ఇక్కడ ఉంటున్నాము. ఈ సంఘం పరిస్థితులు తెలిస్తే ఇలా ఉండవు నువ్వు. మీద చెయ్యి వెయ్యడం కాదు కదా, ఎవరయినా వెకిలిగా ఆడపిల్ల వైపు చూస్తేనే ఆ పిల్ల పేరు పాడయి పోతుంది. అలాంటి సమాజం ఇది. అందులో ఎక్కడి వాడివో నువ్వు వచ్చి ఆ అమ్మాయి వెనకాతల పడ్డావని నలుగురికి తెలిస్తే ఆ పిల్ల, తల్లిదండ్రులు కూడా ఆత్మహత్య చేసుకోవాల్సిందే తప్ప ఎవరూ ఆ అమ్మాయిని చేసుకోరు. మర్యాదగా బతకనివ్వరు. నీతోటి ఎలా పంపిస్తావనుకున్నావు? నీ జీవితం ఏమిటి? ఎంత పాపపు బ్రతుకు గడుపుతున్నావో తెలుసా? దేవుడికి భయపడు ఏదో ఒక రోజు ఈ పాపానికి దేవుడి ఎదుట సమాధానం చెప్పుకోవాలి.



భారతి

ఏప్రిల్ 1986 సంచిక వెలువడినది

కథలు :

చేతులు కాలేక-శ్రీ మేకా సుధాకరరావు
శ్రీ గణపతిని సేవింపరా రె-వి.పద్మప్రియ
ఉచితం —మూలం. కుందీప్ బగ్గా:
అనువాదం—సుంకర భాస్కరరావు
అవధూతస్వామి-గుమ్మనూరురమేష్ బాబు
గర్ల్ ఫ్రండ్—శ్రీ వి. వి. బి. రామారావు

వ్యాసాలు :

1. స్వేచ్ఛాకవిత్వమూ-నేటి సంశిష్టస్థితి
శ్రీ మాదిరాజు రంగారావు.
2. నవనాథ చరిత్ర-అనుశీలన
డా. ముట్నూరి సంగమేశం
3. శ్రేయోరాజ్యం భారతీయ పౌరాణికభావాలు
శ్రీ టి. యన్. వి. సుబ్రహ్మణ్యం.
4. ప్రజాదరం పొందిన పౌరాణిక నాటకాలు
శ్రీ రామమోహనరాయ్
5. డోలాభూషోత్తరీయాణి- శ్రీ ఆకురాతి పున్నారావు
6. ఆహారధాన్యాల విక్రయం కాగల మిగులు—
నిర్దిష్ట అధ్యయనం
{— శ్రీ ములుకుల ఉపేందర్
{— శ్రీ యం. రమేష్‌రెడ్డి.
7. షరియత్ రక్షణోద్యమం — చాణక్య

భక్తజయదేవ (నాటకం)
శ్రీ పెదగాడి సూర్యప్రకాశరావు
ఈమాసం...మీ నక్షత్ర ఫలం
- శ్రీ నిష్ఠల వెంకటసత్యసుబ్రహ్మణ్యం
సృష్టి (సీరియల్) : శ్రీ ఇచ్ఛాపురపు
రామచంద్రం


కవిత్వం :

భారతీ వందనము-శ్రీ బులుసు వెంకటేశ్వర్లు
1. ఆర్తి - ఆకెళ్ల శివప్రసాద్
2. ఉగాదిలక్ష్మి —శ్రీ పాతకోట రాధాకృష్ణమూర్తి
3. తేడా — డా. ఎమ్. విజయగోపాల్
4. శివరాత్రిపాట — శ్రీ దేశెట్టి కేశవరావు
5. గుణ్యారామరాయగురువిధేయ. డా.బండ్లమూడి
ఆంజనేయులు
6. సమత—శ్రీ పులికంటికృష్ణారెడ్డి
7. తస్మాత్ జాగ్రత్త — శ్రీ దిలావర్
8. విరహిణి రాధ- శ్రీ ఘట్టిప్రోలు కృష్ణమూర్తి.
9. ఈకవిత, చివరిమాట-మూలం : శ్రీ బి.యస్
శివరుద్రప్ప. అనువాదం : శ్రీ తంగిరాల వెంకట
సుబ్బారావు
10. కిరాతకుణ్ని - శ్రీ జి. బాలాజి.
11. యుగాంతం - శ్రీ గడియారం శేషఫణిశర్మ
12. దేవుడి సొంచ్చికంగా - శ్రీ అడబాల
వి.వి. సత్యనారాయణ;
13. జాతస్య - శ్రీ చల్లా రామఫణి
14 భాష్యం - రవి
15. ఏదేశంలో నైనా, కవితచెప్పిన, స్త్రీ-
శ్రీ కె. కిశోరుబాబు, శ్రీ కె. అశోకుబాబు

వచ్చేనెల భారతిలో

కవిజనాశ్రయ కర్త మల్లియ రేచన

రచన శ్రీ పి. వి. పరబ్రహ్మశాస్త్రి



తప్పించుకోలేవు. తన బిడ్డల్ని ఎవరయినా హింసిస్తే, దుఃఖపెడితే దేవుడు మన్నించడు. నిన్ను శపిస్తాడు. ఇప్పటికైనా తెలివి తెచ్చుకుని జీవితాన్ని మార్చుకో' అంటూ ఫాదర్ చేత నాకు దైవోపదేశం చేయించింది.

అంతే ఆ రోజుతో నా జీవితం పూర్తిగా మారిపోయింది. నేనెంత తప్పు చేశానో తెలిసింది. తిరిగివచ్చి కొత్త జీవితం ప్రారంభించాను. తెలిసి తెలిసి ఎవర్నీ బాధపెట్టలేదు. ఏదో ఒకమంచి పనిచేసి నా పాపాన్ని కడుక్కోవాలనే ప్రయత్నం. అయినా నాకు మనశ్శాంతి లేదు. అందులో ఈ చివరి రోజుల్లో, దేవుని పిలుపు కోసం ఎదురు చూస్తున్న

జీసస్, నన్ను క్షమించు

నేను విపరీతంగా భయపడుతున్నాను. చావంటే భయంగా ఉంది. దేవుని ముందు నిలబడాలని. ఆ అమ్మాయి నిజంగా నా బాధపడలేక ఆత్మహత్య చేసుకుందా? పగలూ రాత్రీ ఇదే ప్రశ్న అందుకనే మీ దేశం వచ్చాను. ఇక్కడ తిరిగితే ఏమన్నా మనశ్శాంతి దొరుకుతుందేమోనని.

నిత్యమూ ఒకటే ప్రార్థన. జీసస్, నన్ను క్షమించు' అంటూ ఆగారు.

యథాలాపంగా వింటున్న మాలతి కొయ్యబారిపోయింది. చెవుల్లోంచి ఆవిరి వచ్చినట్లయింది.

'ఊర్కోండి అంకుల్ ఎందుకంత భయపడతారు? మనచేత తప్పులు చేయించేది దేవుడే. మళ్లీ శిక్షించేది దేవుడే. అదెలా కుదుర్తుంది?' అంటున్నాడు మోహన్.

'అదే తప్పు. దేవుడి సృష్టి అంతటిలోకి మనిషి జన్మ

అపురూపమైనది. ఎందుకంటే, మనకి మెదడు ఇచ్చాడు. ఆలోచనాశక్తి ఇచ్చాడు. అటువంటప్పుడు కూడా తప్పులు చేస్తే ఎందుకు క్షమించాలి?'

'ఇదిగో మళ్లీ ఇదొక టాపిక్ తీసుకొచ్చారా" ఆయన్ని ఇంక మాట్లాడించకండి. అసలే ఒంట్లో బాగులేని మనిషి. మరీ ఆవేశపడుతున్నారు. ఎప్పుడో అయిపోయినవన్నీ జ్ఞాపకం చేస్తూను' అని పిల్లల్ని మందలించి బయటికి తీసుకొచ్చారు లక్ష్మీకాంతంగారు మాలతి గబుక్కున వంటింట్లోకి తప్పుకుంది. పొద్దున్నే శాంతి వచ్చింది వాళ్ల నాన్నగారితో మళ్లీ ఒక ఇంజక్షన్ చేసి, మందులు వేసుకోమని చెప్పి వెళ్లిపోతుంటే,

'సాధ్యమైనంతవరకూ దేవుడి దగ్గరకి చేరే ప్రయత్నాన్ని వాయిదా వేయిస్తుంటారు మీ డాక్టర్లు' అన్నారు నవ్వుతూ ముసలాయన

'అలా అనకండి ఇది కూడా దేవుడి చేతుల్లోదే ఆయన రమ్మంటే మేము ఎంత ప్రయత్నించినా ఆపగలమా? కాకపోతే మందులతో ఎక్కువ బాధపడుతూ ఉండకుండా ఉపశమనం కలిగిస్తాం అంతే అన్నారు డాక్టరుగారు నవ్వుతూనే

ఆఫీసుకి వెళుతూ 'చూడు మాలతీ ఆయన మళ్లీ పడుకున్నారు. నాకు బొంబాయి నుంచి వచ్చిన కొంతమందితో మాట్లాడే పని ఉంది ఆఫీసులో వాళ్ళు ఇవాళ వెళ్లిపోతున్నారు. తొందరగా వచ్చేస్తాను. వాళ్ల అబ్బాయికి కూడా తెలియపర్చాలి గదా. ఏం చెయ్యమంటాడో" పనిపిల్లని గుమ్మం దగ్గర కూర్చోమను లేస్తే చెపుతుంది లేచి తిరుగుతున్నారు గదా ఆయన పనులు ఆయన చేసుకోగలరు. కొంచెం మందులు వేసుకున్నారో లేదో గుర్తు చెయ్యి. నీకు భాష ప్రాబ్లమ్ కాదు కదా మళ్లీ హార్లిక్స్, బ్రెడ్ ఇయ్యి పెద్దాయన ఫ్రీగా తిరుగు ఫర్వాలేదు సుధ తొందరగా వచ్చేస్తానంది' అని, 'అదేమిటి మొహం అలా ఉంది" రాత్రంతా

నిద్ర లేదు కదా. భయపడిపోయావేమిటి? నేనూ ఇంతేలే. ఏమన్నా అయితే ఏం చెయ్యగలం?'అంటూ వెళ్ళిపోయారు శ్రీకాంతంగారు.

అమ్మగారు ఆ బాబుగారు లేచారండి' అంటూ పరిగెత్తు కొచ్చింది పనిపిల్ల. పనంతా చేసుకొని పేపరు చూస్తోంది మాలతి. ఇపుడు మనసు ప్రశాంతంగా ఉంది ఆవిడకి కొన్ని గంటల సముదాయింపుతో.

'అక్కడే నిలబడి ఉండు వస్తున్నాను'. అని గబగబా హార్లిక్స్ కలిపి, బ్రెడ్ టోస్ట్ చేసి పట్టుకెళ్ళింది. కర్టెన్ తీసుకొని ట్రేతో లోపలికి వస్తూ.

'ఎలా ఉంది? ఇపుడు మీకు బాగుందా?' అంది నవ్వుతూ.

'చాలా బాగుంది. మీకందరికీ చాలా ట్రబుల్ ఇచ్చాను. అదే బాధగా ఉంది'.

'ఏమి ఫర్వాలేదు. మీ పిల్లలయితే చేయ్యరా అలాగే. మాదేశం చూడ్డానికి ఎంతో అభిమానంగా వచ్చారు. మీ బాధ్యత మాదికదా.'

'హార్ట్ ఎటాక్ నుంచి కోలుకుంటున్న మనిషి తను చెప్పే విషయం విని తట్టుకోగలడా? అలాకాక దానివల్ల అతని హృదయం తేలికపడి తొందరగా కోలుకుంటాడేమో' . అతని వైపే చూస్తూ ఆలోచిస్తోంది. ఏదో నిర్ణయించుకున్నట్టు లేచి బయటకి వెళ్ళి, పాత ఆల్బమ్ ఒకటి తెచ్చింది.

'ఏమిటి? ఆల్బమ్ . మీ ఫోటోలన్నీ ఉన్నాయా? మీది ఒక స్వీట్‌హోమ్ మైచైల్డ్. నీ పిల్లలు , నీ భర్త నీ వెనకాతలే ఎంతలా తిరుగుతారు? పొద్దున లేచిన దగ్గర నుంచి నీ మీద ఎంతగా ఆధారపడతారు? యు ఆర్ ది సెంట్రల్ ఫిగర్. నీ చుట్టూ నీ ఇల్లు తిరుగుతోంది. చూడ్డానికి చాలా హాయిగా ఉంది. ఒక నిజమైన భారత స్త్రీ రూపాన్ని చూస్తున్నాను.' అంటూ ఆల్బమ్ అందుకోబోయాడు.

'ఈ ఫోటోలో అమ్మాయిని గుర్తు పట్టగలరా 'గొంతు పెగుల్చుకుని అడిగింది. మాలతి. దడదడ కొట్టుకుంటున్న గుండె చప్పుడు గొంతులోకి వినిపిస్తోంది. స్కూలు యూనిఫారమ్‌తో తియించుకున్న ఫోటో అది. ఆయన దగ్గరగా పెట్టుకుని చూసి,

'ఈ అమ్మాయి..... ' అంటూ అర్థోక్తిలో ఆగిపోయి తన వైపు చూశారు. మళ్ళీ ఫోటో చూసి తల ఎత్తిన మనిషి ఎత్తినట్లే ఉండిపోయారు. ఏదో వెదుకుతున్నట్టుగా ఆగిపోయారు.

'ఈ అమ్మాయి నువ్వేనా? అవును కదూ' అన్నాడు ఏదో లోకం లోంచి మాట్లాడుతున్నట్టుగా. 'నేను చెప్పినదంతా విన్నారా?'

'అవునన్నట్టు తల వూపింది.' ఆ అమ్మాయిని నేనే. ఇన్నాళ్ళ తర్వాత ఇలా మొహం కూడా గుర్తు లేని ఆ మనిషి ఇలా తారస పడతారనుకోలేదు. ఆ రోజు నా వెనక పడి నా జీవితమే మార్చేశారు. కాళ్ళు చేతులు వణుకుతూ, చెమటలు కార్చుకుంటూ బయట పడ్డాను అక్కడ నుంచి. ఏదో అయిపోయిందను కుంటే రెండు రోజుల తర్వాత మళ్ళీ వచ్చారు. నన్ను స్టాఫ్ బాత్‌రూమ్‌లో దాచారు ఎవరికీ కనిపించకుండా. నాన్న గారిని పిలిపించారు. ప్రిన్సిపాల్ నెమ్మదిగా విషయం వివరించారు. స్కూల్లో పిల్లలకి కూడా తెలియనివ్వ లేదు నేను. అనవసరంగా విషయం బయటకి పోతుందని. ఈ మనుష్యులు చాలా ప్రమాదకరమైన వాళ్ళు, ఊరంతా తిరుగుతున్నారు. వాళ్ళలో ఎవరు మీ అమ్మాయిని చూసినా ప్రమాదమే. ఎక్కడికన్నా



పంపే ప్రయత్నం చెయ్యండి. ఇదంతా నావల్ల కూడా జరిగింది. చాలా బాధపడుతున్నాను. తెలివైన పిల్ల. కానీ జీవితం ముఖ్యం కదా. ఆలస్యం లేకుండా ఏదో ఒకటి చెయ్యండి.

నాన్నగారికి ఇది ఒక షాక్. ఇలాంటిది కూడా జరుగుతుందన్న ఆలోచనే లేదు. అంత మనిషీ డీలా పడిపోయారు. తన హోదా అదీ ఈ సమయంలో పనికి రాదని గ్రహించుకున్నారు. ఏం చేసినా మరింతగా అందరి నోళ్లల్లో పడతారు. నేనయితే బెదిరిపోయాను. ఉన్నపళంగా నన్ను వూరు నుంచి తీసుకెళ్లి పోయారు. చాలా రోజులు రాత్రిళ్లు నిద్రపట్టలేదు. కళ్లు మూసుకుంటే ఎవరో ఎత్తుకు పోతారనే భయం. ఆవిడ అన్నట్టుగా ఈ విషయం ఏమాత్రం బయటకి వచ్చినా మాకు ఆత్మహత్యే శరణ్యం అయ్యేది. అందులో ఒక తెల్లవాడు ఊర్కొనే వెనక పడ్డాడంటే ఎవరూ ఊర్కోరు. ఏదో చేసే ఉంటాడు అంటారు.' తనలో తనే అనుకున్నట్టుగా చెప్పుకు పోతోంది మాలతి.

'ఇప్పటికీ నిద్దట్లో భయపడుతుంటాను. ఉదయం మీరా విషయం చెపుతుంటే నాలో చలనం ఆగిపోయింది. ఎప్పుడన్నా అనుకున్నారా? ఇలా ఎక్కడి వాళ్లమో కలుస్తామని. ఏదో మామూలు సంఘటనలా చెప్పి ఉంటే నేనూ విని ఊర్కునే దాన్ని. ఇప్పటి ఈ గౌరవం ఉండేది కాదేమో. కానీ ఆఖరులో మీరు అన్న మాటలు నన్ను కదిలించాయి. ఆ రోజుల మాయమయిన అమ్మాయి

జీసస్, నన్ను క్షమించు.

ఏమయిపోయిందో అని మీరు మథన పడుతుంటే ఊర్కోలేక పోయాను. పెళ్లయిన కొన్ని రోజులకే నేను ఆ బాధ మర్చిపోయాను. ఆ తర్వాత పిల్లలతో నా కలలన్నీ తీర్చుకోగలిగాను. అందుకని నేనెక్కువగా పోగొట్టుకున్నది లేదు. కొన్ని రోజులు పడ్డ మనస్తాపం తప్ప. మీరు నిశ్చింతగా గడపండి ఈ రోజులు. మీదేవుడైనా, మా దేవుడైనా తెలిసి తెలిసి అవతల మనిషిని బాధపెడితే క్షమించడు. అందుకనే ఇలా ధైర్యం చేసి మీతో ఇదంతా చెప్తున్నాను. ఏ దేవుడి ముందు తలవంచవలసిన అవసరం మీకు లేదు ఎందుకంటే ఇన్ని రోజులూ మీరు పడ్డ క్షోభే మీకు పెద్ద శిక్ష' అంటూ తేలికపడ్డ హృదయంతో ఆగింది.

ముసలాయన మొహం ఆనందంతో వెలిగింది. ముందురాత్రి రోగ లక్షణాలు కూడా ఏమీ కనిపించలేదు.

'గాడ్ ఈజ్ గ్రేట్ చైల్డ్! నిన్న రాత్రి నా బాధకి దేవుడు నన్ను శిక్షిస్తున్నాడనుకున్నాను గానీ, నాకు విముక్తి కలిగిస్తున్నాడనుకోలేదు. ఆ పరిస్థితే రాకపోతే నేను మీ యింట్లో ఉండను, ఆ ప్రస్తావనే రాకపోను. చాలు. ఆ దేవుడి కన్న ముందు నువ్వు నన్ను క్షమించావు. నాకెంతో తేలిగ్గా ఉంది. ఇన్నాళ్లు ఎంత నరకం అనుభవించానో నీకు తెలియదు. ఈ శిక్ష ఇంక చాలనుకున్నాడు దేవుడు.అందుకనే నాకు మీ దేశం రావాలన్న కోరిక కలిగించాడు.' అని ఉద్వేగంతో ఆగి,

'అవునూ. నేను చెప్తనపుడు నీ భర్త ఏమీ అనలేదే? అతనికి ఈ విషయం తెలియదా?ఇన్నాళ్లయినా చెప్పలేదా నమ్మలేనట్టుగా అన్నాడు.

పేలవంగా నవ్వింది మాలతి.

'ఈ దేశంలో భార్య విషయంలో భర్త చాలా స్వార్థపరుడు. మనసా, వాచా ఆమె పూర్తిగా తనదే అయి ఉండాలి. ఒక విధంగా మా దేశంలో ఈ కుటుంబ వ్యవస్థ, భార్యాభర్తల అనుబంధం ఇంకా మిగలడానికి ఇదీ ఒక కారణమే. బయట ఎన్ని తిరిగినా ఆఖరికి తన దగ్గరకే వస్తాడనే నమ్మకంతో ఈ దేశపు భార్య అలా ఎదురు చూస్తూనే ఉంటుంది. కొన్ని దశాబ్దాల కిందట అయినా సరే ఎవరో వ్యక్తి తన భార్యని కూడని దృష్టితో చూశాడని తెలిసి ఇపుడు కూడా ఆయన భరించలేరు. ఎప్పటికీ ఈ విషయం చెప్పవద్దని నాన్నగారు నాదగ్గర నుంచి మాట తీసుకున్నారు. అర్థం చేసుకుంటే కలిగే తృప్తి కన్న , అపార్థం చేసుకోవడం వల్ల వచ్చే నష్టమే ఎక్కువ. ఇంతేనా, ఇంకా ఏమన్నా జరిగిందా అన్న అనుమానం జీవితాంతం పీడిస్తుంది. అది ఎటువంటి పరిణామాలకన్నా దారి తీయవచ్చు. ఇంక ఇపుడు చెప్పే ప్రశ్నే లేదు. మీ నోటమ్మట ఆ నాటి భావాలు విన్నాక తల పండి పోయిన ఈ వయసులో కూడా ఆయన భరించలేరు. ఆయనకు

నా దగ్గర రహస్యాలు లేవు. అందుకనే అవుడపుడు నేను చాలా బాధపడుతుంటాను- ఆయన లోని)ర్మలత్వం నాలో లేదని. ఏం చెయ్యను? విషయం ·ెలిసిన అమ్మానాన్న, ఆ ప్రిన్సిపాల్ లేనేలేరు. నేను ·ప్పే ప్రసక్తే లేదు'. అంటూంటే మధ్యలో అందుకొని.

'డోన్ట్ వరీ చైల్డ్. బి ఎస్యూర్డ్. నీ భావనలు అర్థం చేసుకున్నాను. ఈ రహస్యం నాతోనే చచ్చిపోతుంది. ఈ రాజు నుంచీ జీసస్ , నన్ను క్షమించు అంటూ భయపడే రోజులు పోయాయి. నువ్వు, భర్త, నీ పిల్లలు ఇలాగే సుఖంగా ఉండాలని ఆ దేవదేవుని ప్రార్థిస్తాను నాకు పిలుపు వచ్చేదాకా'. అన్నారు.

'మీరు విశ్రాంతి తీసుకోండి. ఈ రోజంతా చాలా ఉద్వేగ పడ్డారు.' అంటూ లేచింది. ఆయన చేతిలోకి క్రాస్ తీసుకుని. బాగ్ లోంచి బైబిల్ తీసుకుని,

'నిర్మలమైన మనసుతో భగవధ్యాన్నం చేసుకుంటాను కొంతసేపు' అని చదువుకోసాగారు.

ఆ తర్వాత ఆయన కొడుకు ఫోనులో మాట్లాడి తన స్నేహితుడొకరు ఢిల్లీ హైకమిషన్‌లో ఉన్నాడని, అతని కుటుంబంతో తన తండ్రిని పంపించి వెయ్యమని చెప్తే, మోహన్ ఆయన కోరిక మీద రైలులో ఢిల్లీ తీసుకెళ్ళి దిగబెట్టాడు. ఇంటికి చేరాక ముసలాయన కృతజ్ఞతలతో ఉత్తరం కూడా రాశారు.

* * *

అరు నెలలు ఇట్టే జరిగిపోయాయి. లక్ష్మీకాంతం గారు, మాలతి కొడుకు పెళ్ళి ముహూర్తాలు పెట్టుకున్నారు. ఆ హడావుడిలో రోజులు సరదాగా గడిచి పోతున్నాయి. వియ్యాపు రాళ్ళు ఇద్దరూ కలిసి షాపింగ్‌లు చేస్తున్నారు.

ఆఫీసు నుంచి ఇంటికి వచ్చిన లక్ష్మీకాంతం గారికి, ఆ రోజు తను నగల కొట్టుకి వెళ్ళి సెలక్టు చేసిన డిజైన్ల వివరాలు ఉత్సాహంగా చెప్తోంది మాలతి.

'కొత్త మోడల్ లెండి. సింపుల్‌గా ఉంది. శాంతి ఎలాగూ, ఎక్కువ బంగారం పెట్టదు, తేలిగ్గా ఉన్నవి చూడమంది కదా. తనకి నచ్చింది. గాజులకి కూడా చెప్పేశాను. సరళకి కూడా ఏదో నెల గాజులు పెట్టించి నపుడు ఇవ్వచ్చుని, ఇంకో జత కూడా చెప్పాను' ఆయన తన మాటలు సరిగ్గా వినడం లేదని గ్రహించి ఆగిపోయింది.

'ఏమిటి అలా ఉన్నారు? ఒంట్లో బాగు లేదా?'

'ఏమీ లేదు . ఇవాళొక ఉత్తరం వచ్చింది. మన ఇంటికి వచ్చిన ముసలాయన గుర్తున్నారా? పోయారట. కొడుకు రాశాడు.' అప్రయత్నంగా మాలతి కళ్ళు చెమర్చాయి. తను సుఖంగా ఉందని తెలిసి, వెలిగిన ఆ మొహమే కళ్ళముందు నిలబడింది.

'పోనీ మిగిలిన రోజులన్నీ హాయిగా గడిపారట. చాలా పీస్‌ఫుల్‌గా పోయారట. మీ దేశంలో ప్రశాంతత పొందుతానని అంటే ఏదో పంపించాను గానీ దాన్లో ఇంత నిజముందనుకో లేదు. అక్కడి నుంచి వచ్చాక చాలా మారిపోయారు. ఎప్పుడూ టెన్షన్‌తో కుంచించుకు పోయి చావంటే భయపడి పోయే మనిషి అంత ఉత్సాహంగా ఎలా తయారయ్యారు. ఆ రహస్యం ఇప్పటికీ అర్థం అవడం లేదు. మీ దేశంలో నిజంగానే ఏదో ఉంది. నేనూ ఫామిలీతో ఒకసారి వస్తాను అంటూ రాశారు. పోనీలే. ఆ రోజుల్లో ఆయనకి ఒంట్లో బాగులేక పోతే ఎంత భయపడ్డాము. దేశం కాని దేశంలో ఏమయిపోతాడో అని. ఏమిటో పరిచయం కొంచెమే అయినా ఈ వార్త వింటే మనసు ఏమిటో లా అయిపోయింది. తను కావాలనుకున్న తృప్తి ఏదో పొందే వెళ్ళాడు ఇక్కడనుంచి. అదే చాలు. అవును, ఏదో చెప్తున్నావు ఇందాక, సరిగ్గా వినలేదు'.

'తర్వాత చెప్తాను లెండి. కాఫీ చల్లారిపోయింది. మళ్ళీ తెస్తాను' అంటూ వంటింట్లోకి వెళ్ళి పోయింది. ఆమె మనసంతా ఉత్తరంలో ని మాటల మీదే ఉంది.

'నిజమే . ఆ రహస్యం ఎవరికి తెలియదు. అది ఆయనతోనే చచ్చిపోయింది. నాతో పూర్తిగా సమాధి అయిపోతుంది.' అని నిట్టూర్చింది.

(అయిపోయింది)

ఇ'వేమన'పద్యాలు




సంద్రమునకు జూడ సరియేదియును లేదు
అట్టి జలధినీరు ననువుగాదు
అనువుగాని నీరు యదియేమి చేయను
విశ్వదాభిరామ వినురవేమ

సీరియల్

ఎన్. భారతీ దేవి

ప్రేమసాగరం



(గత సంచిక తరువాయి)

స్వప్న వాళ్ళను ఇంట్లో నుంచి పంపించమని జయరాంతో చెప్పి కూడా పది రోజులు దాటిపోయింది. వాళ్ళను పంపించలేదు సరికదా? పంపించే సూచనలు కూడా ఎక్కడా కనిపించలేదు. వేరే ఇల్లు చూసి పంపుతాడేమో వాళ్ళను అని ఎదురు చూస్తుంది స్వప్న.

జరుగుతున్న, ఒక్కొక్క సంఘటనా ఆమె హృదయాన్ని మరింత గాయం చేస్తున్నాయి. హాలులో ఉన్న ఫోన్ తీసి, తన గదిలో పెట్టించుకుంది. మిగతా వస్తువులు స్వప్న అడగలేదు. వాళ్ళు ఇవ్వలేదు.

పనివాళ్ళకు స్వప్న ఆ ఇంటి యజమానురాలని, తమ, జీతాల డబ్బు కూడా ఆమె ఇస్తుందన్న విషయం తెలియదు. స్వప్న పిలిస్తేనే, వాళ్ళు నిర్లక్ష్యంగా ఉంటున్నారు. అది గమనించిన స్వప్న వాళ్ళను అవసరమయినా, పలకరించటం మానేసింది.

రాములమ్మ మాత్రం, ఆమెను కనిపెట్టుకు నుంటుంది. రోజుకు కనీసం ఇరవయిసార్లు టీలు తాగే, స్వప్న ఆ అలవాటును రోజుకు రెండు సార్లకు మార్చుకుంది. మరి తలనెప్పి అనిపిస్తే రాములమ్మ చేత హోటల్ నుంచి ఫ్లాస్కుతో తెప్పించుకుని తాగుతుంది.

తనింట్లో తనే, పరాయి దానిలా, పనివాళ్ళ కంటే తక్కువగా, తన బెడ్‌రూములో నుంచి బయటకు రాకుండా ఒక విధమయిన జైలు జీవితాన్ని గడుపుతుంది.

పగవాళ్ళకు కూడా, కన్నీరు తెప్పించేటంత దుస్థితిలో గడుపుతుంది స్వప్న. నీరసం మూలంగా, స్కూలు దగ్గరకు కూడా వెళ్ళలేకపోతుంది. రఘునాథ్ స్వప్నకు ఫోన్ చేసి, ఆమె ఆరోగ్యం గురించి తెల్సుకుంటున్నాడు.

ఇంటికి మాత్రం రావటం లేదు. అతనొచ్చి, తన స్థితి తెల్సుకుని, బాధ పడటం కంటే, అతను రాకుండా ఉండటమే మంచిదనుకున్న స్వప్న కూడా అతన్ని ఇంటికి రమ్మనటం లేదు.

* * * * *

జీవితం ఏమిటి? అనే నవల చదువుతూ పడుకుంది స్వప్న. జయరాం వచ్చి సోఫాలో కూర్చున్నాడు. అతనిప్పుడు బెడ్‌రూములో కొస్తున్నాడంటే భయంగా ఉంటుంది స్వప్నకు. అతనొచ్చి లాలనగా ఆమె ఆరోగ్యం గురించి తెల్సుకోవటం గానీ, ప్రేమగా నాలుగు మాటలు మాట్లాడటం గానీ లేదు. ఏదయినా కారణం ఉంటేనే రావటం. అయిదు వేల లోపు తప్ప, అంతకు మించి డబ్బు అవసరమయితే, చెక్కు మీద స్వప్న సంతకం కావాలి.

"స్వప్నా!" పిలిచాడు జయరాం. అతనెంత మృదువుగా పిలిచినా, ఆ పిలుపులో ఆమెకు నటనే కనిపిస్తుంది. అతని వైపు చూసింది. అతని చూపులు నేల వైపుకు తిరిగాయి.

ఒకవిధంగా అన్‌నేచురాలిటీని ప్రతిబింబించే బ్రతుకు బ్రతకటం ఎంతో దురదృష్టమని స్వానుభవం మీద తెల్సుకుంది స్వప్న.

"ఏమిటి?"

"ఎందుకు స్వప్నా! అంత కటువుగా మాట్లాడుతావు? నీతో మాట్లాడాలంటేనే భయంగా ఉంటుంది. నాకు రాను, రాను మనిద్దరి మధ్యా ఏర్పడిన దూరాన్ని, నువ్వు శాశ్వతం చేసేలా ఉన్నావు." అన్నాడు ఎంతో ప్రేమను కనబరుస్తూ.

భార్యాభర్తల బంధం అంటే, రెండు శరీరాలు ఏకం కావటం మాత్రమే కాదు. రెండు మనస్సులు కల్సి, జీవితాంతం ఆప్యాయతలూ, బాధ్యతలూ పంచుకోవాల్సిన అనుబంధం. అటువంటి పవిత్రమయిన వివాహబంధంలో ఎందుకంత అసహజత్వం, నటన, మోసం, ఆత్మవంచన.

భార్యాభర్తల అనుబంధంలో ఎన్నో అందమయిన అనుభూతుల్ని, జ్ఞాపకాలను గుండెల్లో దాచుకోవాల్సిన అమూల్యమయిన మధుర స్మృతులను కూడా తన నటనతో తుడిచి వేస్తున్న భర్తతో, భార్యగా మాట్లాడాలని కూడా అనిపించటం లేదు స్వప్నకు. అతనితో గడిపే కంటే, వంటరి బతుకే నయమనిపిస్తుంది. "ఏం కావాలి?" అడిగింది అతని కళ్ళలోకి చూస్తూ. గుండె గొంతుకలో అడ్డుపడినట్టుగా వెంటనే మాట్లాడ లేకపోయాడు. దీప శిఖలా మెరుస్తున్న ఆమె చూపుల్లో చూపులు కలపలేకపోయాడు.

"మీరొచ్చింది డబ్బు కోసమే అని నాకు తెల్సు. చూడండి నా బ్రతుకులో ఎన్నో విషయాలలో మీతో రాజీపడి, మొండిగా మనుగడ సాగిస్తున్నాను. మీ సుఖం కోసం, మీ ఆనందం కోసం నా జీవితాన్నే అర్పణ చేసాను. ఇంకా ఎందుకు నన్నిలా చంపుతారు?"

"అదికాదు స్వప్నా! నా ఫ్రెండ్ ఒకతను కొత్తగా బిజినెస్ ప్రారంభిస్తున్నాడు. నన్ను కూడా పార్టనర్‌గా కలవమన్నాడు. నీతో మాట్లాడి, నీకిష్టమయితే, బాబు పేరుతో లక్ష రూపాయల షేరు తీసుకుందామనుకుంటున్నాను. నీ కిష్టమయితేనే."

స్వప్న పగలబడి నవ్వింది. పడి, పడీ నవ్వుతుంటే, ఆమె ఎందుకలా నవ్వుతుందో అర్థంగాక విస్తుపోయినట్టుగా ఆమె వైపు చూసాడు జయరాం.

"స్వప్నా! ఎందుకలా నవ్వుతావు?"

"మీ మాటలకు, ఏడవలేక నవ్వుతున్నాను. ఇంకా ఎందుకండీ! మాటలతో

జరిగిన కథ – 13 : జయరాం ఎంతగా తనను బాధించినా స్వప్న అతన్ని వదలి వుండలేక పోతోంది. డబ్బు విషయంలో స్వప్న, జయరాం ఘర్షణ పడతారు. స్వప్నకు జ్వరం వస్తే రఘునాథ్ ఆమెను హాస్పిటల్‌లో చేరుస్తాడు. స్వప్న తిరిగి కోలుకుని ఇంటికి వచ్చేటప్పటికి ఇంట్లో చాలా మార్పులు జరగటం గమనిస్తుంది.

నన్ను మభ్యపెట్టాలని చూస్తారు? మీరిక్కడకు వచ్చినప్పుడే నాకు తెల్సు డబ్బు కోసం వచ్చారని. మీరు మీ ఫ్రెండ్‌తో మాట్లాడారు. బాబు పేరుతో షేరు తీసుకున్నారు. రెండు రోజుల్లో కాగితాల మీద పని పూర్తవ్వగానే డబ్బిస్తానని చెప్పారు. అవునా?"

"ఈ విషయాలన్నీ నీకెలా తెల్సు?" ఆశ్చర్యం నుంచి తేరుకుంటూ అడిగాడు.

"మీకు తెలియని విషయాలు కొన్ని చెప్పమంటారా? మీరు నా భర్తగా, మాధవరావుగారి అల్లుడిగా చెలామణి అవుతున్నారు తప్ప, మీకుగా మీ ఉనికిని ఎవరూ గుర్తించరు. మీరు చెప్పుకుంటున్న మీ ఫ్రెండ్ నెల క్రితమే నా దగ్గర కొచ్చి, తను చేయబోతున్న బిజినెస్ వివరాలు, అప్పటి వరకూ భాగస్తులుగా చేరిన వాళ్ళ పేర్లు నాకు చెప్పి, నన్ను కూడా షేరు తీసుకోమన్నాడు. ఆ షేర్ను విషయం మీతో మాట్లాడమని, మీకిష్టమయితే తప్పకుండా తీసుకుంటామని, నేనే అతనికి చెప్పాను. నేను చెప్పితర్వాతనే అతను మీతో మాట్లాడాడు. మీరు ఒప్పుకున్నారన్న విషయం కూడా నాకు ఫోన్ చేసి చెప్పాడు." అతని కళ్ళలోకి చూస్తూ చెప్పింది. తేలు కుట్టిన దొంగలా అయింది స్వప్న ముందు జయరాం పరిస్థితి. సిగ్గుతో అతని తల వాలిపోయింది.

"మనస్సుకు సంబంధించినంత వరకూ, నేను మామూలు ఆడదాన్ని. ఇన్ని రోజుల నుంచి, మీరు శాసించిన పద్ధతిలో, కోరుకున్న రీతిలో నన్ను నేను మరిచిపోయి నన్ను నేను చంపుకుని, మీ ఆనందం కోసం, మీ సంతోషం కోసం బ్రతుకుతున్నాను."

"మీలాంటి దురాశపరుడు ఒకడు. రోజూ, బంగారు గుడ్డును పెడుతున్న తన పెంపుడు బాతును, దాని పొట్టలో గుడ్లన్నిటినీ ఒకేసారి తీసుకోవాలని చంపేసాడంట. అతని దురాశ మూలంగా, రోజూ పెడుతున్న ఆ గుడ్డు కూడా లేకుండా పోయింది బాతు చనిపోవటంతో డబ్బు, డబ్బు. డబ్బే ప్రపంచంగా బ్రతుకుతున్న మీకూ, మీ వాళ్ళకూ, మనుష్యుల విలువా, మనస్సుల విలువా తెలియదు."

"మీరు అడిగినప్పుడల్లా, అడిగినంత డబ్బిచ్చి మీలో ఆశను నేనే కలిగించాను. మిమ్మల్ని సంతోష పెట్టటానికే, నా జీవితం అనుకున్నాను. భార్యగా అది నా విధి అని మనస్ఫూర్తిగా నమ్మాను."

"కానీ, మీ ప్రవృత్తి ఏమిటో ఇంత కాలం నుంచి అర్థం చేసుకోలేకపోతున్నాను. మీకు కావలసింది నా డబ్బు తప్ప నా ప్రేమ కాదు. అపరూపమయిన, నా ప్రేమను, మీరు స్వార్థానికి ఉపయోగించుకుంటుంటే, మీరు మారిపోయారన్న బాధ కన్న, వ్యక్తిత్వం, అస్థిత్వం కోల్పోలేక నలిగిపోతున్న నా ఆత్మాభిమానం నన్నెక్కువగా కృంగదీస్తున్నాయి."

"మీ నుంచి నేను కోరుతున్నది ప్రేమను. దాని కోసమే, మీరేం చెయ్యమన్నా చేస్తున్నాను. పది రోజులు, నేను హాస్పటల్‌లో ఉంటే, ఒక్కరాత్రయినా, నాకు ధైర్యం చెబుతూ, నా దగ్గరుండగలగారా? చెప్పండి. ఇలా అడుగడుగునా, నన్ను డబ్బు కోసం పీడించటానికి మీకు సిగ్గనిపించటం లేదూ?" కోపం, బాధా, వేదనా, స్వప్న గొంతులో పోటీ పడుతున్నాయి.

"భార్య సొమ్మును, భర్తగా నేను వాడుకునే అధికారం లేదంటే, నిన్నెప్పుడూ డబ్బడగను స్వప్నా."

"అధికారం లేదని, నేనటం లేదు. ఆ ప్రశ్న నన్ను అడిగే ముందు, భర్తగా నా పట్ల మీ ధర్మాన్ని నిర్వర్తిస్తున్నారా? ఆలోచించండి. మా డాడీ, ఒప్పుకోకపోయినా, నేను మీ కోసం అన్ని వదులుకుని వచ్చేస్తానండి. అని పెళ్ళికి ముందు పార్కులో నేను మీతో చెప్పినప్పుడు, మెరిసిన మీ కళ్ళలో ఆ నాడు నిజమయిన ప్రేమనూ, అనురాగాన్ని చూసాను. నిజంగా ఆ రోజున ప్రపంచ విజేతలా గర్వించాను. ఆ నాటి మీ రూపం, నా గుండెల్లో ముద్రపడిపోయింది. ఆ నిజమయిన ప్రేమానుభూతుల్ని నెమరు వేసుకుంటూ, ఈ బ్రతుకు బరువును మోస్తున్నాను."

"మీరు చెప్పే అబద్ధాలను జీర్ణించుకోలేక పోతున్నాను. చెప్పకనే వ్యక్తమయే నిజమయిన ప్రేమ ఎంత మధురంగా ఉంటుందో, నటన అంత జుగుప్సాకరంగా ఉంటుంది."

"నా మీద పెంచుకున్న ద్వేషంతో, నేనేం చెప్పినా అది నీకు అబద్ధంగానే అనిపిస్తుంది."



ప్రేమసాగరం

"ఇప్పుడు మీరు చెప్పింది అబద్ధం కాదంటారా?"

"నిన్ను డబ్బు అడగటానికి, సిగ్గనిపించి అలా చెప్పాను."

"మాటల్లో, చూపుల్లో, చేష్టల్లో మీ ప్రతి అణువు అణువులోనూ నిండిపోయిన కృత్రిమత్వం, నన్నెంతగా కృంగదిస్తుందో మీకు తెలియదు. మీరు, నన్ను ప్రేమిస్తున్నారన్న భావన చాలు. ప్రేమించకపోయినా బ్రతకగలను. నటననూ, మోసాన్నీ నేను భరించలేను." స్వప్న గొంతు దుఃఖంతో పూడుకుపోయింది.

"ఇరవయి నాలుగు గంటల కాలంలో, ఒక్క నిముషం కూడా, నా మనస్సును మీ నుంచి మరల్చుకోలేక పోతున్నాను. మీ ప్రేమలో పిచ్చిదాన్ని అయిపోయిన నన్ను మీ ప్రవర్తనతో అసలయిన పిచ్చిదాన్ని చేస్తున్నారు. ఇంకా ఈ వాతావరణంలో కొంత కాలముంటే నాకు నిజంగానే పిచ్చి పడుతుంది. మీలోని అస్సలు మనిషిని చూస్తుంటే, వెన్నులో నుంచి వణుకు పుట్టుకొస్తుంది నాకు."

"డబ్బు కోసం ప్రాణాలు తీస్తారన్న భయం నాకు లేదు. ఎందుకంటే, మానసికంగా నేను ఏ నాడో చచ్చిపోయాను. బ్రతికున్న శవాన్ని నేను. ఈ శవం చావు కోసం ఎదురు చూస్తుందే తప్ప, చచ్చిపోతానన్న భయం ఉండదు. నేను దబ్బివ్వను. ఎందుకో తెలుసా? కిరాయి ఇచ్చి, కొనుక్కున్నట్టుగా, ఇన్ని రోజులు మీరిచ్చే ప్రేమకు, ఇంత డబ్బు అన్నట్టుగా, మీ ప్రేమను నేను డబ్బుతో కొనుక్కోలేను వెళ్ళండి. దబ్బివ్వను." ఒక విధమయిన, మొండితనం చోటు చేసుకుంది స్వప్నలో.

జయరాం వెళ్ళిపోయాడు.

* * * * *

షేరు తీసుకున్నందుకుగానూ, పెట్టుబడికి డబ్బు ఇస్తానన్న గడువు దాటిపోయింది. అతను అప్పటికే, డబ్బు ఇవ్వలేదేమిటని? రెండుసార్లు ఫోన్ చేసి అడిగాడు. స్వప్నకు తెలియకుండా తను దబ్బివ్వలేదు. స్వప్నను ఎన్నిసార్లు అడిగినా, ఇవ్వనని మొండి సమాధానం చెబుతుంది. ఏం చెయ్యాలో తోచక తల పట్టుకుని కూర్చున్నాడు జయరాం.

"డబ్బు విషయం ఇంతగా ఆలోచించాలా? ఆవిడకు, పిల్లా, జెల్లా? ఈ ఆస్థి అంతా మనదేగా. అది బ్రతికున్నప్పుడే ఇస్తే ఏం పోయింది? చచ్చిం తర్వాత డబ్బుతో తగలబెట్టించుకుంటుందా?" అంది మోహిని ఈర్ష్యా అసూయలతో అంతకు ముందు, జయరాం ఎదురుగా స్వప్నను గురించి మాట్లాడడానికే ధైర్యం ఉండేదికాదు. అతన్ని పూర్తిగా తన హస్తగతం చేసుకున్న తర్వాత, ఆమె నోటికీ, చేష్టలకూ, హద్దు లేకుండా పోయింది.

"స్వప్న ఇవ్వనంటుంది."

"మీ మెతకతనం చూసి, అలా మాట్లాడుతుంది. ఇవ్వనందని, మీరు నోరు మూసుకుని ఊరుకున్నారా?" కోపంగా అంది.

"ఊరుకోక, ఏం చెయ్యమంటావు?" అన్నాడు విసుగ్గా.

"అది కూడా నేనే చెప్పాలా?"

"ఈ మధ్య అన్నీ నువ్వే చెప్పి చేయిస్తున్నావుగా?"

అతని భుజం మీదికి వంగి, అతని చెంపకు తన చెంపను రాస్తూ "దానికి దిక్కా? మొక్కా? ఎవరున్నారు? మన అండన బ్రతుకుతున్న దానికి అంత గర్వం ఏమిటి? నాలుగు తంతే, దెబ్బలకు భయంతో పెట్టమన్న చోట ఆదే సంతకం పెడుతుంది."

"మోహినీ. నోటికొచ్చినట్లు వాగకు. ఊరుకున్నకొద్దీ నీ నోటికి హద్దు లేకుండా పోతోంది." అన్నాడు కోపంగా. అతనికి, స్వప్న మనసు తెలుసు. ఆమె ప్రేమ తెల్సు. అయినా, మోహిని యవ్వనం, ఆమె ప్రతి రాత్రి అందిస్తున్న సుఖం అతని మనస్సుకు మైకాన్ని కలిగిస్తుంటే ఆమె మాటలకు ఎదురు చెప్పలేని స్థితికి

౯జారిపోయాడు. అతని బలహీనతల్ని కనిపెట్టి ఉపయోగించుకుంటుంది మోహిని.

ఆడది అందించే సుఖం, మహారాజులు సైతం, సామ్రాజ్యాల్ని వదిలేసుకుని మ్మురాలి పాదాల చెంతకు చేరుకున్నారు. మామూలు మగాడు జయరాం ఎంత?

మాటలతో, మమతను నింపి తీపి, తీపిగా ప్రేమ కబుర్లు చెబుతూ, కావ్య నాయికలా రోజుకో విధంగా అలంకరించుకుని, శృంగార దేవతలా, ఆమె శృంగార సామ్రాజ్యానికి అతన్ని రాజును చేస్తూ, కాదనకుండా కౌగిలిలో ఇమిడిపోతూ, అతన్ని పూర్తిగా వశపరచుకుని, అతని చేత ఎన్నో పనులు చేయించుతోంది.

"ఎందుకండీ అంత కోపం? మీ మాట పోతుందన్న ఆలోచనగానీ, మీ పరువు పోతుందని గానీ, ఆలోచించకుండా డబ్బే ముఖ్యం అనుకుని, డబ్బివ్వకుండా మిమ్మల్నింత బాధపెడుతుంటే, నా గుండెలు మండిపోతున్నాయి. ఏం చూసుకుని ఆవిడకంత అహంకారం?" అంది కావాలని, అతన్ని రెచ్చగొడుతున్న ధోరణిలో మోహిని.

జయరాం ఏం మాట్లాడలేదు.

"అయినా, ఆవిడకేమిటి? అంత మొండితనం?"

"మోహినీ! కాసేపు నన్ను విసిగించకుండా, ప్రశాంతంగా ఉండనివ్వు."

"అవునులెండి. మీ కోసం తాపత్రయపడే నేను, మీకు పరాయిదాన్ని. ఆ రాక్షసిమీకు దేవత." అంది.

"నిన్ను ఆ మాట అనొద్దని ఎన్నిసార్లు చెప్పాను."

"సరే. అనను." అంది నవ్వుతూ.

"నీ దగ్గర డబ్బేమయినా ఉందా?"

"ఉంది."

"ఎంతుంది?"

"లక్ష రూపాయలు."

ఉలిక్కిపడ్డాడు జయరాం. అంత డబ్బు ఉందని చెప్పగానే.

"మైగాడ్! నీ దగ్గర అంత డబ్బుందా?"

"అప్పుడప్పుడు మీరిచ్చిన డబ్బు ఖర్చు పెట్టుకోగా, మిగిలింది దాచిపెడితే, లక్ష రూపాయలయింది. విడిగాఉంటే ఖర్చవుతుందని, నా పేర ఫిక్సిడ్ డిపాజిట్ చేసాను.ఆరు సంవత్సరాలవరకూ తియ్యటానికి వీల్లేకుండా" అంది.

ఆకాశానికి, ఎగిసిన అతని ఉత్సాహం, చప్పున చల్లారిపోయింది.

"ఏడవలేకపోయావు. డిపాజిట్ చేసే ముందు నాకు చెప్పకూడదూ? వెధవ తెలివితేటలు ప్రదర్శించావు.

అంత డబ్బు బ్యాంకులో దాచేకంటే, బిజినెస్‌లో పెట్టుబడి పెడితే అంతకు మూడు రెట్లు సంపాదించవచ్చు" అన్నాడు కోపంగా.

"ఎంత సంపాదించినా ఆవిడగార్కి దాసోహమంటూ బ్రతకడమేగా?" అంది వ్యంగ్యంగా.

డబ్బు ఎలా? అన్న ప్రశ్న అతని అంతరంగాన్ని వేధిస్తోంది.సమయా, సమయాలు తెల్సుకోకుండా విసిగిస్తున్న స్వప్న మీద అంతులేని కోపం వస్తోంది.

"ఆవిడగారి చేత, మీకు సంతకం పెట్టించుకోవటం చాత కావటం లేదంటే, ఎవరయినా నవ్వుతారు? రేపు మిగతా పార్టనర్స్ ఏమంటారో తెలుసా? మీ భార్య మీకు డబ్బివ్వలేదా? పెళ్లానికి భయపడే మీరు, షేర్ ఎందుకు తీసుకున్నారని అడుగుతారు. వాళ్ళడిగే ప్రశ్నలకు ఏమని సమాధానం చెబుతారు? ఎలా తలెత్తుకు తిరుగుతారు?"

జయరాంను, ఎలాగయినా రెచ్చగొట్టి, స్వప్న మీదకు పంపించి డబ్బు రాబట్టాలని మోహిని వుద్దేశ్యం. అందుకోసం అతన్ని ఎన్ని విధాలా రెచ్చగొట్టాలో అన్ని విధాలా రెచ్చగొట్టింది. కందిరీగలా అతని చెవిలో రొద పెట్టింది. అయినా అతను అక్కడ నుంచి కదలలేదు.

(ఇంకా ఉంది)

శ్రీ వెంకటేశ్వరుని గోశాల!

తిరుమల తిరుపతి దేవునికి 120 హెక్టేర్ల గోశాల వున్నదట. అక్కడ 400 ఉత్తమమైన ఆవులున్నాయట.

జంతువుల్లో కంటిచూపు!


గుడ్లగూబ తల తిప్పకుండానే తన కళ్లను రిక్కించి పక్కలకూ చూడగలదట. దాని చూపు మనిషి చూపుకన్నా 82 రెట్లు శక్తివంతంగా వుంటుందట. కుందేలు తల పక్కకి త్రిప్పకుండానే కళ్లను వెనక్కు తిప్పి తన వెనుక జరిగేవి కూడా చూడగలదట.

కాలువలో శవం!

కొవ్వూరుకు చెందిన చిడిపి గ్రామ వాస్తవ్యుడు నాగేశ్వర్రావు అనే ఒకతను తన యజమానికి మరో కామందుకు వున్న వైరంలో జొరపడి అవతలి వారిని దుర్భాషలాడినందుకుగ్గాను ఆతడు శవమై వూరు చివరి నీటి కాలువలో పడున్నాడట. ఈ విషయంలో స్థానిక పోలీసులు అంతగా కలిపించుకోబోయినా హతుని తల్లి కొవ్వాక రావమ్మ పట్టు విడవనందువల్ల తీగంతా కదిలి, శవాన్ని బయటికి తీసి పరీక్షకు పంపడం జరిగిందట.

బయటపడిన భాగోతం!

విశాఖపట్నణం ఓడరేవు కార్మికుల బోర్డుకు చెందిన కార్మికుడు ఎద్దు ముసలయ్య అనే అతను 1964లో వుద్యోగంలో చేరి, 1966లో పని కోల్పోయాడట. తవుడు అనే ఒక వ్యక్తి తాను ముసలయ్యనని చెప్పి, బ్రతిమాలుకొని తిరిగి పనివ్వమని, పనిలో చేరి గత 20 ఏళ్ళుగా పనిచేసి, అదే పేరుతో రిటైరై పింఛనుగా 43 వేల రూపాయలు పొందాడట. తిరిగి కొంచెం మిగిలిన బాకీ వసూలు చేసుకోడానికి వచ్చేసరికి 20 ఏళ్ల భాగోతం బయటపడింది - పాపం!



కెనడాలో వావివరుసలు లేని సెక్స్!

కెనడాలో రాను రానూ వావివరుసలు లేని లైంగిక సంపర్కం ఎక్కువై పోయిందట. తండ్రి కూతుళ్ళు, తల్లీకొడుకులు, సోదర సోదరీమణులు కూడా సరదాగా యీ లైంగిక తృప్తిని అనుభవిస్తున్నారట. మిసెస్ కూపర్ అనే ఆవిడ యీ విషయంలో కొన్ని వేల మందిని కలుసుకుని, చర్చించి, 1984లో యిలాంటి కేసులు 4,600 కనిపెట్టిందట. ఈ కేసుల్లో కూతుళ్లతో లైంగిక తృప్తిని పొందే తండ్రుల సంఖ్య వో పిసరంత ఎక్కువ వున్నదట - దటీజ్ సివిలిజేషన్ - సాఫిస్టికేషన్ -

టి. వి. చూసి అసువులు బాసిన అభాగ్యుడు!

ఐరిష్ దేశానికి చెందిన జోసఫ్ ముర్రే అనే ఆయన దిలాసాగా టీవి చూస్తున్న వాడల్లా ఆ టీవీలో వో అందమైన వనిత చకచకా బట్టలు యిప్పి, తన నగ్న సౌందర్యాన్ని చూపరులకు బహిర్గతం చేసేసరికి ఆ చూపిచ్చిన వుద్రేకంలో గుండెపోటు వచ్చి, ఆసుపత్రికి తీసుకువెళ్లే దారిలోనే చనిపోయాడట.

కప్పు కాళ్ల రవాణాలో పట్టుబడ్డ వ్యాపారులు!

విజయవాడ, గుంటూరు, నరసారావుపేట వ... వూళ్ల నుంచి కప్పకాళ్లను మద్రాసుకు అక్రమ రవాణా చేస్తున్నందుకు పోలీసు కొంతమంది వ్యాపారులను పట్టుకుని చట్టానికి వప్పగిస్తే చట్టం వారికి 26,550 రూపాయలు జరిమానా విధించిందట.

ప్రభుత్వ కేన్సరు ఆసుపత్రిలో ఆక్సిజన్ కొరత!

హైదరాబాద్ నవాబ్‌జంగ్ ప్రభుత్వ కేన్సరు ఆసుపత్రిలో ఆక్సిజను కొనడానికి సర్కారువారు నెలకి వెయ్యి రూపాయలు ఇస్తున్నారనీ, కనీసం అయిదు వేల రూపాయలుంటే గానీ నెలంతా గడవడం కష్టమని, ఆక్సిజను కొరతవల్ల ఆపరేషన్లు కూడా వాయిదాలు వేయవలసి వస్తోందనీ ఆసుపత్రి అధిష్ఠాన వర్గాలంటున్నాయట.

కుటుంబ కలహాల ఫలితంగా ఆత్మహత్య!


కుటుంబ కలహాల ఫలితంగా హైదరాబాద ఫతేయాకూట్‌ఖాన్ బజారు నివాసిని సబిత అనే 25 ఏళ్ల వివాహిత తన మీద కిరసనాయిలు పోసుకుని, ఆత్మహత్య చేసుకున్నదట.


త్రాగుబోతు భర్తతో వేగలేక ఆత్మహత్య!

వికారాబాదుకు చెందిన సొప్పరి కొండయ్య తాను త్రాగడానికి భార్య రాసమ్మను వో అయిదు రూపాయలు అప్పు అడిగాడట. రోజూ జరిగే యీ భాగోతానికామె తలవొగ్గక, ససేమిరా అన్నదట. దాంతో ఆ కొండయ్య కోపమొచ్చి కర్రతో ఆమెను చావ బాదాడట. ఈ రకం జీవితం కన్నా మరో హాటే మేలని ఆ రాసమ్మ కిరసనాయిలు మీద పోసుకుని, నిప్పంటించుకు చనిపోయిందట.

అమెరికాలో ఖరీదైన ఎన్నికలు, రాజకీయ పదవులు!

యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాలో ఎన్నికలు, రాజకీయ పదవులూ చాలా ఖరీదైనవిగా తయారయ్యాయట. 1984 ఎన్నికలకు అక్కడ 374 మిలియను డాలర్లు ఖర్చయిందట. హవుస్ ఆఫ్ రిప్రజంటేటివ్స్‌లో స్థానంరాడానికి సరాసరి 288000 డాలర్లు ఖర్చవుతోందట. సెనేట్ సీటుకు 3 మిలియను డాలర్లు ఖర్చవుతోందట - చదువరీ! మనదేశపు రాజకీయ పదవుల రేట్లేవి? □





ఉత్తమనటి-ఉత్తమనటుడు అవార్డులు అందుకున్న విజయశాంతి-శోభన్‌బాబుతో వాణిజ్యవేత్త టి.సుబ్బరామిరెడ్డి

నెఫ్జా నాటకోత్సవాలు

నెల్లూరు ఫిలిం జర్నలిస్టుల అసోసియేషన్ వారు తమ 22వ వార్షికోత్సవ సందర్భంగా మార్చి 5 నుంచి 9 వరకూ నెల్లూరులో అఖిల భారత స్థాయిలో నాటక, నాటికల పోటీలని నిర్వహించారు. ప్రారంభోత్సవానికి నెల్లూరు డి. ఎస్. పి. శ్రీ లక్ష్మణమోహన్ అధ్యక్షత వహించారు సినీ నటుడు విజయచందర్ ఉత్సవాలని ప్రారంభించారు. సినీనటి కుమారి పవిత్ర నటరాజ పూజ చేయగా, సిని హీరో అర్జున్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ పోటీలలో సుమారు 1000 కళాకారులు పాల్గొన్నారు. 9వ తేది జరిగిన బహుమతి ప్రదానోత్సవానికి నెల్లూరు శాసనసభ్యులు శ్రీ కె. వి. సుబ్బారెడ్డి అధ్యక్షత వహించగా సినీ హీరో నరేష్, సినీనటి విజయలక్ష్మి బహుమతి ప్రదానం చేసారు.

పోటీ ఫలితాలు

నాటకములు:

ప్రథమ బహుమతి: "పల్లవి" రెఫ్కా విజయవాడ.

ద్వితీయ బహుమతి: "క్విట్ ఇండియా" స్నేహ సమాఖ్య, పేర్నమిట్ట.

ఉత్తమ నటుడు: "పల్లవి"లో ఆఫీసరు పాత్రధారి శ్రీ యం. గురుమూర్తి. ద్వితీయ ఉత్తమనటుడు: పల్లవిలో సింహాద్రి పాత్రధారి శ్రీ కె. రఘునాథరెడ్డి

ఉత్తమ విలన్: –"పల్లవి" లో వల్లభరావు పాత్రధారి –శ్రీ మధుబాబు.

ఉత్తమ హాస్యనటుడు: –"పల్లవి" లో వెంకటాచలం పాత్రధారి –శ్రీ సిహెచ్. రామచంద్రరావు.

ఉత్తమ నటి: –"పల్లవి" లో పల్లవి పాత్రధారిణి శ్రీమతి అలపాటి లక్ష్మి.

ద్వితీయ ఉత్తమనటి: –"క్విట్ ఇండియా"లో

అవీ ఇవీ అన్నీ

జయంతి పాత్రధారిణి – యస్. లక్ష్మి

ఉత్తమ దర్శకత్వం: – సి హెచ్. రామచంద్రరావు (పల్లవి–దర్శకుడు).

ఉత్తమ రచయిత –"పల్లవి" రచయిత శ్రీ బి. ఆర్. రంగారెడ్డి.

నాటికలు:

ప్రథమ బహుమతి –"అమ్మ" రెఫ్కా –విజయవాడ

ద్వితీయ బహుమతి –"46వ నిమిషం" ఇండ్లీఫ్ రిక్రియేషన్ క్లబ్ "అనపర్తి"

ఉత్తమ నటుడు –"అమ్మ"లో రుద్రయ్య పాత్రధారి మధుబాబు, విజయవాడ.

ద్వితీయ ఉత్తమ నటుడు –'46వ నిమిషంలో' రావు పాత్రధారి పి. యస్. మణ్యం, అనపర్తి.

ఉత్తమ విలన్ –'చైతన్యం'లో లక్ష్మిపతి పాత్రధారి యం. శింగపతిరావు, చిలకలూరిపేట.

ఉత్తమ హాస్యనటుడు –'స్వరాజ్యాన్ని సమాధి చేస్తే'లో కాళిదాసు పాత్రధారి శ్రీ వేగి సూర్యనారాయణ, విశాఖపట్నం.

ఉత్తమ నటి –'అమ్మ' శివమ్మ పాత్రధారిణి శ్రీమతి ఆలపాటి లక్ష్మి.

ద్వితీయ ఉత్తమ నటి –'స్వరాజ్యాన్ని సమాధి చేస్తే'లో భారతమ్మ పాత్రధారిణి నాగమణి, విశాఖపట్నం.

ఉత్తమ దర్శకత్వం –'డ్రా' దర్శకుడు 'లంకపల్లి'

ఉత్తమ రచయిత –"స్వరాజ్యాన్ని సమాధి చేస్తే" రచయిత శ్రీ వేగి సూర్యనారాయణ, విశాఖపట్నం.

ఏకపాత్రాభినయం – సాంఘికము:

1. ప్రథమ బహుమతి – డి. ఆంథోని, మార్కాపురం.
2. ద్వితీయ బహుమతి – పి. శివప్రసాద్, గుంటూరు.

ఏకపాత్రాభినయం పౌరాణిక, చారిత్రాత్మక:

1. ప్రథమ బహుమతి – సూరా వీరరెడ్డి, కొత్తపల్లి.
2. ద్వితీయ బహుమతి – యన్. లక్ష్మినరసింహరావు, అచ్చెంపేట.

□

కొత్త గర్భనిరోధక బిళ్లలు 'టుడే'

గర్భనిరోధానికి పనికి వచ్చే బిళ్లలు 'టుడే' ఉత్పత్తిని త్వరలోనే తమ సంస్థ ప్రారంభించగలదని బొంబాయికి చెందిన బ్లిస్ కెమికల్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ ఇండియా లిమిటెడ్ మానేజింగ్ డైరెక్టర్ శ్రీ ఉదయ్ ఎస్. లేఠి ఇటీవల విజయవాడలో జరిగిన ఒక పత్రికా సమావేశంలో వెల్లడించారు.

వంద సంవత్సరాలుగా పేరు పొందిన డబ్ల్యు. జె. రెండాల్ సంస్థ సహకారంతో తాము 'టుడే' ఉత్పత్తిని ప్రారంభిస్తున్నామని, 16 కోట్ల వ్యయంతో కర్మాగారం తయారైందని ఆయన చెప్పారు. గత పాతిక సంవత్సరాలుగా ఈ బిళ్లలు అమెరికా సంయుక్త రాష్ట్రాలు, యూరోప్‌తో సహా దాదాపు 60 దేశాలలో వాడకంలో ఉన్నాయని, ఇవి పూర్తిగా నిరపాయకరమైనవని శ్రీ లేఠీ అన్నారు. ఇప్పటికే కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం వీటిపై అమ్మకం పన్ను మినహాయించిందని చెప్పారాయన. వాడకం పెరిగితే ధర తగ్గే అవకాశం ఉందని, అత్యధిక జనాభా గల, వర్ధమాన దేశం అయిన భారతదేశంలో గర్భనిరోధకాల పాత్రకి చాలా ప్రాముఖ్యత ఉందని ఆయన అన్నారు. □

Printed and Published for Nageswara Rao Estates Private Ltd., by S. Nageswara Rao at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3, Editor : S. Radhakrishna; Phones :- Business : 61247, 61248, Editorial : 75667

హైదరాబాద్ నోట్‌బుక్

బెంగళూరు కళాకారుల బృందం:

హైదరాబాద్ నగరం ప్రాచీన నవీన కళలకు నిలయం. చార్‌మినార్ కుతుబ్ షాహీల వైభవాన్ని చాటుతుంది. ప్రభుత్వం వారు నిర్వహిస్తున్న మ్యూజియంలో చోళుల కాలపు కాంస్య విగ్రహాలు అపూర్వంగా ఉన్నాయి. అజంతా శాల చాల బాగుంది కాని చిత్రాల డిస్‌ప్లే బాగాలేదు. అన్నీ ఇరికించి పెట్టి నట్టుగా వుంది. తగిన వెలుతురు లేదు. సమకాలీన కళాశ్రేణిక (గ్యాలరీ) బాగుంది. కాని, అక్కడ కూడ వాటి ప్రదర్శన తీరు బాగులేదు. మొగల్ అల్పచిత్రాల (మిని యేచర్స్) సంకలనం బాగుంది. మెయింటినెన్స్ బాగులేదు. సాలార్‌జంగ్ మ్యూజియం దేశవిఖ్యాత మైంది. నా దృష్టిలో దానికి కూడ మరింత విశాలమైన ఆవరణ అవసరం. ఈ కళాఖండాలకు తగినంత ప్రచురణ లేదు. చిన్న చిన్న పుస్తకాలు ప్రచురించాలి. అప్పుడు గాని ప్రేక్షకులకు తగినంత ప్రయోజనం ఉండదు. బిర్లా మ్యూజియం బాగా వృద్ధికి వస్తూంది. ఊరికి కొంత దూరంలో వున్నందున ప్రేక్షకులకు యాతాయాతశ్రమ. ప్రముఖ కళాకారులు, రాష్ట్ర లలితకళా అకాడెమి మాజీ కార్యదర్శి శ్రీ పి. టి. రెడ్డి మ్యూజియం వైయక్తిక సంస్థలలో చాల గొప్పది. ఒక కళాకారుడు స్వయం కృషితో, ఏకాంగ వీరుడుగా నగర మధ్యాన ఇంత గొప్ప కళా భండారాన్ని నెలకొల్పడం గొప్ప విషయం. కళా భండారం ఆయన కళాఖండాలతోనే ఏర్పడింది. ఆయన అర్ధ శతాబ్దిగా సృజించిన కళాఖండాలు– వర్ణచిత్రాలు, స్కెచ్చీలు, గ్రాఫిక్కులు, శిల్పాలు, డ్రాయింగులు – ఆయన కళా పరిణామాన్ని, అనుభవ సంపదను, భావ వైవిధ్యాన్ని తెలుపు తున్నాయి. ఇది ఆధునిక కళాకారులకు ఒక గొప్ప సంపద. ఈ మ్యూజియం లోని వివిధ విభాగాలు చాల బాగున్నాయి. ఇక్కడ విద్యార్థులకు శిక్షణ కూడ ఏర్పాటు చేశారు. ఆయన కృషి ప్రశంసనీయం. వెలుపలి వారు వచ్చి బసచేయడానికి వసతి వుంది. తృప్తి కళా ప్రదర్శనం జరపడానికి, సభలు నిర్వహించడానికి ఆడిటోరియం కూడ వుంది. కళాకారులకు ఇది ఎంతో ప్రయోజన కరం–అన్నారు ప్రముఖ కర్నాటక కళాచార్యులు శ్రీ ఆర్. ఎం. హడ్‌పద్. ఈయన బొంబాయిలోని జె. జె. స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో షట్చక్రవర్తి వివిధ పాఠశాలలలో కళోపాధ్యాయులుగా పనిచేసి, బెంగళూరులో స్థిరపడి, అక్కడే కెన్‌స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అనే లలిత కళా పాఠశాలను స్థాపించి నిర్వహిస్తున్నారు. శ్రీ హడ్‌పద్ ఉత్సాహ వంతులు. భారతీయులు సహజంగానే కళాదృష్టి గల వారు. దానికి దేశమంతా వివిధ రాష్ట్రాలలో విరాజిల్లుతున్న కళాక్షేత్రాలే తార్కాణ అంటారు ఆయన. బెంగళూరులో ఈ కెన్‌స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ కాక మరి రెండు లలిత కళా పాఠశాలలున్నాయి. కర్నాటక రాష్ట్రం మొత్తంలో పది లలిత కళా పాఠశాలలున్నాయి. శ్రీ హడ్‌పద్ ఏటా తమ విద్యార్థులతో కళాయాత్ర జరుపుతారు. ఈ బృందం మార్చి 6వ తేదిన బెంగళూరు నుంచి బయలుదేరి ఢిల్లీలో కళామేళా, నేషనల్ మాడర్న్ ఆర్ట్ గ్యాలరీ మున్నగు వాటిని చూచింది, అక్కడి ప్రజా జీవితాన్ని పరిశీలించి. తిరుగు ప్రయాణంలో తాజ్‌మహల్ మొదలైనవి చూచి భోపాల్‌కు వచ్చి బనాలే ఎగ్జిబిషన్, భారత్ భవన్, సాంచీ, ఔరంగజేబ్ మసీదు మున్నగునవి పరిశీలించింది. అక్కడి ప్రజల అభిరుచిని గురించి స్కెచ్చులు వేసుకొంది. పిదప 21వ తేదిన హైదరాబాద్ చేరి రెండు రోజుల పాటు నిర్విరామంగా వివిధ కళా క్షేత్రాలు చూచి, రేఖాచిత్రాలు గీచుకున్నది. శ్రీ హడ్‌పద్ ప్రిన్సిపాలుగా నిర్వహిస్తున్న కెన్‌స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో కళోపాధ్యాయులు నలుగురున్నారు. శ్రీయుతులు జె. ఎం. ఎస్. మణి, కృష్ణమూర్తి రావు, నరసింహన్, ధనలక్ష్మి. ఈ పాఠశాల కర్నాటక, కేంద్ర ప్రభుత్వాల లలిత కళాడిప్లొమా పరీక్షలకు, ఇతర పరీక్షలకు శిక్షణ ఇస్తుంది. మొత్తం శిక్షణ కాలం ఐదు సంవత్సరాలు. హైదరాబాద్‌కు వచ్చిన కళాయాత్రా బృందంలో మొత్తం పన్నెండు మంది ఉన్నారు. శ్రీ ఆర్. ఎం. హడ్‌పద్ (ప్రిన్సిపాల్), శ్రీమతి ధనలక్ష్మి (ఉపాధ్యాయిని), విద్యార్థులు– మంజుల, సరస్వతి, పద్మ, సుధ హళేసాగర్, సుధారామయ్య, నందిని, అనూరాధ, శ్రీమతి, గణేశన్, బ్యాప్పి. వీరిలో శ్రీమతి తెలుగు కూడ చక్కగా మాట్లాడగలరు. జంటనగరాల పౌరుల పరిసర ప్రజల పద్ధతులు చాల ఇంటిరెస్టింగుగా వున్నవని, చాల స్కెచ్‌లు వేసుకున్నానని శ్రీమతి అన్నది. చార్‌మినార్ పరిసరాల్లో ప్రజల నిర్విరామ జీవిత పద్ధతి, బస్సుల సరభసగతి, వీటిని చూస్తూ శతాబ్దాలుగా గంభీరంగా నిలిచిన చార్‌మినార్ కట్టడం– తనలోని భావుకతను ఎంతగానో ప్రోత్సహించిందని, చాల రేఖా చిత్రాలు గీచుకున్నానని శ్రీమతి అన్నది. భారతదేశం ఒక్క మణిహారం. ఒక్కొక్క రాష్ట్రం ఒక్కొక్క ఉజ్వల మణి. ఇలాటి కళాయాత్రల వల్ల పరస్పర అవగాహన, సామరస్యభావం పెంపొందుతాయని శ్రీమతి అన్నది. నవయువతలో ఇలాటి భావాలు కలుగడం శుభోదర్కం. రెండు రోజులలో ఏం చూడగలుగుతారు? తెలుగుదేశం రెండు సహస్రాబ్దులకు ముందు నుంచే వివిధ కళలకు పుట్టినిల్లు. నాగార్జునకొండ, అమరావతి, లేపాక్షి, తాడిపత్రి– ప్రతి జిల్లాలోను ఎన్నో కళాక్షేత్రాలున్నాయి. వాటిని మీ బోటి నవయువతీ యువకులు చూస్తే భావసమైక్యం పటిష్ఠ మౌతుంది– అన్నాను. ఈ సారి కొన్ని నెలల పాటు ఆంధ్రప్రదేశ్‌లో కళాయాత్ర జరుపుతాము. పక్కనే కర్నాటకలో వున్నాంగదా!– అన్నది శ్రీమతి.

ఉపశ్రుతి: –

చాపమీద నిటారుగా కూర్చున్నాడు మనమడు ఫల్గున. ఏం ఇలా కూర్చున్నావు?– అనడిగాను. లిలే ట్రిక్– అన్నాడు. అదేమిటి?– అన్నాను. నాకు, ఉదయనకు కోపం వచ్చింది. ట్రిక్‌చేస్తున్నాం– అన్నాడు. నేను పాలు తాగి వచ్చి కూర్చున్నాను. తర్వాత ఉదయన వస్తాడు. నేను అన్నంతిని మళ్లీ వస్తాను, కూర్చుంటాను. ఉదయన అన్నంతిని వస్తాడు. ఇల్లా సాయంత్రం వరకు – అని తమ రిలే హంగర్‌స్ట్రైక్ పద్ధతి వివరించాడు. అన్నం మానేయలేదు గదా! – అన్నాను. చాప మీద కూచోవద్దూ కదలకుండా. నీవు కూచో గంటసేపు, తెలుస్తుంది– అన్నాడు నీకేం తెలుసు ఇలాటి విషయాలు అన్నట్టు చూస్తూ.

–తిరుమల రామచంద్ర

న్యూఢిల్లీ లేఖ


(4 వ పేజీ తరువాయి)

ఆమోదించిన వారికి తెలుసు. సి. ఐ.ఎ. కానీ, లేక అలాంటిదే మరొక సంస్థగానీ తెర వెనుక లేకపోతే అసలు అటువంటి చిత్రాన్ని తీయటం జరిగి ఉండేదా అన్నది అనుమానం. ఎందుకంటే నాకు తెలిసినంత వరకూ జాక్ ఆండర్‌సన్ తమ జీవితంలో ఎప్పుడూ చిత్రాలని తియ్యలేదు. అందులోనూ తనకి తుదీ మొదలూ తెలియని విషయం మీద తియ్యటం అసలే జరగదు.

ఇటువంటి ఉదాహరణలని నేను ఎన్నైనా ఇవ్వగలను, కానీ ఇవిచాలు. అతి తెలివి, అబద్ధాలూ బాగా కలిసి పోగలుగుతాయి. ఆ విషయాన్ని మన చిరకాల మిత్రుడు అబ్దుల్ రెహమాన్ అంతూలే ఎప్పుడో కనిపెట్టారు. అంతే కాకుండా వాటిని పెట్టుబడిగా ఉపయోగించుకుని ప్రయోజనం పొందారు. ఆయన విషయం బయట పడకముందు ఆయన చేసిన ప్రకటనలన్నీ గోడమీది పిల్లి వాటంగానే ఉండేవి. అర్థం చెప్పే వారి చిత్త ప్రవృత్తిని బట్టి వాటికి ఎలాగైనా అర్థం చెప్పవచ్చు. తమకి ఉపయోగించినంత వరకూ శ్రీమతి గాంధీ ఆయనకి అనుకూలంగానే ఉన్నారు. ఇప్పుడు రాజీవ్ గాంధీ, ఆయన బృందం జాక్ ఆండర్‌సన్, తెరవెనుక ఉన్న ఆయన మిత్ర బృందంతో అనుకూలంగా ఉన్నట్లే. అంతూలే వ్యవహారం బయట పడగానే తాము చాలా దూరం వెళ్లినట్టు శ్రీమతి గాంధీ గ్రహించి ఆయన ఖర్మానికి ఆయన్ని వదిలి వేశారు. పాపం ఇప్పుడు విఠల్ గాడ్గిల్‌కి కూడా బయటికి నెట్టబడే పరిస్థితి వచ్చింది కానీ చివరి క్షణంలో ఆయన ఎలాగో అలా తమని తాము కాపాడుకో గలిగారు. విశ్వనాథ్ ప్రతాప్ సింగ్‌కి మాత్రం ఆయన వంతు వచ్చినప్పుడు తప్పించుకునే అవకాశం ఉండకపోవచ్చు.


సీక్రెట్ ఏజంట్
విక్రమ్
14
తిరిగి "రా" ప్రధాన కార్యాలయంలో-
ఇందులో చాలా సమాచారం ఏదో "కోడ్"లో ఉన్నది సర్! దీన్ని మనం క్రిప్టోగ్రఫీ విభాగానికి పంపాల్సి ఉంటుంది.
29/14
తర్వాత....
ముఖ్యంగా - మూడు పేర్లు తరచు కనిపిస్తున్నాయి సర్. భగన్‌లాల్, మనోహర్, మాల్కమ్ వైట్ అనే వాళ్ళవి.
ధన్యవాదాలు ఖన్నా!
భగన్‌లాల్, మనోహర్‌లు ఢిల్లీలోని ప్రముఖ పారిశ్రామికవేత్తలు!
మాల్కమ్ వైట్ లండన్‌లో ఉండే పలుకుబడిగల వ్యాపారవేత్త!
చీఫ్ ఢిల్లీలోని ఒక నెంబరుకి ఫోన్ చేసాడు-
ఇన్స్పెక్టర్ మిత్రా! వెంటనే భగన్‌లాల్ మనోహర్‌లని ప్రశ్నించే నిమిత్తం అదుపులోకి తీసుకోండి.
అలాగే సర్!
అరగంట తర్వాత ఇన్స్పెక్టర్ మిత్రా నుంచి సమాధానం వచ్చింది.
ఏమిటీ? వాళ్ళు కన్పించటం లేదా?
83.
వెంటనే చీఫ్ కంట్రోల్ రూమ్‌కి ఫోన్ చేసాడు-
హలో! కంట్రోల్ రూమ్! దేశంలోని విమాన, రోడ్డు, రైలు మార్గాలు అన్నిటినీ జాగ్రత్తగా కనిపెట్టి ఉండవలసిందిగా సమాచారం పంపండి. అనుమానితుల ఫోటోలని అన్ని పోలీస్ స్టేషన్‌లకి పంపుతున్నాను. అర్థం అయింది కదా?
అలాగే సర్!
తమకి పెద్ద దిక్కు అయిన మాల్కమ్ వైట్‌తో సంప్రదించటానికి మన పిట్టలు లండన్ ఎగిరి పోయి ఉంటాయి సర్!
అవును! నిజమేనని పిస్తోంది.
అయి ఉండవచ్చు. దీనికి జవాబు లండన్‌లో నే దొరుకుతుంది నువ్వు అక్కడికి ఎందుకు వెళ్ళకూడదు?
నేనూ అదే సూచిద్దామనుకుంటున్నాను సర్!
© RANG REKHA FEATURES PVT. LTD.
స్కాట్‌లాండ్ యార్డ్‌కి అవసరమైన సమాచారం పంపిస్తాను. శుభం! వెళ్ళిరండి.
ధన్యవాదాలు సర్!
(ఇంకా ఉంది)

చెమటకాయల బాధనుండి ఉపశమనానికి టాల్కం పౌడర్ కాదు నైసిల్ కావాలి!



నైసిల్ వాడండి

చెమటకాయల బాధనుండి శీఘ్ర ఉపశమనం పొందండి.





HTB-GLL/8808

నైసిల్ చెమటకాయల బాధనుండి ప్రతిదశలోనూ ఉపశమనాన్నిచ్చేందుకై ప్రత్యేకించి రూపొందించబడిన ఔషధయుక్త పౌడర్. ఇది దురదను, మంటను, చిరచిరను వెంటనే ఉపశమింపజేస్తుంది. టాల్కం పౌడర్లవలెకాక ఇది క్రిమిచర్యను అరికట్టి బాధ క్రుతిమించకుండ చేస్తుంది.

నైసిల్—చెమటకాయల బాధనుండి ఉపశమనానికి నమ్మకమైన, నిరపాయకరమైన మార్గం.

1. అతిగా వచ్చే చెమటను ఆపుతుంది. 2. చెమటను పీలుస్తుంది.
3. దుర్గంధకారక క్రిములను ధ్వంసం చేస్తుంది. 4. శరీరానికి హాయినిస్తుంది.

మంచి ఆరోగ్యానికి మూలస్థానం

గ్లాక్సో



kiron/apco/85 4